


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 46

గురువారం 8-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




LAUNCHING

CASAGRAND BELAIR
GOWDAVALLI

5 BHK Ultra Luxurious 4000+ sft. Bungalows


From ₹3.4cr*




20 ft. wide bedroom with a walk-in wardrobe, the biggest you'll find


Every bungalow has an option for a private home theatre*



2 rooftop swimming pools of 2800 sft. with lounges, poolside volleyball, party nook & more


Private lift option in each unit*


Indulge in luxury at the exclusive 20,000 sft. clubhouse


Every unit is surrounded by a 1000 sft. private garden

More reasons to buy a bungalow in Casagrand Belair



Proximity to the ORR means an excellent connectivity to all the important areas of Hyderabad as well as the major districts.

- Secunderabad, City Centre
- Financial District
- Gachibowli, HiTec City
- Nearby districts e.g. Kamareddy, Nizamabad, Karimnagar

UPCOMING & OTHER DEVELOPMENTS

- Double-decker elevated corridor for highway and metro from Medchal to Malkajgiri
- India's largest Medical devices park is located at ORR 4. This is the largest in India around 302 acres around 25 mins.

Significant capital appreciation is expected in this fast-emerging bungalow hub of Hyderabad

*T&C Apply

WHY CASAGRAND

20 years of real estate excellence	160+ landmark projects	55,000+ happy families	2023 rigorous quality checks	87% on-time delivery	7 cities Chennai, Bengaluru, Hyderabad, Coimbatore, Pune, Delhi & Dubai
2 months of rental assurance	6 months of resale support	8 Year warranty & 10-year community maintenance	75% open area for 2x more light & ventilation	0% space wastage for carpet area efficiency	23 global brands used in fittings and finishing materials

CREDAI

Exclusive site visit available | www.casagrand.co.in

90475 40000

Scan for Walkthrough

Scan for location

CASAGRAND building aspirations

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 46

గురువారం 8-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

టెస్టులకు రోహిత్ గుడ్‌బై



భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ మరో ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పాడు. గత ఏడాది టి20 వరల్డ్‌కప్ నెగ్గిన తర్వాత పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్... బుధవారం టెస్టు క్రికెట్ నుంచి కూడా తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. అయితే వన్డేల్లో మాత్రం తాను కొనసాగుతానని స్పష్టం చేశాడు. 38 ఏళ్ల రోహిత్ భారత్ తరఫున 67 టెస్టులు ఆడి 4301 పరుగులు సాధించాడు. -14లో



జైషే మహ్మద్ ప్రధాన స్థావరం



లష్కరే ప్రధాన కేంద్రం




పీవోకేలో లష్కరే బేస్

రక్త సిందూరం

పాక్ ఉగ్ర తండాలపై విరుచుకుపడ్డ భారత్

100 మందికి పైగా ఉగ్రవాదులు హతం

'పహల్గాం'కు బదులు తీర్చుకున్న భారత్



అమాయక మహిళల నుదుటి నుంచి ముష్కరులు తుడిచేసిన సిందూరం వారి పాలిట రక్తసిందూరమే అయింది. దెబ్బతిన్న పులి పంజా విసిరితే ఎలా ఉంటుందో పాక్‌కు, దాని ప్రేరేపిత ఉగ్ర ముఠాలకు తెలిసొచ్చింది. పహల్గాం ఉగ్ర దాడికి భారత్ అంతకంతా బదులు తీర్చుకుంది. పాక్, పీఓకేల్లోని 9 ప్రాంతాలపై సైన్యం విరుచుకుపడింది. లష్కరే, జైషే వంటి ఉగ్ర సంస్థల ప్రధాన స్థావరాలతో పాటు శిక్షణ శిబిరాలను సమూలంగా తుడిచిపెట్టింది. 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టి 'ఆపరేషన్ సిందూర్'ను దిగ్విజయంగా పూర్తి చేసింది. 'జైహింద్' అంటూ పహల్గాం మృతులకు ఘనంగా నివాళులు అర్పించింది. -6లో



అత్యంత సమర్థతతో దాడులు జరిపారు. మన సైన్యం దేశానికి గర్వకారణం - ప్రధాని మోదీ

ప్రతిదాడులకు ఆస్కారం లేకుండా దాడి చేశాం



- సరైన రీతిలోనే ప్రతీకార చర్యలు తీసుకున్నాం
- ఇవి 'బాధ్యతాయుతమైన' దాడులు
- భారత వైఖరిని స్పష్టంచేసిన విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ

- వివరాలు 6లో▶

లక్ష్యాలు 9

పక్కాగా ఎంపిక చేసిన భారత సైన్యం

ఆపరేషన్ సిందూర్ కోసం ఎంపిక చేసిన 9 లక్ష్యాలను పక్కాగా సేకరించిన నిఘా సమాచారం ఆధారంగా సైన్యం నిర్ణయించుకుంది. ఇవన్నీ ఆరోగ్య కేంద్రాలు తదితర ముసుగుల్లో నడుస్తున్నాయి. వీటిని కచ్చితంగా గుర్తించడం మన నిఘా వర్గాలకు సవాలుగా నిలిచింది. 7లో



యుద్ధ స్వరం... ఆ ఇద్దరు..

భారత చరిత్రలో తొలిసారి ఇద్దరు మహిళా అధికారులు భారీ సైనిక చర్యపై అధికారిక విలేకరుల సమావేశానికి నాయకత్వం వహించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలనే దేశ సంకల్పాన్ని మాత్రమే కాకుండా సాయుధ దళాల్లో పెరుగుతున్న మహిళల బలానికి వారు ప్రతీకలుగా కనిపించారు. 8లో



సోఫియా ఖురేషీ



వ్యోమికా సింగ్

ముష్కరులపై తిరుగులేని అస్త్రాలు

స్కాల్ప్, హ్యామర్ క్షిపణులను ప్రయోగించిన భారత సైన్యం

ఉగ్ర శిబిరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడి

- వివరాలు 6లో▶

పాక్ సైన్యం కర్కశ కాల్పులు

సరిహద్దు వెంట ప్రాణాలు కోల్పోయిన 15 మంది గ్రామీణులు

57 మందికి బుల్లెట్ గాయాలు

దీటుగా బదులిచ్చిన భారత సైన్యం

సరిహద్దు ఆవల భారీగా మరణాలు



7లో

యుద్ధ విమానాలు కూల్చేశాం..

- రఫేల్ సహా ఫైటర్ జెట్లను ధ్వంసం చేశాం
- రెండు ఇండియన్ డ్రోన్లు సైతం నేలమట్టం
- పాకిస్తాన్ పార్లమెంట్‌లో ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటన..
- శత్రువుకు ఎలా బుద్ధి చెప్పాలో తెలుసని వెల్లడి

మరిన్ని వార్తలు, కథనాలు 6,7 పేజీల్లో..



ఇదండీ సంగతి





కర్రిగుట్టల్లో రక్తపుటేర్లు

భారీ ఎన్‌కౌంటర్‌లో 38 మంది మావోయిస్టుల మృతి?

- 22 మంది కంటే ఎక్కువే చనిపోయారన్న ఛత్తీస్‌గఢ్ సీఎం
- గుంజపర్తి–ఇత్తగూడ సమీపంలో చోటుచేసుకున్న ఎదురుకాల్పులు
- మృతుల్లో ఎవరెవరున్నారనే దానిపై కొరవడిన స్పష్టత

- వివరాలు 5లో



అత్యవసర సేవల ఉద్యోగుల సెలవులు రద్దు

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సీఎం రేవంత్ సమీక్ష

- మంత్రులు, అధికారులంతా హైదరాబాద్‌లోనే అందుబాటులో ఉండాలి
- ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా, సోషల్ మీడియాలో అనవసర ప్రకటనలు చేయొద్దు
- మనమంతా సైన్యంతోనే అన్న సందేశం ఇవ్వాలన్న ముఖ్యమంత్రి
- కీలక ప్రాంతాల్లో భద్రతా చర్యలకు సీఎం, డిప్యూటీ సీఎం ఆదేశం

2లో

యుద్ధ విమానాలు వచ్చినట్లు.. బాంబులు వేసినట్లు..

- హైదరాబాద్‌లోని 4 ప్రాంతాల్లో మాక్ డ్రిల్
- సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు నిర్వహణ
- కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించిన అధికారులు
- 'ఆపరేషన్ అభ్యాస్' విజయవంతమైనట్లు ప్రకటన

-2లో



హైదరాబాద్ కాచిగూడ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన మాక్‌డ్రిల్

క్లుప్తంగా...

భారత సైనిక పాటవానికి భారతీయుడిగా గర్విస్తున్నా

మాజీ సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: భారత సైన్యం ప్రదర్శించిన సైనిక పాటవానికి ఒక భారతీయుడిగా గర్విస్తున్నట్లు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం జరిపిన దాడి పట్ల ఆయన స్పందించారు. 'ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో ఉన్నా.. ఏ దేశంలో ఉన్నా.. ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే తప్ప లాభం చేకూర్చేదికాదు. ఉగ్రవాదం అంతం కావాల్సిందే. ఈ విషయంలో పాజిటివ్‌గా ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకమై, ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతి సామరస్యాలు నెలకొంటాయి. భారత సైన్యం ఎంత వీరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా ఉండి దేశరక్షణలో మేమెవరికీ తీసిపోము అన్నట్టుగా వారికి శక్తి సామర్థ్యాలుండాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను' అని ఒక ప్రకటనలో తెలిపారు.

ఉగ్రవాద స్థావరాలపై దాడి అనివార్యం

ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో నిర్వహించిన దాడులపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. భారత్‌లో రక్తపాతం సృష్టిస్తున్న ఉగ్రవాదులు, వారి స్థావరాలు, శిబిరాలపై చర్యలు అనివార్యమని స్పష్టం చేశారు. 'దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం, ఉగ్రవాదుల దాడుల నుంచి తన పౌరులను రక్షించుకోవడం దేశానికి అత్యంత ముఖ్యమైన కర్తవ్యం. కశ్మీర్‌లోని పహల్గాంలో ఉన్న బైసరన్ వ్యాలీకి పర్యాటకులుగా వెళ్లిన అమాయక పౌరులపై ఉగ్రవాదుల చేసిన దాడి.. మానవత్వంపై జరిగిన దాడి. అలాంటి ఉగ్రవాద చర్యలపై భారత రక్షణ దళాలు గట్టిగా స్పందించాయి. ఆపరేషన్ సిందూర్ అనివార్యమైన చర్య. భారత రక్షణ బలగాలకు యావత్ దేశం అండగా నిలుస్తుంది. దేశ పౌరుల భద్రత ధ్యేయంగా రక్షణ బలగాలు తీసుకుంటున్న చర్యలకు దేశమంతా మద్దతుగా నిలుస్తోంది' అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. అంతకుముందు 'ఎక్స్'లో కూడా వైఎస్ జగన్ పోస్టు చేశారు. పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతి చర్యగా భారత రక్షణ దళాలు ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించడం సరైన నిర్ణయమని ప్రశంసించారు. ఇలాంటి సమయంలో ఇటువంటి అనివార్యమైన చర్యలు దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం, ప్రజలను రక్షించడంలో ఉన్న అచంచలమైన శక్తిని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ఈ పోరాటంలో తామంతా అండగా నిలుస్తామని.. జైహింద్ అంటూ పోస్టు చేశారు.

భారత సైన్యానికి సెల్యూట్


బీజేఎల్పీ నేత ఏలేటి



సాక్షి, హైదరాబాద్: ఉగ్రవాదానికి సమాధానంగా.. ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టిన భారత సైన్యానికి సెల్యూట్ అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాకిస్తాన్‌లోని మూడు ఉగ్రవాద సంస్థలకు చెందిన తొమ్మిది శిబిరాల్లో దాక్కున్న ఉగ్రవాదులను.. పెద్దసంఖ్యలో హతమార్చిన భారత సైన్యానికి అభినందనలు తెలిపారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల ఏరివేతకు.. భారత త్రివిధ దళాలు ఈ దాడులు చేపట్టినందుకు దేశమంతా గర్వపడుతోందని 'ఏలేటి' పేర్కొన్నారు.


మెరుపుదాడులను స్వాగతించిన ఒవైసీ

జైహింద్ అంటూ 'ఎక్స్'లో ట్వీట్



సాక్షి, హైదరాబాద్: పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత బలగాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'ను ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్వాగతించారు. బుధవారం ఉదయం తన 'ఎక్స్' వేదికగా భారత్ బలగాల మెరుపుదాడిని ఆయన అభినందించారు. పహల్గాం దాడి తరహా ఘటనలు పునరావృతం కాకుండా పాకిస్తాన్‌కు గట్టి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని ఒవైసీ ఉద్ఘాటించారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద లక్ష్యాలపై భారత రక్షణ బలగాలు తీసుకున్న చర్యలకు పూర్తి మద్దతు ఇస్తున్నానని, ఉగ్రవాదులపై మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పాకిస్తాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను పూర్తిగా నాశనం చేయాలని, ఆపరేషన్ సిందూర్‌కు జైహింద్ అంటూ తన మద్దతు తెలిపారు.

ఆర్మీకి సెల్యూట్: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై విజయవంతంగా దాడులు నిర్వహించిన భారత ఆర్మీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెల్యూట్ చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై ఎక్స్ వేదికగా స్పందించారు. ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా తుడిచిపెట్టే శక్తి భారత ఆర్మీకే ఉందని ఆయన స్పష్టం చేశారు.

యుద్ధ విమానాలు వచ్చినట్లు.. బాంబులు వేసినట్లు..

హైదరాబాద్‌లోని 4 ప్రాంతాల్లో మాక్ డ్రిల్

సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు నిర్వహణ

కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించిన అధికారులు.. 'ఆపరేషన్ అభ్యాస్' విజయవంతమైనట్లు ప్రకటన

సాక్షి, హైదరాబాద్: పహల్గాం ఉగ్రదాడుల అనంతరం నెలకొన్న వాతావరణం నేపథ్యంలో.. వైమానిక దాడులు జరిగినప్పుడు ప్రభుత్వ యంత్రాంగాలు తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తల్ని తెలియజేసేలా.. కేంద్రం ఆదేశాల మేరకు బుధవారం హైదరాబాద్‌లోని నాలుగు ప్రాంతాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించారు. యుద్ధ విమానాలు వస్తున్నట్లు, బాంబులు వేస్తున్నట్లు స్పీకర్ల ద్వారా శబ్దాలు వినిపించారు. ఆ తర్వాత బాంబుల ధాటికి అనేక మంది క్షతగాత్రులైనట్లు పడిపోతూ ఆర్తనాదాలు చేశారు. వీరిని వైద్య సిబ్బంది అంబులెన్సుల్లో ఎక్కించడం, ఆ వాహనాల రాకపోకలకు పోలీసులు గ్రీన్ చానల్ ఇవ్వడం తదితరాలను మాక్ డ్రిల్‌లో భాగంగా ప్రదర్శించారు.



కాచిగూడ రైల్వేస్టేషన్‌లో మాక్‌డ్రిల్

ఆ సైరన్లు ఏవీ?

→ సాయంత్రం 4 గంటల నుంచి 4.30 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) నుంచి హోంశాఖ కార్యదర్శి రవిగుప్తా, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి, ఐసీసీసీ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి పర్యవేక్షించారు. సుమారు 54 ఏళ్ల తర్వాత (1971 నాటి ఇండో-పాక్ యుద్ధం సందర్భంగా) 'ఆపరేషన్ అభ్యాస్' పేరిట నిర్వహించిన ఈ మాక్ డ్రిల్ పక్కాగా జరగలేదనే అభిప్రాయం వ్యక్తమైనప్పటికీ, అధికారులు మాత్రం విజయవంతమైనట్లు ప్రకటించారు.

జంక్షన్లలో అలెర్ట్ సందేశాలు

→ తొలుత ఈ మాక్ డ్రిల్ ప్రారంభాన్ని సూచిస్తూ ఐసీసీసీ నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బందికి సాయంత్రం 4 గంటలకు సందేశం ఇచ్చారు. వెంటనే నగర వ్యాప్తంగా ఉన్న వార్ సైరన్లు మోగాల్సి ఉంది. అయితే ఇండో-పాక్ యుద్ధం తర్వాత వీటి అవసరం రాకపోవడంతో నగరంలో ఈ సైరన్లు లేవు. దీంతో కొన్ని జంక్షన్లలో పోలీసులు తమ బ్లూకోల్ట్స్, గస్తీ మొబైల్ వాహనాలను ఆపి వాటి సైరన్లు, మరికొన్ని చోట్ల ఫ్యాక్టరీల సైరన్లు మోగించారు. రెండు నిమిషాలు ఇవి మోగిన తర్వాత జంక్షన్లలోని పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా అలెర్ట్ మెసేజ్ వినిపించారు. ఇళ్లల్లో ఉన్న వాళ్లు బయటకు రావద్దని, బయట ఉన్న వాళ్లు భవనాలు, సెల్లార్లు తదితర సురక్షిత ప్రదేశాల్లో ఆశ్రయం తీసుకోవాలని సూచించారు. వాహనచోదకులు సైతం తమ వాహనాలను ఆపి వాటిల్లోకి వెళ్లాలని సూచించారు. కాగా చుట్టుపక్కల ఉన్న వాళ్లు ఈ సూచనల్ని పాటించేలా సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

మాక్‌డ్రిల్స్ ఇక్కడే..

నగర వ్యాప్తంగా ఉన్న పలు జంక్షన్లలో ఈ కార్యక్రమం 15 నిమిషాలు సాగింది. ఆపై ఐసీసీసీ నుంచి నగరంలోని నాలుగు ప్రాంతాల్లోని సిబ్బందికి మాక్ డ్రిల్ చేయాలంటూ సందేశం వెళ్లింది. గోల్కొండ సమీపంలోని నానల్‌నగర్ అవలాన్ కాంప్లెక్స్ అపార్ట్‌మెంట్స్, కంచన్‌బాగ్‌లోని ట్విన్ సిటీస్ బీపీఎస్ టవర్లు, సికింద్రాబాద్‌లోని షెనాయ్ హాస్పిటల్ సమీపంలోని మస్‌ఖూమ్ అపార్ట్‌మెంట్స్, నేషనల్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఈసీఐఎల్) సమీపంలోని మే ఫ్లవర్ అపార్ట్‌మెంట్స్ వద్ద ఈ డ్రిల్స్ చేపట్టారు. పోలీసు, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, వైద్య ఆరోగ్య శాఖ... ఇలా ప్రతి విభాగం వైమానిక దాడుల సమయంలో స్పందించాల్సిన తీరు, తీసుకోవాల్సిన చర్యలపై డ్రిల్స్ చేశాయి. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించడం, వారిని సమీప ఆస్పత్రులకు తరలించడం, అవసరమైన వాహనాలు ఏర్పాటు చేయడం, ఎమర్జెన్సీ రెస్పాన్స్, సాధారణ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం తదితర అంశాలపై డ్రిల్స్ సాగాయి. సాయంత్రం 4.30 గంటల వరకు ఇవి కొనసాగగా..1971 తర్వాత చేస్తున్న ఈ డ్రిల్ అంత పక్కాగా లేనట్లు గుర్తించిన అధికారులు.. లోపాలను సరిచేయడంపై దృష్టి పెట్టారు.

బ్లాక్ ఔట్ సమయం తగ్గించడంపై దృష్టి

వైమానిక దాడులు జరుగుతున్న సమయంలో భూమ్మీది ప్రాంతాలు శత్రు దేశాల యుద్ధ విమానాలకు కనిపించకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి ఉంటుంది. దీన్నే సాంకేతిక పరిభాషలో బ్లాక్ ఔట్ అంటారు. మాక్‌డ్రిల్ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మొత్తాన్ని బ్లాక్ ఔట్ చేయడంపై డ్రైరన్ నిర్వహించారు. ప్రస్తుతం దీనికి గరిష్ఠంగా 4 గంటల సమయం పడుతున్నట్లు గుర్తించిన అధికారులు ఈ సమయాన్ని గణనీయంగా తగ్గించడానికి కసరత్తు చేస్తున్నారు.

ప్రజల్ని అప్రమత్తం చేయడానికే: కొత్వాల్ సీవీ ఆనంద్

'ప్రజల్ని అప్రమత్తం చేస్తూ మానసికంగా, శారీరకంగా సన్నద్ధం చేయడానికే ఈ మాక్ డ్రిల్స్. సీఎం ఆదేశాల మేరకు కొన్ని రోజుల పాటు అంతా అప్రమత్తంగా ఉండేలా అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు చేశాం. ప్రతి ఒక్కరూ డబుల్ డ్యూటీ చేసేలా ఆదేశాలు ఇచ్చాం. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నాం. నగరంలోని ఆస్పత్రులపై రెడ్ క్రాస్‌ను పెయింట్‌తో వేసేలా ఆదేశాలు ఇచ్చాం..' అని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ చెప్పారు.

అత్యవసర సేవల ఉద్యోగుల సెలవులు రద్దు

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సీఎం రేవంత్ సమీక్ష

- మంత్రులు, అధికారులంతా హైదరాబాద్‌లోనే అందుబాటులో ఉండాలి
- ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా, సోషల్ మీడియాలో అనవసర ప్రకటనలు చేయొద్దు
- మనమంతా సైన్యంతోనే అన్న సందేశం ఇవ్వాలన్న ముఖ్యమంత్రి
- కీలక ప్రాంతాల్లో భద్రతా చర్యలకు సీఎం, డిప్యూటీ సీఎం ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో వేం నరేందర్‌రెడ్డి, సీవీ ఆనంద్, రవిగుప్తా తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అత్యవసర సేవలు అందించే అన్ని విభాగాల ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే మంత్రులు, అధికారులు విదేశీ పర్యటనలు రద్దు చేసుకుని హైదరాబాద్‌లోనే అందుబాటులో ఉండాలని ఆదేశించింది. పాకిస్తాన్‌లో ఉగ్రవాద శిబిరాలపై మంగళవారం అర్ధరాత్రి భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. త్రివిధ దళాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ దాడుల నేపథ్యంలో మనమంతా సైన్యంతో ఉన్నామనే సందేశం ఇవ్వాలని సీఎం పిలుపునిచ్చారు. ఈ సమయంలో రాజకీయాలకు, పార్టీలకు తావు లేదని అన్నారు. మీడియా, సోషల్ మీడియాలో ప్రభుత్వ ఉద్యోగులు అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు.

ప్రజల కోసం 24/7 టోల్ ఫ్రీ నంబర్

'సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నంబర్ వెంటనే ఏర్పాటు చేయాలి. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. మూడు కమిషనరేట్లకు సంబంధించిన సీసీటీవీలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలి. పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి వచ్చి అనధికారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలి. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలి.

రక్తం, ఆహారం నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలి

బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలి. ఇందుకోసం రెడ్ క్రాస్‌తో సమన్వయం చేసుకోవాలి. అత్యవసర మందులు కూడా అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. ప్రైవేటు ఆస్పత్రుల్లో పడకల అందుబాటుపై ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలి. ఆహార నిల్వలు కూడా తగినంత ఉండేలా చూడాలి. సైబర్ దాడులు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపై ఉక్కు పాదం మోపాలి. ఫేక్ న్యూస్ వల్ల ప్రజల్లో ఆందోళన మరింత పెరిగే అవకాశం ఉంది. ఇలాంటి వాటిని అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి.

కీలక ప్రాంతాల్లో భద్రత పెంచాలి

అన్ని జిల్లా కేంద్రాలతో పాటు సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు భద్రత పెంచాలి. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, అన్ని విదేశీ రాయబార కార్యాలయాలు, ఐటీ సంస్థల దగ్గర కూడా భద్రత పెంచాలి. నగరంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలి. అవసరమైతే పీస్ కమిటీలతో మాట్లాడాలి. హిస్టరీ షీటర్లు, పాత నేరస్తుల విషయంలో పోలీస్ విభాగం అప్రమత్తంగా ఉండాలి..' అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

విదేశీ పర్యాటకులకు రక్షణ కల్పించండి

హైదరాబాద్‌లోని ఆర్మీ, నేవీ, వైమానిక కార్యాలయాలు, రక్షణ రంగ సంస్థల దగ్గర భద్రతాపరమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పోలీసులను ఆదేశించారు. నగరంలో మాక్ డ్రిల్ అనంతర పరిస్థితులపై అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని చెప్పారు. తెలంగాణ పర్యటనకు వచ్చిన విదేశీ పర్యాటకులకు తగిన రక్షణ కల్పించాలని చెప్పారు. కేంద్ర నిఘా బృందాలతో , రాష్ట్ర నిఘా బృందాలు సమన్వయం చేసుకోవాలని సూచించారు.

చంపినా చూస్తూ ఊరుకుంటే ఎలా..?

ఐసీసీసీ వద్ద ఎండలో నిలబడిన మీడియాను చూసిన రేవంత్‌రెడ్డి తన వాహనం ఆపి వారితో ముచ్చటించారు. 'భారత రక్షణ రంగంలో హైదరాబాద్ అత్యంత కీలక ప్రాంతం. అన్ని విభాగాలను అప్రమత్తం చేశాం. దేశంలోకి వచ్చి చంపుతుంటే చూస్తూ ఊరుకుంటే ఎలా? 'అని వ్యాఖ్యానించారు.

నేడు సంఘీభావ ర్యాలీ

భారత సైన్యానికి సంఘీభావంగా హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించాలని సీఎం నిర్ణయించారు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర నేతలు పాల్గొననున్నారు.

సైన్యానికి సెల్యూట్: సీఎం రేవంత్

ఆపరేషన్ సిందూర్‌లో భారత సాయుధ దళాలు సాధించిన విజయంపై సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మన సైన్యం దేశ ప్రజలందరినీ గర్వపడేలా చేసిందని పేర్కొన్నారు. 'ఒక భారతీయ పౌరుడిగా, నేను ముందుగా మన సాయుధ దళాలకు బలమైన అండగా నిలుస్తున్నా. ఉగ్రవాద నిర్మూలన దిశగా భారత సైన్యం చేపట్టిన ఈ ధైర్యవంతమైన చర్య దేశ భద్రతకు నిదర్శనం. ఈ దాడులు మన సైన్యం సామర్థ్యం, ధైర్యాన్ని ప్రపంచానికి స్పష్టంగా చాటాయి. మనమంతా ఒకే గొంతుకై, ఒకే స్వరంతో ప్రకటిద్దాం.. జై హింద్..' అని సీఎం తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

సున్నిత సంస్థల వద్ద డేగకన్ను

ఎంబసీలు, కాన్సులేట్ల వద్ద అత్యంత అప్రమత్తం

- ఆ రెండు దేశాలకు చెందిన వారి వివరాలు సేకరణ: సీపీ ఆనంద్

సాక్షి, హైదరాబాద్: 'నగరంలో ఏదో జరుగుతోందని భావించి ఎవరూ ఆందోళన చెందొద్దు. కేవలం పోలీసులతోపాటు ప్రభుత్వ విభాగాలను మరింత అప్రమత్తం చేయడానికే మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నాం. ఎలాంటి అనుమానం వచ్చినా, సహాయసహకారాలు కావాలన్నా 100, 112కు కాల్ చేయండి' అని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. గురువారం ఆయన బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (ఐసీసీసీ) విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాలివి...

ఆయా ప్రాంతాల్లో అదనపు చర్యలు.

ప్రస్తుతం నెలకొన్న పరిణామాల నేపథ్యంలో అలర్ట్‌గా ఉన్నాం. 'గ్రేటర్' పరిధిలో రక్షణ శాఖకు సంబంధించిన అనేక సున్నిత సంస్థలు ఉన్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి కీలక చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న విదేశీ ఎంబసీలు, కాన్సులేట్ల వద్ద నిఘా, గస్తీ ముమ్మరం చేసి అదనపు బలగాలను మోహరించాం. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న బంగ్లాదేశీయులు, రోహింగ్యాల వివరాలను సేకరించి జాబితా రూపొందిస్తున్నాం. ఐసీసీసీ కనెక్ట్ అయి ఉన్న 12 వేల కెమెరాల ద్వారా పరిస్థితులు ఎప్పటికప్పుడు గమనిస్తున్నాం. అవసరమైనప్పుడు వివిధ ప్రాంతాల్లో ఉన్న మరో ఆరు లక్షల కెమెరాల్లో రికార్డు అయిన ఫీడ్‌ను పరిశీలిస్తాం. సున్నిత, కీలక ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలు పక్కాగా పని చేసేలా, అవసరమైన చోట్ల అదనంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఆయా విమానాల రద్దు

శంషాబాద్: దేశంలోని పలు విమానాశ్రయాల మూసివేతతో ఎయిర్‌ఇండియా, ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థలు పెద్ద ఎత్తున విమానాలను రద్దు చేశాయి. శంషాబాద్ విమానాశ్రయం నుంచి బుధవారం మధ్యాహ్నం శ్రీనగర్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం రద్దయ్యింది. ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థకు చెందిన జమ్మూ, చండీగఢ్, అమృత్‌సర్, జోధ్‌పూర్‌కు రాకపోకలు సాగించే మరో ఐదు విమానాలు కూడా రద్దయ్యాయి.

విద్యుత్ ఉద్యోగుల సెలవులు రద్దు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగుల సెలవులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఉద్యోగులందరూ తమ పనిక్షేత్రంలో అందుబాటులో ఉండాలని ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల సీఎండీలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడి చేయడంతో పాటు దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్‌ను నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది.

పహల్గాం దాడికి తగిన నివాళి

ఆపరేషన్ సిందూర్‌పై బాధిత కుటుంబాల హర్షం..

సాయుధ దళాలకు, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు

'ఆపరేషన్ సిందూర్'పై పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. తమ నుదుటన సిందూరాన్ని తుడిపేసినవారిపై దాడితో న్యాయం జరిగిందని మహిళలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ దాడులతో మరోసారి దాడి చేయాలంటే ఉగ్రవాదులు వణికిపోతారంటూ బిడ్డలను పోగొట్టుకున్న తల్లిదండ్రులు కొంత ఉపశమనం పొందారు. భారత సైన్యం, కేంద్ర ప్రభుత్వాలను ప్రశంసించారు. - సాక్షి, నేషనల్ డెస్క్

మోదీని అడగండి అన్నారు.. ఆయన సమాధానం ఇచ్చారు: హిమాన్షి నర్వాల్



ఆపరేషన్ సిందూర్‌ను పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయిన నేవీ అధికారి వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి నర్వాల్ స్వాగతించారు. 'నా పెళ్లి జరిగి ఆరు రోజులే అయింది.. మమ్మల్ని వదిలేయండని ఉగ్రవాదులను వేడుకున్నా. కానీ ఉగ్రవాదులు మాత్రం 'మోదీని అడగండి' అని బదులిచ్చారు. ఈ రోజు మోదీ, మన సైన్యం వారికి సమాధానం చెప్పారు' అని హిమాన్షి వ్యాఖ్యానించారు.

ఇదే నిజమైన నివాళి: అషన్య ద్వివేది



ఉగ్రవాదులు భవిష్యత్తులో అమాయకులపై ఎలాంటి దాడులకు పాల్పడకుండా ఆపరేషన్ సిందూర్ బుద్ధి చెప్పిందని పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన కాన్పూర్ వాసి శుభమ్ ద్వివేది భార్య అషన్య సంతోషం వ్యక్తం చేశారు. 'ఇదే నా భర్తకు, పహల్గాం దాడిలో మరణించిన వారికి నిజమైన నివాళి. నా భర్త ఎక్కడున్నా ఈ రోజు ప్రశాంతంగా ఉంటారు' అని ఆమె పేర్కొన్నారు.

ప్రాణాల విలువ ఇప్పుడు తెలిసొస్తుంది: ప్రియదర్శిని ఆచార్య



ప్రాణాల విలువేంటో ఉగ్రవాదులకు ఇప్పుడు తెలిసొస్తుందని పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఒడిశాకు చెందిన ప్రశాంత్ సత్పతి భార్య ప్రియదర్శని ఆచార్య అన్నారు. చర్యలు తీసుకుంటామని భర్త మృతదేహం వద్ద ఆర్మీ సిబ్బంది తనకు హామీ ఇచ్చారని, ఈరోజు అది చేసి చూపించారని సంతోషం వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా తరిమికొట్టాలని, ఈ భూమ్మీద ప్రజలు స్వేచ్ఛగా, భయం లేకుండా జీవించాలని ఆశాభావం వ్యక్తం చేవారు.

బాధితులకు సరైన నివాళి: ప్రగతి జగ్దాలే




'ఆపరేషన్ సిందూర్' పహల్గాం దాడిలో మరణించిన వారికి సరైన నివాళి అని పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన పుణేవాసి సంతోష్ జగ్దాలే భార్య ప్రగతి జగ్దాలే అభివర్ణించారు. 'మా సిందూరాన్ని ఉగ్రవాదులు తుడిచిపెట్టేశారు. మన సాయుధ దళాలు పాక్‌లోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసినందుకు సంతోషిస్తున్నా. ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంటుందని నాకు తెలుసు'' అని ఆమె వ్యాఖ్యానించారు.

'పహల్గాం' ఉగ్రవాదులను కూడా అంతమొందించాలి: జెన్నీఫర్



ఆపరేషన్ సిందూర్ బాగుందని, కానీ.. తన భర్తను చంపిన నలుగురు ఉగ్రవాదులను కూడా అంతమొందించాలని పహల్గాం దాడిలో మృతి చెందిన సుశీల్ నథానియేల్ భార్య జెన్నీఫర్ అన్నారు. ఒక జంతువు కూడా చేయని పనిని ఆ నలుగురూ చేశారని, వారు కూడా అదే శిక్షను పొందాలని, నలుగురూ చనిపోవాలని కోరుకుంటున్నానని తెలిపారు.

సరైన నిర్ణయం: మంజునాథ్ రావు తల్లి సుమతి



ఆపరేషన్ సిందూర్‌తో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుందని పహల్గాంలో హత్యకు గురైన కర్ణాటకలోని శివమొగ్గకు చెందిన మంజునాథ్ రావు తల్లి సుమతి అన్నారు. అమాయకులకు ఏమీ జరగకూడదని, అణచివేతకు, దౌర్జన్యాలకు పాల్పడేవారిని వదిలిపెట్టకూడదని చెప్పారు. ఎంతోమంది నుదుటి తిలకాన్ని చెరిపేసినవారిని తుదముట్టించడానికి ఆపరేషన్ సింధూర్ సరైనదని పహల్గాం దాడిలో మరణించిన బెంగళూరుకు చెందిన భరత్ భూషణ్ తండ్రి చెన్నవీరప్ప అన్నారు.

ప్రతీకారం తీర్చుకున్నాం..: సంగీతా గన్బోటే



ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకున్నందుకు తాము చాలా సంతోషంగా ఉన్నామని పహల్గాం దాడిలో మరణించిన మరో పుణే వాసి కౌస్తుభ్ గన్బోటే భార్య సంగీతా గన్బోటే అన్నారు. ''ఉగ్రదాడికి భారత్ ఎప్పుడు ప్రతీకారం తీర్చుకుంటుందోనని మేమంతా ఎదురు చూశాం. ఈ రోజు ఆపరేషన్ సిందూర్‌తో భారత సాయుధ దళాలు పహల్గాంలో పిరికిపంద దాడికి ధీటైన సమాధానం ఇచ్చాయి'' అని తెలిపారు.

నా కుమారుడి హత్యకు ప్రతీకారం తీరింది: పోనీవాలా ఆదిల్ తండ్రి హైదర్ షా



ఉగ్రవాద శిబిరాలపై సైనిక దాడులు తన కుమారుడి హత్యకు ప్రతీకారం తీర్చుకున్నాయని పహల్గాం ఉగ్రదాడి సమయంలో పర్యాటకులను కాపాడుతూ ప్రాణాలు అర్పించిన పోనీవాలా సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా తండ్రి హైదర్ షా అన్నారు. ఇప్పుడు తనకు సంతోషంగా ఉందన్నారు. తన సోదరునితోపాటు మరో 25 మంది బాధిత కుటుంబాలకు న్యాయం చేశారని ఆదిల్ సోదరుడు సయ్యద్ నౌషాద్ వ్యాఖ్యానించారు.

ఉగ్రవాదాన్ని తుడిచి పెట్టాలి: బాధిత కుటుంబాలు

ఉగ్రవాదాన్ని తుడిచి పెట్టేంతవరకూ దాడులు కొనసాగించాలని పహల్గాం దాడిలో మరణించిన పశ్చిమబెంగాల్ వాసులు సమీర్ గుహా, బితాన్ అధికారి కుటుంబీకులు కోరారు. పాకిస్తాన్ తుడిచిపెట్టుకుపోయే వరకు ఆ దేశంపై చర్యలు కొనసాగించాలని ఉగ్రదాడిలో భర్త యతీష్ పర్మార్, కుమారుడు స్మిత్‌లను కోల్పోయిన గుజరాత్‌లోని భావ్‌నగర్‌కు చెందిన



కాజల్ బెన్ పర్మార్ ప్రభుత్వాన్ని కోరారు. పాక్‌పై భారత్ చర్య పట్ల తనకు సంతృప్తిగా ఉందని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన సూరత్‌కు చెందిన శైలేష్ కలతియా భార్య శీతల్ బెన్ కలతియా చెప్పారు. హిందువులు, ముస్లింల పేరుతో నా భర్తను, ఇతరులను కాల్చి చంపిన ప్రజలకు న్యాయం చేసేందుకు మోదీ ప్రభుత్వం ఏం చేసినా సరే నన్న శీతల్‌బెన్.. ప్రభుత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు.

కొంత ఉపశమనం: ఆరతి



ఆపరేషన్ సిందూర్ బాధిత కుటుంబాలకు కొంత ఉపశమనం కలిగిస్తుందని పహల్గాం దాడిలో మృతి చెందిన కొచ్చికి చెందిన ఎన్ రామచంద్రన్ కుమార్తె ఆరతి ఆశాభావం వ్యక్తం చేశారు. 'నేను సంతృప్తిగా ఉన్నాను. నా దివంగత తండ్రి ఇప్పుడు ప్రశాంతంగా ఉంటారు. విడిచిపెట్టాలంటూ మా మేనమామలు ఉగ్రవాదులను వేడుకున్నారు. కానీ వారు కనికరం చూపలేదు. వారిని కాల్చి చంపారు' అంటూ దాడి రోజును గుర్తు చేసుకున్నారు.

క్లుప్తంగా...

కలెక్టర్, ఆర్డీవోకు షోకాజ్ నోటీసులు

ఫార్మా భూముల స్వాధీనంపై హైకోర్టు ఆగ్రహం



యాచారం: ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను స్వాధీనం చేసుకోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫార్మాసిటీ భూముల్లో సర్వే, కంచె నిర్మాణ పనులపై అభ్యంతరం చెప్పినా, భూసేకరణ అధికారిగా వ్యవహరిస్తున్న ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీవో అనంత్‌రెడ్డి, యాచారం తహసీల్దార్ అయ్యప్పకు బుధవారం కోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 4 వారాల్లో స్వయంగా వచ్చి లేదా న్యాయవాది ద్వారా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. లేదంటే వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలియజేయాలని పేర్కొంది.

జీవన్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణను మరోసారి వాయిదా వేసింది. తన భూమిని లాక్కున్నారని సామ దామోదర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీవన్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులపై మోకిలా పోలీసుస్టేషన్‌లో గతంలో కేసు నమోదైంది. దీనిపై జీవన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. తమపై నమోదైన కేసులను కొట్టివేయాలని, ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. దీంతో జీవన్‌రెడ్డి మార్చి 21న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ బుధవారం జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. అయితే ఈ పిటిషన్‌పై మే 13న విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

బీఆర్ఎస్, బీజేపీ నేతలు కక్ష గట్టి అడ్డుపడుతున్నారు

రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణపై కక్ష గట్టి మరీ బీఆర్ఎస్, బీజేపీ నేతలు అభివృద్ధికి అడ్డుపడుతున్నారని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే లక్ష్యంగా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని, వాస్తవాలను జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు ఎన్నుకున్న సీఎం రేవంత్‌రెడ్డిని దిగిపొమ్మని అనడానికి కేటీఆర్ ఎవరని ప్రశ్నించారు. తెలంగాణకు కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారో కేంద్రమంత్రి బండి సంజయ్ చెప్పాలని ఒబేదుల్లా నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కలిసి ఉద్యోగులను రెచ్చగొట్టి సమ్మెకు పంపాలని చూస్తున్నారన్నారు. తెలంగాణ దివాళా తీయడంలో కేసీఆర్, కేటీఆర్‌లతో పాటు అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కూడా భాగస్వామి అని ఆరోపించారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి: ఎస్టీఎఫ్



మిత్తల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సైదులు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థికేతర అంశాలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వేసిన త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్ నవీన్ మిత్తల్‌ను రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీఎఫ్) దేవరకొండ సైదులు కోరారు. బుధవారం మిత్తల్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. పెండింగ్ బిల్లులు డీఏలు, పీఆర్సీ వంటి ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించేందుకు నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ప్రత్యేక కార్యాచరణను ఏర్పాటు చేసి అమలు చేయాలని కోరారు.

మళ్లీ మనకు అధికారం ఖాయం

- చంద్రబాబుకు తగిన శాస్తి తప్పదు
- సరైన సమయంలో ప్రజలు, దేవుడు మొట్టికాయలు వేస్తారు
- వైఎస్సార్‌సీపీ నేతలతో అధ్యక్షుడు వైఎస్ జగన్
- చంద్రబాబు ప్రభుత్వం హామీల అమల్లో ఘోరంగా విఫలమైంది



సాక్షి, అమరావతి: మన ప్రభుత్వం ఇస్తున్న ప్రతి పథకాన్నీ ఆపేయడంతో పాటు చంద్రబాబు చెప్పింది చేయకపోవడం వల్ల ప్రజలు కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ప్రజలు చంద్రబాబు తీరును గమనిస్తున్నారని, ఓటు అనే ఆయుధం వారి చేతుల్లోనే ఉందని చెప్పారు. సరైన సమయంలో ప్రజలు, దేవుడు మొట్టికాయలు వేస్తారని.. వచ్చే ఎన్నికల్లో అఖండ విజయంతో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్లమెంటు నియోజకవర్గాల పార్టీ పరిశీలకులు, రీజినల్ కో–ఆర్డినేటర్లతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు.. జరుగుతున్న పరిణామాలపై చర్చించి, పార్టీని మరింతగా బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. 'మనల్ని అభిమానించే వారిని కొడుతున్నారు.. ఇబ్బంది పెడుతున్నారు. నన్ను అభిమానించినందుకే కదా.. వీళ్లకు దెబ్బలు తగులుతున్నాయన్నది నన్ను బాధిస్తోంది. వారిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉంది. వాళ్లకు ఏదైనా జరిగితే ముందు బాధపడేది నేనే. అందుకే జగన్ 2.0లో ఈ మాదిరిగా ఉండదని స్పష్టంగా చెబుతున్నా. మొదటి ప్రాధాన్యత ఉంటుంది' అని స్పష్టం చేశారు. కార్యకర్తల్లో ఇప్పటికే మంచి చైతన్యం వచ్చిందని, కేడర్ ధైర్యంగా నిలబడిందని అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా తాను ఎక్కడికి వెళ్లినా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి వస్తున్నారని, రాష్ట్రంలో అరాచక పాలన పట్ల వివిధ రూపాల్లో వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రాజకీయాలతో సంబంధం లేని వారిని కూడా కక్షలకు గురి చేస్తుండటం పట్ల ప్రజల్లో తీవ్రమైన ఆగ్రహం ఉందని తెలిపారు. మన ప్రభుత్వ హయాంలో మన పథకాల ద్వారా పేదల నోట్లోకి నాలుగు వేళ్లూ వెళ్లేవని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలు తింటున్న కంచాన్ని చంద్రబాబు లాగేశారని చెప్పారు. వారి కడుపు కొట్టారని మండిపడ్డారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

కూటమి ప్రభుత్వం అనైతిక పనులు

చంద్రబాబు రాజకీయాలను ఒక దారుణమైన స్థాయికి తీసుకెళ్లారు. రాజకీయాల్లో ఇలాంటి పరిస్థితులు రాకూడదని మన ప్రభుత్వ హయాంలో చాలా కష్టపడ్డాం. చాలా మంది నాయకులను మన పరిపాలనలో కట్టడి చేశాం. తాడిపత్రిలో మున్సిపల్ ఎన్నికలు జరిగినప్పుడు టీడీపీకి స్వల్ప ఆధిక్యత వచ్చింది. వైఎస్సార్‌సీపీకి 16 వార్డులు, టీడీపీకి 18 వార్డులు వచ్చాయి. కానీ అప్పటి వైఎస్సార్‌సీపీ తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఫలితాన్ని మన వైపు తిప్పుదామని యత్నించారు. కానీ, ఆ రోజు మన ప్రభుత్వంలో మన పార్టీ ఎమ్మెల్యేనే గృహ నిర్బంధం చేశాం. అదే ఇప్పుడు ఏడాది కాలంగా పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి అడుగు పెట్టనీయడం లేదు. కార్యకర్తల ఆస్తులను విధ్వంసం చేస్తున్నారు. ఇప్పుడు పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి.

చరిత్ర పునరావృతం ఖాయం

2014లో ఇదే కూటమి అధికారంలో ఉంది. ఆ రోజు ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేయలేదు. చరిత్ర పునరావృతం అవుతుంది. అప్పుడు కూడా రైతులకు రుణమాఫీ అని కొద్దిగా చేసి ఎగనామం పెట్టాడు. పొదుపు సంఘాలకు రుణమాఫీ అన్నాడు. అది కూడా మోసంగా తయారైంది. ఇంటింటికీ రూ.2 వేలు నిరుద్యోగ భృతి అన్నాడు. అదీ మోసమైంది. ప్రతి ఒక్కరికీ మూడు సెంట్ల స్థలం అన్నాడు.. అదీ మోసంగా మిగిలింది. అదే సమయంలో మనం పాదయాత్ర చేసి ప్రజలకు భరోసా ఇచ్చాం. చివరకు ప్రజా వ్యతిరేకత కొట్టొచ్చినట్టు ఎన్నికల ఫలితాల్లో కనిపించింది. చంద్రబాబు ప్రజా వ్యతిరేకతను చీల్చడానికి తన భాగస్వామిని వేరేగా పోటీ చేయించాడు. అయినా చంద్రబాబు ఓటమిని అడ్డుకోలేకపోయారు. ఇప్పుడు కూడా ప్రజలు చంద్రబాబు తీరును గమనిస్తున్నారు. సరైన సమయంలో మొట్టికాయలు వేస్తారు.

మరణించినా వైఎస్సార్‌పై కుట్రలు

న్యాయం గెలిచింది: సబితా ఇంద్రారెడ్డి



మణికొండ (హైదరాబాద్): నిజం నిలకడమీద తెలుస్తుందని, న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందని మరోసారి రుజువైందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఓబుళాపురం గనుల కేసులో ఆమెకు మంగళవారం సీబీఐ కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. బుధవారం బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ.. అవినీతికి ఆమడదూరంలో ఉండే తనను అప్పట్లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ కేసులో కావాలని ఇరికించిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డిపై ఉన్న కోపంతో చనిపోయిన తరువాత ఆయన పేరుతో పాటు తనను సదరు కేసులో ఇరికించి కొందరు పైశాచిక ఆనందం పొందారని చెప్పారు. తనపై మచ్చ తొలగిపోయిందని, ఇక మీదట మరింత దూకుడుగా ప్రజాసేవకు అంకితమవుతానని ఆమె చెప్పారు.



మహిళా ప్రయాణికులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

'మహాలక్ష్మి' ఎలా ఉంది? సమస్యలున్నాయా?

బస్సులో మహిళా ప్రయాణికులతో మంత్రి పొన్నం మాటామంతి

కొండపాక (గజ్వేల్): ఆర్టీసీ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ శివారులో గల టోల్‌ప్లాజా నుంచి కలెక్టరేట్ వరకు బుధవారం మంత్రి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. ప్రయాణంలో ఏమైనా సమస్యలున్నాయా అంటూ ఆరా తీశారు. ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ఎలా ఉందంటూ అడిగి తెలుసుకున్నారు. బస్సులో ఎక్కువ శాతం మహిళలు ఉండటంతో మంత్రి సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి జేఏసీ నేతలతో చర్చించామన్నారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెలా ఆర్టీసీకి రూ.330 కోట్లను ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని పొన్నం ఆరోపించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు మంత్రితో సెల్ఫీలు దిగుతూ సంతోషం వ్యక్తంచేశారు.

త్రిసభ్య కమిటీతో ఉద్యోగ జేఏసీ నేతల భేటీ

- సమస్యలను వివరించిన నాయకులు
- నేడు మరోమారు సమావేశం



సచివాలయంలో త్రిసభ్య కమిటీని కలిసి బయటకు వస్తున్న ఉద్యోగ జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో భాగంగా ఏర్పాటైన త్రిసభ్య కమిటీతో బుధవారం ఉద్యోగ సంఘాలు సమావేశమయ్యాయి. కమిటీ చైర్మన్‌గా ఉన్న రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, సభ్యులుగా ఉన్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, టీజీ ట్రాన్స్‌కో సీఎండీ, ఉపముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్‌లతో జరిగిన భేటీలో తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావుతో పాటు దాదాపు వంద మంది ప్రతినిధులు పాల్గొన్నారు. దాదాపు రెండున్నర గంటల పాటు ఉద్యోగ నేతలు సమస్యలను వివరించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు తర్వాత జరిగిన పరిణామాలు, ఉన్నతాధికారులు, మంత్రులకు వినతుల సమర్పణ, ముఖ్యమంత్రితో గతంలో జరిగిన చర్చలకు సంబంధించిన అంశాలను ఉద్యోగ సంఘాల నేతలు ప్రస్తావించారు. ప్రధానంగా 57 రకాల సమస్యలను జేఏసీ నేతలు త్రిసభ్య కమిటీ ముందు ఉంచారు. కాగా, గురువారం కూడా త్రిసభ్య కమిటీతో ఉద్యోగ సంఘాల నేతలు సమావేశం కానున్నారు. త్రిసభ్య కమిటీని కలిసిన వారిలో ఉద్యోగ జేఏసీ నేతలు దామోదర్ రెడ్డి, చావ రవి, వంగ రవీందర్ రెడ్డి, సదానంద్ గౌడ్, దేవరకొండ సైదులు, ముజీబ్ హుస్సేన్, సత్యనారాయణ, బి.శ్యామ్, కస్తూరి వెంకట్, మధుసూదన్ రెడ్డి తదితరులున్నారు.

సీపీఎస్‌ను రద్దు చేస్తే నెలకు రూ.300 కోట్లు మిగులు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించడం వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడదని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయన త్రిసభ్య కమిటీతో జరిగిన భేటీలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. కంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేస్తే ప్రతి నెలా ప్రభుత్వం చందా రూపంలో చెల్లించాల్సిన రూ.300 కోట్లు మిగులుతుందని, ఈ సొమ్మును ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగించుకునే వీలుంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం దీనిని నెరవేర్చాలని ఆయన కోరారు.

కమిటీల పేరుతో కాలయాపన

ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సమయంలో అన్ని హామీలు నెరవేర్చుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వాటిని అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ ఆరోపించింది. బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఉద్యోగుల జేఏసీ మాజీ చైర్మన్ జి.దేవీప్రసాద్ మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులకు ఏ చిన్న సమస్య వచ్చినా కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ సభ్యులు అండగా ఉంటారని,, ఉద్యోగులకు మద్దతు ఇస్తే తప్పేంటని, ఉద్యోగుల డిమాండ్ల సాధనకు మాతో కలిసి వచ్చేవారితో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఏఐసీసీ అగ్రనేతలు సోనియా, రాహుల్‌పై ఈడీ కేసు పెడితే మంత్రులు ధర్నా చేయొచ్చుగానీ, తెలంగాణ ఉద్యమం కోసం పోరాటం చేసినవారికి అండగా ఉండొద్దా అని వారు నిలదీశారు. రేవంత్‌కి దమ్ముంటే ఉద్యోగులు అడుగుతున్న 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని, గతంలో ఇచ్చిన కమిటీ రిపోర్టులు కాదని మళ్లీ కొత్త కమిటీ ఎందుకో చెప్పాలని ప్రశ్నించారు. కేటీఆర్‌కే ఉద్యోగుల సమస్యలపై మాట్లాడే హక్కు ఉందని, కేటీఆర్‌ను కాంగ్రెస్ నేతలు విమర్శించడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఉద్యోగులు సమ్మెకు పిలుపునివ్వలేదని, ధర్నా చేస్తామంటేనే సీఎంకు ఎందుకంత కోపమో చెప్పాలని ప్రశ్నించారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే సొంతింటి కల సాకారం

అర్హులందరికీ లబ్ధి జరిగేలా చూస్తాం: మంత్రి పొంగులేటి



సుబ్బంపేటలో సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న పొంగులేటి, తెల్లం వెంకట్రావు

పినపాక/దుమ్ముగూడెం/చర్ల: ఇందిరమ్మ రాజ్యంలోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో బుధవారం ఆయన ఇందిరమ్మ ఇళ్లతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో సొంతిల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి లబ్ధి చేకూరుస్తామని, ప్రతిపక్షాల మాటలు నమ్మి ప్రజలు ఆందోళనకు గురికావొద్దని, మోసపోవద్దని సూచించారు. లబ్ధిదారుల జాబితాలో అర్హులకు మాత్రమే చోటు దక్కాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా అనర్హులకు ఇల్లు మంజూరైనట్లు తేలితే నిర్మాణంలో ఉన్నా రద్దు చేస్తామని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఇస్తున్నామని తెలిపారు. ఇంటి నిర్మాణ దశలను బట్టి వెంటవెంటనే నగదు అందిస్తామన్నారు. కాగా, చర్ల మండలం తేగడలో లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని గ్రామస్తులు మంత్రికి ఫిర్యాదు చేశారు. పూరి గుడిసెల్లో, డేరాలు వేసుకుని నివసిస్తున్న వారికి కాకుండా పక్కా ఇళ్లు ఉన్నవారిని ఎంపిక చేశారని చెప్పడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దంటూ స్థానిక నాయకులు, అధికారులపై పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి విచారణ చేపట్టి అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ జితేశ్ పాటిల్‌ను ఆదేశించారు. అనంతరం సుబ్బంపేట గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారుడు వాసం ముసలయ్య ఇంట్లో భోజనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి.రాహుల్, భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు పాల్గొన్నారు.

గెజిట్‌పై స్టే ఇవ్వలేం!

- కృష్ణా, గోదావరి బోర్డులకు ప్రాజెక్టుల అప్పగింత వ్యవహారంపై సుప్రీంకోర్టు
- ప్రాజెక్టులు అప్పగించాలని 2021లో కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ
- గెజిట్ నోటిఫికేషన్‌ను సవాలు చేసిన తెలంగాణ
- ఈ పరిస్థితిలో స్టే ఇవ్వడం సాధ్యం కాదని సుప్రీం స్పష్టీకరణ
- తదుపరి విచారణ జూలై 28కి వాయిదా



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో కృష్ణా, గోదావరి పరీవాహకంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ)కు అప్పగించాలని ఆదేశిస్తూ 2021 జూలై 15న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌పై ప్రస్తుత పరిస్థితిలో స్టే విధించడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గెజిట్ నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ గతంలో తెలంగాణ రాష్ట్రం దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన డివిజన్ బెంచి విచారణ జరిపింది. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి ఉన్న వాటాలను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పంపిణీ చేసేందుకు గాను అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం 1956లోని సెక్షన్ 3 కింద కృష్ణా ట్రిబ్యునల్–2కు కేంద్రం అదనపు మార్గదర్శకాలు (టీఓఆర్) జారీ చేసిన నేపథ్యంలో అంతకు ముందు జారీ చేసిన గెజిట్‌పై స్టే విధించాలని తెలంగాణ తరఫు న్యాయవాది వాదించారు. గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన మూడేళ్ల తర్వాత ఇప్పుడు ఎందుకు స్టేను కోరుతున్నారని సుప్రీంకోర్టు ప్రశ్నించగా, గెజిట్ ఇంకా అమల్లోకి రాలేదని బదులిచ్చారు. 'అమల్లోకి రానప్పుడు స్టే ఎందుకు? అలాంటి ఉపశమనం ఇవ్వలేము' అని కోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో వాదనలు విని తుది తీర్పు జారీ చేస్తామని తేల్చి చెప్పింది. ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీ జరగలేదని, ఈ పరిస్థితిలో రెండు రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణను కృష్ణా బోర్డుకు అప్పగించడం సరి కాదని తెలంగాణ న్యాయవాది కోర్టుకు వివరించారు. రెండు రాష్ట్రాల మధ్య నీళ్ల పంపిణీకి ఓ ప్రాతిపదికన లేనప్పుడు కృష్ణా బోర్డుకు ప్రాజెక్టులు అప్పగించడం తగదన్నారు. కాగా, నీటి పంపకాలను కృష్ణా ట్రిబ్యునల్–2 తేల్చలేదని, ఈ పరిస్థితిలో స్టే ఇవ్వడం సాధ్యం కాదని కోర్టు స్పష్టం చేసింది. కేసు తుదుపరి విచారణను జూలై 28కి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలు జరిపేందుకు గాను కృష్ణా ట్రిబ్యునల్–2కు అదనపు మార్గదర్శకాలను సవాలు చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం సుప్రీం కోర్టులోని మరో ధర్మాసనం విచారించనుంది.

సాక్షి
గురువారం, 8 మే 2025

అదనుచూసి పదునైన పాఠం!

తీరికూర్చుని భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో జగడాలమారి పాకిస్తాన్‌కూ, దాని కీలుబొమ్మలైన ఉగ్రమూకలకూ తెలిసొచ్చి ఉండాలి. 2016 నాటి 'ఉరి' సర్జికల్ దాడులు, 2019 నాటి బాలాకోట్ వైమానిక దాడులకు అనేక రెట్లు అధికంగా మంగళవారం అర్ధరాత్రి దాటాక 'ఆపరేషన్ సిందూర్' సంకేతనామంతో మన త్రివిధ దళాలు పకడ్బందీ సమన్వయంతో పాకిస్తాన్‌లోనూ, ఆక్రమిత కశ్మీర్‌లోనూ తొమ్మిది చోట్ల గంటసేపు సాగించిన క్షిపణి దాడులు పాక్ సైన్యాన్నీ, ఉగ్రమూకల్నీ గుక్క తిప్పుకోనీయకుండా చేశాయి. ఉగ్రవాదుల శిక్షణ కేంద్రాలూ, వారి ఆయుధ గిడ్డంగులూ, ఇతరేతర అవసరాలకు వినియోగిస్తున్న బహుళ అంతస్తుల భవంతులూ లక్ష్యంగా మొత్తం 24 చోట్ల సాగించిన దాడుల్లో 70 మంది వరకూ ఉగ్రవాదులు మరణించగా, మరో 60 మంది గాయపడ్డారని చెబుతున్నారు. ఉగ్రవాద ముఠాలైన జైషే మొహమ్మద్ (జేఈఎం), లష్కరే తోయిబా(ఎల్ఈటీ) ప్రధాన కార్యాలయాలు రెండూ కుప్పకూలాయని సమాచారం. జేఈఎం చీఫ్ మసూద్ అజర్ సోదరితోసహా అతగాడి కుటుంబానికి చెందిన పదిమంది హతమయ్యారని కూడా చెబుతున్నారు. జరిగిన నష్టాన్ని కప్పెట్టే ఎత్తుగడతో అయిదు భారత్ విమానాలను కూల్చామంటూ పాక్ స్వోత్కర్షలకు పోతోంది.

సంప్రదాయానికి భిన్నంగా ఈసారి పాక్ లోలోపలివరకూ చొచ్చుకెళ్లి దాడులు సాగించిన తీరూ, ఒక్క క్షిపణి కూడా గురితప్పకుండా శత్రుమూకలపై చంద్రనిప్పులు కురిపించిన విధానం మన త్రివిధ దళాల పకడ్బందీ అంచనాలకూ, పదునైన వ్యూహచతురతకూ దర్పణాలు. పాక్ గడ్డపై గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఉగ్రశిబిరాల ఆనుపానుల్ని శత్రునేత్రానికి చిక్కని విధంగా గత పక్షం రోజులుగా మానవ రహిత విమానాలతో జల్లెడపట్టాకే ఈ దాడులు జరిగాయి. పహల్‌గామ్ సమీపంలో అకారణంగా, అన్యాయంగా నిరాయుధ భారత పౌరులను గురిచూసి కాల్చిచంపటానికి కిరాయిమూకల్ని పంపి కొన్నిరోజులుగా పాకిస్తాన్ మురుస్తోంది. దీనిపై నిలదీస్తే షరా మామూలుగా సాక్ష్యాలడుగుతోంది. గత నెల 22న పహల్‌గామ్ సమీపంలో ఉగ్రవాద ముఠా 26 మందిని పొట్టనబెట్టుకున్నప్పటి నుంచీ భారత ప్రజ ప్రతీకారంతో రగిలిపోతోంది. కంటికి కన్ను సిద్ధాంతం పాటించి గట్టి దెబ్బతీయాల్సిందేనన్న అభిప్రాయం అలుముకుంది. ఈ నేపథ్యంలో మన దళాల దాడులు విజయవంతం కావటం అందరినీ సాంత్వన పరుస్తుందనటంలో సందేహం లేదు.

అనుకోని పరిణామాలు తలెత్తితే అనుసరించాల్సిన పద్ధతులపై పౌరులకు అవగాహన కల్పించటానికి బుధవారం మాక్ డ్రిల్ జరగటం, అంతకుముందు రోజు రాత్రే మన త్రివిధ దళాలు దాడులు చేయటం గమనిస్తే వర్తమానం ఎంత జటిలంగా ఉన్నదో అర్థమవుతుంది. ఇది మనం కోరుకున్నది కాదు. మన ప్రమేయం లేకుండా వచ్చిపడిన విపత్తు. అకారణంగా మనపై రుద్దిన సంక్లిష్ట సమస్య. దీనికి దీటుగా స్పందించకపోతే ఉగ్రదాడులకు అంతూ పొంతూ ఉండదు. కనుకనే పహల్‌గామ్ మారణకాండ గురించి తెలియగానే ప్రధాని నరేంద్ర మోదీ సౌదీ పర్యటనను రద్దుచేసుకుని వెనుదిరిగారు. ఆ వెంటనే మంత్రివర్గ సహచరులతో, త్రివిధ దళాల అధిపతులతో వరస సమాలోచనలు సాగించారు. ఎప్పుడు, ఎక్కడ ఎలా దాడులు సాగించాలో, తీవ్రత ఏ స్థాయిలో వుండాలో మీరే నిర్ణయించండంటూ మన దళాలకు అధికారం ఇచ్చారు. పర్యవసానంగానే పాక్ ప్రాపకంతో చెలరేగిపోతున్న ఉగ్రముఠాలకు గట్టి సమాధానం వెళ్లింది. ఈ దాడులకు చాలాముందే ఇతరేతర నిర్ణయాలు తీసుకున్నారు. సింధూ నదీజలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపేస్తున్నట్టు ప్రకటించటంతోపాటు ఇండియా పలు చర్యలు తీసుకుంది. దీన్నంతటినీ గమనిస్తున్నవారికి మన దేశం సైనిక చర్యకు కూడా వెనకాడబోదని పక్షం రోజుల క్రితమే అర్థమైంది.

యుద్ధం దేనికీ పరిష్కారం కాకపోవచ్చు. చర్చలే అంతిమంగా ఎంతటి జటిల సమస్యనైనా పరిష్కరిస్తాయన్న సిద్ధాంతం కూడా సరైనదే కావొచ్చు. కానీ పొరుగు పచ్చగావుంటే ఓర్వలేక నిష్కారణంగా దాడులకు దిగే నైజాన్ని శాంతిప్రవచనాలతో ఎదుర్కొనటం సాధ్యమేనా? ఒకపక్క పహల్‌గామ్ దాడులతో సంబంధం లేదంటూనే గత కొన్ని రోజులుగా అధీనరేఖ వద్దా, అంతర్జాతీయ సరిహద్దు వద్దా పాక్ ఎలాంటి కవ్వింపూ లేకుండా కాల్పులకు దిగుతోంది. ఈ దాడుల కారణంగా ఒక్క బుధవారంనాడే పూంఛ్ జిల్లా గ్రామాల్లో 12 మంది పౌరులు బలయ్యారు. తన దుష్ట పన్నాగాలను కప్పిపుచ్చటానికి భద్రతామండలిలో పాకిస్తాన్ అమాయకత్వం నటిస్తూ భారత్ తీసుకుంటున్న వరస చర్యలకు వ్యతిరేకంగా తీర్మానం చేయించాలని విఫలయత్నం చేసింది. రేపో మాపో అది నేరుగా సైన్యాన్ని రంగంలోకి దించి ప్రతీకారం పేరిట చెలరేగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఉగ్రముఠాల ద్వారా మారణహోమానికి పాల్పడటం కన్నా ఒకరకంగా ఇది మంచిదే. భారత్ బెదిరిపోయి సైనిక దాడుల ఆలోచన మానుకుంటుందన్న తప్పుడు ఆలోచనతో కొన్ని రోజులుగా అది అణుబాంబు బెదిరింపులకు కూడా తెగించింది. ఆ దుస్సాహసానికి పూనుకుంటే చేజేతులా స్వీయవినాశనాన్ని కొనితెచ్చుకున్నానని పాక్ పశ్చాత్తాపపడే రోజు ఎంతో దూరంలో ఉండదు. ఈ కష్టకాలంలో దేశ ప్రజానీకం కుల మత భేదాలు మరిచి కలిసికట్టుగా ఉండటం అత్యావసరం. ఇదే అదనుగా నాలుగు ఓట్ల కోసమో, మరికొన్ని సీట్ల కోసమో ప్రజల్లో వైషమ్యాలు సృష్టించాలని చూసే అవాంఛనీయ శక్తుల్ని అందరూ సకాలంలో పోల్చుకుని దూరం పెట్టడం, తగిన బుద్ధి చెప్పటం ఎంతో అవసరం. మనలోని సమష్టితత్వమే ఎంతటి విపత్తునైనా ఎదుర్కొనే ధైర్యాన్నిస్తుంది. విజయాన్ని మన చేతికందిస్తుంది.

దృఢసంకల్పంతో...

సందర్భం



మనోజ్ కె. చన్నన్

పహల్‌గామ్ ఉగ్రదాడికి భారత్ తగిన ప్రతీకారం తీర్చుకుంది. కుటుంబాల విచ్ఛిన్నమే లక్ష్యంగా పురుషులను మాత్రం ఎన్నుకుని... వారి మతం అడిగి మరీ భార్యల ఎదుటే భర్తలను ఉగ్రవాదులు చంపిన వైనం దేశాద్యంతం ప్రకంపనలు సృష్టించింది. ఇది కేవలం ఒక హింసాత్మక ఘటన కాదు. మానసిక యుద్ధ తంత్రం.

ఈ విషయంపై భారత్ ఆచితూచి స్పందించింది. ఉద్రేకాలకు పోలేదు. కచ్చితమైన, వ్యూహాత్మకమైన, సమన్వయ యుతమైన మిలిటరీ ప్రతిచర్యకు దిగింది. నిఘా వర్గాల అంచనాలను ఒకటికి రెండుసార్లు పరిశీలించి మరీ 'ఆపరేషన్ సిందూర్'ను నిర్వహించారు. పహల్‌గామ్ దాడులకు పాల్పడ్డ ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌లోని వారి గురువులను రూఢి చేసుకునేంతవరకూ అత్యంత ఓరిమితో వ్యవహరించారు. మిలటరీ భాషలో ఈ ఓరిమిని క్రమశిక్షణ అనాలి. మరోవైపు పాకిస్తాన్ యథావిధిగా పహల్‌గామ్ దాడి తరువాత సరిహద్దుల్లో తన పదాతి దళాలను పెంచుకుని భారత మిలిటరీ ప్రతిచర్య కోసం ఎదురు చూసింది. అయితే భారత్ ఈసారి తన వ్యూహాన్ని మార్చుకున్న విషయం పాక్‌కు తెలియలేదు.

బయటకు కనిపించని అసలు వ్యూహం

ఏదో జరగబోతోందన్న సంకేతాలు రెండు వారాలుగా కనిపిస్తున్నా కచ్చితంగా ఏమిటన్నది చివరి క్షణం వరకూ బయటపడలేదు. ప్రధాని కేబినెట్ సమావేశాలు, ప్రతిపక్ష నేతలతోనూ మంతనాలు జరిపారు. భద్రతాదళ ఉన్నతాధికారులు, రక్షణ శాఖ మంత్రి అందరూ చర్చల్లో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్స్‌కూ ఏర్పాట్లు పూర్తిస్థాయిలో జరిపారు. బయటకు కనిపించిన ఈ వ్యూహం వెనుక అసలైన ప్రతీకార చర్య చోటు చేసుకుంది. అణుబాంబుల బెదిరింపులతో మన ఆలోచనలను పక్కదారి పట్టించేందుకు జరిగిన విఫల యత్నాన్ని కూడా భారత్ అధిగమించింది.

భారత రక్షణ దళాలు నియంత్రణ రేఖకు (ఎల్‌ఓసీ) ఆవల తొమ్మిది కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపాయి. ఇది భారత సత్తాను, కృత నిశ్చయాన్ని చాటే ప్రణాళికా బద్ధమైన ప్రతిదాడి.

యుద్ధాల్లో ప్రతీకాత్మకతకు ప్రాముఖ్యం ఉంటుంది. మానసిక యుద్ధాల్లో మరీ ఎక్కువ. అందుకే అనూహ్యంగా ఇద్దరు మహిళా సైనికాధికారులు కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీతో కలిసి ఆపరేషన్ సిందూర్ గురించిన అధికారిక ప్రకటన వెలువరించారు. విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శితో ఇద్దరు మహిళ సైనికాధికారులు పాల్గొనడం పాకిస్తాన్‌తో పాటు ప్రపంచ దేశాలన్నింటికీ బలమైన సంకేతం పంపినట్లు అయ్యింది. భారత్‌కు తన గౌరవాన్ని కాపాడుకోవడం ఎలాగో తెలుసు అన్న సందేశాన్ని స్పష్టం చేసింది. అయితే, నియంత్రణ రేఖ వెంబడి పాకిస్తాన్ కాల్పులు జరుపుతూనే ఉంది. భారత్ వీటికి అంతే స్థాయిలో ప్రత్యుత్తరమూ ఇస్తోంది. దురదృష్టవశాత్తూ ఈ క్రమంలో భారత పౌరులు కొందరు ప్రాణాలు కోల్పోయారు. ఒకటి మాత్రం వాస్తవం: నిష్క్రియతో శాంతిని పొందలేమన్నది అందరూ గుర్తించాలి.



పహల్‌గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ఇండియా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న సైనికాధికారి కల్నల్ సోఫియా ఖురేషీ

> ఇది భారతదేశ సత్తానూ, కృత నిశ్చయాన్నీ చాటే ప్రణాళికాబద్ధమైన ప్రతిదాడి.

మునీర్‌పై విమర్శలు

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాకిస్తాన్ ఆర్మీ జనరల్ అసీమ్ మునీర్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాకిస్తాన్ భద్రతాంశాల విశ్లేషకురాలు అయేషా సిద్దిఖా ఆయన్ని 'ఆలోచన లేని జనరల్'గా అభివర్ణించారు. మతానికి మాత్రమే కట్టుబడిన జనరల్‌కు వాస్తవిక కార్యాచరణ ప్రణాళికల గురించి ఏమీ తెలియదని విమర్శించారు. జనరల్ జియా–ఉల్ హక్, పర్వేజ్ ముషారఫ్‌ల మాదిరిగా తానూ ఏదో పేరు సంపాదించాలన్న తాపత్రయం ఆయనలో కనబడుతోంది. జియా, ముషారఫ్ ఇద్దరూ విభజనకు ముందు భారత్‌లో పుట్టిన వారే. వాళ్లు సిద్ధాంతానికి వ్యూహాన్ని జోడించగల సమర్థులు. మునీర్ మతాన్ని, మాటలనే నమ్ముకున్నారు.


ప్రస్తుతం జరుగుతున్నది రెండు సరిహద్దుల మధ్య యుద్ధం కాదు. సైద్ధాంతికమైనది. త్యాగమంటే ఏమిటో చెప్పేది. నష్టానికి దేశాలు న్యాయం పొందడం ఎలాగో చెప్పేది. ఆపరేషన్ సిందూర్ అన్న పేరు కేవలం ప్రతీకాత్మకమైంది మాత్రమే కాదు. భారతీయ సంప్రదాయంలో కుంకుమ బొట్టుకు ఉన్న ప్రాశస్త్యం తెలియంది కాదు. పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు కుటుంబంలోని భర్తలే లక్ష్యంగా కాల్పులు జరిపారు. అందుకే మహిళల నుదుటి బొట్టును కాపాడేందుకే ఈ దాడులు చేసిందన్న సంకేతాన్ని భారత్ పంపింది. బెదిరింపులు, బుల్లెట్లు భారత సంకల్పాన్ని దెబ్బతీయలేవని, అణ్వాయుధాల పేరుచెప్పినా ఇక వదిలేది లేదన్నది ఆపరేషన్ సిందూర్ ఇచ్చే స్పష్టమైన సందేశం.

మరి ఈ దాడులకు పాక్ స్పందించకుండా ఉంటుందా? కచ్చితంగా స్పందిస్తుంది. కాకపోతే ఎప్పుడు, ఎలా అన్నది వేచి చూడాలి. ఇందుకు భారత రక్షణ దళాలు పూర్తి సన్నద్ధంగానే ఉన్నాయి. పాక్ కవ్వింపులకు దిగితే గట్టి సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగానే ఉన్నట్లు ఇండియా స్పష్టమైన సంకేతాలిచ్చింది. అంతేకాదు... ఇదేదో పరిస్థితిని మరింత జటిలం చేసుకునేందుకు మాత్రం కాదనీ, పొరుగు దేశం తన హద్దుల్లో తానుండటం మేలన్న సంకేతాన్ని ఇచ్చేందుకేననీ స్పష్టం చేసింది. హద్దు మీరితే అంతే గట్టి సమాధానం దొరుకుతుందన్న హెచ్చరిక కూడా అందులో ఉంది.

వ్యాసకర్త భారత సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ (రిటైర్డ్)

గతానికి భిన్నంగా...

సందర్భం



సంజీవ్ శంకరన్

ఏప్రిల్ నెల చివరలో జమ్మూ–కశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో 26 మంది నిరాయుధులను దారుణంగా హత్య చేసినందుకు ప్రతీకారంగా, మే 7 ఉదయం పాకిస్తాన్‌లో ఉగ్రవాదులకు స్థావరంగా ఉన్న తొమ్మిది ప్రదేశాలపై భారత సైన్యం దాడి చేసింది. పహల్‌గామ్ ఘాతుక చర్యకు సమాధానం ఇచ్చి తీరుతామని దేశ రాజకీయ నాయకత్వం స్పష్టం చేయడంతో సైనిక దాడి తప్పదని తేలిపోయింది. అయితే, పాక్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై దాడి జరగడం ఇదే మొదటిసారి కాదు, కానీ సరిహద్దు రేఖలు మారుతున్నాయని సూచించే లక్షణాలు 'ఆపరేషన్ సిందూర్'లో ఉన్నాయి.

సరిహద్దును దాటి...

పాకిస్తాన్‌లో ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై చివరి ప్రధాన దాడి 2019 ఫిబ్రవరిలో చోటు చేసుకుంది. ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లోని బాలాకోట్‌ను అప్పుడు భారత వైమానిక దళం లక్ష్యంగా చేసుకుంది.

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్ కేంద్ర బిందువైన పంజాబ్ ప్రావిన్స్‌లోని ప్రదేశాలపై భారతీయ సైన్యం దాడికి దిగింది. 1971 యుద్ధంలో పాకిస్తాన్ సైన్యం లొంగిపోయిన తర్వాత, భారత వాయుసేన నియంత్రణ రేఖను దాటడం ఇదే మొదటిసారి. దక్షిణ పంజాబ్‌లోని బహావల్‌పూర్‌లో జైష్–ఎ–మొహమ్మద్ ప్రధాన కార్యాలయం ఉంది. పంజాబ్‌లోని మరొక ప్రదేశం మురీద్‌కే! ఇక్కడ లష్కరే తోయిబా చాలా కాలంగా ఉనికిలో ఉంది. అయితే కశ్మీర్‌లో వాస్తవ సరిహద్దును గుర్తించే ఎల్‌ఓసీకీ, పాకిస్తానీ పంజాబ్‌కు మధ్య వ్యత్యాసం ఏమిటంటే, స్థిరపడిన అంతర్జాతీయ సరిహద్దు. సూటిగా చెప్పాలంటే, ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై దాడులకు చెందిన భౌగోళిక ప్రాంతం ఇప్పుడు విస్తరించింది. ప్రతీకారం తీర్చుకునే విషయంలో పాకిస్తాన్‌లోని ఏ ప్రదేశం కూడా భారత్ లక్ష్యాలకు దూరంగా లేదని తాజా దాడులు స్పష్టంగా సందేశమిస్తున్నాయి.

1971 నాటి యుద్ధంలోని ముఖ్యాంశాలలో ఒకటి, భారత సైన్యంలోని త్రివిధ బలగాలూ పాల్గొనడమే! నాటి యుద్ధంలో పూర్తి విజయం సాధించడానికి త్రివిధ దళాలు కలిసి పనిచేశాయి. ఆపరేషన్ సిందూర్‌లో కూడా మూడు దళాలూ పాల్గొన్నాయని ప్రభుత్వం తెలిపింది. వనరులను అత్యంత సమర్థంగా ఉపయోగించుకోవడానికి సైన్యం దీర్ఘకాలిక లక్ష్యంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ థియేటర్ కమాండ్లకు ఇది శుభ సూచకం.

నిజానికి భారతదేశం నుండి ప్రతిస్పందన అనివార్యం అయింది. అయినా భారీ స్థాయి దళాల కదలికల ద్వారా భారత్ ప్రతిస్పందన ఉంటుందని చెప్పే సూచన లేవీ లేవు. పాకిస్తాన్ వైపు మాత్రం వారు ప్రతిస్పందన కోసం సిద్ధమవుతున్నప్పుడు గణనీయ స్థాయిలో దళాల కదలిక కనిపించింది. అదే సమయంలో భారత్ సంయమన మార్గాన్ని ఎంచుకుంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో జరిగిన దాడుల్లో ఏవీ పాకిస్తాన్ సైన్యాన్ని లక్ష్యంగా చేసుకోలేదు. ఈ దాడిని ఉగ్రవాద మౌలిక సదుపాయాల నిర్మూలనకే పరిమితం చేశారు. దాడుల తర్వాత కూడా ప్రభుత్వం తన మీడియా ప్రకటనలో భారతదేశం తీవ్ర స్థాయి యుద్ధంలోకి వెళ్లకుండా ఉండాలనుకుంటున్నట్లు స్పష్టంగా సూచించింది.

> పాకిస్తాన్‌లోని ఏ ప్రదేశం కూడా భారతదేశానికి దూరంగా లేదని ఈ దాడి తెలియ జేస్తోంది.

ప్రతిదాడి చేయడానికి ముందు, భారతదేశం తాను అనుకున్న విధంగా ప్రతీకారం తీర్చుకోవడానికి గణనీయమైన స్థాయిలో అంతర్జాతీయ మద్దతును సాధించింది. చైనా మాత్రమే దీనికి మినహాయింపు. అదే సమయంలో, అంతర్జాతీయ ప్రధాన శక్తులు వాణిజ్య యుద్ధంతో పాటుగా పశ్చిమాసియాలో, ఉక్రెయిన్‌లో దీర్ఘకాలిక సంఘర్షణ సవాలును ఎదుర్కొంటున్నాయి. కాబట్టి ఇరుదేశాల మధ్య ఘర్షణలు ఒక స్థాయికి మించి పెరగకూడదని అవి ఆశిస్తున్నాయి.

వికసిత భారత్, రుణ సంక్షోభ పాక్

భారతదేశం మూడు దశాబ్దాలకు పైగా జమ్మూకశ్మీర్‌లో పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదంతో పోరాడుతోంది. ఈ క్రమంలో రెండు దేశాలలోనూ, వేర్వేరు ఆర్థిక పథాల్లో అభివృద్ధి జరుగుతోంది. భారత్ తన ఆర్థిక సరళీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన 1991 నాటికి, పాకిస్తాన్ తలసరి జీడీపీ భారత్ కంటే ఎక్కువగా ఉంది. తాజాగా ప్రపంచ బ్యాంకు డేటా ప్రకారం, 2023లో పాకిస్తాన్ తలసరి జీడీపీ 1,365 డాలర్లు కాగా, భారత్ జీడీపీ 82 శాతం ఎక్కువగా 2,481 డాలర్ల వద్ద ఉంది. అంటే రెండు దేశాల ఆర్థిక పథాలు వాటి వ్యూహాత్మక ఎంపికలను ప్రభావితం చేశాయి.

భారత్ ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే మార్గంలో ఉంది. 'బ్రెగ్జిట్' తర్వాత అది బ్రిటన్‌తో చేసుకున్న అత్యంత ముఖ్యమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఇటీవలే ముగించింది. మరోవైపు, పాకిస్తాన్ ఒక రుణ సంక్షోభం నుండి మరొక రుణ సంక్షోభానికి గురవుతూ, ఐఎమ్ఎఫ్ ఆపన్న హస్తం కోసం విజ్ఞప్తి చేస్తోంది. అది దాదాపు చైనా కాలనీగా మారింది. ఈ నేపథ్యంలో రెండు దేశాలు ఎంచుకున్న ఎంపికలనూ, పాకిస్తాన్ ఎదుర్కొంటున్న సార్వభౌమాధికారపు నిరంతర బలహీనతనూ పరిశీలించడం అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో జనరల్ అసీమ్ మునీర్‌కు అది ఎంతో ఉపయోగకరంగా ఉండవచ్చు.

వ్యాసకర్త 'మనీ కంట్రోల్' ఒపీనియన్స్–ఫీచర్స్ ఎడిటర్

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.ఏకాదశి ప.1.42 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఉత్తర రా.10.07 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.48 నుండి 10.39 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.46 వరకు, **అమృత ఘడియలు:** ప.2.24 నుండి 4.10 వరకు.

సూర్యోదయం: 5.35
సూర్యాస్తమయం: 6.17
రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు

సోషల్ మీడియా



ఐక్యతే బలం

ఇద్దరు మహిళలు. రెండు యూనిఫారాలు. రెండు విశ్వాసాలు. ఒకటే మిషన్: దేశ సేవ. ఆపరేషన్ సిందూర్ గురించి కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ వివరించడం వ్యూహం కన్నా కూడా ఒక ప్రకటన! ఇండియా బలం ఐక్యతలో ఉంది.

– అర్ఫా ఖానమ్ షేర్వానీ, జర్నలిస్ట్



మానసికమైన దెబ్బ

అన్నింటికన్నా సోఫియా ఖురేషీ ఫొటో పాకిస్తాన్‌ను ఎక్కువగా వెంటాడుతుంది. పాక్ మొత్తం ఉనికే మతాన్ని ఆధారంగా చేసుకున్నది. కానీ ఇక్కడ యూనిఫారంలోని ఒక భారతీయ ముస్లిం తన దేశమైన ఇండియా తరఫున వంచక దేశమైన పాకిస్తాన్ మీద గర్జిస్తోంది. భారతీయ సైన్యం పాకిస్తాన్‌ను క్షేత్రస్థాయిలో ఓడించింది. కానీ ఐక్య భారత సందేశంతో పాకిస్తాన్‌ను మానసికంగా నాశనం చేసింది.

– రోషన్ రాయ్, వ్యాఖ్యాత

పాక్‌ను ఇంకెలా దెబ్బ కొట్టాలంటే...

అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ తన స్వరాన్ని గట్టిగా వినిపించాలి. పొరుగు దేశానికి భూగోళం, చరిత్ర, అర్థశాస్త్రాలకు సంబంధించిన దిమ్మతిరిగే గుణపాఠాలు చెప్పాలి. పక్క దేశం హింస, నేరం, రక్తపాతాలను తనకు ఎగుమతి చేస్తూ ఉంటే ఏ దేశం కూడా మౌనంగా చూస్తూ ఉండి పోలేదు.

మొదటగా పాకిస్తాన్‌ను ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టాలి. ఆ దెబ్బ దాని ఆర్థిక నవనాడులూ కుంగిపోయేలా ఉండాలి. దేశ ఆర్థిక వ్యవస్థ టెర్రర్ నెట్‌వర్క్‌కు వెన్నెముక లాంటిది. పాకిస్తాన్ పెంచి పోషించే టెర్రరిస్టులకూ ఇది వర్తిస్తుంది. యూరోపియన్ యూనియన్ పాక్‌తో సహా కొన్ని దేశాలకు వాణిజ్య రంగంలో ప్రత్యేక ప్రాధాన్య హోదా కల్పించింది. అలాగే, టెర్రరిజాన్ని ప్రోత్సహించే దేశాలను శిక్షించడానికి ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) ఉంది. అలాంటి దేశాలను గుర్తించి 'గ్రే లిస్ట్' అనే జాబితా తయారు చేస్తుంది. ఇందులో చేర్చిన దేశాలకు ఆర్థిక సాయం నిలిపి వేస్తారు. పాక్‌ను గ్రే లిస్టులో చేర్చేలా ఒత్తిడి చేసి దానికి వాణిజ్య రాయితీలు అందకుండా చేయాలి. అసలైన పీడ మరొకటి ఉంది. దీన్ని వదిలించడానికి యూఎన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ ఆఫీస్ (యూఎన్‌ఓడీసీ) నివేదికలను ఉపయోగించుకోవాలి. ఈ సంస్థ అధ్యయనం ప్రకారం, హెరాయిన్ తయారీకి అవసరమైన ముడి సరుకు (ఓపియం)లో 90 శాతం అఫ్గానిస్తాన్ నుంచి సరఫరా అవుతోంది. పాక్ సైనిక గూఢచారి వ్యవస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) ఈ ఓపీయంను దిగుమతి చేసుకుని దాన్నుంచి హెరాయిన్ తయారు చేయిస్తోంది. ఈ మాదక ద్రవ్యాన్ని దొంగచాటుగా మత్తుబానిసలకు సరఫరా చేసి సంపాదించి నెత్తుటి సొమ్ము ఆర్జిస్తోంది. దీంతో టెర్రరిస్టులను పెంచి పోషిస్తోంది. ఇండియా ముందుగా ఈ మాదకద్రవ్య చీకటి సామ్రాజ్యాన్ని సర్వ శక్తులూ ఒడ్డి ఛిన్నాభిన్నం చేయాలి. అప్పుడే ఐఎస్ఐ టెర్రర్ రాకాసి ఊపిరాడక చస్తుంది.

పాక్‌ను నలుదిక్కులా చిక్కుల్లో పడేయాలి. ఒక వంక డ్యూరాండ్ లైన్ సరిహద్దులో అఫ్గానిస్తాన్‌తో చారిత్రక వైరం



నడుస్తోంది. ఒకప్పుడు తనే పెంచిన తాలిబన్ బిడ్డలు ఇప్పుడు దానికి చుక్కలు చూపిస్తున్నారు. ఇండియా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అఫ్గానిస్తాన్‌తో సంబంధాలు పెంచుకోవాలి. నమ్మకమైన తృతీయ పక్షాల సహకారంతో తాలిబన్ వర్గాలను దువ్వాలి. ఈ సమస్య మీద పాక్‌లో చీలికలు పెంచాలి. ఐఎస్ఐ మద్దతు పొందుతున్న హక్కానీ నెట్‌వర్క్‌ను ఏకాకిని చెయ్యాలి. తద్వారా పాక్ బీజం వేసిన మహావృక్షం దాని మీదే విరిగి పడేట్లు చెయ్యాలి. బలూచిస్తాన్ లోనూ ఇరాన్ సహకారంతో ఇదే విధంగా వ్యవహారం నడపాలి.

ప్రపంచ వేదిక మీద పాకిస్తాన్ నిజరూపం బయటపెట్టాలి. తీవ్రవాద మూలాలను తుదముట్టించేందుకు ఐరాస భద్రతా మండలి తీర్మానాల (1267, 1373) కింద పాక్‌ను దోషిగా నిలబెట్టాలి. ఈ దిశగా మనం మరింత గట్టిగా ప్రయత్నించాలి. ఇండియా, పాకిస్తాన్‌లలో ఉన్న ఐరాస మిలటరీ అబ్జర్వర్ గ్రూపునకు ఇంటి దారి చూపెట్టాలి. స్వదేశంలోనూ పాకిస్తాన్ క్రూరత్వానికి హద్దుల్లేకుండా పోయాయి. హజారాలు, అహ్మదీయులు వంటి జాతులు, కులాల వారి పరిస్థితి మెడ మీద కత్తిలా ఉంది. ఏకపక్ష నిర్బంధాలతో మగ్గిపోతున్నారు. పహల్‌గామ్ ఊచకోతకు ముందు, తర్వాత కూడా వీరంతా ఇండియాతో భుజం భుజం కలిపి పనిచేస్తున్నారు. ఈ వర్గాలకూ అలాగే చైనాలోని ఉయిగర్లకూ మనం నైతికపరంగా, దౌత్యపరంగా ఆపన్నహస్తం అందించాలి.

పాకిస్తాన్, టర్కీ, మలేసియాల దుష్టత్రయం అపవిత్ర కూటమిగా ఏర్పడటంతో మనకు ప్రమాదం పెరిగింది. ఈ దేశాలు ఉమ్మా (ముస్లిం ప్రపంచం) రక్షకులుగా చెప్పుకుంటూ ఒకప్పుడు ఆర్మేనియాలో సాగించిన మారణహోమం, గ్రీకులు, అస్సిరియా ప్రజలపై జరిపిన హింసాకాండలు వీటి రక్త చరిత్రకు ఆనవాళ్లు. ఇప్పుడివి కశ్మీరు ప్రజల మీద తెగబడే సాహసం చేస్తున్నాయి.

ఇలా ఉండగా, సౌదీ అరేబియా దాని మిత్రదేశాలు ఇండియాకు వ్యూహాత్మక, సాంస్కృతిక భాగస్వాములుగా ఆవిర్భవించాయి. మనం కూడలిలో తటస్థంగా నిలబడితే కుదరదు. చొరవ తీసుకోవాలి. వాషింగ్టన్‌లో హోలోకాస్ట్ మ్యూజియం, యెరెవన్‌లో ఆర్మేనియన్ జినోసైడ్ మ్యూజియంలు నిర్మించినట్లు... ఇండియా ఇప్పటికైనా కళ్లు తెరిచి శ్రీనగర్‌లో టెర్రర్ మ్యూజియం ఏర్పాటు చేయాలి. జిహాద్ పేరిట దశాబ్దాల తరబడిగా పాకిస్తాన్ సాగిస్తున్న ఊచకోతలకు అది సజీవ స్మారకంగా నిలవాలి.

పాక్ ఆక్రమిత కశ్మీర్, గిల్గిత్–బాల్టిస్తాన్‌లలో నినదించే అసమ్మతి స్వరాలతో ఇండియా గొంతు కలపాలి. పంజాబీ ఆధిపత్య పాక్ సైనికాధికారులు వెంటాడి తరిమికొట్టిన ఇతర ప్రాంతాల వారికి ప్రవాస ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకునేందుకు మనం సహాయం చేయాలి. 1950లలో టిబెట్ ప్రవాస ప్రభుత్వం ఏర్పాటుకు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పునాది వేయగలిగినప్పుడు, నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆయన అడుగుజాడల్లో ఎందుకు నడవలేదు? తప్పకుండా నడవగలదు.

చివరగా ఇండియా డిజిటల్ యోధులను రంగంలోకి దించి తీరాలి. మనం మానవ మేధలో అగ్రగణ్యులం. అలాగే సాంకేతిక మేధలో అంతకంటే అత్యుత్తమ స్థానంలో ఉంటాం. డిజిటల్ స్ట్రయిక్స్ చేయాల్సిన అవసరం కూడా ఇప్పుడుంది. బుల్లెట్ పేల్చకుండానే శత్రు దేశ మౌలిక సదుపాయాలను నిర్వీర్యం చేయగలం. మిలిటరీ రహస్యాలు లీక్ చేయగలం. వ్యతిరేక కథనాలను తిప్పికొట్టగలం. డిజిటల్ యుద్ధం నేటి ఆధునిక తంత్రం. టెర్రరిజం సరిహద్దులను దాటినప్పుడు, దాని పర్యవసానాలూ అలాగే ప్రయాణించాలి.


మనుగడ, ఆధిపత్యం కోసం జరుగుతున్న దీర్ఘకాలిక చదరంగ క్రీడ ఇది! ఇండియా ఈ ఆటలో మూడు ఎత్తులు ముందుగా ఆలోచించి తీరాలి. మనం డిఫెన్స్ మాత్రమే ఆడితే కుదరదు. నివ్వెరపోయేలా సాహసోపేతమైన మరిన్ని త్రివిధ దళాల దాడులకు రూపకల్పన చేయాలి. ఇన్నాళ్ళూ మన సహనాన్ని నిష్క్రియాపరత్వంగా పాకిస్తాన్ పొరబడుతూ వచ్చింది. 'ఆపరేషన్ సిందూర్' అనంతరమూ మనం బహుముఖ వ్యూహాలతో దూకుడు చూపాలి. మార్పు తరంగాలను అలా చూస్తూ ఉండిపోయే వారిపట్ల చరిత్ర ఎప్పుడూ కనికరం చూపించదు. తుపాను మీద స్వారీ చేస్తూ తీరరేఖను మార్చగలిగే వారికే అది ప్రతిఫలం చేకూర్చుతుంది!

– అభిషేక్ మను సింఘ్వీ, పార్లమెంట్ సభ్యులు
– ఆకాశ్ కుమార్ సింగ్, జేఎన్‌యూ జాతీయ భద్రతా అధ్యయనాల ప్రత్యేక కేంద్రంలో పీహెచ్‌డీ స్కాలర్

దేవుడిని చూడాలంటే...

భగవంతుడు అనేవాడు ఉన్నాడా? ఒకవేళ ఉంటే, మనం ఆయన్ని ఎందుకు చూడలేకపోతున్నాం? మనం సినిమా చూడడానికి ప్రదర్శనశాల (సినిమా హాలు)కు వెళ్లినప్పుడు తెరపై చిత్రాలు ఏ విధంగా కనపడతాయో కొంత అవగాహన ఉంది కదా! ఒక చిన్నగదిలో యంత్రాన్ని (ప్రొజెక్టర్) నడిపిస్తూ తన కర్తవ్యాన్ని తాను నిర్వర్తించి తెరపై బొమ్మలు పడేలా చేస్తాడు ఒక వ్యక్తి. అతడు లేకుండా సినిమా ప్రదర్శన సాధ్యమే కాదు. సినిమా నడిపే వ్యక్తి మాత్రం మనకు కనబడకుండా ఉంటాడు. నీవు అతనిని కలవాలని అనుకుంటే అతడితో పరిచయం ఉన్నవాని (మధ్యవర్తి) సహాయంతో కలవవచ్చు. ఆ సినిమా నడిపే అతనితో స్నేహం పెంచుకొన్న తర్వాత నీకు ఇష్టం వచ్చినప్పుడు అతని గదిలోకి ప్రవేశించవచ్చు, అతనితో మాట్లాడవచ్చు కదా!

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఈ ప్రపంచమే ఒక విశాలమైన చిత్ర ప్రదర్శనశాల. దీనియందు మనకు ఎప్పుడూ సంభవించే సంఘటనలే ప్రదర్శనలు. సినిమాలో ఉన్నట్లు, ఇక్కడ కూడా యంత్రాన్ని నడిపించేవాడు ఉన్నాడు. అతను కూడా కనిపించడు. సరైన పరికరాలు, మధ్యవర్తి ఉంటేనే ఆయన కనిపిస్తాడు. ఈ సందర్భంలో మైత్రి అంటే 'భక్తి' అని పిలిచే ఒక సాధనాన్ని ఈ కార్య సాధనలో ఉపయోగిస్తూ సద్గురువు అనే మధ్యవర్తి ద్వారా భగవంతుని చూడవచ్చు.

సద్గురువు సహాయంతో భగవంతుని దర్శించుకొన్నవారు ఎందరో ఉన్నారు. అటువంటివారి అనుభవాలే మన పవిత్ర గ్రంథాల్లో దృష్టాంతాలుగా ఉన్నాయి. భగవంతుని దర్శించుకొనదలచిన వారికి పూర్వం భక్తులు ఏ బాటలో నడచి భగవత్ సాక్షాత్కారాన్ని పొందారో అటువంటివారు నడచిన మార్గాన్ని ఇతిహాసాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఆ మార్గంలోనే భక్తి విశ్వాసాలు, ధైర్యంతో నీవు నడచినట్లయితే గమ్యాన్ని చేరుకోగలవు. నిన్ను చెడగొడుతున్న సందేహాలు అన్నీ అప్పుడు తొలగిపోతాయి.

క్లుప్తంగా...

జాతీయ రహదారిపై చిరుత మృతి

- ఢీకొన్న గుర్తు తెలియని వాహనం



రహదారిపై మృత్యువాత పడ్డ చిరుత

ఇందల్వాయి (నిజామాబాద్ రూరల్): నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం 44వ నంబరు జాతీయ రహదారిపై చంద్రాయన్‌పల్లి గ్రామ శివారులో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండేళ్ల వయసున్న మగ చిరుత మృతి చెందింది. చిరుత కళేబరాన్ని తిర్మన్‌పల్లి సెంట్రల్ నర్సరీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేసినట్లు ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌వో సంజయ్ గౌడ్ తెలిపారు.

మూడేళ్లలో మూడు చిరుతలు మృతి

ఇందల్వాయి–సదాశివనగర్ మధ్యలో జాతీయ రహదారిపై మూడేళ్లలో మూడు చిరుతలు మృతి చెందాయి. 2023 ఫిబ్రవరిలో ఇదే అటవీ ప్రాంతంలో, 2024 ఏప్రిల్‌లో దగ్గి అటవీ ప్రాంతంలో చిరుతలు రోడ్డు దాటుతూ.. గుర్తు తెలియని వాహనాలు ఢీకొని మృతి చెందాయి. 2018 మే నెలలో కూడా చిరుత ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందింది. వరుస ప్రమాదాలపై స్పందించిన డీఎఫ్‌వో వికాస్ మీనా.. జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులకు రక్షణ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

డాడీ.. లే డాడీ..

- ఆత్మహత్య చేసుకున్న తండ్రి వద్ద చిన్నారి పిలుపులు



తండ్రి నిద్రపోయాడని లేపుతున్న చిన్నారి

తంగళ్లపల్లి (సిరిసిల్ల): తండ్రి నిద్రపోయాడనుకున్న ఆ రెండేళ్ల చిన్నారి చనిపోయిన తండ్రిని 'డాడీ.. లే డాడీ'.. అంటూ పిలవడం అందరినీ కంటతడి పెట్టించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం కేసీఆర్‌నగర్ (డబుల్ బెడ్రూం సముదాయం)లోని బ్లాక్ నంబర్ 18, రూం నంబర్ 6లో నివాసముంటున్న తాడూరి రామ్‌కుమార్ (38) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. రామ్‌కుమార్ 14 ఏళ్ల క్రితం వేములవాడకు చెందిన అనితను కులాంతర వివాహం చేసుకున్నాడు. వారికి ముగ్గురు సంతానం సుఖజిత్ (11), శ్రీవాస్తవ్ (5), విహాన్ (2). రామ్‌కుమార్ జిరాక్స్ మెషీన్ మెకానిక్‌గా, వివాహ ఈవెంట్లలోనూ పనిచేస్తుండేవాడు. పనులు సరిగాలేక రామ్‌కుమార్‌కు రూ.3 లక్షల వరకు అప్పులు కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం మధ్యాహ్నం భార్య వంటగదిలో ఉన్న సమయంలో పెద్ద కొడుకు సుఖజిత్‌తో మాట్లాడిన రామ్‌కుమార్, తమ్ముళ్లను బాగా చూసుకోమని చెప్పి గదిలోకి వెళ్లి డోర్ వేసుకుని ఉరేసుకున్నాడు. ఎంతసేపటికి డోర్ తీయకపోవడంతో భార్య కేకలతో స్థానికులు వచ్చి తలుపు పగలగొట్టి చూడగా అప్పటికే మృతిచెందాడు. ట్రెయినీ ఎస్సై వినీతారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బకు కూలీ మృతి

గుర్రంపోడు: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం పిట్టలగూడెంకు చెందిన పాల్వాయి సునీత (50) వడదెబ్బతో మృతి చెందింది. రోజూ మాదిరిగానే బుధవారం ఉపాధి హామీ కూలి పనికి వెళ్లిన సునీత.. పనిచేస్తూ అక్కడే కుప్పకూలింది. ఆమెను 108 వాహనంలో నల్లగొండకు తరలించగా.. చికిత్స చేస్తుండగానే మృతి చెందింది. వడదెబ్బ వల్ల మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

కర్రిగుట్టల్లో రక్తపుటేర్లు

భారీ ఎన్‌కౌంటర్‌లో 38 మంది మావోయిస్టుల మృతి?

- 22 మంది కంటే ఎక్కువే చనిపోయారన్న ఛత్తీస్‌గఢ్ సీఎం
- గుంజపర్తి–ఇత్తగూడ సమీపంలో చోటుచేసుకున్న ఎదురుకాల్పులు
- మృతుల్లో ఎవరెవరున్నారనే దానిపై కొరవడిన స్పష్టత



కర్రిగుట్టలపై మావోయిస్టుల సంచారం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్న డ్రోన్ చిత్రం. (ఇన్‌సెట్‌లో) హెలికాప్టర్ ద్వారా కాల్పులు జరుపుతున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ –ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న కర్రిగుట్టలు కాల్పుల మోతతో దద్దరిల్లాయి. పోలీసులు, మావోయిస్టుల మధ్య భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. బుధవారం జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో 38 మంది మావోయిస్టులు చనిపోయినట్టు విశ్వసనీయవర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అయితే ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ మాత్రం.. 22 కంటే ఎక్కువ మావోయిస్టుల మృతదేహాలు లభించినట్లు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్ బుధవారం ఉదయమే జరిగినట్టు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం మొదలైంది. తొలుత 15 మంది మావోయిస్టులు మాత్రమే చనిపోయినట్లు తెలిసింది. ఆ తర్వాత ఈ సంఖ్య గంటగంటకూ పెరగగా, ఛత్తీస్‌గఢ్ సీఎం మధ్యాహ్నం 1.30 ప్రాంతంలో మీడియాతో మాట్లాడారు. 'కొన్ని రోజులుగా కర్రిగుట్టల దగ్గర యాంటీ నక్సలైట్ ఆపరేషన్ కొనసాగుతోంది. భద్రతా దళాలకు ఈ రోజు భారీ విజయం దక్కింది. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది..'అని వెల్లడించారు.

మృతదేహాలేవీ..?

బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్రిగుట్టల సమీపాన గుంజపర్తి – ఇత్తగూడ సమీపంలో ఈ ఎదురుకాల్పులు చోటు చేసుకున్నట్టు సమాచారం. చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని ఛత్తీస్‌గఢ్ సీఎం ప్రకటించినా..ఎవరెవరు చనిపోయారు? ఆ మృతదేహాలను ఎక్కడికి, ఎలా తరలించారనే అంశాలపై స్పష్టత రాలేదు. దీంతో చనిపోయిన మావోయిస్టుల్లో అగ్రనేతలు ఉన్నారా లేక దళ సభ్యులు, జన మిలీషియా సభ్యులే ఉన్నారా? అనే అంశంపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఈ గుట్టలపై తెలంగాణ మావోయిస్టు కమిటీతో పాటు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, పీఎల్‌జీఏ బెటాలియన్ వన్ ఉన్నట్టు భద్రతా దళాలు అనుమానిస్తున్నాయి. మరోవైపు బుధవారం ఐఈడీ పేలి ఓ జవాను గాయపడగా, ఎలుగుబంటి దాడిలో ఇంకొకరు గాయపడినట్టు తెలుస్తోంది. అయితే వీటిపై పోలీసు వర్గాల నుంచి అధికారిక సమాచారం అందలేదు.

మిషన్‌లో అంతా గోప్యతే

మంగళవారం డ్రోన్‌తో తీసిన కొన్ని వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. కొందరు సాయుధులు నడిచి వెళ్తున్న దృశ్యాలు వాటిల్లో కనిపించాయి. ఈ వీడియో 'మిషన్ సంకల్ప్'కు సంబంధించినదే అని ప్రచారం జరిగినా, అధికారికంగా ఎవరూ ధ్రువీకరించలేదు. అయితే ఆ మరుసటి రోజే భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకోవడం గమనార్హం. ఈ ఒక్క వీడియోనే కాదు మిషన్ సంకల్ప్ మొదలైనప్పటి నుంచి అన్ని విషయాల్లో భద్రతా దళాలు గోప్యత పాటిస్తున్నాయి. మావోయిస్టులు ఉపయోగించిన గుహలు అంటూ వైరల్ అయిన వీడియోలపైనా స్పష్టత కరువైంది. ఏప్రిల్ 24న జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మహిళా మావోయిస్టులు చనిపోయారని ప్రకటించి, వారి పేర్లు, ఫొటోలు వెల్లడించడానికి 72 గంటల సమయం తీసుకున్నారు. వారు ఎక్కడివారనేది వెల్లడించలేదు. అలాగే మంగళవారం చనిపోయిన మరో మహిళా మావోయిస్టుకు సంబంధించిన వివరాలపై కూడా స్పష్టత లేదు. ప్రస్తుత భారీ ఎన్‌కౌంటర్ విషయంలోనూ అదే గోప్యత కొనసాగుతోంది.

కొనసాగుతున్న ఆపరేషన్

మిషన్ సంకల్ప్ ఏప్రిల్ 21న మొదలైంది. ఈ ఆపరేషన్‌లో 24 వేల మంది బలగాలను, నాలుగు హెలీకాప్టర్లు, రెండు డ్రోన్లు, 20 వరకు అన్‌మ్యాన్డ్ వెహికల్స్(యూఏవీ)ను ఉపయోగిస్తున్నారు. ఇప్పటివరకు కర్రిగుట్టల్లో 70 శాతం ప్రాంతాన్ని భద్రతా దళాలు తమ అధీనంలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 6 తర్వాత దశల వారీగా ఇక్కడ బలగాలను తగ్గించాలని ముందుగా నిర్ణయించినా, బుధవారం నాటి ఎన్‌కౌంటర్ నేపథ్యంలో మరికొన్ని రోజులు యధాతథంగా కొనసాగించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాదిలో ఇప్పటివరకు జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో 184 మంది మావోయిస్టులు చనిపోయారు.

ఐదుగురు మావోయిస్టుల లొంగుబాటు

ములుగు: మావోయిస్టు పార్టీకి చెందిన ఐదుగురు బుధవారం లొంగిపోయినట్లు ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీశ్ తెలిపారు. లొంగిపోయిన వారిలో కొమటిపల్లికి చెందిన ఆర్పీసీ సభ్యుడు మడావి భీమా, జంగిల్‌శాఖ సభ్యుడు మడావి కోస, డీకేఏఎంఎస్ సభ్యుడు మడివి భీమా, ఆర్పీసీ సభ్యుడు వంజం ఊర, చైతన్య నాట్యమండలి సభ్యురాలు వంజం హూంగి ఉన్నట్లు చెప్పారు.

పాలన చేతకాకపోతే దిగిపోండి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజం
- ధాన్యం కొనుగోళ్లలో సర్కార్ విఫలం



మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్: పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవి నుంచి రేవంత్‌రెడ్డి వెంటనే దిగిపోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. బుధవారం సిద్దిపేట మండల పరిధిలోని ఇర్కోడ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి మొలకలెత్తడంతో రైతుల బాధను చూసి విచారం వ్యక్తంచేశారు. వెంటనే తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్, ఆర్డీఓ, సివిల్‌సప్లై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ధాన్యం పరిస్థితి రైతుల కష్టాలను గుర్చి హరీశ్ విన్నవించారు. అనంతరం మాట్లాడుతూ పాలన చేతకాకపోతే సీఎం పదవి నుంచి రేవంత్‌రెడ్డి దిగిపోవాలన్నారు. అప్పులు పుట్టడం లేదంటూ సీఎం మాట్లాడటం సీఎంగా ఫెయిల్ అవడానికి నిదర్శనమని మండిపడ్డారు. సీఎం 43 సార్లు విమానంలో ఢిల్లీకి వెళ్లి వస్తున్నప్పటికీ సాధించింది ఏముందని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో అందాల పోటీలపై రివ్యూలు చేయడమే తప్ప.. రైతుల సమస్యలు పట్టడంలేదన్నారు. మొలకెత్తిన ధాన్యాన్ని తన ఫోన్‌లో ఫొటో తీసుకుని హరీశ్ అధికారులకు పంపించారు.

మీ కాల్మొక్త సార్.. వడ్లు కాంటా వేయించండి

- ట్రెయినీ ఎస్‌ఐ కాళ్లు పట్టుకుని వేడుకున్న రైతు



ట్రెయినీ ఎస్‌ఐ కాళ్లు పట్టుకుని వేడుకుంటున్న రైతు మాధవరావు (కుడి చివర)

తల్లాడ: 'మీ కాల్మొక్త సార్... మా వడ్లు కొనేటట్టు చేయండి, మా బాధలు ఆలకించండి'.. అని ఒక రైతు ట్రెయినీ ఎస్‌ఐ కాళ్లు పట్టుకుని వేడుకున్నాడు. వివరాలివి. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కుర్నవల్లికి చెందిన పలువురు రైతులు సాగు చేసిన వరి ధాన్యాన్ని కల్లంలో ఆరబోసి రోజులు గడుస్తున్నా గన్నీ సంచులు, లారీల కొరతతో కాంటా వేయడం లేదు. దీంతో 80 లారీలకు పైగా ధాన్యం పేరుకుపోగా, రైతులు మండల కేంద్రమైన తల్లాడ చేరుకుని రింగ్ రోడ్డు సెంటర్‌లో బుధవారం రాస్తారోకోకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు రంగప్రవేశం చేసి సివిల్ సప్లయిస్ అధికారులతో చర్చించి సమస్య పరిష్కరించుకోవాలని సూచించినా ధర్నా విరమించలేదు. దీంతో ట్రెయినీ ఎస్‌ఐ వెంకటేశ్, రైతులను పైకి లేపుతుండగా, కుర్నవల్లికి చెందిన రైతు బోడేపూడి మాధవరావు 'మీ కాల్మొక్త సార్... మా వడ్లు కొనేటట్టు చేయండి, మా బాధలు ఆలకించండి'.. అని ఆయన కాళ్లు పట్టుకుని వేడుకోవడం కలిచివేసింది. ఆ రైతు దండం పెడుతూ.. తమ బాధలు ఆలకించాలంటూ కోరాడు. చివరకు తహసీల్దార్ వచ్చి ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడగా, త్వరగా కాంటా వేయిస్తామని హామీ ఇవ్వడంతో అన్నదాతలు ఆందోళన విరమించారు.

సరస్వతీమాత విగ్రహ స్థిర ప్రతిష్ట

- కాళేశ్వరంలో పుష్కరాల పనులపై దేవాదాయశాఖ కమిషనర్ సమీక్ష



క్రేన్ సాయంతో సరస్వతీ మాత విగ్రహాన్ని పీఠంపైకి చేర్చుతున్న కార్మికులు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు నిర్వహించే సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా రాతితో తయారు చేసిన సరస్వతీ మాత విగ్రహాన్ని బుధవారం దేవాదాయశాఖ స్థపతి వల్లీనాయగం ఆధ్వర్యంలో పూజలు చేసి స్థిర ప్రతిష్ట చేశారు. సరస్వతీ అమ్మవారి చేతుల్లో వీణ, అక్షరమాల, తాళపత్ర గ్రంథాలున్నాయి. రూ.కోటి వ్యయంతో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాట్లు, సుందరీకరణ చేపట్టారు. విగ్రహం ఎత్తు 10 ఫీట్లు, చుట్టూరా నాలుగు వేద మూర్తులకు (రుగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అథర్వణవేదం) సంబంధించిన రుత్వికుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. రెండున్నర నెలల పాటు తమిళనాడులోని మహాబలిపురంలో రోజూ మూడు షిఫ్టుల్లో శిల్పులు విగ్రహాన్ని తయారు చేశారని స్థపతి పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ వెంకట్‌రావు సరస్వతీనది పుష్కరాల పనులను పరిశీలించి సమీక్ష నిర్వహించారు. పనుల్లో వేగం పెంచి పుష్కరాల నాటికి పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ఉన్నారు.

'సిందూర్'ని ఎగతాళి చేసిన ప్రొ.సుజాతను సస్పెండ్ చేయాలి

- అవసరమైతే అరెస్ట్ చేయాలి
- బీజేపీ ఎమ్మెల్యేల డిమాండ్

సాక్షి,హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్‌ను ఎగతాళి చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్, రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు సూరేపల్లి సుజాతను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని బీజేపీ ఎమ్మెల్యేలు రాజాసింగ్, పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్‌బాబు, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా డిమాండ్ చేశారు. సుజాతను విద్యా కమిషన్ సభ్యత్వం నుంచి తొలగించడంతో పాటు అవసరమైతే దేశద్రోహ చర్యగా భావించి ఆమెను అరెస్టు చేయాలని బుధవారం వేర్వేరు ప్రకటనల్లో వారు సూచించారు. పహల్గాం ఉగ్రదాడిలో 26 మందిని పొట్టన పెట్టుకున్న పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పేందుకు భారత సైన్యం ఆపరేషన్ చేపడితే సుజాత దానిని ఎగతాళి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యావత్ దేశం భారత సైనికుల శౌర్య, పరాక్రమాలను కీర్తిస్తుంటే, కొందరు అర్బన్ నక్సలైట్లు దానిని జీర్ణించుకోలేక పోతున్నారన్నారని మండిపడ్డారు. టెర్రరిస్టులు మారణాయుధాలతో దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తుంటే, అర్బన్ నక్సలైట్లు దేశద్రోహ భావజాలంతో విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు.

తప్పుడు పత్రాలతో బోనస్ స్వాహాకు యత్నం?

- ఏపీ నుంచి వచ్చిన ధాన్యం లారీ అడ్డగింత



కట్టుకాచారంలో రైతులు అడ్డుకున్న ధాన్యం లారీ

నేలకొండపల్లి: తెలంగాణలో సన్నధాన్యానికి బోనస్ ఇస్తున్న నేపథ్యంలో ఏపీ నుంచి అక్రమంగా ధాన్యం తీసుకొచ్చి అమ్మేందుకు చేసిన యత్నాలను ఖమ్మం జిల్లా కట్టుకాచారం వాసులు అడ్డుకున్నారు. ఏపీలోని వినుకొండ నుంచి విజయవాడ మీదుగా ధాన్యం లారీ బుధవారం ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించింది. దీంతో నేలకొండపల్లి మండలంలోని కట్టుకాచారంలో గ్రామస్తులు అడ్డుకుని వివరాలు ఆరా తీయగా చెరువుమాదారం రైతు కె.వెంకటేశ్వరరెడ్డి పేరిట పత్రాలతో ధాన్యాన్ని మిర్యాలగూడెం తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఆ గ్రామస్తులకు ఫోన్ చేయగా, వెంకటేశ్వరరెడ్డి పేరుతో రైతులెవరూ లేనట్లు తేలింది. దీంతో లారీని నిలిపేసి సివిల్ సప్లైస్ ఆర్‌ఐ నరేశ్‌తో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ధాన్యాన్ని పరిశీలించి సన్నాలైతే కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

'గాలి'ని కలిసిన భార్య, కుమార్తె

చంచల్‌గూడ (హైదరాబాద్): ఓఎంసీ అక్రమ మైనింగ్ కేసులో చంచల్‌గూడ జైల్లో శిక్ష అనుభవిస్తున్న మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డిని.. బుధవారం ఆయన సతీమణి, కుమార్తె కలిశారు. ములాఖత్‌లో ఆయనను కలిసేందుకు సతీమణి అరుణలక్ష్మి, కూతురు జైలుకు వచ్చి కాసేపు మాట్లాడి వెళ్లారు.

ప్రైవేట్‌దే విత్తు... పత్తి రైతే చిత్తు

- ఏటా ఒకటి, రెండు కంపెనీల పత్తి విత్తనాలకే డిమాండ్ సృష్టించి... కృత్రిమ కొరతతో బ్లాక్ మార్కెట్
- ఆపై రెట్టింపు ధరలకు అమ్మకాలు
- ఏ కంపెనీ అయినా బీటీ విత్తనాలన్నీ ఒకటే అంటున్న వ్యవసాయ శాఖ



సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ విత్తన కంపెనీల చేతిలో ఏటా పత్తి రైతు చిత్తవుతూనే ఉన్నాడు. ఒకటి రెండు కంపెనీల పత్తి విత్తనాలకే కృత్రిమ డిమాండ్ సృష్టిస్తూ, వాటిని బ్లాక్ చేస్తున్నారు. ఆపై రెట్టింపు ధరలకు అమ్ముతున్నారు. ఇది ప్రతి ఏటా జరిగే తంతే. ఈ సీజన్‌లోనూ కృత్రిమ కొరత సృష్టించేందుకు కొన్ని విత్తన కంపెనీల ఏజెంట్లు రంగంలోకి దిగినట్టు తెలిసింది. మరోవైపు టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పలు జిల్లాల్లో నకిలీ పత్తి విత్తనాల దందా సాగిస్తున్న వారిని అరెస్టు చేశారు. ఈ నెలాఖరు కల్లా తొలకరి వర్షం పడగానే పత్తి విత్తనాలు విత్తే అవకాశం ఉండడంతో కొన్ని విత్తన కంపెనీలు కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాల్లో ఉన్నట్టు వ్యవసాయ శాఖ అనుమానిస్తోంది. ఈ మేరకు విజిలెన్స్ విభాగాన్ని అప్రమత్తం చేసింది.

డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు...

వాస్తవానికి బీటీ రకం హైబ్రిడ్ పత్తి విత్తనాలన్నీ ఒకే ఫార్ములాతో రూపొందినవే. బీటీ–1, బీటీ–2 విత్తనాలు మార్కెట్‌లో ఉన్నా, రైతులు బీటీ– 2 విత్తనాలనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. బీటీ–3 విత్తనాలపై నిషేధం ఉన్నా, కొన్నిచోట్ల గుట్టుగా ఈ విత్తనాలను కూడా రైతులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. 475 గ్రాముల పత్తి విత్తన ప్యాకెట్ ధర ఈ సీజన్‌లో రూ. 37 పెరిగి రూ.901కి చేరింది. దీంతో పత్తి విత్తన కంపెనీలన్నీ ఇదే ధరకు రైతులకు విక్రయించాలి. అయితే ఏవో రెండు కంపెనీల విత్తన బ్రాండ్లకు అధిక డిమాండ్ సృష్టించి, రైతులంతా ఆ విత్తనాలు కొనుగోలు చేసేలా అనివార్య పరిస్థితులను సృష్టించి, వాటిని రైతులకు అందకుండా చేస్తారు. 'ఫలానా కంపెనీ విత్తనాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. కానీ ప్రస్తుతం మా దగ్గర ఆ విత్తనాలు అందుబాటులో లేవు. బ్లాక్‌లో తెప్పిస్తాం 'అంటూ రైతులకు ఆ బ్రాండ్ విత్తనాలపై ఆసక్తి పెరిగేలా చేసి, కృత్రిమ కొరత సృష్టించి, సొమ్ము చేసుకునే ఎత్తుగడ కొందరు దుకాణదారులు వేశారు. దీని వెనుక ఆయా కంపెనీల ఏజెంట్లు ఉన్నట్టు అనుమానిస్తున్నారు. తులసి, రాశి, అంబుజ, మహికో, యూఎస్ అగ్రిసీడ్ 7067, రేవంత్, సంకేత్, క్యాష్, ఏటీఎం సిమ్రాన్, బయోసీడ్, జయాగోల్డ్, చంద్రగోవా, సదానంద్, ప్రవర్ధన్, రేవంత్, యాక్స్ కంపెనీలు వివిధ రకాల బ్రాండ్ల పేరుతో మార్కెట్లో పత్తి విత్తనాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చాయి. అయితే కొన్ని జిల్లాల్లో కొన్ని బ్రాండ్లకే డిమాండ్ సృష్టిస్తూ వస్తున్నారు. ఈసారి ఆ పరిస్థితి లేకుండా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే తమ బ్రాండ్‌లకు డిమాండ్ కల్పించేలా కొన్ని కంపెనీలు ఏజెంట్లను ఇప్పటికే ఆయా జిల్లాలకు పంపించాయి. జిల్లా కేంద్రాల్లోని విత్తన దుకాణదారులు, హోల్‌సేల్ డీలర్ల సహకారంతో ఈ ప్రక్రియ సాగుతోంది.

అందుబాటులో 1.37 లక్షల క్వింటాళ్ల విత్తనాలు

రాష్ట్రంలో ఈసారి 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందుకోసం 45 వేల క్వింటాళ్ల బీటీ పత్తి విత్తనాలు అవసరమని లెక్కలు కట్టింది. కానీ ప్రైవేట్ కంపెనీల వద్ద ఇప్పటికే 1.37 లక్షల క్వింటాళ్ల పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు వ్యవసాయ అధికారులు తేల్చారు. ఈ విత్తనాల్లో డిమాండ్ అధికంగా ఉన్న బ్రాండ్ల విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి, రిటైల్ దుకాణదారులు, హోల్‌సేల్ వ్యాపారులతో కుమ్మక్కై రెట్టింపు ధరలకు విక్రయించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిసింది.

సీడ్ కార్పొరేషన్, ఆగ్రోస్‌ల ద్వారా విక్రయిస్తే...

రాష్ట్రంలో వరి విత్తనాలను తెలంగాణ సీడ్ కార్పొరేషన్ రైతులకు అందుబాటులో ఉంచుతోంది. ఆగ్రోస్ సైతం ఇతర విత్తనాలను రైతులకు విక్రయిస్తోంది. కానీ బీటీ పత్తి విత్తనాల విషయంలో ఈ రెండూ ఏ మాత్రం దృష్టి పెట్టలేదు. ప్రభుత్వం పూర్తిగా ఈ విత్తనాలను ప్రైవేట్ వ్యక్తులకే ధారాదత్తం చేయడంతో ఈ సంస్థలు కూడా వాటి జోలికి పోలేదు. ప్రభుత్వం ఈ దిశగా దృష్టి పెడితే ప్రైవేట్ కంపెనీల దందాకు అడ్డుకట్ట వేయొచ్చని వ్యవసాయ నిపుణులు భావిస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాల్లో కోతల్లేకుండా చూడండి

- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాల్లో ఎలాంటి కోతల్లేకుండా వారితో చేయించుకున్న పనికి వేతనం దక్కేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. తమను పలు కేటగిరీలుగా విభజించడం వల్ల ఎంతో నష్టపోతున్నామని, అందరినీ ఒకే కేటగిరీగా పరిగణించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు చేసిన విజ్ఞప్తిపై ఆమె సానుకూలంగా స్పందించారు. బుధవారం సచివాలయంలో మంత్రి సీతక్కతో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ సిబ్బంది సమావేశమైన సందర్భంగా తమ పెండింగ్ జీతాలు విడుదల చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్‌తో సంబంధం లేని పాలనాపరమైన సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి సూచించారు. పలు సమస్యలు, అంశాలపై చర్చించేందుకు త్వరలోనే ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది సంఘాలు, ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ (ఐఎన్‌టీయూసీ అనుబంధ) ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, రాష్ట్ర నేతలున్నారు.

'ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తున్నాం'

సాక్షి, హైదరాబాద్: ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను స్వాగతిస్తూ, సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. అదే సమయంలో దేశ పౌరులైన మావోయిస్టులను ఏరివేసేందుకు చేపట్టిన 'ఆపరేషన్ కగార్'ను తక్షణమే నిలిపివేయాలని కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు గట్టి గుణపాఠం చెప్పాల్సిందేనని అన్నారు. దేశానికి ఉగ్రవాదం నుంచి శాశ్వతంగా విముక్తి కలగాలని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వానికి సీపీఐ బాసటగా నిలుస్తుందని చెప్పారు. మావోయిస్టులు చర్చలకు వస్తామంటే ఒప్పుకోకుండా, లొంగిపోవాల్సిందేనని ఒక కేంద్ర మంత్రి నియంతలా మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాల ప్రకటనపై రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదనతో ఒక ప్రకటన చేయడం తప్పు కాకపోయినప్పటికీ, ఈ సమస్యకు కారణమైన వారు ఎవరో ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పాలని సూచించారు.

గిఫ్ట్ రద్దు అధికారం జగన్‌కు ఉంది

ఎన్‌సీఎల్‌టీలో వైఎస్సార్‌సీపీ అధినేత తరఫున ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు

- విజయమ్మ ఓ ట్రస్టీనే.. ఆమె నేరుగా షేర్లు బదిలీ చేయజాలరు
- షేర్ల సర్టిఫికెట్ లేకుండా బదిలీ చేయడం సాధ్యంకాదు
- సరస్వతి పవర్ ఇండస్ట్రీస్‌లో షేర్ల బదిలీ నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలి
- తదుపరి విచారణ మే 30కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: చెల్లెలిపై ప్రేమ, అభిమానంతో చేసుకున్న తొలి ఒప్పందమే రద్దయినప్పుడు... ఆ ఒప్పందం ప్రకారం చేసుకున్న గిఫ్ట్‌డీడ్ చెల్లుబాటే కాదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫున ఎన్‌సీఎల్‌టీలో న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'చెల్లెలు షర్మిలపై ప్రేమ, అభిమానాలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమెకు తన సొంత ఆస్తుల్లో వాటా ఇవ్వాలనుకున్నారు. ఆయన ఇవ్వాలనుకున్న ఆస్తి కుటుంబ వారసత్వంగా వచ్చింది కాదు. ఆయన సొంత ఆస్తి. ఈ మేరకు 2019లో తల్లి, చెల్లెలు సమక్షంలో ఎంఓయూ చేసుకున్నాక... పలు ఆస్తులు కోర్టు వివాదాల్లో ఉన్నాయి కనక కేసులన్నీ తేలాక ఎంఓయూ ప్రకారం ఆమెకు ఆస్తులు బదలాయించాలని భావించారు. కానీ 2024లో షర్మిల రాజకీయాల్లోకి వచ్చారు. జగన్‌కు వ్యతిరేకంగా ఉన్న పార్టీలో చేరారు. జగన్‌ను, ఆయన ప్రభుత్వాన్ని బహిరంగంగా తూలనాడుతూ విమర్శలు చేశారు. సయోధ్యకు జగన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా కుదరలేదు. వారసత్వంగా వచ్చిన ఆస్తుల్ని తండ్రి ఎవరికివ్వాల్సింది వారికిచ్చారని, ప్రేమాభిమానాలతో తాను ఇస్తానన్న ఆస్తులు ఆమె అంతలా తూలనాడుతున్నపుడు ఇవ్వాల్సిన అవసరం లేదని జగన్ భావించారు. తీరు మారకపోతే ఎంవోయూ రద్దు చేసుకుంటానని చెప్పారు. దీంతో షర్మిల విజయమ్మపై ఒత్తిడి తెచ్చి సరస్వతి పవర్‌లో షేర్లను చట్టవిరుద్ధంగా బదిలీ చేయించుకున్నారు. షేర్ సర్టిఫికెట్, షేర్ బదిలీ ఫారం పోయిందని చెప్పి.. అక్రమంగా బదిలీ చేసేసుకున్నారు. ఇది చట్టవిరుద్ధం. 51 శాతం షేర్లున్న వ్యక్తికి కనీస సమాచారం కూడా ఇవ్వకుండా బదిలీ చేయటం న్యాయవిరుద్ధం'అని జగన్ న్యాయవాది పేర్కొన్నారు.

గిఫ్ట్ రద్దు చేసుకునే హక్కు జగన్‌కుంది...

గిఫ్ట్‌డీడ్‌కు సంబంధించి విజయమ్మ ఓ ట్రస్టీ మాత్రమేనని, ఆమెకు షేర్లు బదిలీ చేసే అధికారం లేదని జగన్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. షర్మిల తరఫున న్యాయవాది పాండ్యన్ వాదిస్తూ... జగన్ కంపెనీకి రాజీనామా చేసి వెళ్లిపోయారని, అందుకే షేర్ల బదిలీ సమాచారం ఇవ్వలేదని చెప్పారు. జూలై 2 బోర్డు సమావేశం జరిగిందా అని బెంచ్ ప్రశ్నించగా.. అవునన్నారు. ఇండెమ్నిటీ బాండ్ ఉందా? అని అడగ్గా స్పందించలేదు. బాండ్ కాపీని కోర్టుకు ఇవ్వాలని కోరగా... ఇప్పుడు లేదని, తెప్పించి ఇస్తామని చెప్పారు. బోర్డు భేటీకి తాను హాజరు కాకున్నా హాజరైనట్లు పత్రాలు సృష్టించారని డైరెక్టరు యశ్వంత్ తరఫు న్యాయవాది వెల్లడించారు. విజయమ్మ, జగన్ కలిసే ఉంటున్నారని.. తల్లి అంటే ఆయనకు ప్రేమ, అభిమానం ఉన్నాయని విజయమ్మ తరఫు సీనియర్ న్యాయవాది వివేక్‌రెడ్డి చెప్పారు. ఒకే ఇంట్లో ఉంటున్నారు కనుక షేర్ సర్టిఫికెట్ జగన్ వద్ద ఉన్నా.. విజయమ్మ వద్ద ఉన్నా ఒకటేనన్నారు. రాజీవ్ భరద్వాజ్(జ్యుడీషియల్), సంజయ్ పూరి(టెక్నికల్)తో కూడిన బెంచ్ ఈ వాదనలు విన్న అనంతరం.. తదుపరి విచారణను మే 30కి వాయిదా వేసింది. అప్పటిలోగా లిఖిత పూర్వక వాదనలుంటే సమర్పించాలని న్యాయవాదులకు స్పష్టం చేసింది.


ఉగ్ర తండాలపై రక్త సిందూరం

100 మందికి పైగా ఉగ్రవాదులు హతం

'పహల్గాం'కు బదులు తీర్చుకున్న భారత్

- 'ఆపరేషన్ సిందూర్'తో గర్జించిన సైన్యం
- ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ సంయుక్త ఆపరేషన్
- విరుచుకుపడ్డ క్షిపణులు, బాంబులు, డ్రోన్లు
- జైషే, లష్కరే ప్రధాన స్థావరాలు ధ్వంసం
- పదుల కొద్దీ ఉగ్ర శిక్షణ కేంద్రాలు కూడా
- బాధితులకు న్యాయం జరిగింది: సైన్యం
- మనందరికీ ఎంతో గర్వకారణం: మోదీ





న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర దాడికి పక్షం రోజుల్లోనే భారత్ బదులు తీర్చుకుంది. అమాయక పర్యాటకులను పాశవికంగా పొట్టన పెట్టుకున్న ఉగ్ర ముష్కరులకు జన్మలో మర్చిపోలేని గుణపాఠం నేర్పింది. వారిని ప్రపంచం అంచుల దాకా వేటాడైనా కలలో కూడా ఊహించనంత కఠినంగా శిక్షిస్తామన్న ప్రధాని ప్రతిజ్ఞను సైన్యం దిగ్విజయంగా నెరవేర్చింది. ప్రతీకార దాడుల విషయంలో పూర్తి స్వేచ్ఛనిస్తూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంది. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై మంగళవారం అర్ధరాత్రి దాటాక మెరుపు దాడులు చేసింది. అంతర్జాతీయ ఉగ్రవాదులు మౌలానా మసూద్ అజర్ సారథ్యంలోని జైషే మహ్మద్, హఫీజ్ సయీద్ నేతృత్వంలోని లష్కరే తొయిబాతో పాటు హిజ్బుల్ ముజాహిదీన్ తదితర ఉగ్ర తండాల వెన్ను విరిచింది. వాటి ప్రధాన స్థావరాలతో పాటు శిక్షణ శిబిరాలను కూడా నేలమట్టం చేసేసింది. 'ఆపరేషన్ సిందూర్' పేరిట 25 నిమిషాల దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టింది. త్రివిధ దళాలు పూర్తి సమన్వయంతో, అత్యంత కచ్చితత్వంతో ఆపరేషన్ నిర్వహించాయి. ఎయిర్ టు ఎయిర్ మిసైల్స్‌తో వైమానిక దళం, సర్ఫేస్ టు ఎయిర్ క్షిపణులతో ఆర్మీ ద్విముఖ వ్యూహంతో ఏక కాలంలో దాడులకు దిగాయి. అత్యాధునిక స్కాల్ప్ క్రూయిజ్ క్షిపణులు, హామర్ ప్రెసిషన్ బాంబులు, గైడెడ్ బాంబ్ కిట్లు, ఆత్మాహుతి డ్రోన్లతో 9 ఉగ్రవాద శిబిరాలను నామరూపాల్లేకుండా తుడిచిపెట్టేశాయి. వీటిలో ఐదు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉండగా నాలుగు స్వయానా పాక్ గడ్డ మీదే ఉండటం విశేషం! బాలాకోట్ దాడుల మాదిరిగా పాక్ గగనతలంలోకి వెళ్లకుండా మన ఎయిర్‌ఫోర్స్ అమ్ములపొదిలోని అత్యాధునిక రఫేల్ యుద్ధ విమానాలు సరిహద్దులకు ఇవతలి నుంచే అరగంట లోపే పని ముగించేశాయి. అర్ధరాత్రి 1:05కు మొదలైన దాడులు 1:30కు ముగిశాయి. ఆ వెంటనే 1:44 గంటలకు రక్షణ శాఖ ప్రకటన విడుదల చేసింది. ''కాసేపటి క్రితం ఆపరేషన్ సిందూర్ చేపట్టాం. పాక్, పీఓకేల్లో నుంచి భారత్‌పై ఉగ్ర దాడులకు వ్యూహరచన చేసిన ఉగ్రవాద మౌలిక వ్యవస్థలపై దాడులు చేశాం. ఉద్రిక్తతలకు తావులేని రీతిలో, పూర్తి కచ్చితత్వంతో కేవలం ఉగ్ర శిబిరాలను మాత్రమే ధ్వంసం చేశాం. పాక్ సైన్యాన్ని, సైనిక వ్యవస్థలను, పౌరులను ఏ మాత్రమూ లక్ష్యం చేసుకోలేదు. లక్ష్యాల ఎంపిక, దాడిలో ఆ మేరకు పూర్తి సంయమనం పాటించాం'' అని వెల్లడించింది. ''ఈ రోజు మనం చరిత్ర సృష్టించాం. భారత్ మాతా కీ జై'' అంటూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ''పహల్గాం బాధితులకు న్యాయం జరిగింది. జైహింద్' అని సైన్యం పేర్కొంది. దాడుల వీడియోను ఎక్స్‌లో ఉంచింది. మృతుల్లో జైషే చీఫ్ అజర్ కుటుంబానికి చెందిన 10 మంది ఉన్నారు. దీన్ని అజర్ కూడా ధ్రువీకరించాడు. జైషే ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడుల్లో వారితో పాటు తన నలుగురు సన్నిహిత సహచరులు కూడా మరణించినట్టు చెప్పుకొచ్చాడు. పాక్ ప్రేరేపిత ఉగ్ర తండాల పీచమణచేలా అద్భుతంగా సాగిన సైనిక చర్య భారతీయులందరికీ గర్వకారణమంటూ ప్రధాని మోదీ ప్రస్తుతించారు. భారత దాడుల్లో 26 మందే మరణించారని, 46 మందికి పైగా గాయపడ్డారని పాక్ చెప్పుకుంది. సరైన సమయంలో ప్రతీకారం తీర్చుకుంటామంటూ తొలుత ప్రగల్భాలకు దిగినా కాసేపటికే దిగొచ్చింది. గట్టి ప్రతిచర్యలు తప్పవంటూ బీరాలు పలికిన రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్, 'ఇప్పటికైనా ఉద్రిక్తతలు పెరగకుండా భారత్ చూస్తే మేమూ సహకరిస్తాం' అంటూ సాయంత్రానికల్లా మాట మార్చారు. ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం సమీపంలో బైసారన్ మైదానంలో 26 మంది పర్యాటకులను లష్కరే ఉగ్రవాదులు కిరాతకంగా కాల్చి చంపడం తెలిసిందే.

అద్భుత నైపుణ్యం
దాడులపై నిపుణులు

సైన్యం ఆపరేషన్ సిందూర్‌ను అమలు చేసిన తీరును రక్షణ నిపుణులు ఎంతగానో కొనియాడుతున్నారు. ఉగ్ర శిబిరాల పరిసరాల్లోని నివాసాలు తదితరాలకు ఏమాత్రమూ నష్టం జరగకుండా, కేవలం లక్ష్యాలను మాత్రమే నేలమట్టం చేస్తూ అత్యంత కచ్చితత్వంతో దాడులు జరపడం అద్భుతమని చెబుతున్నారు. ''పాక్ సైనిక స్థావరాలు, కీలక మౌలిక వ్యవస్థల వంటి వాటి జోలికే వెళ్లకుండా సంయమనం పాటించడం నిస్సందేహంగా అద్భుతమైన దౌత్య ఎత్తుగడే. తద్వారా ప్రతీకార దాడులకు దిగేందుకు పాక్‌కు ఎలాంటి సాకూ లేకుండా పోయింది. పైగా 9 ఉగ్ర శిబిరాల్లో 4 స్వయానా పాక్ భూభాగంలోనే ఉండటంతో ఆ తండాలను దాయాది ఇప్పటికీ పెంచి పోషిస్తోందని నిర్ద్వంద్వంగా నిరూపణ అయింది. దాంతో పాక్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారింది. అంతర్జాతీయ సమాజం ముందు మరోసారి ధూర్త దేశంగా మిగిలింది'' అని వారు వివరించారు. దాడులు చేసిన ప్రాంతాల్లో కొన్ని సరిహద్దుల నుంచి ఏకంగా 100 కి.మీ. లోపల ఉండటం విశేషం. తద్వారా పాక్‌లో ఏ లక్ష్యాన్నైనా, ఎప్పుడైనా అత్యంత కచ్చితత్వంతో ఛేదించే సత్తా తనకుందని భారత్ మరోసారి నిరూపించింది.

25 నిమిషాలు 9 లక్ష్యాలు

దాడుల విషయంలో సైన్యం అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించింది. పక్కాగా వ్యవహరించి అత్యంత విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించింది. నిఘా వర్గాలు పక్షం రోజుల పాటు నిరంతరాయంగా శ్రమించి లష్కరే, జైషే తదితర ఉగ్రవాద సంస్థ శిబిరాలతో పాటు ప్రధాన కార్యాలయాల ఆనుపానులను పక్కాగా సేకరించాయి. వాటి ఆధారంగా ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగాయి. సరిహద్దులకు ఆవల క్షిపణి నిరోధక వ్యవస్థలు తదితరాలతో కాచుకుని కూచున్న శత్రు సైన్యం అంచనాలకు అందకుండా వ్యవహరించాయి. సరిహద్దులు దాటకుండానే ఆపరేషన్ నిర్వహించాయి. మురిద్కే, బహావల్‌పూర్‌ల్లోని లష్కరే, జైషే ప్రధాన స్థావరాల్లో ఒక్కోచోట కనీసం 30 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు.

పేరు పెట్టింది మోదీనే

న్యూఢిల్లీ: దేశమంతటా ఎక్కడ విన్నా 'ఆపరేషన్ సిందూర్' ప్రతిధ్వనులే. అతికినట్టుగా సరిపోయిన ఆ పేరును స్వయంగా ప్రధాని మోదీయే సూచించారు. పహల్గాం దాడిలో ఉగ్రవాదులు పురుషులను మాత్రమే ఎంచుకుని భార్యల ముందే వారిని కాల్చి చంపడం తెలిసిందే. వాళ్లలో లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ భార్య హిమాన్షికైతే కనీసం కాళ్ల పారాణి కూడా ఆరలేదు. పెళ్లయిన ఆరు రోజులకే నూరేళ్లూ నిండిన భర్త మృతదేహం వద్ద ఆమె ఆక్రందన అందరినీ కలచివేసింది. ఉగ్రవాదులు అమాయక మహిళల నుదుటి సిందూరాన్ని తుడిపేసినందున ప్రతీకార చర్యకు ఆ పేరే బాగుంటుందని సూచించినట్టు కేంద్ర వర్గాలు తెలిపాయి. దాడుల విషయంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చిన ఆయన, ఆపరేషన్‌ను ఆద్యంతం పర్యవేక్షించారు.

కేబినెట్ అభినందనలు

ప్రధాని మోదీ సారథ్యంలో బుధవారం కీలక సమావేశాలు జరిగాయి. తొలుత కేంద్ర కేబినెట్, అనంతరం భద్రతా వ్యవహారాలపై కేబినెట్ కమిటీ (సీసీఎస్) భేటీ అయ్యాయి. ఆపరేషన్ సిందూర్‌ను ముక్తకంఠంతో అభినందిస్తూ కేబినెట్ తీర్మానం ఆమోదించింది. మన సైన్యం దేశానికి గర్వకారణమని మోదీ అన్నారు. దాడులు జరిపిన తీరును కొనియాడారు. మరోవైపు కేంద్రం గురువారం ఉదయం అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసింది.


దాడుల్లో ధ్వంసమైన పంజాబ్ ప్రావిన్స్‌లోని మురిద్కేలో ఓ ఉగ్ర శిబిరం


అహ్మద్‌పూర్ షర్కియాలో...


పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్‌లో దెబ్బతిన్న భవనం


మురిద్కేలో దెబ్బతిన్న లష్కరే స్థావరం

ఉగ్రవాద నిర్మూలనకే ఆపరేషన్ సిందూర్

మిత్ర దేశాలకు మంత్రి జైశంకర్ వివరణ

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌లో ఆశ్రయం పొందుతూ భారత్‌లో దాడులకు తెగబడుతున్న ఉగ్రవాదులను ఏరివేయటానికి ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు చేసినట్లు పలు దేశాలకు భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. బుధవారం ఆయన జపాన్, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ విదేశాంగ మంత్రులతో మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని అదుపు చేసేందుకే పాక్‌లోని ఉగ్రవాద మౌలిక సౌకర్యాలను ధ్వంసం చేసినట్లు జపాన్ విదేశాంగ మంత్రి తకేషీ ఇవాయాకు వివరించినట్లు సోషల్‌మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో జైశంకర్ తెలిపారు. ఫ్రాన్స్, జర్మనీ విదేశాంగ మంత్రులు జీన్ నోయెల్ బారట్, జోహన్ వాడెపుల్‌తో జాయింట్ ఫోన్‌కాల్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగానే పాక్ ఉగ్ర స్థావరాలపై దాడులు చేశామని స్పెయిన్ విదేశాంగ మంత్రి జోస్ మాన్యుయెల్ అల్బరెస్‌కు వివరించినట్లు పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి సమయంలో భారత్‌కు అండగా నిలిచినందుకు ఆయా దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు.

సిబ్బంది సెలవులు రద్దు చేయండి

పారామిలిటరీ విభాగాల అధిపతులకు కేంద్ర హోంమంత్రి షా ఆదేశం

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడులతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో అన్ని పారామిలిటరీ విభాగాలు తమ సిబ్బంది సెలవులను రద్దుచేయాలని ఆయా విభాగాల డైరెక్టర్లకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బుధవారం ఆదేశాలు జారీచేశారు. కశ్మీర్‌లోని పహల్గాంలో గత నెల 22న ఉగ్రవాదులు అమాయకులను చంపిన ఘటనకు ఆపరేషన్ సిందూర్‌తో సరైన బదులిచ్చామని ఆయన పేర్కొన్నారు. భారత్‌పై ఎవరు, ఎలాంటి దాడి చేసినా మోదీ సర్కారు తగిన విధంగా ప్రతిస్పందిస్తుందని స్పష్టంచేశారు. దేశ అంతర్గత భద్రతపై కూడా సమీక్ష నిర్వహించిన షా.. ఉన్నతాధికారులంతా అలర్ట్‌గా ఉండాలని ఆదేశించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

రాష్ట్రపతికి వివరించిన మోదీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో సమావేశమయ్యారు. ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. పాకిస్తాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లోని ఉగ్రవాదుల శిబిరాలపై భారత సైనిక దళాలు మెరుపు దాడులు చేసినట్లు వెల్లడించారు. ముష్కర మూకలకు భారీగా నష్టం వాటిల్లినట్లు తెలియజేశారు.

ప్రతిదాడులకు ఆస్కారం లేకుండా

దాడి చేశాం

సరైన రీతిలోనే ప్రతీకార చర్యలు తీసుకున్నాం

- ఇవి 'బాధ్యతాయుతమైన' దాడులు
- భారత వైఖరిని స్పష్టంచేసిన విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ
- మహిళా సైన్యాధికారులతో మీడియా సమక్షంలో నారీశక్తిని చాటిన భారత్

న్యూఢిల్లీ: ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు మరింతగా పెచ్చరిల్లకుండా చూసుకుంటూనే సరైన రీతిలో ప్రతీకార చర్యలు చేపట్టామని ప్రపంచ దేశాలకు భారత్ స్పష్టంచేసింది. ఈ మేరకు బుధవారం భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి ఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో దాడి వివరాలను మీడియాకు వెల్లడించారు. తొలుత విక్రమ్ మిస్రీ మాట్లాడారు. '' ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి సూత్రధారులు, పాత్రధారులను చట్టం ముందుకు ఈడ్చుకురావాల్సిన అత్యావశ్యక పరిస్థితుల్లో ఈ దాడులు చేయాల్సి వచ్చింది. తమ భూభాగంలో ఉగ్ర వ్యవస్థపై పాకిస్తాన్ ఎలాంటి చర్యలు తీసుకోని కారణంగా మేం 'బాధ్యతాయుతమైన' దాడులు చేశాం. పహల్గాం ఉదంతం తర్వాత సైతం మరోసారి భారత్‌లో దాడులతో తెగించేందుకు ఉగ్రసంస్థలు కుట్రలు పన్నినట్లు విశ్వసనీయ నిఘా సమాచారం అందటంతో ముందస్తుగా మెరుపుదాడులు చేశాం. పౌర, జనావాసాలకు ఏమాత్రం హాని కలగకుండా కేవలం ఉగ్రవాదుల మౌలికవసతులే లక్ష్యంగా దాడులు జరిపాం. సీమాంతర దాడులు, సీమాంతర చొరబాట్లను నిరోధించడమే లక్ష్యంగా మంగళవారం అర్ధరాత్రి దాడులు కొనసాగాయి. బైసారన్‌లో హేయమైన ఉగ్రదాడి జరిగింది. అమాయకులను తమ కుటుంబసభ్యుల కళ్లెదుటే తలపై గురిపెట్టి కాల్చిచంపారు. దీంతో కుటుంసభ్యుల్లో అంతులేని విషాదం, భయం అలుముకున్నాయి. భారత్ అదే స్థాయిలో ఉగ్రవాదులకు దీటైన సమాధానం చెప్పదల్చుకుంది'' అని మిస్రీ స్పష్టం చేశారు. ''జమ్మూకశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనడం ఇష్టంలేకే ఉగ్రవాదులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. కోట్ల మంది పర్యాటకులతో వృద్ధిబాటలో పయనిస్తున్న కశ్మీర్ ఆర్థికవ్యవస్థను ఉగ్రవాదులు కూలదోయాలనుకున్నారు. ప్రత్యేకంగా హిందువులను చంపేసి కశ్మీర్ లోయలో, దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టాలని చూశారు. కానీ భారతీయులు వీళ్ల నమ్మకాన్ని వమ్ముచేశారు. ఈ విషయంలో మన ప్రజలను కచ్చితంగా మెచ్చుకోవాల్సిందే'' అని మిస్రీ అన్నారు.

నారీశక్తి.. నాయకత్వం

'ఆపరేషన్ సిందూర్' దాడి వివరాలను ఇండియన్ ఆర్మీ, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఇద్దరు మహిళా అధికారులు మీడియాకు వివరించడం అక్కడి వారందర్నీ ఆశ్చర్యపరిచింది. భారత్ ఏఏ ప్రాంతాలపై దాడి చేసిందనే పూర్తి వివరాలను భారత ఆర్మీ తరఫున కల్నల్ సోఫియా ఖురేషీ, భారత వాయుసేన తరఫున వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు మీడియాకు వెల్లడించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే), పాకిస్తాన్‌లోని ఏఏ ప్రాంతాల్లో ఏ విధంగా భారత్ దాడులు చేసిందో ఈ అధికారిణులు ఇద్దరూ సవివరంగా చెప్పారు. ధైర్యసాహసాలతో దాడులు చేసిన వైనాన్ని వనితలతో చెప్పించడం వెనుక భారత సర్కార్ దౌత్య పాటవం దాగి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. లింగవివక్షకు తావులేకుండా కీలక సమయాల్లోనూ భారత్ సమానత్వానికి, మహిళా సాధికారతకు జై కొడుతుందని ఈ మీడియా సమావేశంలో భారత్ మరోసారి చాటిచెప్పిందని విశ్లేషకులు వ్యాఖ్యానించారు. సోఫియా ఖురేషి ప్రస్తుతం ఆర్మీ కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్‌లో కల్నల్‌గా ఉన్నారు. వింగ్ కమాండర్ వ్యోమికా ప్రస్తుతం హెలికాప్టర్ పైలట్‌గా సేవలందిస్తున్నారు. ఖురేషీ హిందీలో, వ్యోమికా ఇంగ్లిష్‌లో మాట్లాడారు. '' పహల్గాం దాడికి ప్రతీకారంగానే ఈ ఆపరేషన్ చేపట్టాం. 9 ఉగ్రస్థావరాలపై దాడులు జరిపాం. గత మూడు దశాబ్దాల్లో పాకిస్తాన్‌లో ఎన్నో ఉగ్ర స్థావరాలు నెలకొల్పారు. ఇక్కడ రిక్రూట్‌మెంట్, భారత్‌పై విద్వేషాన్ని నూరిపోసేలా ప్రసంగాలు ఇవ్వడం, శిక్షణ కేంద్రాలున్నాయి'' అని సోఫియా ఖురేషీ చెప్పారు. '' ఈ దాడుల్లో పాకిస్తాన్ ఆర్మీ సంబంధ ప్రాంతాల జోలికి వెళ్లలేదు. అత్యంత కచ్చితత్వంతో ఉగ్రవాదుల స్థావరాలపైనే దాడులు చేశాం. దాడి ప్రాంత పరిధికి తగ్గట్లుగా సరైన ఆయుధాలను, అనువైన సాంకేతికతను వినియోగించాం. దీని వల్ల లక్ష్యాలను మాత్రమే ధ్వంసంచేశాం. చుట్టుపక్కల ప్రాంతాలకు ఎలాంటి నష్టం జరగలేదు. ముందుగా నిర్ణయించుకున్న భవనాలను మాత్రమే నేలమట్టంచేశాం. ఆ శిబిరాల్లోని ఉగ్రవాదులను హతమార్చాం. లక్ష్యాల ఛేదనలో భారత సాయుధ బలగాల ప్రణాళికా రచన, దాడి, సామర్థ్యాలను ఈ దాడులు మరోసారి చాటిచెప్పాయి. ఇకమీదట పాకిస్తాన్ ఉద్రిక్తతలను పెంచుతూ దాడులు చేయాలని చూస్తే భారత్ కనీవినీ ఎరుగని రీతిలో దాడులతో విరుచుకుపడుతుందని మరోసారి స్పష్టంచేస్తున్నా. జై హింద్' అని వ్యోమికా సింగ్ తన మీడియా బ్రీఫింగ్‌ను ముగించారు. ఈ ఇద్దరు మహిళాధికారుల మధ్యలో కూర్చొని మీడియాకు వివరాలు వెల్లడించిన విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఒక కశ్మీరీ పండిట్. కీలక ప్రెస్‌మీట్‌లో ఎవరెవరు వేదికపై ఆసీనులై భారతవాణిని ప్రపంచానికి వినిపించాలనే విషయంలో కేంద్రప్రభుత్వానికి అత్యంత స్పష్టత ఉందని ఈ ముగ్గురిని చూస్తే తెలుస్తోంది.


దాడుల వివరాలు వెల్లడిస్తున్న విదేశాంగ కార్యదర్శి మిస్రీ, కల్నల్ సోఫియా , వింగ్ కమాండర్ వ్యోమిక

అజార్ కుటుంబసభ్యులు హతం

10 మంది మరణించారని స్వయంగా ప్రకటించిన జైషే చీఫ్ ● బహావల్పూర్‌లో భారత దాడిలో మరో నలుగురు హతం

లాహోర్: పాకిస్తాన్‌లోని బహావలూప్‌ర్ నగరంలో భారత్ జరిపిన దాడుల్లో ఉగ్రసంస్థ జైషే మొహమ్మద్ చీఫ్ మౌలానా మసూద్ అజార్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆయన కుటుంబంలో పది మంది హతమయ్యారు. ఈ వివరాలను స్వయంగా ఆయనే పాకిస్తాన్ మీడియాకు వెల్లడించినట్లు సంబంధిత ప్రకటన పేర్కొంది. బహావల్పూర్‌లోని జామియా మసీద్ సుభాన్ అల్లాహ్ శిబిరం సముదాయంపై భారత్ జరిపిన క్షిపణి దాడిలో అజార్ సోదరి, ఆమె భర్త, అజార్ మేనల్లుడు, అతని భార్య, మరో మేనల్లుడు, ఉమ్మడి కుటుంబంలోని ఐదుగురు చిన్నారులు చనిపోయారు. వీరితోపాటే అజార్‌కు అత్యంత సన్నిహితమైన వ్యక్తి, అతని తల్లి, మరో ఇద్దరు వ్యక్తులూ మరణించారు. ఈ దాడిలో గాయపడిన వారిని దగ్గర్లోని విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. 1999లో ఐసీ–814 విమానాన్ని హైజాక్ చేశాక దానిని విడిచిపెట్టాలంటే అజార్‌ను వదిలేయాలని హైజాకర్లు డిమాండ్‌చేయడం, తప్పని పరిస్థితుల్లో అజార్‌ను జైలు నుంచి వదిలేయడం తెల్సిందే. విడుదలైన నాటి నుంచి అజార్ పాకిస్తాన్ కేంద్రంగా ఉగ్రకార్యకలాపాలను ఉధృతం చేశాడు. సుభాన్ శిబిరం అలియాస్ ఉస్మాన్ ఓ అలీ క్యాంపస్‌గా పిలుచుకునే ఈ ప్రాంగణాన్ని జైషే ఉగ్రసంస్థ ప్రధాన కార్యాలయంగా అజార్ వినియోగించుకుంటున్నాడు. 18 ఎకరాల ఈ ప్రాంతం నుంచే జైషే ఉగ్రసంస్థలోకి కొత్త వాళ్ల రిక్రూట్‌మెంట్లు, విద్వేష బోధన, శిక్షణ, నిధుల సేకరణ తదితర కార్యకలాపాలు కొనసాగుతుంటాయి. 2019 మేలో అజార్‌ను ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. 2019 ఏప్రిల్ తర్వాత అజార్ పెద్దగా బహిరంగ కార్యక్రమాల్లో కనిపించలేదు. బహావల్పూర్‌లోనే ఉంటున్నట్లు గతంలోనే నిఘా సమాచారం భారత్‌కు అందింది. 2001లో భారత పార్లమెంట్‌పై దాడి, 2000లో జమ్మూకశ్మీర్ అసెంబ్లీపై దాడి, 2016లో పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై దాడి, 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడులకు అజార్ సూత్రధారి అని తెలుస్తోంది.



పూర్తిస్థాయి యుద్ధం వద్దు

- ఉద్రిక్తతలు నివారించుకుందాం
- పాక్ రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ విజ్ఞప్తి

ఇస్లామాబాద్: భారత్‌తో పూర్తిస్థాయి యుద్ధాన్ని తాము కోరుకోవడం లేదని పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా అసిఫ్ బుధవారం చెప్పారు. పూర్తిస్థాయి యుద్ధాన్ని నివారించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. భారత్–పాక్ మధ్య మొదలైన ఘర్షణ పూర్తిస్థాయి యుద్ధంగా మారే సంకేతాలు కనిపిస్తున్నాయని, అది తమకు ఇష్టం లేదని పేర్కొన్నారు. పరిస్థితి మారిపోవాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. ఉద్రిక్తతలు నివారించుకుందామని భారత్‌కు విజ్ఞప్తి చేశారు. భారత్‌తో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఉద్ఘాటించారు. భారత్ వెనక్కి తగ్గితే తాము సైతం వెనక్కి తగ్గి ఉంటామని సూచించారు. యుద్ధం ఇంకా కొనసాగడం మనకు మేలు చేయదని చెప్పారు. భారత్ మొండిగా ముందుకెళ్తే యుద్ధం చేయడం తప్ప తమకు మరో మార్గ లేదని ఖ్వాజా అసిఫ్ స్పష్టంచేశారు. ఆయుధాలు వదిలేసి భారత్‌కు లొంగిపోలేం కదా? అని వ్యాఖ్యానించారు.

ముష్కరులపై తిరుగులేని అస్త్రాలు

- స్కాల్ప్, హ్యామర్ క్షిపణులను ప్రయోగించిన భారత సైన్యం
- ఉగ్ర శిబిరాలపై కచ్చితత్వంతో దాడి

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్ ముష్కరుల భరతం పట్టడానికి భారత సైన్యం అత్యాధునిక క్షిపణులు ప్రయోగించింది. స్కాల్ప్ క్రూయిజ్ మిస్సైళ్లు, హ్యామర్ క్షిపణులను రంగంలోకి దించింది. వీటిని రఫేల్ యుద్ధ విమానాల నుంచి ఉగ్రవాద శిబిరాలపై ప్రయోగించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కచ్చితత్వంతో లక్ష్యాలపై దాడులు చేయడంలో స్కాల్ప్ క్షిపణులు పేరుగాంచాయి. వీటిని స్టార్మ్ షాడో అని కూడా అంటారు. పగటిపూట, రాత్రిపూట మాత్రమే కాకుండా అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లోనూ ప్రయోగించేలా ఉండడం వీటి ప్రత్యేకత. సుదూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించడానికి ఉపయోగిస్తారు. స్కాల్ప్ మిస్సైల్స్ రేంజ్ 450 కిలోమీటర్లు. జీపీఎస్ వ్యవస్థ అమర్చి ఉంటుంది. అడ్వాన్స్‌డ్ నావిగేషన్ సిస్టమ్ వల్ల గురి తప్పదు. యూరోపియన్ కన్సార్టియం ఎంబీడీఏ ఈ క్షిపణులను తయారు చేసింది. దృఢమైన బంకర్లు, ఆయుధాగారాలను ధ్వంసం చేయడానికి ఇవి చక్కగా తోడ్పడతాయి. గత ఏడాది ఉక్రెయిన్ సైన్యం ఇలాంటి క్షిపణులనే తొలిసారిగా రష్యాపై ప్రయోగించింది. స్కాల్ప్ మిస్సైల్ 450 కిలోల వార్‌హెడ్లను మోసుకెళ్లగలదు. తక్కువ ఎత్తులో ప్రయోగించగల వీలుంది కాబట్టి శత్రువుల నిఘా వ్యవస్థలు వీటిని గుర్తించడం కష్టం.

హ్యామర్.. గైడ్ బాంబు

హైలీ అగైల్ మాడ్యులర్ మ్యునీషన్ ఎక్స్‌టెండెడ్ రేంజ్(హ్యామర్)... ఇది అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో ఫైటర్ జెట్ నుంచి భూఉపరితలంపైకి ప్రయోగించగల క్షిపణి. గైడ్ బాంబు అని కూడా అంటారు. దీని పరిధి 70 కిలోమీటర్లు. 1,000 కిలోల దాకా బరువైన బాంబులను ఇందులో అమర్చవచ్చు. ఫ్రెంచ్ కంపెనీ 'సాఫ్రాన్' ఈ క్షిపణిని అభివృద్ధి చేసింది. దీన్ని జామ్ చేయడం, గుర్తించడం కష్టమే. మధ్యలో నిరోధించడం దాదాపు అసాధ్యమే. బలమైన నిర్మాణాలను సైతం సులువుగా కూల్చివేయగలదు. ఆపరేషన్ సిందూర్‌లో జైషే మొహమ్మద్, లష్కరే తోయిబాల ప్రధాన శిబిరాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయంటే అందుకు కారణం హ్యామర్ క్షిపణులు అని చెప్పొచ్చు.

- సాక్షి, నేషనల్ డెస్క్

పాక్ సైన్యం కర్కశ కాల్పులు

సరిహద్దు వెంట ప్రాణాలు కోల్పోయిన 15 మంది గ్రామీణులు	57 మందికి తీవ్ర గాయాలు	దీటుగా బదులిచ్చిన భారతసైన్యం	సరిహద్దుకు అవల పాక్‌లోనూ భారీగా మరణాలు

జమ్మూ/శ్రీనగర్/పూంచ్: ఉగ్రస్థావరాలపై భారత్ దాడి తర్వాత బరితెగించిన పాకిస్తాన్ సైన్యం సరిహద్దువెంట కన్నుమిన్నుకానక కర్కశంగా కాల్పులకు తెగబడింది. గతంలో ఎన్నడూలేనంతగా కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లుపొడుస్తూ తూటాల వర్షం కురిపించింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో సరిహద్దు వెంట డజన్ల కొద్దీ గ్రామాలపై పాకిస్తాన్ సైనికులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. సాధారణ నివాస ప్రాంతాలపై జరిపిన కాల్పుల్లో నలుగురు చిన్నారులు సహా 15 మంది ప్రాణాలు కోల్పోయారు. 57 మందికి బుల్లెట్ గాయాలయ్యాయి. గాయాలపాలైన కొందరిని ఆస్పత్రిలో చేర్పించారు. వారిలో కొందరు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. మరణించిన వారిలో బల్వీందర్ కౌర్ అలియాస్ రూబీ(33), మొహ్మద్ జైన్ ఖాన్(10), జోయా ఖాన్(12), మొహ్మద్ అక్రమ్(40), అమ్రిక్ సింగ్(55), మొహ్మద్ ఇక్బాల్(45), రంజీత్ సింగ్(48), షకీలా బీ(40), అమీర్‌జీత్ సింగ్(47), మరియం ఖటూన్(7), విహాన్ భార్గవ్(13), మొహ్మద్ రఫీ(40), ఒక లాన్స్ నాయక్‌లను గుర్తించారు. పూంచ్ జిల్లాతోపాటు బాలకోటి, మెన్‌ధార్, మాన్‌కోటి, కృష్ణ ఘతి, గుల్పూర్, కెర్నీ సెక్టార్లలో పాక్ రేంజర్ల భారీ స్థాయిలో మోర్టార్‌లతో కాల్పులు జరిపారు. చారిత్రక ప్రాధాన్యమున్న పూంచ్ కోట, ఆలయాలు, గురుద్వారాలపైనా బుల్లెట్‌ల వర్షం కురిసింది. బారాముల్లా జిల్లాలోని ఉరీ సెక్టార్‌లో ఐదుగురు మైనర్లుసహా పది మంది గాయపడ్డారు. కుప్వారా జిల్లాలోని కర్నాహ్ సెకోటర్‌లో బాంబుల శకలాలు పడి మంటలు అంటుకుని పలు ఇళ్లు దగ్ధమయ్యాయి. బుధవారం మధ్యాహ్నందాకా ఈ కాల్పులు ఆగలేదు. ఈ కాల్పుల్లో ఇళ్లు, దుకాణాలు, వాహనాలు, బస్టాండ్‌లు ధ్వంసమయ్యాయి. జనావాసాలపై తుపాకులు ఎక్కుపెట్టడాన్ని మాజీ జమ్మూకశ్మీర్ డీజీపీ ఎస్పీ వేద్ తీవ్రంగా తప్పుబట్టారు.

బోర్డర్‌కు అవల డజన్ల మంది మృతి

పాక్ రేంజర్ల కాల్పులకు భారత సైన్యం దీటుగా బదులిచ్చింది. భారత సైన్యం కాల్పుల్లో సరిహద్దుకు ఆవల పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించినట్లు ఇండియన్ ఆర్మీ బుధవారం ప్రకటించింది. దాయాది ఆర్మీ పోస్ట్‌లను ధ్వంసం చేసింది. ముందు జాగ్రత్తగా సరిహద్దు జిల్లాలైన జమ్మూ, సాంబా, కథువా, రాజౌరీ, పూంచ్‌లలో అన్ని పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలను బుధవారం మూసేశామని డివిజనల్ కమిషనర్ రమేశ్ కుమార్ చెప్పారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత సరిహద్దు వెంట పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం ఇది వరుసగా 13వ రోజు. పూంచ్–రాజౌరీలోని భీంబర్ గలీలో పాక్ కాల్పులు కొనసాగిస్తోందని భారతఆర్మీలో అడిషనల్ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ తెలిపింది. కాల్పుల బారిన పడకుండా అధికారులు సరిహద్దు ప్రాంతాల్లోని వేలాది మంది స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



పాక్ కాల్పులకు ఉరి నియంత్రణ రేఖ వద్ద సలామాబాద్‌లో దెబ్బతిన్న ఇళ్లు



ఉరి ఆసుపత్రిలో క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న దృశ్యం

త్వరగా ముగుస్తుందని ఆశిస్తున్నా : ట్రంప్

న్యూయార్క్/వాషింగ్టన్: ఆపరేషన్ సిందూర్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఈ ఘర్షణలు త్వరగా సమసిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 'దాడుల గురించి నేను విన్నాను. ఇది సిగ్గుచేటు. గతంలో జరిగిన ఘటనల దృష్ట్యా ఏదో జరగబోతోందని ప్రజలకు తెలుసునని నేను భావిస్తున్నా. వారు చాలా కాలంగా పోరాడుతున్నారు. ఎన్నో దశాబ్దాలు పోరాడుతున్నారు'అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరుదేశాలకు ఏదైనా సందేశం ఇవ్వాలనుకుంటున్నారా అని ప్రశ్నించగా.. 'లేదు, అది చాలా త్వరగా ముగుస్తుందని నేను ఆశిస్తున్నాను'అని సమాధానమిచ్చారు. ఇదిలావుండగా, ఇరు దేశాలు చర్చలకు మార్గాలను తెరిచి ఉంచాలని, ఉద్రిక్తతలను నివారించాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కోరినట్లు ఆయన కార్యాలయం తెలిపింది. బుధవారం మధ్యాహ్నం భారత్, పాక్ జాతీయ భద్రతా సలహాదారులతో మాట్లాడిన రూబియో ఈ మేరకు ఇరువురు నేతలకు విజ్ఞప్తి చేశారని పేర్కొంది.

సంయమనం పాటించాలి: చైనా

బీజింగ్: ఆపరేషన్ సింధూర్‌పై చైనా స్పందించింది. విస్తృత ప్రాంతీయ ప్రయోజనాల భారత్, పాకిస్తాన్‌లు సంయమనం పాటించాలని పిలుపునిచ్చింది. ఉద్రిక్తతలను తగ్గించడానికి నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని తెలిపింది. 'పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్లోని క్షిపణి దాడులప్రస్తుత పరిస్థితి గురించి ఆందోళన చెందుతున్నాం. భారత్, పాకిస్తాన్ రెండూ పొరుగుదేశాలే. చైనా అన్ని రకాల ఉగ్రవాదాలను వ్యతిరేకిస్తోంది. శాంతి, సుస్థిరతల విస్తృత ప్రయోజనాలకు అనుగుణంగా ఇరు దేశాలు సంయమనం పాటించాలి. ప్రశాంతంగా ఉండాలి. పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసే చర్యలకు దూరంగా ఉండాలని ఇరు పక్షాలను కోరుతున్నాం'అని ఒక ప్రకటనలో తెలిపింది. అనంతరం చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఉద్రిక్తతలను తగ్గించడంలో నిర్మాణాత్మక పాత్రను కొనసాగించడానికి, అంతర్జాతీయ సమాజంతో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందన్నారు. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నామని భారత్ పేర్కొనడంపైనా లిన్ స్పందించారు.

ఆ 9 లక్ష్యాలు ఇవే..

పక్కాగా ఎంపిక • సవాలుగా మారిన వైనం



న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ కోసం ఎంపిక చేసిన 9 లక్ష్యాలను పక్కాగా సేకరించిన నిఘా సమాచారం ఆధారంగా సైన్యం నిర్ణయించుకుంది. ఇవన్నీ ఆరోగ్య కేంద్రాలు తదితర ముసుగుల్లో నడుస్తున్నాయి. వీటిని కచ్చితంగా గుర్తించడం మన నిఘా వర్గాలకు సవాలుగా నిలిచింది. ఈ ఉగ్ర కేంద్రాలు, శిబిరాలను బయటి ప్రపంచం దృష్టి నుంచి దాచి ఉంచేందుకు పాక్ ప్రభుత్వం, సైన్యం అన్ని రకాల జాగ్రత్తలూ తీసుకుంటాయి. ఇందు కోసం ఎప్పటికప్పుడు వాటి గుర్తింపులు మార్చడం వంటి పనులు చేస్తుంటాయి.

పాకిస్తాన్ భూభాగంలో ఉన్నవి (4)

1 మర్కజ్ సుభాన్

జైషే మహ్మద్ ప్రధాన స్థావరం. అంతర్జాతీయ సరిహద్దులకు 100 కి.మీ. దూరంలో పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలో బహావల్‌పూర్ సమీపంలో నరోవల్ జిల్లా తెహ్రా కలాన్ గ్రామంలో ఉంది. ఉగ్రవాదుల చేరిక, శిక్షణ వంటివి ఇక్కడ జరుగుతాయి. జైషే చీఫ్ మసూద్ అజర్ ఇక్కడినుంచే కార్యకలాపాలు సాగిస్తుంటాడు. భద్రతా దళాలకు చిక్కిన అతన్ని 1999లో జైషే ఉగ్రవాదులు ప్రయాణికుల విమానాన్ని హైజాక్ చేసి విడిపించుకున్నారు. అజర్, అతని సోదరుడు అబ్దుల్ రవూఫ్ అస్గర్ తదితర అగ్ర నేతల నివాసాలు తదితరాలూ ఇక్కడే ఉన్నాయి. ప్రస్తుతం ఇది అస్గర్ కనుసన్నల్లో నడుస్తోంది. సరిహద్దుల గుండా ముష్కరులు చొరబడేందుకు అనువైన ప్రాంతాలను ఇక్కడినుంచే గుర్తించడం, అక్కడ గుట్టుచప్పుడు కాకుండా సొరంగాలు తవ్వడం జైషేకు నిత్యకృత్యం. అంతేగాక డ్రోన్ల ద్వారా ఉగ్రవాదులకు ఆయుధాలు, డ్రగ్స్ వంటివి పంపే లాంచ్‌ప్యాడ్ కూడా ఇదే. 2000లో జమ్మూ కశ్మీర్ అసెంబ్లీపై దాడి, 2001లో పార్లమెంటుపై దాడి మొదలుకుని 2019లో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను పొట్టన పెట్టుకున్న పుల్వామా దాడుల దాకా ప్లానింగ్ జరిగిందిక్కడే.

2 మర్కజ్ తొయిబా

'టెర్రర్ ఫ్యాక్టరీ'గా పేరు పొందింది! నియంత్రణ రేఖకు 30 కి.మీ. దూరంలో లాహర్ సమీపంలో మురిద్కేలో ఉంది. ఇది హఫీజ్ సయీద్ నేతత్వంలో పని చేసే లష్కరే తొయిబా ప్రధాన కేంద్రం. దానికి ఆయువుపట్టు కూడా. 1990లో ఉనికిలోకి వచ్చింది. నిత్యం కనీసం 1,000 మంది రిక్రూట్లకు ఇక్కడ 2 వారాల ప్రాథమిక కోర్సు నడుస్తుంటుంది. అందులో భాగంగా శారీరక, మతోన్మాద శిక్షణ ఇస్తారు. ముంబై ఉగ్ర దాడుల కుట్ర పురుడు పోసుకుంది ఇక్కడే. వాటికి పాల్పడ్డ కసబ్ బృందానికి దౌరా–ఎ–నిబ్బత్ (నిఘా) సంబంధిత శిక్షణ ఇక్కడే ఇచ్చారు. ముంబై దాడుల సూత్రధారులు డేవిడ్ హెడ్లీ, తహవ్వుర్ రాణా కూడా ఇక్కడ శిక్షణ పొందారు. ఇక్కడ 'అతిథి గృహం'నిర్మాణానికి అప్పటి అల్‌కాయిదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్ రూ.10 లక్షలిచ్చాడు. జమ్మూ కశ్మీర్‌తో పాటు హైదరాబాద్, బెంగళూరు తదితర చోట్ల బాంబు పేలుళ్లు లష్కరే పనే.

3 సర్జాల్

అంతర్జాతీయ సరిహద్దుకు దాదాపు 6 కి.మీ. దూరంలో సియాల్‌కోట్‌లో ఉంది. గత మార్చిలో నలుగురు జమ్మూ కశ్మీర్ పోలీసు సిబ్బందిని పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులు శిక్షణ పొందింది ఇక్కడే.

4 మెహమూనా జోయా

అంతర్జాతీయ సరిహద్దుకు దాదాపు 12 కి.మీ. దూరంలో సియాల్‌కోట్ సమీపంలో ఉంది. హిజ్బుల్‌కు కీలక శిక్షణ కేంద్రం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముసుగులో పని చేస్తోంది. జమ్మూలోని కథువా ప్రాంతంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషించే కార్యకలాపాలకు ఇది కంట్రోల్ సెంటర్‌గా వ్యవహరిస్తోంది. పఠాన్‌కోట్ వైమానిక బేస్‌పై దాడుల వంటివాటికి ఇక్కడినుంచే వ్యూహరచన జరిగింది. జమ్మూ నగరంలో పలు ఉగ్ర దాడులకు కారకుడైన ఇర్ఫాన్ టండా ఈ కేంద్రానికి సారథి.

పీఓకేలో ఉన్నవి (5)

5 అహ్లే హదీత్ (బర్నాలా) క్యాంప్

నియంత్రణ రేఖకు 9 కి.మీ. దూరంలో భీంబర్ వద్ద ఉంది. ఆయుధాల వాడకంతో పాటు అత్యాధునిక పేలుడు పదార్థాల (ఐఈడీ) తయారీలో ఇక్కడ శిక్షణ ఇస్తారు. 150 మంది దాకా ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వగలదు.

6 మర్కజ్ తొయిబా

లష్కరే తొయిబా ముఖ్య కేంద్రాల్లో ఒకటి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్‌లో నియంత్రణ రేఖకు 30 కి.మీ. దూరంలో తాంగ్‌దార్ సెక్టర్లో ఉంది. కీలక ఉగ్ర శిక్షణకు ఇవది కేంద్రం. ముంబైపై 26/11 దాడులకు తెగబడ్డ అజ్మల్ కసబ్ ఉగ్రవాద బృందం పూర్తిస్థాయి శిక్షణ పొందింది ఇక్కడే. ఇది 2000లో పుట్టుకొచ్చింది. పాక్ సైనిక, ఐఎస్ఐ అధికారులు ఇక్కడికి నిత్యం వస్తూ పోతూ ఉంటారు. ఏకకాలంలో 250 మందికి పైగా ఉగ్రవాదులు ఉండేందుకు ఇక్కడ అన్ని వసతులూ ఉన్నాయి. ఇక్కడినుంచి వారు ప్రధానంగా ఉత్తర కశ్మీర్‌లోకి చొరబడుతుంటారు. కొత్తగా చేర్చుకున్న వారికి మత, ఉగ్రవాద శిక్షణ కూడా ఇక్కడ అందుతుంది. పహల్గాంలో ఉగ్రవాదులపై దాడులకు తెగబడింది ఇక్కడినుంచి చొరబడ్డ ఉగ్రవాదులే! 2024లో కశ్మీర్‌లోని సోన్‌మార్గ్, గుల్‌మార్గ్‌లో భద్రతా బలగాలు, పౌరులపై దాడులు కూడా వారి పనే.

7 గుల్పూర్ క్యాంప్

నియంత్రణ రేఖకు 30 కి.మీ. దూరంలో కోట్లిలో ఉంది. రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో ఆపరేట్ చేసే లష్కరే ఉగ్రవాదులకు బేస్. పూంచ్ 2023 దాడులు, 2024లో యాత్రికులపై దాడులకు పాల్పడ్డ ఉగ్రవాదులు ఇక్కడే శిక్షణ పొందారు. ముంబై దాడుల సూత్రధారి జకీవుర్ రెహ్మాన్ లఖ్వీ ఈ శిబిరానికి తరచూ వచ్చి రిక్రూటీలకు మతోన్మాద ప్రసంగాలిచ్చేవాడు.

8 అబ్బాస్ క్యాంప్

నియంత్రణ రేఖకు 13 కి.మీ. దూరంలో కోట్లీలో ఉంది. లష్కరే ఆత్మాహుతి బాంబర్లకు ప్రధాన కేంద్రం. 150 మందికి పైగా ఉగ్రవాదులకు ఏకకాలంలో శిక్షణ ఇచ్చేందుకు వసతులున్నాయి. పూంచ్, రాజౌరీల్లో చొరబాట్లు, ఉగ్ర దాడులకు వ్యూహరచన మొత్తం ఇక్కడి నుంచే జరుగుతుంది. ఇక్కడి వ్యవహారాలు చూసేది క్వారీ జరార్. జైషే చీఫ్ మసూద్ సోదరుడైన అస్గర్‌కు సన్నిహితుడు. పలు ఎన్ఐఏ కేసుల్లో జరార్ ప్రధాన నిందితుడు. హిజ్బుల్ ముజాహిదీన్ శిక్షణ కేంద్రం కూడా ఇక్కడే ఉంది. బోర్డర్ యాక్షన్ టీం (బీఏటీ)తో పాటు స్నైపర్ దాడులు తదితరాలకు ఇక్కడ శిక్షణ ఇస్తారు.

9 సయిద్నా బిలాల్ క్యాంప్

జైషే ఉగ్ర శిబిరం. ముజఫరాబాద్‌లో ఉంది. తొలుత ఉగ్ర సామగ్రి నిల్వ కేంద్రం. తర్వాత ఆధునీకరించి ఉగ్రవాదులకు ఆయుధాలు, పేలుడు పదార్థాల వాడకం, అడవులు, ప్రతికూల పరిస్థితుల్లో సుదీర్ఘకాలం ఉండటం తదితరాల్లో శిక్షణ ఇచ్చే కేంద్రంగా మార్చారు. నిత్యం కనీసం 100 మందికి పైగా ఉగ్రవాదులు ఇక్కడ శిక్షణ పొందుతుంటారు. పాక్ సైన్యానికి చెందిన స్పెషల్ సర్వీసెస్ గ్రూప్ వీరికి నేరుగా శిక్షణ ఇస్తుంది!

చర్చలతో ఉద్రిక్తతలు తగ్గించాలి : స్టార్మర్

లండన్: ఆపరేషన్ సిందూర్‌పై బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ స్పందించారు. ఉద్రిక్తతలు తగ్గించడానికి భారత్, పాకిస్తాన్ రెండింటితో తాము సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రధాన మంత్రి ప్రశ్నోత్తరాల (పీఎంక్యూ) సెషన్‌ను ప్రారంభించిన స్టార్మర్ భారత్–పాక్‌ల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల అంశాన్ని లేవనెత్తారు. సంయమనం పాటించాలని ఇరు దేశాల విదేశాంగ మంత్రులతో సంప్రదింపులు జరుపున్నట్లు విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీ ఒక ప్రకటన విడుదల చేసిన కొద్దిసేపటికే ఆయన పార్లమెంటులో ఈ వ్యాఖ్యలు చేశారు. ''భారత్, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు బ్రిటన్ వ్యాప్తంగా చాలా మందికి తీవ్ర ఆందోళన కలిగిస్తాయి. ఇరు దేశాలతో పాటు ఇతర అంతర్జాతీయ భాగస్వాములతో చర్చలు జరుపుతున్నాం. ఉద్రిక్తతలను తగ్గించడానికి, సామాన్య పౌరులకు రక్షణకు ప్రోత్సహిస్తున్నాం''అని స్టార్మర్ పార్లమెంటులో తెలిపారు.

భారత్‌ను దెబ్బకొట్టాల్సిందే

- ప్రతీకార చర్యలపై సైన్యానికి పూర్తిస్వేచ్ఛ
- పాకిస్తాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ భేటీలో నిర్ణయం

ఇస్లామాబాద్: ఆపరేషన్ సిందూర్ పట్ల పాకిస్తాన్ ప్రభుత్వం ఆగ్రహంతో రగిలిపోతోంది. భారత్‌ను గట్టిగా దెబ్బకొట్టాల్సిందేనని నిర్ణయానికి వచ్చింది. భారత్‌పై ప్రతీకార చర్యల విషయంలో సైన్యానికి పూర్తిస్వేచ్ఛ ఇస్తున్నట్లు ప్రకటించింది. ఎప్పుడు, ఎక్కడ, ఎలా దాడి చేయాలన్న దానిపై బాధ్యతను సైన్యానికే అప్పగించింది. పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో బుధవారం పాకిస్తాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎన్ఎస్సీ) సమావేశం నిర్వహించారు. కేబినెట్ మంత్రులు, ముఖ్యమంత్రులు, త్రివిధ దళాల అధిపతులు, సీనియర్ ఆర్మీ అధికారులు హాజరయ్యారు. ఆపరేషన్ సిందూర్‌తోపాటు తదనంతర పరిణామాలు, భవిష్యత్తు కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. భారత సైన్యం నిర్వహించిన తాజా దాడుల్లో సామాన్య ప్రజలు బలైనట్లు నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆరోపించింది. ఐక్యరాజ్య సమితి చార్టర్‌లోని ఆర్టికల్–51 ప్రకారం ఆత్మరక్షణ కోసం ఎదురుదాడి చేసే హక్కు తమకు ఉందని ఒక ప్రకటనలో స్పష్టంచేసింది. అమాయక ప్రజలను బలితీసుకున్నందుకు భారత్‌పై ప్రతీకారం తప్పదని తేల్చిచెప్పింది. ఈ విషయంలో తగిన చర్యలు చేపట్టే అధికారాన్ని తమ సైనిక దళాలకు అప్పగించినట్లు వెల్లడించింది.

సామాన్యులపై దాడులు సిగ్గుచేటు

పాక్‌తోపాటు పీఓకేలో భారత్ దాడులను ఎన్ఎస్సీ తీవ్రంగా ఖండించింది. పాకిస్తాన్ సార్వభౌమత్వం, ప్రాంతీయ సమగ్రతను దెబ్బతీయాలని చూస్తే సహించబోమని హెచ్చరించింది. భారత్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిందని, ఇది ముమ్మాటికీ తమపై యుద్ధ ప్రకటనేనని పేర్కొంది. అంతర్జాతీయ చట్టం ప్రకారం భారత్ దాడిని యుద్ధ చర్యగానే పరిగణిస్తున్నామని వెల్లడించింది. మహిళలు, చిన్నారులు సహా సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం అత్యంత హేయం, దారుణం, సిగ్గుచేటు అని మండిపడింది. మానవత్వానికి సంబంధించిన అన్ని నియమాలను భారత సైన్యం ఉల్లంఘించినట్లు ఆరోపించింది. భారతదేశ చట్టవ్యతిరేక చర్యలను అంతర్జాతీయ సమాజం గుర్తించాలని ఎన్ఎస్సీ విజ్ఞప్తి చేసింది. అంతర్జాతీయ నిబంధనలు, చట్టాలను ఉల్లంఘించినందుకు భారత్ దోషిగా పరిగణించాలని స్పష్టంచేసింది. ఉగ్రవాదుల శిబిరాలు ఉన్నాయన్న సాకుతో సాధారణ జనావాసాలపై భారత సైన్యం దాడులు చేసిందని ఆక్షేపించింది. ఈ దాడుల్లో మసీదులు సహా పౌర సదుపాయాలు ధ్వంసమయ్యాయని ఆందోళన వ్యక్తంచేసింది.



ఐదు విమానాలు కూల్చేశాం

- రఫేల్ సహా ఫైటర్ జెట్లను ధ్వంసం చేశాం
- రెండు ఇండియన్ డ్రోన్లు సైతం నేలమట్టం
- పాక్ పార్లమెంట్‌లో ప్రధాని షరీఫ్ ప్రకటన

ఇస్లామాబాద్: భారత్ చేపట్టిన వైమానిక దాడులను తమ సైన్యం గట్టిగా తిప్పికొట్టిందని పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చెప్పారు. భారత్ చేసే దాడి కోసం పాక్ సైనిక దళాలు ముందుగానే సర్వసన్నద్ధంగా ఉన్నాయని తెలిపారు. భారత్ దాడి చేయగానే అత్యంత వేగంగా ప్రతిస్పందించాయని అన్నారు. తమ సైన్యం ఐదు భారత యుద్ధ విమానాలను ధ్వంసం చేసిందని తేల్చిచెప్పారు. అయితే, అందుకు ఎలాంటి ఆధారాలు ఆయన చూపలేకపోయారు. షెహబాజ్ షరీఫ్ బుధవారం పాకిస్తాన్ పార్లమెంట్‌లో మాట్లాడారు. తాజా పరిణామాలను వివరించారు. ఇండియా యుద్ధ ప్రణాళికల గురించి తమ సైనిక దళాలకు ముందస్తుగానే సమాచారం ఉందన్నారు. ఇండియా దాడుల పట్ల పాక్ వైమానిక దళం ప్రతిస్పందన అద్భుతం అని కొనియాడారు. ఇండియాకు సంబంధించిన రఫేల్ జెట్లు సహా ఐదు యుద్ధ విమానాలకు కూల్చేసినట్లు ప్రకటించారు. అలాగే రెండు ఇండియన్ డ్రోన్లను సైతం ధ్వంసం చేసినట్లు తెలిపారు. గత రాత్రి 80 ఇండియన్ యుద్ధ విమానాలు దాడికి దిగాయని, తమ సైన్యం గట్టిగా బదులివ్వడంతో అవి తోకముడిచాయని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యానించారు. మాతృభూమిని రక్షించుకోవడానికి తమ సైన్యం పూర్తి అప్రమత్తంగా ఉందని స్పష్టంచేశారు. పహల్గాం ఉగ్రదాడిపై పారదర్శకంగా అంతర్జాతీయ దర్యాప్తు జరగాలని చెప్పారు. దర్యాప్తునకు సహకరించాల్సిన భారత ప్రభుత్వం ఆవేశంతో తమపై దాడికి దిగిందని మండిపడ్డారు.

భారత్ దాడిని యుద్ధ చర్యగా పరిగణిస్తున్నాం

భారత ప్రభుత్వం తమపై యుద్ధం ప్రారంభించిందని షెహబాజ్ షరీఫ్ ఆరోపించారు. పాక్‌తోపాటు పీఓకేలో భారత సైన్యం జరిపిన క్షిపణి దాడులను 'యుద్ధ చర్య'గా పరిగణిస్తున్నట్లు చెప్పారు. భారత్‌కు తగిన సమాధానం చెప్పే హక్కు తమకు ఉందని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌లో ఐదు చోట్ల భారత సైన్యం దాడులు చేసినట్లు తెలిపారు. ఇందుకు గట్టిగా బదులివ్వక తప్పదని అన్నారు. ఈ మేరకు షహబాజ్ షరీఫ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శత్రువుకు ఎలా బుద్ధి చెప్పాలో తమ సైన్యానికి బాగా తెలుసని ఉద్ఘాటించారు. శత్రువు ఆటలు సాగవని అన్నారు. తమపై హేయమైన దాడులకు పాల్పడినవారిని నెగ్గనిచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. తమ చేతిలో భారత్‌కు ఓటమి తప్పదని పరోక్షంగా హెచ్చరించారు. ఇదిలా ఉండగా, క్షిపణి దాడులను పాక్ ఉప ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి ఇషాఖ్ దార్ ఖండించారు. పాకిస్తాన్ సార్వభౌమతాన్ని దెబ్బతీయడానికి భారత్ కుట్ర పన్నిందని మండిపడ్డారు. ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించిందని విమర్శించారు. ప్రాంతీయంగా శాంతి ప్రమాదంలో పడిందని, ఇందుకు భారత్ పూర్తి బాధ్యత వహించాలని పేర్కొన్నారు.

దశాబ్దాలుగా నరమేధమే

అందాల కశ్మీరం ఉగ్రవాదులతో దశాబ్దాలుగా అగ్నిగుండంగా మారింది. 2000 నుంచి అక్కడ జరిగిన దాడులకు 700 మందికి పైగా భద్రతా సిబ్బంది, పౌరులు బలయ్యారు. వాటిలో ముఖ్యమైనవి..

2000 మార్చి 21: అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత్‌లో పర్యటిస్తున్న వేళ టెర్రరిస్టులు చెలరేగిపోయారు. అనంత్‌నాగ్ జిల్లా చట్టీసింగ్‌పురా గ్రామంలో 36 మంది సిక్కులను కాల్చి చంపారు.

- 2000లోనే అమర్‌నాథ్ యాత్రికులపై పహల్గాం బేస్ క్యాంప్ వద్ద జరిగిన ఉగ్ర దాడిలో 32 మంది మరణించారు.
- 2001లో 13 మంది, 2002లో 11 మంది అమర్‌నాథ్ యాత్రికులను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారు.
- 2001 అక్టోబర్ 1న జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ప్రాంగణంపై జరిగిన ఆత్మాహుతి దాడికి 36 మంది బలయ్యారు.
- 2002లో జమ్మూ–శ్రీనగర్ హైవేపై ఉగ్రవాదులు అమర్చిన మందుపాతర పేలి నలుగురు భద్రతా సిబ్బందితో పాటు 19 మంది మరణించారు.
- 2003లో పుల్వామా జిల్లా నందిమార్గ్‌లో 24 మంది కశ్మీరీ పండిట్లను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారు.
- 2014: ఉరిలో ఆత్మాహుతి దాడికి దిగి 17 మంది సైనికులను పొట్టన పెట్టుకున్నారు.
- 2015: కథువా పోలీస్ స్టేషన్‌పై దాడిలో ఆరుగురు పోలీసులు మరణించారు.
- 2016: ఉరిలో సైనిక క్యాంపుపై దాడికి తెగబడి 18 మంది సిబ్బందిని పొట్టన పెట్టుకున్నారు.
- 2017లో అమర్‌నాథ్ యాత్ర నుంచి తిరిగొస్తున్న భక్తులపై కాల్పుల్లో 18 మంది మరణించారు.
- 2019: పుల్వామాలో సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై జరిగిన ఆత్మాహుతి దాడికి 40 మంది జవాన్లు బలయ్యారు.
- 2025 ఏప్రిల్ 22: బైసారన్‌లో 26 మంది పర్యాటకులను కాల్చి చంపారు.



ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాక్ సైనికాధికారులు

ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్రదాడితో తమకు సంబంధం లేదని, ఉగ్రవాదులను పెంచిపోషించడం లేదని పాకిస్తాన్ ప్రభుత్వం నమ్మబలుకుతోంది. తమ దేశంలో ఉగ్రవాదుల క్యాంపులే లేవని కబుర్లు చెబుతోంది. అబద్ధాలతో ప్రపంచ దేశాల కళ్లకు గంతలు కట్టాలని చూస్తోంది. కానీ, పాక్ అసలు రంగు ప్రత్యక్షంగా బయటపడింది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైన్యం దాడిలో హతమైన ఉగ్రవాదుల అంత్యక్రియలు బుధవారం జరిగాయి. పాకిస్తాన్‌తోపాటు పాక్ ఆక్రమిక కాశ్మీర్‌లో ముష్కరుల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఇందులో పాకిస్తాన్ సైనికాధికారులు, జవాన్లు, పోలీసులు, ప్రభుత్వ అధికారులు సైతం పాల్గొనడం గమనార్హం. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. లాహోర్ సమీపంలోని మురిడ్కేలో ముగ్గురు ఉగ్రవాదులు అబ్దుల్ మాలిక్, ఖలీద్, ముదాస్సిర్‌ల అంత్యక్రియల్లో లష్కరే తోయిబా సభ్యుడు హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ ప్రార్థనలు చేశాడు. ఈ సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. సైనికాధికారులు, పోలీసులు హాజరయ్యారు. పాకిస్తాన్ జాతీయ జెండాతో చుట్టిన ఉగ్రవాదుల శవపేటికలను సైనికాధికారులు, జవాన్లు స్వయంగా మోశారు. ప్రార్థనల అనంతరం ఖననం కోసం మృతదేహాలను ఉగ్రవాదుల స్వస్థలాలకు పంపించారు. పీఓకేలోని ముజఫరాబాద్‌లో జరిగిన అంత్యక్రియల్లోనూ పాక్ అధికారులు హాజరైనట్లు తెలిసింది.



'ఆపరేషన్ సిందూర్'
ఒక సంచలనమైతే... ప్రెస్‌మీట్‌లో మిలిటరీ బ్రీఫింగ్ చేసిన
ఇద్దరు మహిళా సైనికాధికారులు మరో సంచలనం.
ఆ ఇద్దరు... చెప్పకనే ఎన్నో చెప్పారు.
వారిలో మతాలకతీతమైన జాతీయ సమైక్యత కనిపించింది.
ఎలాంటి అవరోధాలనైనా అధిగమించి
జయించే మహిళాశక్తి కనిపించింది.
ఆపరేషన్‌కు 'సిందూర్' అని పేరు పెట్టడం ప్రతీకాత్మకం.
ఐక్యత, మత సామరస్యానికి సంబంధించిన
శక్తిమంతమైన సందేశాన్ని తెలియజేసేలా ఇద్దరు
మహిళా అధికారులు బ్రీఫింగ్‌కు నేతృత్వం వహించాలి అనే
నిర్ణయం కూడా ప్రతీకాత్మకమైనదే.
ప్రపంచ ఆసక్తి ఇప్పుడు రెండు పేర్లపై కేంద్రీకృతమైంది.
కల్నల్ సోఫియా ఖురేషీ,
వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్...



యుద్ధ స్వరం... ఆ ఇద్దరు

భారత చరిత్రలో తొలిసారి ఇద్దరు మహిళా అధికారులు భారీ సైనిక చర్యపై అధికారిక విలేకరుల సమావేశానికి నాయకత్వం వహించారు. ఉగ్రవాదాన్ని గట్టిగా ఎదుర్కోవాలనే దేశ సంకల్పాన్ని మాత్రమే కాకుండా సాయుధ దళాల్లో పెరుగుతున్న మహిళల బలానికి వారు ప్రతీకలుగా కనిపించారు. 'ఆపరేషన్ సిందూర్' వివరాలను పంచుకోవడానికి నిర్వహించిన విలేకరుల సమావేశానికి కల్నల్ సోఫియా ఖురేషీ, భారత వైమానిక దళానికి చెందిన వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్ నేతృత్వం వహించిన నేపథ్యంలో వారి గురించి తెలుసుకోవాలనే ఆసక్తి సర్వత్రా మొదలైంది. 'పహల్గామ్‌లో ఇరవై ఆరుమంది ప్రాణాలను బలిగొన్నారు. ఉగ్రవాద బాధితులకు న్యాయం చేసేందుకే ఆపరేషన్ సిందూర్ ప్రారంభించాం' అన్నారు సోఫియా ఖురేషీ. పాక్, పాక్ ఆక్రమిత జమ్ము కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకొని విజయవంతంగా దాడి చేసినట్లు ఆమె తెలియజేశారు. సంక్షోభ పరిస్థితుల్లో సైన్యం, ప్రజల మధ్య కమ్యూనికేషన్‌ను కొనసాగించడంలో ప్రొఫెషనల్ ఆఫీసర్స్ పాత్రను వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్ వివరించారు.

ఆ ఇల్లు సైనిక శిబిరం

అది ఇల్లు అనడం కంటే... చిన్నపాటి సైనిక శిబిరం అంటే బాగుంటుంది! కొట్ట వచ్చినట్లు కనిపించే మిలిటరీ క్రమశిక్షణ ఒకవైపు...'ఆ యుద్ధంలో ఏం జరిగిందో తెలుసా?' 'ఒక వీర సైనికుడి గురించి చెబుతాను విను..' ఇలాంటి విశేషాలు మరోవైపు. గుజరాత్‌లోని వడోదరాకు చెందిన ఖురేషిది సైనిక కుటుంబ నేపథ్యం. తాత, తండ్రీ సైన్యంలో పనిచేయడమే తాను సైన్యంలో పనిచేయాలనుకోవడానికి కారణం. బలం. 'మహారాజా షాయాజీరావు యూనివర్సిటీ'లో బయోకెమిస్ట్రీలో పీజీ చేసిన ఖురేషి 1999లో షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా భారత సైన్యంలో చేరారు.

చరిత్ర సృష్టించి...

పుణెలో జరిగిన 'ఎక్సర్‌సైజ్ ఫోర్స్ 18'లో పద్ధెనిమిది దేశాల సైనికులు పాల్గొన్నారు. ఈ విశిష్ట కార్యక్రమంలో భారత సైన్యానికి చెందిన బృందానికి నాయకత్వం వహించి చరిత్ర సృష్టించారు ఖురేషీ. అంతేకాదు.. 'ఎక్సర్‌సైజ్ ఫోర్స్ 18'లో పాల్గొన్న 18 బృందాలలో ఆమె ఏకైక మహిళా కమాండర్.

గర్వించదగిన కాలం

ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షక చర్యల్లో భాగంగా కాంగోలో ఆరేళ్లు పనిచేశారు ఖురేషీ. అక్కడ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. ఇరు వర్గాల మధ్య కాల్పుల విరమణను పర్యవేక్షించారు. ఒక వైపు శాంతిపునరుద్ధరణ ప్రయత్నాలు చేస్తూనే, మరో వైపు సేవాకార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చేవారు.'ఘర్షణాత్మక ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పేందుకు చేసిన ప్రయత్నాలు నాకు గర్వకారణం' అంటారు ఖురేషీ.

ఖురేషీలోని నాయకత్వ లక్షణాలు, చొరవ, ధైర్యసాహసాలను అప్పటి ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ బిపిన్ రావత్ గుర్తించారు. 'సైన్యంలో పురుష, మహిళా అధికారులు అనే తేడా లేదు. జెండర్ ప్రాతిపదికన కాకుండా బాధ్యతను భుజాన వేసుకునే సామర్థ్యం, నాయకత్వ లక్షణాల వల్లే ఆమె ఎంపిక జరిగింది' అన్నారు రావత్. భారత పార్లమెంట్ పై ఉగ్రవాదుల దాడి తర్వాత చేపట్టిన 'ఆపరేషన్ పరాక్రమ్'లో ఖురేషీ కీలక పాత్ర పోషించారు. ఆమె ధైర్యసాహసాలకుగాను జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ ప్రశంసలు అందుకున్నారు.

కుటుంబ నేపథ్యం ఖురేషీకి సైన్యంలో పని చేయాలనే లక్ష్యాన్ని ఇచ్చింది. విద్యానేపథ్యం విమర్శనాత్మక ఆలోచన దృష్టిని ఇచ్చింది. సమస్య పరిష్కారానికి శాస్త్రీయ దృష్టిని అందించింది.

ఆ ఇద్దరు... ది స్పిరిట్ ఆఫ్ ఇండియా

కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. వివిధ పార్టీల నేతలు వీరిని అభినందించారు. 'ఇది కేవలం బ్రీఫింగ్ మాత్రమే కాదు. సాహసోపేతమైన ప్రకటన. ప్రతి యుద్ధంలో, ప్రతి మిషన్‌లోనూ మహిళలు ముందుండి నడిపిస్తారు' అని కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ట్వీట్ చేశారు. 'విలేకరుల సమావేశంలో ఎవరు ఉన్నారో గుర్తుంచుకోండి. వారు... ఇండియన్ ఆర్మీకి చెందిన కల్నల్ సోఫియా ఖురేషీ, వైమానిక దళానికి చెందిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్. భుజం భుజం కలిపి ఒకే జెండాను మోస్తున్నారు. ఇది భారతదేశం. ఎప్పుడూ ఇలాగే ఉంటుంది. ఐక్యత, శాంతి ముందు విద్వేషానికి మాటలు ఉండవు' అని యాక్టివిస్ట్, రైటర్ గుర్మెహర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

ఆకాశ పుత్రిక

ఆకాశంలో కనిపించే విమానాలను చూస్తూ అందరు పిల్లల్లాగే చప్పట్లు కొడుతూ తెగ సంతోషించేది వ్యోమికా సింగ్. ఆ సంతోషానికి లక్ష్యం కూడా తోడైంది. ఆకాశంలో దూసుకుపోవాల్సిందే!

'నేను ఆరవ తరగతిలో ఉన్నప్పుడే పైలట్ కావాలనుకున్నాను. ఆకాశాన్ని సొంతం చేసుకోవాలనుకున్నాను. మా పేర్ల అర్థాల గురించి క్లాసులో మాట్లాడుకుంటున్నప్పుడు వ్యోమిక... నీ పేరుకు అర్థం ఆకాశ పుత్రిక అని అరిచారో ఎవరో. దీంతో పైలట్ కావాలనే కోరిక మరింత బలపడింది' అని ఒక టీవీ షోలో బాల్య జ్ఞాపకాన్ని గుర్తుచేసుకున్నారు వ్యోమికా సింగ్.

ఎన్‌సీసీ పునాదిపై...

ఇంజినీరింగ్ చేస్తున్నప్పుడు ఎన్‌సీసీలో చేరిన వ్యోమికాకు సైనిక క్రమశిక్షణ అలవడింది. భారత వైమానిక దళంలో హెలికాప్టర్ పైలట్‌గా తన కలను నిజం చేసుకున్న వ్యోమిక 2019లో ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదా పొందారు. తన కుటుంబంలో సాయుధ దళాల్లో చేరిన మొదటి వ్యక్తిగా వ్యోమిక గుర్తింపు పొందారు.

జమ్ముకశ్మీర్, ఈశాన్య ప్రాంతాలతో సహా అత్యంత కఠినమైన భూభాగాల్లో చేతక్, చీతా లాంటి హెలికాప్టర్‌లు 2,500 గంటలకు పైగా నడిపిన అనుభవం ఆమెకు ఉంది. 2021లో 21,650 అడుగుల ఎత్తులో ఉన్న మణిరంగ్ పర్వతారోహణ యాత్రలో పాల్గొన్నారు. కమాండర్ వ్యోమికా సాహసాన్ని, అంకితభావాన్ని చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌తో సహా సీనియర్ డిఫెన్స్ అధికారులు గుర్తించారు.

2020లో అరుణాచల్‌ప్రదేశ్‌లో కీలక రెస్క్యూ ఆపరేషన్‌కు నేతృత్వం వహించి, విపత్కర పరిస్థితుల్లో ఉన్న పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఈశాన్య భారతంలో వరద సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితులు ఎదురైనా చెరగని చిరునవ్వు ఆమె సొంతం. ప్రకృతి కల్లోలాలకు వెరవకుండా బాధితులకు అండగా ఉండడం ఆమె నైజం.

మిస్ వరల్డ్ 2025



తొలి అందాల డాక్టర్ రీటా ఫారియా



రీటా ఫారియా.. అందాల పోటీలను ఫాలో అయ్యే వారెప్పటికీ మరచిపోని పేరు! మిస్ వరల్డ్‌గా ఎంపికైన తొలి ఇండియనే కాదు తొలి ఏషియన్ కూడా! అంతేకాదు మిస్ వరల్డ్‌గా ఎంపికైన తొలి మెడికల్ డాక్టర్!

ఇన్ని ఫస్ట్‌లను ప్రీఫిక్స్‌గా పెట్టుకున్న రీటా నిజంగానే ప్రత్యేకమైన మహిళ! ఇప్పుడామెకు 82 ఏళ్లు. ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ డేవిడ్ పావెల్‌ను పెళ్లి చేసుకుని ఐర్లండ్‌లో స్థిరపడ్డారు. ఆమెకు ఇద్దరు కూతుళ్లు. వాళ్లూ డాక్టర్లే, అమ్మలాగే వాళ్లూ స్పోర్ట్స్ పర్సన్సే గోల్ఫ్‌లో! రీటా 5 అడుగుల 8 అంగుళాల ఎత్తుండటం వల్ల స్కూల్లో, కాలేజీలో ఆమెను 'మమ్మీ లాంగ్ లెగ్స్' అంటూ ఆటపట్టించేవాళ్లట. అయితే ఆమె దాన్ని అవకాశంగా మలచుకుంది. పొడుగు కాళ్లతో స్పోర్ట్స్‌లో బాగా రాణించవచ్చని గ్రహించి.. త్రోబాల్, నెట్‌బాల్, బాడ్మింటన్ నుంచి హాకీ దాకా అన్ని ఆటలూ ఆడారు. పెయింటింగ్ వేస్తారు. డాక్టర్ అయ్యి.. మంచి ఫిజీషియన్‌గా పేరు తెచ్చుకున్నారు.

అసలు మిస్ వరల్డ్ కోసం ప్రయాణం...

రీటా ఫారియా స్వస్థలం ముంబై. తాతల కాలంలోనే గోవా నుంచి వచ్చి ముంబైలో స్థిరపడిన ఓ సామాన్య కుటుంబం. నాన్న.. జాన్, ఒక మినరల్ ఫ్యాక్టరీలో పనిచేస్తే.. అమ్మ.. ఆంటోయినెట్, బ్యూటీ పార్లర్ నడిపేవారు. రీటా అక్క ఫిలోమెనా. రీటా మిస్ వరల్డ్ దాకా వెళ్లడానికి ప్రోత్సహించింది ఆమే! రీటా మెడిసిన్ ఫైనలియర్‌లో ఉన్నప్పుడే (1966) మిస్ బాంబే పోటీల్లో పాల్గొంది. టైటిల్ సొంతం చేసుకుంది. తర్వాత వాళ్ల సోదరి 'మిస్ ఇండియా కోసమూ పోటీ పడు' అంటూ వెన్నుతట్టింది. అక్కడా టైటిల్ ఆమెనే వరించింది. తర్వాత మిస్ వరల్డ్ వైపూ తొంగి చూసింది. ఇంచక్కా వేరే దేశం చూడొచ్చన్న ఆశతో తన 23వ ఏట, చేతిలో కేవలం పది పౌండ్ల (అప్పుడు మన దేశ ఫారెక్స్ నిబంధనలు కఠినంగా ఉండేవి అందుకే పది పౌండ్లు)తో ఆ పోటీల కోసం ఫ్లయిట్ ఎక్కారు. మిస్ వరల్డ్ పాజెంట్ కోసం కూతురు ఒంటరిగా లండన్ వెళ్లడం వాళ్లమ్మను కలవరపరచింది. ఆమె తిరిగొచ్చే వరకూ ఆందోళనతోనే ఉన్నారట.

మినిస్టర్ కూతురు చీర.. సేల్స్‌లో హీల్స్..

మిస్ వరల్డ్ పోటీల మీద సరైన అవగాహన, పోటీల్లో ఈవినింగ్ వేర్, గౌన్, పర్సనాలిటీ చాలెంజ్, మిస్ వరల్డ్ నైట్.. లాంటి ముఖ్యమైన ఘట్టాలకు సూట్ అయే దుస్తులూ లేకుండానే పాల్గొంది రీటా. ఈవెనింగ్ వేర్‌లో చీరే కట్టుకోవాలని నిశ్చయించుకుంది. ఎందుకంటే తన దగ్గర చీర మాత్రమే ఉంది. చీరను ఇండియన్ ట్రెడిషనల్ వేర్‌గానూ ప్రెజెంట్ చేయొచ్చు అనుకుంది. ఆ చీర కూడా అప్పటి మిస్ ఇండియా పాజెంట్ ఆర్గనైజేషన్‌తో అనుబంధం ఉన్న మహారాష్ట్ర నాటి మినిస్టర్ పాజ్‌పాయి కూతురి పెళ్లి చీర. నగలు కూడా అరువు తీసుకున్నవే! ఆర్గనైజర్స్ ఆమె వార్డ్ రోబ్ చూసి అవాక్కయ్యారట. ఏమీ లేకుండా ఎలా పాల్గొనబోతోందీ అమ్మాయి అని! ఆమె పొడగరి కావడం వల్ల ఆమెకిచ్చిన స్విమ్ సూట్ కురచదైపోయిందట. తన దగ్గరున్న హీల్స్ ఆ పోటీలకు కావల్సిన ఎత్తు కన్నా తక్కువ ఎత్తున్నవి. ఏం చేయాలో పాలుపోక.. ఒకరోజు తన దగ్గరున్న పది పౌండ్లతో ఎక్కడ దొరుకుతాయో వెదుక్కోసాగింది. అదృష్టవశాత్తు ఒక షాపులో మూడు పౌండ్లకు మంచి స్విమ్ సూట్, అర పౌండ్‌కి కావల్సిన హీల్స్ దొరికాయి ఆమెకు. వాటితోనే పోటీలకు తలపడింది. విశేషమేమంటే ఆ రౌండ్‌లో ఆమెకు 'బెస్ట్ స్విమ్‌సూట్' సబ్ టైటిల్ దక్కింది. అంతేకాదు ఈవెనింగ్ వేర్ ఈవెంట్‌లో శారీతో ప్రత్యక్షమై 'బెస్ట్ ఈవెనింగ్ వేర్' సబ్ టైటిల్‌నూ సొంతం చేసుకుంది. ఫైనల్ ఈవెంట్‌లో కూడా జడ్జెస్ అడిగిన ప్రశ్నలుకు చక్కటి సమాధానంతో 51 కంటెస్టెంట్లతో పోటీపడి 'మిస్ వరల్డ్' కిరీటాన్ని అందుకుంది. ఇక వాళ్లమ్మ సంతోషానికి అవధుల్లేవట!

'అదంతా చాలా వేగంగా జరిగిపోయింది. కిరీటం గెలుచుకున్నాక వెనక్కి తిరిగి ఆలోచిస్తే.. నాకున్న అరకొర ఏర్పాట్లతో దీన్నెలా సాధించగలిగానా అని ఆశ్చర్యం వేసింది. ఇప్పటివాళ్లలాగా అప్పట్లో ఏడాది ముందు నుంచే ప్రిపరేషన్లు ఉండేవి కావు. ఇప్పటి వాళ్ల స్పష్టమైన లక్ష్యంతో దాని కోసం ట్రెన్ అవుతున్నారు' అని చెబుతారు రీటా ఫారియా పావెల్.

– సరస్వతి రమ







గెలిచాక..

రీటా ఫారియాకు మోడలింగ్‌లో, సినిమాల్లో చాలా అవకాశాలు వచ్చాయి. కానీ ఆమె తన డాక్టర్ వృత్తిని చాలా సీరియస్‌గా తీసుకున్నారు. అందుకే వాటన్నిటికీ నో చెప్పారు. అంతేకాదు మిస్ వరల్డ్‌గా వేదికల మీద పర్సనల్ అపియరెన్స్ ఇచ్చానే తప్ప ఎలాంటి కమర్షియల్స్‌కి అడ్వర్టయిజ్ చేయలేదు. ఆమె కమిట్‌మెంట్‌కు ముచ్చటపడ్డ లండన్‌లోని ప్రిస్టేజియస్ కింగ్స్ కాలేజ్ హాస్పిటల్ సిబ్బంది తమ కాలేజీలో చదువు కొనసాగించమని ఆహ్వానించారు. అక్కడే డాక్టర్ యురోపియన్ డేవిడ్ పావెల్ ఈ డస్కీ బ్యూటీ రీటాను కలుసుకున్నాడు. ప్రేమలో పడి పెళ్లి చేసుకున్నాడు. ఇప్పుడు వాళ్లకు అయిదురుగు మనవలు, మనవరాళ్లు. ఇప్పటికీ రీటా అంతే బిజీగా, అంతే ఉత్సాహంగా ఉంటారు. గోల్ఫ్ ఆడుతారు. గార్డెనింగ్ చేస్తారు. ఇంటి పనీ, వంట పనీ చేస్తారు. భార్యాభర్తలిద్దరూ క్లాసికల్ మ్యూజిక్ క్లాసెస్‌కూ వెళ్తారు.

కూల్ సమ్మర్

ఇలా ఇంట్లో చల్లగా...

- కిటికీలకు, తలుపులకు లైట్ కలర్ కర్టెన్‌లు వేయాలి
- సాధ్యమైనంత వరకు బాగా కాంతివంతమైన లైట్లు, వేడిని ఉత్పత్తి చేసే ఉపకరణాలను ఉపయోగించక పోవడం మంచిది. దీనికి బదులుగా ఫ్లోరెసెంట్ లైటింగ్‌ను ఉపయోగించవచ్చు.
- ఇంటికప్పు బ్రైట్ కలర్‌లో ఉంటే తెలుపు రంగు వేయాలి. ప్రత్యేకంగా రూపొందించిన రిఫ్లెక్టివ్ పెయింట్స్‌ను ఉపయోగించడం మంచిది. ఇవి వేసవిలో గదులను చల్లగా ఉంచడంలో సహాయపడతాయి.
- టెర్రస్‌పై వైట్ సిరామిక్ వాటర్ ప్రూఫ్ టైల్స్ వాడడం మంచి ఐడియా
- హీట్-రెసిస్టెంట్ ఫ్లోరింగ్‌లో భాగంగా కూల్ ఫ్లోరింగ్ ఆల్టర్‌నేటివ్స్... మార్బుల్స్, ఉడెన్ టైల్స్ ట్రై చేయవచ్చు.
- విండో ప్లాంటర్స్ ఇంట్లోని వేడిని చల్లబరచడానికి సహాయపడతాయి. కలబంద, అరెకా పామ్, ఫికస్, ఫెర్న్‌లాంటి మొక్కలు బెటర్.



- డీహ్యూమిడిఫైయర్ గదిలోని దుమ్ము, ధూళిని తొలగించి గది ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది.
- విండో ఫిల్మ్స్ బయటి వేడి లోనికి రాకుండా చేస్తాయి
- ఉదయం పూట కిటికీలన్నీ తెరిచి ఉంచాలి. లోపలి వేడి బయటికి వెళ్లడానికి, చల్లగాలి ఇంట్లోకి రావడానికి ఉపయోగపడే టెక్నిక్ ఇది.
- సీజనల్ అప్‌గ్రేడ్‌కు వేసవి తగిన సమయం. చల్లగా ఉండడానికి గోడలకు స్కైబ్లూ, లేత పసుపు, ఆక్వా, లేత గోధుమలాంటి రంగులు వేయాలి. చల్లదనంతో పాటు ఈ రంగులు ఇంటికి కొత్త లుక్ ఇస్తాయి.

వేసవి కాలమ్

గోరింటలూ పూల జడలూ...

సెలవులు వస్తే అబ్బాయిలు ఆటల్లో పడతారు. ఆడపిల్లలు తీర్చుకోవాల్సిన ముచ్చట్లలో మునిగిపోతారు. మల్లెలు విరగగాసే ఈ సీజన్‌లో కనకాంబరాలతో వేసే పూలజడ మిస్సవకూడని జ్ఞాపకం. ఇక గోరింటాకు డిజైన్లు.... పట్టుచీరలతో కొత్త డ్రస్సులు... వెండి పట్టీల వెతుకులాట... పొదుపు చేసి కొనదలచిన బంగారు వస్తువు... వేసవిలో ఆడపిల్లల హడావిడే వేరబ్బా. పెద్దవాళ్లకు గుర్తుండాలేగాని. మరి సీజన్ సంబరంలో ఉంచారా వారిని? ఏం కావాలని అడిగారా?





వేసవి వస్తే ఆడపిల్లల ఆటలు వేరు. చెట్ల నీడల్లో, వరండాల్లో గుంపుగా చేరి వారు చెప్పుకునే కబుర్లకు అంతు ఉండదు. ఇక గోరింట సింగారానికి వేసవి సెలవులే అదను. గోరింటాకు చెట్టు ఏ ఇంట్లో ఉందో వెతికి, వారిని బతిమాలి, ఆకు కోసుకొచ్చి, నూరి, చేతులకు మంచి మంచి డిజైన్లు వేసే అక్కలను వెతికి పెట్టించుకుని, గోరింట ఆరే దాకా అమ్మ చేత్తో ముద్దలు తింటూ... ఎప్పుడెప్పుడు పండుతుందా ఎంత ఎర్రగా పండుతుందా కాచుకుని... ఆ తర్వాత కడిగి నీదెలా పండిందంటే నాదెలా పండిందనుకోవడం... భలే వేడుక.

ఇక అన్నింటికి మించిన అట్రాక్షన్ పూలజడ.

మామూలుగానే అమ్మాయిలకు పూలు ఇష్టం. జడ ఇష్టం. పూలున్న పొడవు జడ ఇంకా ఇష్టం. స్కూలుకెళ్లే రోజుల్లో ఈ ముచ్చట తీరే తీరుబడి ఉండదు కాబట్టి వేసవిలోనే ముహూర్తం. పూలజడ వేయించుకోవాలి... అద్దంలో జడ కనిపించేలా ఫొటో దిగాలి అని అప్పట్లో ప్రతి అమ్మాయి కోరిగ్గా ఉండేది. అది సెంటిమెంట్ కూడా. అయితే ఇది అనుకున్న వెంటనే అవదు. ఫలానా రోజున వేద్దామని ముందే అనుకుంటూరు. తండ్రికి సమాచారం ఇస్తారు... మరి స్టూడియోకు తీసుకెళ్లి ఫొటో తీయించాలి కదా. కాస్ట్యూమ్స్ సెలక్షన్ ఉంటుంది. అమ్మమ్మ, నానమ్మ వంటి పెద్దవాళ్లకు పిన్ని, పెదమ్మలకు కబురు పెడతారు... పూల జడ కార్యక్రమం ఉందని. ఎందుకంటే పూల జడకు అవసరమైన మల్లెలు ప్రత్యేకంగా ఉంటాయి. వాటిని తేవాలి. వాటి మధ్యన కనకాంబరాలు, రోజాలు, మరువం, దవనం లాంటివి పెట్టి జడలు అల్లే స్పెషలిస్టులు కొందరుంటారు. వారి డేట్‌ను ముందే తీసుకోవాలి. వారు అనుకున్న టైమ్‌కన్నా లేటుగా వచ్చి ఆ కబురూ ఈ కబురూ చెప్తూ జడ సిద్ధం చేస్తారు. పూలజడ వేసుకుంటే జడకుప్పెలు పెట్టుకోవటం మరో ముచ్చట. అవి అందరి దగ్గరా ఉండవు కదా... అక్కడికీ ఇక్కడికీ వెళ్లి జడకుప్పెలు తెచ్చుకుని, పూలజడ చివరలో అలంకరించుకుని పావడా కట్టుకుని ఇరుగమ్మలకు, పొరుగమ్మలకూ తాతయ్యలకూ పెదనాన్నలకూ మామయ్యలకూ అత్తయ్యలకూ చూపించి రావడం... వాళ్లు మెటికలు విరిచి పదో ఇరవయ్యో చేతిలో పెట్టటం మరో ముచ్చట. ఇంటికొచ్చిన నాన్న తన బంగారు కూతురు పూల జడతో కళకళలాడుతూ కనిపించే సరికి అనురాగం పొంగుకొచ్చి ఏం అడిగినా కొని పెట్టేస్తాడు. ఫొటో తీయించి ఫ్రేమ్ కట్టించి ఇంట్లో అందరికీ కనిపించేలా ప్రదర్శనకు పెడతాడు. ఈ తతంగం అంతా చూసిన కొందరు తల్లులు వారికి ఆడపిల్లలు లేకపోయినా పిల్లలు మగవాళ్లయినా సరే, బారెడు జుట్టు ఉందని పూలజడలు వేసి ఫొటోలు తీయించి పెద్దయ్యాక చూపించటం, వీళ్లేమో సిగ్గుపడుతూ వంకర్లు తిరగటం...

ఇప్పుడు ఆ పూలూ లేవు... ఆ ముచ్చటా లేదు.

– కె

● మన(సు)లో మాట


గంజాయి నుంచి మా బాబును బయట పడేయగలరా?

డాక్టర్ గారూ, మా అబ్బాయిని అగ్రికల్చరల్ బి.ఎస్‌సి. కోసం మహారాష్ట్రకి పంపాం. మొదటి సంవత్సరం బాగానే ఉన్నాడు. కానీ ఈ మధ్య కాలంలో కాలేజీకి వెళ్ళకుండా రూమ్‌లోనే ఉంటున్నాడని, తిండి సరిగ్గా తినట్లేదని, బాగా వీక్ అవుతున్నాడని వాడి ఫ్రెండ్స్ చెపితే చూడడానికి వెళ్ళాము. చూసి షాక్ అయ్యాం. జుట్టు, గడ్డం బాగా పెంచుకొని స్నానం కూడా చేయకుండా మాసిన బట్టలు వేసుకొని ఉన్నాడు. రూమ్ చిందర వందరగా ఉంది. అతన్ని అక్కడ నుండి కోదాడకి తీసుకొచ్చేశాము. ఇంటికి వచ్చాక కూడా రూమ్‌లో తలుపులు వేసుకునే ఉంటున్నాడు. పదే పదే చెప్తే గాని బ్రష్, స్నానం చేయడం లేదు. మంచిగా రెడీ అవ్వాలనే ఆలోచనే లేదు. మా చుట్టాలబ్బాయితో బయటకి వెళ్ళి తిరిగి రమ్మంటే ఇంటరెస్ట్ లేదంటాడు. మావారు తనతోపాటు షాపుకి రమ్మంటే రాలేను అంటాడు. ఒక్కడే బయటకి వెళ్ళి వస్తాడు. సిగరెట్లు విపరీతంగా తాగుతున్నాడు. కాలేజీలో ఉన్నప్పుడు గంజాయి కూడా తీసుకునేవాడని, ఇక్కడ కూడా కొంతమంది ద్వారా గంజాయి తెప్పించుకొని తాగుతున్నాడనీ తెలిసింది. మేము ఏదైనా గట్టిగా చెప్పాలని చూస్తే మా మీదికి కొట్టడానికి వస్తాడు. లేదా తలుపులు వేసుకొని రూమ్‌లో పడుకొని ఏదో ఆలోచిస్తుంటాడు. అబ్బాయి చదువుకొని బాగు పడతాడు అనుకుంటే ఇలా తయారయ్యాడు. అసలు మా ఇంటా వంటా ఇలాంటి జబ్బులు లేవు. ఏం చేయాలో మాకు అర్థం కావట్లేదు. దయచేసి సహాయం చేయగలరు.

– **కవిత,** కోదాడ

మీరు చెప్పిన లక్షణాలని బట్టి చూస్తే మీ అబ్బాయి గంజాయి తాగడం వలన వచ్చే 'ఎమోటివేషన్ సిండ్రోమ్' అనే ఒక తీవ్రమైన మానసిక సమస్యతో బాధపడుతున్నాడని అర్థం అవుతోంది. గంజాయి తాగేవారిలో కొన్నాళ్ల తర్వాత మెదడుని ఉత్తేజపరిచే భాగాలు పూర్తిగా చచ్చుబడిపోతాయి. భావోద్వేగాలను నియంత్రించే మెదడు భాగాల్లో రసాయనాల ఉత్పత్తి బాగా తగ్గిపోతుంది. దీనివల్ల వారిలో జీవితంలో ఎలాంటి మోటివేషన్ ఇంటరెస్ట్ లేకుండా తయారవుతారు. 'ఏకాగ్రత తగ్గి, మతిమరుపు సమస్య వస్తుంది. దాంతో చదువులో ఫెయిల్ అవుతారు. కెరీర్‌లో వెనక బడతారు. ఇది క్లిష్టమైన మానసిక సమస్య అయినప్పటికీ దీన్ని ట్రీట్ చేయడం అసంభవమైతే కాదు! రిహాబిలిటేషన్ సెంటర్లో ఉంచి మందులు, కౌన్సెలింగ్, ఒక క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవాటు చేయడం ద్వారా తిరిగి తనలో ఆసక్తిని, ఉత్సాహాన్ని పెంపొందించవచ్చు. ఐతే గంజాయి వలన మెదడులో వచ్చే మార్పులు చాలా గాఢంగా ఉంటాయి కాబట్టి ఈ మార్పు రావడానికి చాలా సమయం పడుతుంది. చాలా మంది తల్లి తండ్రులు తమ పిల్లలు గంజాయి తీసుకుంటున్నారని తెలిసినా కూడా, వాళ్ళే మెల్లిగా మానేస్తారులే అనుకుంటారు. సిగరెట్, మందుతో పోల్చినప్పుడు గంజాయి వలన వచ్చే దుష్పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి.

కాబట్టి, పిల్లలు డ్రగ్స్ వాడుతున్నారని తెలిసిన వెంటనే సైకియాట్రిస్ట్‌ని కలవడం ముఖ్యం. లేదంటే ఇలా 'ఎమోటివేషన్ సిండ్రోమ్', సైకోసిస్ లాంటి సమస్యల బారిన పడి తమ జీవితం నాశనం చేసుకుంటున్నారు. కాబట్టి మీరు ఆలస్యం చేయకుండా మీ అబ్బాయిని మీకు దగ్గర్లోని సైకియాట్రిస్ట్ పర్యవేక్షణలో ఉంచి చికిత్స చేయించండి. తప్పకుండా మళ్ళీ మామూలు మనిషి అవుతాడు. ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ
sakshifamily3@gmail.com



సామర్థ్యం పెంచాం..
పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచినట్లు, ఐటీ జోన్‌లో కరెంట్ పోకుండా కాపాలా కాస్తున్నామని రంగారెడ్డి జోన్ సీజీఎం పాండ్యా నాయక్ చెప్పారు. -10లో



సిటీకి 'మిస్'.. బ్యూటీస్ లెస్..
మిస్ వరల్డ్ పోటీకి రకరకాల కారణాలతో పలు దేశాలు తమ ప్రతినిధులను పంపలేకపోయాయి. తొలి అంచనాలతో పోలిస్తే 30 దేశాలు తగ్గినట్లయ్యింది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
37.0/24.0
నగరంలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 37, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.


మల్లాపూర్ మే ఫ్లవర్ అపార్టుమెంట్‌లో భారత జాతీయ పతాకం రెపరెపలు


సంతోష్‌నగర్ ట్విన్ సిటీస్‌లో..

మాక్‌డ్రిల్.. వెల్

నగరంలోని నాలుగు ప్రాంతాల్లో..

శత్రు దేశ దాడులను ఎదుర్కొనేలా.. • సైనికుల సాహసోపేత విన్యాసాలు

- సైరన్ల మోత.. యుద్ధ వాతావరణం
- సురక్షిత ప్రాంతాలకు క్షతగాత్రుల తరలింపు
- ఉత్కంఠభరితంగా వీక్షించిన నగర పౌరులు
- మాక్‌డ్రిల్స్ విజయవంతమయ్యాయన్న అధికారులు



పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ యుద్ధ సన్నద్ధత నేపథ్యంలో పౌరులను అప్రమత్తం చేసే దిశగా చర్యలు చేపట్టింది. దేశ సరిహద్దుల్లో ఉద్రిక్త వాతావరణం సందర్భంగా ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొనేలా, వైమానిక దాడులు జరిగినప్పుడు ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తల్ని వివరిస్తూ కేంద్రం ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 4.30 గంటల వరకు నగరంలోని నాలుగు ప్రాంతాల్లో మాక్‌డ్రిల్స్ చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన మాక్‌డ్రిల్స్ వివరాలు ఇలా ఉన్నాయి.


నానల్ నగర్‌లో మంటల్ని ఆర్పుతూ..


నానల్‌నగర్‌లో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ..


మే ఫ్లవర్ అపార్టుమెంట్‌లో..


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది..


ట్విన్ సిటీస్‌లో సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్తూ..

ఆద్యంతం ఉత్కంఠగా..

గోల్కొండ: గోల్కొండ ఆర్టిలరీ సెంటర్ ఆధ్వర్యంలో నానల్‌నగర్ అవలాన్ కాంప్లెక్స్ వద్ద డీఎఫ్‌ఓ జై కృష్ణ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అంతకుముందు అవలాన్ కంప్లెక్స్‌కు దారి తీసే అన్ని రోడ్లను మిలిటరీ, స్థానిక పోలీసులు దిగ్బంధనం చేశారు. అరగంట పాటు రోడ్లపై ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. అవలాన్ కాంప్లెక్స్ వద్ద జరిగిన ఈ మాక్ డ్రిల్‌ను ప్రజలు ఉత్కంఠగా తిలకించారు. రియల్ లైఫ్‌లో మొదటిసారి సైన్యం మెరుపుదాడులు, సాహసోపేత సైన్య విన్యాసాలను చూసి ఆశ్చర్య చకితులయ్యారు. మరోవైపు శత్రు స్థావరాలపై దాడులు చేయడం, తమకు తాము ఏ విధంగా రక్షించుకోవడం లాంటి సైనికుల విన్యాసాలు వారి ధైర్య సాహసాలను ప్రజలు ఎంతగానో మెచ్చుకున్నారు. సుమారు 29 నిమిషాల పాటు జరిగిన మాక్ డ్రిల్ దేశరక్షణ, శత్రు నిర్మూలన తదితరాలపై సైనికుల ప్రదర్శన ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మరో వైపు పరిసర ప్రాంతాల్లో పూర్తిగా నిశ్శబ్దం ఆవహించింది. కొందరు తమ ఇళ్లలోని విద్యుత్ కనెక్షన్లను ఆఫ్ చేయగా మరికొందరు మాక్ డ్రిల్ సూచనలను పాటిస్తూ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎల్‌పీజీ గ్యాస్ స్విచ్‌లను ఆఫ్ చేశారు.

మే ఫ్లవర్‌లో సైరన్ల మోత..

ఉప్పల్/మల్లాపూర్: ఉప్పల్ మల్లాపూర్ మే ఫ్లవర్ అపార్టుమెంట్‌లో బాంబుల మోత.. స్థానికులంతా ఉలిక్కి పడ్డారు. అపార్టుమెంట్ వాసులు ఎక్కడికక్కడ తలుపులు వేసుకున్నారు. లైట్లు బంద్ చేశారు. సెల్‌ఫోన్‌లు స్విచ్ ఆఫ్ చేశారు. చెలరేగిన మంటలు.. ఫైరింజిన్లు.. అంబులెన్స్‌లు.. వైద్య బృందం, పోలీసులు డీఆర్‌ఎఫ్ బలగాలు, ఆర్మీ సిబ్బంది.. ఉరుకులు.. పరుగులు.. క్షతగాత్రుల తరలింపు.. ఇలా మాక్ డ్రిల్ యుద్ధ వాతావరణాన్ని తలపించింది. యుద్ధ సమయాల్లో అనుకోని విపత్తు వస్తే అపార్టుమెంట్‌లో నుంచి ఎక్కడ నుంచి బయట పడవచ్చు లాంటి అంశాలను మాక్‌డ్రిల్‌లో కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. మాక్‌డ్రిల్‌లో మేడ్చల్- మల్కాజిగిరి కలెక్టర్ గౌతం పొత్రూ, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఏసీపీ చక్రపాణి, జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి, బీజేఈ అధికారి ప్రసన్న కుమార్, ఏడీఎఫ్ఎస్ ఫైర్ సర్వీస్ అధికారి వి. శ్రీనివాస్, హైడ్రా అధికారి పాపయ్యతో పాటు 150 మంది ఎన్‌సీసీ విద్యార్థులు, 70 మంది పోలీస్ అధికారులు, డీఆర్‌ఎఫ్ బృందాలు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్కనీల నుంచి భయాందోళనతో..

సంతోష్‌నగర్: ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ట్విన్ సిటీస్ బీపీఎస్‌లో బుధవారం సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ సుభాష్ పాటిల్, అగ్నిమాపక శాఖ రీజినల్ ఫైర్ ఆఫీసర్ హరినాథ్ రెడ్డిల ఆధ్వర్యంలో సివిల్ డిఫెన్స్ మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. ట్విన్ సిటీస్ టవర్స్‌లో ఒక్కసారిగా బాంబులు పేలడంతో పెద్ద ఎత్తున శబ్దం రావడంతో అపార్ట్‌మెంట్ వాసులు భయాందోళనతో బాల్కనీల నుంచి తమను కాపాడాలంటూ అరుపులు, కేకలు వేయడంతో స్థానిక పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాంబు దాడిలో తీవ్ర గాయాలకు గురైన క్షతగాత్రులను ఒక్కొక్కరిని అగ్నిమాపక శాఖకు చెందిన భారీ నిచ్చెనల ద్వారా జాగ్రత్తగా కిందికి దించడం... వారిని అంబులెన్స్ సహాయంతో వైద్య చికిత్సల నిమిత్తం కంచన్‌బాగ్ అపోలో డీఆర్‌డీఓ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన అపార్ట్‌మెంట్‌లో ఉన్న బాధితులను ప్రత్యేక వాహనాలలో కేంద్రీయ విద్యాలయానికి తరలించారు. ఆ తర్వాత ఇదంతా మాక్‌డ్రిల్‌లో భాగమేనని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. మాక్ డ్రిల్‌లో హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ ముకుంద్ రెడ్డి, ఆర్డీఓ రామకృష్ణ, సౌత్ జోన్ డీసీపీ అశోక్, సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీ, జిల్లా ఫైర్ ఆఫీసర్ వెంకన్న, మురళీమోహన్ రెడ్డి, సౌత్, ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ రఘు, ట్రాఫిక్ డీసీపీ-2 అశోక్ కుమార్, డీసీపీ-3 ఆర్.వెంకటేశ్వర్లు, సౌత్, ఈస్ట్ జోన్ ఏసీపీ వి.చంద్ర కుమార్, వైద్యశాఖ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బిర్జిస్ ఉన్నీసా, మొత్తం 12 విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.


ఈస్ట్‌మారేడుపల్లి మన్‌భుమ్ అపార్ట్‌మెంట్ వద్ద..

అంతటా అప్రమత్తం..

కంటోన్మెంట్: ఈస్ట్‌మారేడుపల్లి మన్‌భుమ్ అపార్ట్‌మెంట్ ఆవరణలో నిర్వహించిన మాక్‌డ్రిల్‌లో వివిధ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం 4.15 గంటలకు అపార్ట్‌మెంట్ ముందు ఓ బాంబు పేలింది. వెంటనే అప్రమత్తమైన పోలీసు, ఫైర్ సేఫ్టీ సిబ్బంది తక్షణమే అక్కడికి చేరుకున్నారు. రెండు ప్రత్యేక ఫైర్ ఇంజిన్‌లు అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చాయి. ఇంతలోనే ఎన్‌సీసీ క్యాడెట్‌లు పోలీసులు, డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలు, జీహెచ్‌ఎంసీ, కంటోన్మెంట్ సిబ్బంది పరుగు పరుగున అపార్ట్‌మెంట్‌లోకి చేరిపోయారు. క్షతగాత్రులను ఒక్కొక్కరిగా స్ట్రెచర్‌లు, వీల్‌చైర్‌లపై కిందకు తీసుకొచ్చారు. అప్పటికే అపార్ట్‌మెంట్ ఎదుటకు చేరుకున్న అంబులెన్స్‌లలోకి వారిని చేర్చి ఆసుపత్రికి తరలించారు. నిజంగా ఏదైనా ఆపద సంభవిస్తే ఎలా స్పందించాలో వివరిస్తూ చేసిన మాక్‌డ్రిల్ ఎంతగానో ఉపకరిస్తుందని ఆయా శాఖల సిబ్బంది పేర్కొన్నారు. మారేడుపల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్‌ను నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్, ట్రాఫిక్ ఏసీపీ శంకర్రాజు, ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్, కంటోన్మెంట్ శానిటరీ సూపరింటెండెంట్ మహేందర్ పరిశీలించారు.

సికింద్రాబాద్ స్టేషన్‌లో అలర్ట్

సికింద్రాబాద్: పహల్గాం ఘటన, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. భద్రతను మూడింతలు పెంచారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువుల విషయంలో రెట్టించిన అప్రమత్తంగా ఉండాలని రైల్వే పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. 50 మందికి ఒక బృందం చొప్పున మూడు బృందాలకు చెందిన 150 మంది రైల్వే రక్షణ ప్రత్యేక దళం (ఆర్‌పీఎస్‌ఎఫ్) పోలీసులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మోహరించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఇప్పటికే 100 మంది ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు. 100 మంది ప్రత్యేక ఆర్‌పీఎఫ్ పోలీసులు మూడు షిఫ్టుల్లో (24 గంటలు) సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పహారా కాస్తున్నారు. మరో 50 మంది పోలీసులు మొబైల్ టీంలుగా ఏర్పడి సేటషన్ పరిసరాల్లో గస్తీ నిర్వహించడంతోపాటు, స్టేషన్‌కు వచ్చివెళ్లే వ్యక్తులపై నిఘా వేస్తున్నారు. జీఆర్‌పీ పోలీసుల సహకారంతో ప్రయాణికులకు, రైల్వే ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.
సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్న అన్ని రైళ్లలోనూ రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రయాణికుల వెయిటింగ్ హాళ్లు, పది ప్లాట్‌ఫామ్‌లలో సంచరించే వ్యక్తుల లగేజీలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. మరికొందరు పోలీసులను మఫ్టీలో ఉంచి గస్తీ నిర్వహిస్తున్నారు. ప్రయాణికులు వేచి ఉండే గదులు, ప్రవేశ మార్గాల పరిస్థితులను సీసీ కెమెరాల ద్వారా వీక్షిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించిన సందర్భాల్లో మొబైల్ ద్వారా రైల్వే కంట్రోల్ రూం (హెల్ప్‌లైన్) 139 నంబరు ద్వారా సమాచారం అందించాలని సూచించారు.

ఆరు ప్రాంతాల్లో సెక్యూరిటీ రిహార్సల్స్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నాలుగు ప్రాంతాల్లో బుధవారం ఆపరేషన్ అభ్యాస్ పేరుతో మాక్ డ్రిల్స్ నిర్వహించగా... ఆరు కీలక, సున్నిత ప్రాంతాల్లో సెక్యూరిటీ రిహార్సల్స్ జరిగాయి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిఘా వర్గాలు ఈ సంస్థల్ని ఎంపిక చేశాయి. ఈ ఆరూ రక్షణ శాఖకు సంబంధించివే కావడం గమనార్హం. సికింద్రాబాద్, తిరుమలగిరి, మారేడ్‌పల్లి, బోయిన్‌పల్లిల్లో ఉన్న కంటోన్మెంట్లతో పాటు మెహిదీపట్నం, గోల్కొండల్లో ఉన్న గారిసన్ ప్రాంతాలను సెక్యూరిటీ రిహార్సల్స్ కోసం రక్షణ శాఖ ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ మంగళవారమే డీజీపీ కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. ఈ రిహార్సల్స్‌లో భద్రత బలగాలతో పాటు పోలీసు విభాగం నుంచి ఏసీపీ ర్యాంకు అధికారి, ఆక్టోపస్ కమాండోలు పాల్గొన్నాయి. ఈ సెక్యూరిటీ రిహార్సల్స్ నిర్వహణ కోసం హైదరాబాద్ పోలీసులు అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు ఏసీపీలను కేటాయించారు.

ఎలా జాగ్రత్తపడాలో బోధపడింది..



అత్యవసర సమయంలో ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలనేది మాక్ డ్రిల్‌తో అర్థమైంది. మే ఫ్లవర్ గ్రాండ్ అపార్ట్‌మెంట్‌లో 370 ఫ్లాట్లు ఉన్నాయి. ఉదయం 10 గంటల నుంచి రెండుసార్లు ట్రయల్ మాక్ డ్రిల్ నిర్వహించారు. అపార్ట్‌మెంట్ మొత్తం మాక్‌డ్రిల్‌లో భాగస్వాములు అయ్యారు. – టీవీ రావు, మల్లాపూర్, మే ఫ్లవర్ గ్రాండ్ అధ్యక్షుడు

కళ్లకు కట్టినట్లు చూపించారు



బాంబులు పేలినప్పుడు, ఉగ్రవాదులు అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించి, బాంబులు పేల్చినప్పుడు సీన్‌ఎలా ఉంటుందో అచ్చం అలాగే మాక్‌డ్రిల్‌తో అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారులు ఎలా జాగ్రత్త పడాలో మాక్‌డ్రిల్‌తో అవగాహన కలిగింది. – జ్యోతి రాణి, మే ఫ్లవర్ అపార్ట్‌మెంట్ వాసి

ఎన్నో అంశాలు తెలిశాయి..



అనుకొని విపత్తు సంభవించినప్పుడు మనం ఎలా బయట పడాలి, ఆపదలో ఉన్న వారిని సైతం ఎలా గట్టెకించాలనే అంశాలు బోధపడ్డాయి. ముఖ్యంగా యుద్ధ సమయాల్లో ఎటాక్ జరిగినప్పుడు ఎలా మెలగాలో చూపించారు. మాక్‌డ్రిల్ వల్ల మాలో భయం కూడా పోయింది. – మల్లేష్, మే ఫ్లవర్ అపార్టుమెంట్ వాసి

పనులు పరుగిడేలా..

హై సిటీ నిర్మాణాల కోసం పీఎంసీలు
- టెండర్లు పిలిచిన జీహెచ్‌ఎంసీ


నిర్మాణ వ్యయం తగ్గించేందుకు..

సాక్షి, సిటీబ్యూరో: హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్ట్ కింద చేపట్టనున్న ఫ్లై ఓవర్లు, తదితర నిర్మాణాల్ని వేగవంతంగా చేసేందుకు పర్యవేక్షణ తదితర పనుల కోసం ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీలు (పీఎంసీ) కావాల్సిందిగా జీహెచ్‌ఎంసీ కోరింది. పనులు నాణ్యతగా, త్వరితగతిన పూర్తయ్యేందుకు నిత్యం పర్యవేక్షణ కోసం పెద్ద ప్రాజెక్టులకు జీహెచ్‌ఎంసీ పీఎంసీల సేవల్ని వినియోగించుకుంటోంది. గతంలో ఎస్సార్‌డీపీ కింద చేపట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, తదితర ప్రాజెక్టుల్లోనూ పీఎంసీల సేవల్ని వినియోగించుకుంది. పనుల్లో తేడాలొచ్చినా, డిజైన్లు, నాణ్యత, తదితర అంశాల్లోనూ పీఎంసీలు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఫ్లై ఓవర్లు.. అండర్ పాస్‌లు..
హై సిటీ కింద కేబీఆర్ పార్కు చుట్టూ పలు ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లతో పాటు ఖాజాగూడ జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్‌ల వద్ద ఫ్లై ఓవర్ల పనులకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. పనులు ప్రారంభించే సమయానికి పీఎంసీలు కూడా సిద్ధంగా ఉండాల్సి ఉన్నందున జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం టెండర్లు ఆహ్వానించింది. ఆయా ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లతో పాటు సైబరాబాద్ సీపీ కార్యాలయం నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు 215 అడుగులతో రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు, అంజయ్యనగర్ నుంచి రాంకీ టవర్స్ వరకు 150 అడుగులతో రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనుల కోసం కూడా పీఎంసీలను ఆహ్వానించింది. కాంట్రాక్టర్ల డిజైన్లను పరిశీలించి ఇంజినీరింగ్ ప్రమాణాలకనుగుణంగా ఉన్నదీ లేనిదీ నిర్ధారించడంతో పాటు పనులు జరిగే సమయంలోనూ పనులు నాణ్యతగా జరుగుతున్నదీ లేనిదీ, వినియోగించే సామగ్రి తదితరమైనవి చూడాలి. పనులు వేగంగా పూర్తిచేసేందుకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో కొత్తగా అందుబాటులోకొచ్చిన సాంకేతిక విధానాలుంటే వాటిని అమలు చేసేందుకు కూడా అవసరమైన సలహాలివ్వవచ్చు.

జీహెచ్‌ఎంసీలో ఎస్సార్‌డీపీ పనులతోనే ప్రీకాస్ట్, స్టీల్ బ్రిడ్జిలు మొదలు కావడం తెలిసిందే. ఇలాంటి వాటిని అమలు చేయడంలోనూ పీఎంసీలు ముఖ్యభూమిక వహిస్తాయి. పనులు వేగంగా పూర్తయ్యేందుకు, నిర్మాణ వ్యయం తగ్గించేందుకు కూడా తగిన సూచనలివ్వాలి. ఫ్లై ఓవర్లతోపాటు వాటిపై లైటింగ్, కింద డ్రైనేజీ సిస్టమ్, ల్యాండ్‌స్కేపింగ్‌లతోసహా ఇతరత్రా పనుల డిజైన్‌లను కూడా పరిశీలించాలి. ప్రజలకు సదుపాయవంతంగా ఉండేలా, సమస్యలకు ఆస్కారం లేకుండా వాటి డిజైన్లుండేలా చూడాలి. క్షేత్రస్థాయి పరిస్థితుల్ని బట్టి అవసరమైన సందర్భాల్లో ఫౌండేషన్లు, తదితరమైన వాటికి సంబంధించి రీడిజైన్ చేయాల్సి ఉంటుంది.పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలివ్వాల్సి ఉంటుంది. పీఎంసీలు లేనిదే పనులు జరగవు కాబట్టి వాటి సేవల కోసం టెండర్లు పిలిచింది.

రోడ్డు ప్రమాదంలో ఐటీ ఉద్యోగి దుర్మరణం


మృతుడు దీపక్ (ఫైల్)

మాదాపూర్: బైకుపై అతి వేగంగా వెళ్తూ..అదుపుతప్పి వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ఓ ఐటీ దుర్మరణం పాలయ్యాడు. మాదాపూర్ ఇన్స్‌పెక్టర్ కృష్ణ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం..వరంగల్ జిల్లా పరకాలకు చెందిన మోకిడి దీపక్ (29) మాదాపూర్‌లోని ఓ కంపెనీలో ఐటీ ఉద్యోగిగా పనిచేస్తూ మల్లంపేట్ కేపీఆర్ వ్యాలీలో నివాసముంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో దీపక్ బైకుపై పర్వత్‌నగర్ సిగ్నల్ వైపు నుంచి హైటెక్‌సిటీ వైపు వెళ్తుండగా..అదే సమయంలో హైటెక్‌సిటీ నుంచి వస్తున్న వాటర్ ట్యాంకర్ వాహనం జంక్షన్ వద్ద టర్నింగ్ తీసుకుంటుండగా..దీపక్ బైకు వేగంగా ఢీకొట్టింది. తల, శరీరభాగాలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రేడింగ్ పేరుతో భారీ మొత్తం స్వాహా

- ఆన్‌లైన్ ద్వారా ఎర వేసిన సైబర్ నేరగాళ్లు
- తొలుత లాభాలు చూపించి ఆపై టోకరా
- సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: సామ్కో ఇన్వెస్టిమెంట్స్ అండ్ సెక్యూరిటీ పేరుతో నగర వ్యాపారికి ఎర వేసిన సైబర్ నేరగాళ్లు ట్రేడింగ్ పేరుతో భారీ మొత్తం కాజేశారు. దీనిపై బాధితుడు బుధవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. నగర వ్యాపారిని గత ఏడాది డిసెంబర్‌లో కొందరు వ్యక్తులు ఆన్‌లైన్‌లో సంప్రదించారు. తాము సామ్కో ఇన్వెస్టిమెంట్స్ అండ్ సెక్యూరిటీ ప్రతినిధులుగా చెప్పుకున్నారు. తమ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, దాని ద్వారా ట్రేడింగ్ చేయాలని కోరారు. అధిక లాభాలు పొందడానికి అవసరమైన సలహాలు, సూచలు ఇస్తామని నమ్మించారు. వీరి మాటలు నమ్మిన బాధితుడు ఆ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ట్రేడింగ్ చేయగా లాభాలు వచ్చాయి. ఆ మొత్తాలు విత్‌డ్రా చేసుకోవడానికి అవకాశం ఉంది. దీంతో బాధితుడు వివిధ దఫాల్లో రూ.68.58 లక్షలు పెట్టుబడి పెట్టారు. సామ్కో ఇన్వెస్టిమెంట్స్ అండ్ సెక్యూరిటీకి చెందినదిగా చెప్పిన యాప్‌లో రూ.50.88 లక్షలు లాభం వచ్చినట్లు కనిపించింది. ఆ మొత్తం డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా సాధ్యం కాలేదు. దీనికోసం సర్వీసు ఫీజుగా 20 శాతం చెల్లించాలని నేరగాళ్లు చెప్పడంతో వ్యాపారి అలానే చేశాడు. ఆపై నిధుల విత్‌డ్రాకు లిఫ్ట్ రిస్క్ కంట్రోల్ ఎత్తివేయాల్సి ఉందని, దీనికోసం మరో 6 శాతం చెల్లించాలని చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు సామ్కో ఇన్వెస్టిమెంట్స్ అండ్ సెక్యూరిటీ సంస్థను నేరుగా వెళ్లి సంప్రదించారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో సంప్రదించిన వారికి, ఆ యాప్‌కు తమతో సంబంధం లేదని చెప్పారు. దీనిపై సైబర్ నేరగాళ్లను నిలదీయంగా స్పందన లేకుండాపోయింది. యాప్ సైతం పని చేయడం మానేసింది. ఇలా తాను మోసపోయినట్లు తెలుసుకున్న బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించడంతో కేసు నమోదైంది.

కందికల్‌లో 2500 గజాల ప్రభుత్వ భూమి స్వాధీనం

పలు ఆక్రమణల్ని తొలగించిన హైడ్రా అధికారులు



సాక్షి, సిటీబ్యూరో: బండ్లగూడ మండలం కందికల్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో వెలిసిన ఆక్రమణలను హైడ్రా బుధవారం తొలగించింది. సర్వే నం.303, 306ల్లో ఉన్న 2500 గజాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. ఇది అర్బన్ ల్యాండ్ సీలింగ్‌కు సంబంధించిన భూమి కాగా సయ్యద్ బషీరుద్దీన్, సయ్యద్ అమీదుల్లా హుస్సేన్ కబ్జా చేశారు. ఈ భూమిని తన పేరు మీద రెగ్యులరైజ్ చేసుకునేందుకు చేసిన విఫలయత్నాలు చేశారు. ఆ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్లు, రూంలు నిర్మించారు. ఆ ప్రభుత్వ భూమి కబ్జా అవుతోందని, కాపాడాలని స్థానికుల నుంచి ప్రజావాణి ద్వారా హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఈ అంశాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబధిత అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకున్నారు. వీటి ఆధారంగా అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. హైకోర్టు సైతం ఈ అక్రమ కట్టడాలను తొలగించాలని రెండు నెలల క్రితం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో హైడ్రా అధికారులు బుధవారం అక్కడ నిర్మించిన నాలుగు ఆర్‌సీసీ రూమ్‌లు, రేకుల షెడ్లలో ఉన్న నాలుగు షాపుల్ని కూల్చివేశారు. అది ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంలో కొందరు స్థానిక రాజకీయ నాయకులు, కబ్జా చేసిన వారి తరపు వారు ఈ కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. స్థానిక పోలీసుల సహకారంతో హైడ్రా వారిని అక్కడ నుంచి పంపేసి కూల్చివేతలు కొనసాగించింది.

సామర్థ్యం పెంచాం..
సరఫరాకు లేదు ధోకా!

- సైబర్ సర్కిల్లోనే 31.75 శాతం విద్యుత్ వృద్ధిరేటు
- లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించాం
- ఫీడర్లు, పీటీఆర్‌లు, డీటీఆర్‌ల కెపాసిటీ పెంచాం
- 'సాక్షి'తో టీజీఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీజీఎం పాండ్యా నాయక్



సాక్షి, సిటీబ్యూరో: 'ఐటీ సర్కిల్లో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. అధిక లోడు కారణంగా ఒత్తిడికి గురవుతున్న సబ్‌స్టేషన్లను గుర్తించాం. వాటిలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 8 ఎంవీఏ నుంచి 12.5 ఎంవీఏకు పెంచాం. అంతేకాదు ఫీడర్లను అనుసంధానించాం. కొత్తగా అనేక డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో పాటు వాటి సామర్థ్యాన్ని పెంచాం. ఐటీ జోన్‌లో రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా కాపాలా కాస్తున్నాం' అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ రంగారెడ్డి జోన్ సీజీఎం పాండ్యా నాయక్ చెప్పారు. ఈ మేరకు బుధవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- 2023 ఏప్రిల్‌తో పోలిస్తే..2024 ఏప్రిల్‌లో ఇతర జోన్లతో పోలిస్తే రంగారెడ్డి జోన్‌లోనే ఎక్కువ విద్యుత్ గ్రోత్‌రేటు నమోదైంది. మెట్రో జోన్‌లో 13.86 శాతం విద్యుత్ వృద్ధిరేటు నమోదు కాగా, మేడ్చల్ జోన్‌లో 16.31 శాతం నమోదైంది. ఇక రంగారెడ్డి జోన్‌లో ఏకంగా 17.77 శాతం నమోదైంది. గచ్చిబౌలి, ఇబ్రహీంబాగ్, కొండాపూర్ డివిజన్లలో ఏకంగా 31.75 శాతం వృద్ధి రేటు కన్పించింది. మణికొండ, అయ్యప్ప సొసైటీ, కోకాపేట్, నార్సింగి, గచ్చిబౌలి, మణికొండ, సన్‌సిటీ, కిస్మత్‌పూర్, ఇబ్రహీంబాగ్, తుక్కుగూడ, శంషాబాద్‌లలో అనూహ్య పెరుగుదల కన్పించింది. భవిష్యత్తులో వచ్చే ఒత్తిడిని తట్టుకునేలా సరఫరా వ్యవస్థను మెరుగుపరుస్తున్నాం. రాజేంద్రనగర్ సర్కిల్లో 13, సైబర్‌సిటీ సర్కిల్‌లో ఆరు, సరూర్‌నగర్ సర్కిల్‌లో ఐదు, వికారాబాద్‌లో పది చొప్పున కొత్త సబ్ స్టేషన్లు నిర్మించబోతున్నాం.
- సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సైబర్‌సిటీ సర్కిల్‌లో ఒత్తిడికి గురవుతున్న 128 (11కేవీ) సహా నాలుగు (33 కేవీ) ఫీడర్లను పునరుద్ధరించాం. సబ్‌స్టేషన్లలోని 25 పీటీఆర్‌ల సామర్థ్యాన్ని పెంచాం. కొత్తగా మరో 232 డీటీఆర్‌లను ఏర్పాటు చేశాం. ఇక రాజేంద్ర నగర్ సర్కిల్‌లో 67(11కేవీ), 09(33కేవీ) ఫీడర్లు సహా 24 పీటీఆర్‌ల సామర్థ్యం పెంచాం. అంతేకాదు ఇక్కడ కొత్తగా మరో 171 డీటీఆర్‌లను ఏర్పాటు చేశాం. అదే విధంగా సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో 49(11కేవీ) సహా ఏడు 33 కేవీ ఫీడర్లతో పాటు 23 పీటీఆర్‌ల సామర్థ్యం పెంచాం. ఇక్కడ కొత్తగా మరో 309 డీటీఆర్‌లను ఏర్పాటు చేశాం.



ఆర్ఆర్ జోన్‌లో విద్యుత్ డిమాండ్ ఇలా

తేదీ	మెగావాట్లు	మిలియన్ యూనిట్లు
01	1591	39.02
02	1828	39.28
03	1548	37.17
04	1397	35.54
05	1597	38.15

డిమాండ్ ఎంతొచ్చినా తగ్గేదే లేదు..

నగరానికి ఆనుకుని ఉన్న రంగారెడ్డి జిల్లాలో కొత్తగా అనేక నిర్మాణాలు వచ్చి చేరుతున్నాయి. ఐటీ అనుబంధ పరిశ్రమలతో పాటు హోటళ్లు, ఇతర వాణిజ్య సంస్థలు ఏర్పాటవుతున్నాయి. ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఇక్కడ విద్యుత్ డిమాండ్ నమోదవుతోంది. ఇప్పటికే ఉన్న సబ్ స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు కొత్తగా మరికొన్ని సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. 2030లో రాబోయే డిమాండ్‌ను ఇప్పుడే అంచనా వేసుకుని ఆమేరకు లైన్ల విస్తరణ, పీటీఆర్‌ల సామర్థ్యం పెంపు వంటి చర్యలు చేపట్టాం. అంచనాలకు మించి డిమాండ్ వచ్చినా..సమర్థవంతంగా సరఫరా చేస్తాం.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు

జగద్గిరిగుట్ట: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నరసింహ తెల్పిన వివరాల ప్రకారం ఏలూరుకు చెందిన నరసింహారాజు, నాగేశ్వరరావు స్నేహితులు. వీరు ఐపీఎల్ మొదలైనప్పటి నుండి గాజులరామారం, మహదేవపురంలో రూమ్ అద్దెకు తీసుకొని క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు బుధవారం వీరు ఉన్న ఇంటిపై దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. 2 కంప్యూటర్లు , 2 ల్యాప్‌టాప్‌లు, 4 ఫోన్‌లతో పాటు రూ.3.6 లక్షలు నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. కాగా నాగేశ్వరరావుపై 2019లో విజయవాడ పోలీస్ స్టేషన్‌లో కూడా కేసు నమోదైనట్లు వారు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఏసీబీకి చిక్కిన అసిస్టెంట్ లైన్‌మన్

అంబర్‌పేట: లంచం డిమాండ్ చేసిన విద్యుత్ శాఖ అసిస్టెంట్ లైన్‌మన్ ఏసీబీకి చిక్కాడు. ఈ సంఘటన బుధవారం అంబర్‌పేటలో చోటు చేసుకుంది. అంబర్‌పేటలో నివసించే ఆటో డ్రైవర్ తన ఇంటికి కొత్త మీటర్ ఇవ్వాలని అసిస్టెంట్ లైన్ మెన్ శివమల్లేష్‌ను సంప్రదించాడు. దీనికి అతను రూ.50 వేలు లంచం డిమాండ్ చేయడంతో రూ.30 వేలకు ఒప్పుకున్నాడు. లంచం డబ్బులు ఇవ్వడానికి ఫోన్ చేస్తే అలీకేఫ్ చౌరస్తా లో ఉన్న ఓ హోటల్‌కు రమ్మన్నాడు. అతను మధ్యవర్తి సంతోష్‌ను హోటల్‌కు డబ్బుల కోసం పంపాడు. డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు సంతోష్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇది గమనించిన శివమల్లేష్ పరారయ్యాడు. అనంతరం సంతోష్‌ను కార్యాలయానికి తీసుకు వెళ్లి కొన్ని పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. శివమల్లేష్ కోసం గాలిస్తున్నారు.

ధూల్‌పేట్‌లో 4.15 కిలోల గంజాయి పట్టివేత


చోట్‌లాల్ సింగ్


శీలా బాయి

అబిడ్స్: ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 4.15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని నలుగురి వ్యక్తులను అరెస్టు చేశారు. 4 సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ధూల్‌పేట్‌లో శీలాబాయి అనే మహిళ గంజాయి విక్రయిస్తుండగా అరెస్టు చేసి 2.08 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ధూల్‌పేట్‌లోని మరో ప్రాంతంలో గంజాయిని విక్రయిస్తున్న ఇంటిపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి చోటులాల్‌సింగ్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద 1.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ముషీరాబాద్‌లాలగూడలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించిశివరామ్, మహేందర్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్ మెంట్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, ఎస్ఐ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీకి షార్ట్ సర్క్యూట్.. కొరియోగ్రాఫర్ మృతి


వీరేందర్‌రెడ్డి (ఫైల్)

మణికొండ: గాఢ నిద్రలో ఉన్న ఓ కొరియోగ్రాఫర్ గదిలోని ఏసీకి షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగి, దట్టమైన పొగ పీల్చటంతో మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్, పుప్పాలగూడ శ్రీరాం నగర్ కాలనీలో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఎస్ మునీందర్ తెలిపిన వివరాల ప్రకారం..వరంగల్ జిల్లాకు చెందిన పోరేటి వీరేందర్‌రెడ్డి (38) కొన్ని సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీరాంనగర్ కాలనీలోని కుతుబ్ ఆర్కేడ్ అపార్ట్‌మెంట్‌లోని 301 ఫ్లాట్‌లో నివాసం ఉంటున్నారు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి తన గదిలో వీరేందర్‌రెడ్డి నిద్రకు ఉపక్రమించాడు. అర్ధ రాత్రి దాటాక 2.30 గంటల సమయంలో అతని గదిలోని ఏసీకి షార్ట్ సర్క్యూట్ కావటంతో మంటలు చెలరేగాయి. దుస్తులు, ఫర్నిచర్ కాలిపోయి పొగలు వ్యాపించాయి. గమనించిన చుట్టు పక్కల వారు డయల్ 100 ద్వారా పోలీసు, అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలార్పి గదిలోకి వెళ్లగా వీరేందర్‌రెడ్డి అపస్మారక స్థితిలో కన్పించాడు. సీపీఆర్ చేసినా అప్పటికే దట్టమైన పొగను పీల్చటంతో మృతి చెందినట్టు 108 సిబ్బంది ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించామని, షార్ట్ సర్క్యూట్ కారణాలను తెలపాలని విద్యుత్ శాఖకు లేఖ రాశామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

దుండిగల్: ద్విచక్ర వాహనాన్ని ఓ గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గండిమైసమ్మ చౌరస్తా ప్రాంతానికి చెందిన కొమ్మట రఘు(23) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం ఉదయం 5.30 గంటల సమయంలో బైక్‌పై తన ఇద్దరు స్నేహితులతో కలిసి గండిమైసమ్మ నుంచి గాగిల్లాపూర్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పిస్తా హౌస్ వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలై రఘు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు సాగర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'దొంగ' సొత్తును విక్రయించి...పోలీసులకు చిక్కి..

అమీర్‌పేట: మేనమామ దొంగిలించిన బంగారం విక్రయించి జల్సా చేసేందుకు వెళ్తూ పట్టుపడ్డ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు..ఏపీలోని విశాఖపట్నంకు చెందిన అంతర్రాష్ట్ర దొంగ తిప్పరాజు రామకృష్ణ నెల రోజుల క్రితం విశాఖ ద్వారకానగర్‌లోని ఓ ఇంట్లో నుండి 20 తులాల బంగారు నగలు చోరీ చేశాడు. ఈ నగలను నగరానికి తీసుకువచ్చి..బంజారాహిల్స్ రోడ్ నెం.12లో ఉండే సోదరి భాగ్యమ్మ, అల్లుడు అశోక్‌కు ఇచ్చాడు. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం అశోక్ కొంత బంగారం విక్రయించి ఆ డబ్బులతో తన ప్రియురాలితో కలిసి ఎంజాయ్ చేసేందుకు ఎస్ఆర్‌నగర్‌కు వచ్చి పోలీసులకు చిక్కాడు. ఈస్ట్ శ్రీనివాస్‌నగర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన అశోక్‌ను ఆపి వివరాలు అడిగారు. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అతడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. బ్యాగులో రూ.3.40 లక్షల నగదు, ఎయిర్ పిస్టల్ ఉన్నట్లు గుర్తించారు. అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా దొంగతనం వివరాలను వెల్లడించాడు. నిందితుడి నుంచి నగదు, అతడి తల్లి వద్ద దాచిపెట్టిన 8 తులాల బంగారం, బైకు స్వాధీనం చేసుకున్నారు.

వైభవంగా వాసవీమాత జయంత్యుత్సవం



మీర్‌పేట: మీర్‌పేట జిల్లెలగూడలో నూతనంగా నిర్మిస్తున్న వాసవి కన్యకాపరమేశ్వరి మాత ఆలయంలో బుధవారం వాసవి మాత జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. వేడుకకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వాసవిమాత విగ్రహానికి క్షీరాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. సమాజ సేవలో విశేషంగా నిలిచిన వాసవిమాత జీవితం అందరికీ ఆదర్శమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ఆర్యవైశ్యులకు జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ఆవరణలో మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ తెరేటిపల్లి శ్రీనివాస్ గుప్తా, సంఘం మీర్‌పేట అధ్యక్షుడు శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి ఇరువెంటి సురేష్, కోశాధికారి వేంకటేశ్వర్లు, బాలాపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో ప్రమాదం...
ముగ్గురు కార్మికుల దుర్మరణం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ డంపింగ్ యార్డులోని పవర్‌ప్లాంట్‌లో లిఫ్ట్ కూలడంతో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు దుర్మరణం చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..డంపింగ్ యార్డ్‌లోని పవర్ ప్రాజెక్ట్‌ఫేజ్-2 చిమ్నీ విభాగంలో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో పనుల కోసం వినియోగించే లిఫ్ట్‌తెగి కింద పడడంతో అందులో పనిచేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కార్మికులు సూరజ్ సర్కార్(25), ప్రకాశ్ మండల్ (29), అమిత్‌రాయ్(25)లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ముగ్గురు కార్మికులు చనిపోవడంతో తోటి కార్మికులు ఆందోళనకు గురయ్యారు. పొట్టకూటి కోసం వచ్చి మృత్యువాతపడ్డారని విలపించారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం..

డంపింగ్‌యార్డ్‌లో పనిచేస్తున్న క్రమంలో ఆకస్మికంగా జరిగిన ఘటనలో ముగ్గురు కార్మికులు మృతిచెందడం బాధాకరమని పనులు నిర్వహిస్తున్న సంబంధిత యాజమాన్య సంస్థ విచారం వ్యక్తం చేసింది. ఘటనలో మృతి చెందిన కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని బుధవారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. డంపింగ్‌యార్డ్‌లో మరోమారు ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని విధాల రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

భర్తపై భార్య దాడి

బంజారాహిల్స్: భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదం కారణంగా..భర్తకు దూరంగా ఉంటున్న భార్య మరొకరిని పెళ్లి చేసుకోవడాన్ని ప్రశ్నించగా.. అతనిపై రోకలితో దాడికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నేపాల్ దేశం బరాండ్‌కు చెందిన కృష్ణదమత్ బతుకుదెరువు కోసం నగరానికి వలసవచ్చాడు. 2013లో సునీత అనే యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్‌లో హౌస్‌కీపింగ్‌గా విధులు నిర్వర్తిస్తూ కుటుంబంతో కలిసి అక్కడే ఉంటున్నాడు. 2024 అక్టోబర్‌లో కుటుంబాన్ని తన గ్రామానికి పంపించేందుకు స్నేహితుడి నుంచి రూ.1.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇదే విషయమై సునీతకు, కృష్ణకు గొడవలు జరిగాయి. ఇదే క్రమంలో జనవరి 3న మద్యం మత్తులో ఇంటికి వచ్చిన కృష్ణకు భార్యతో మరోసారి గొడవ జరిగింది. దీంతో సునీతను ఇంటి నుంచి పంపించివేశాడు. అప్పటి నుంచి భార్యతో ఎలాంటి సంప్రదింపులు చేయలేదు. ఇదిలా ఉండగా మంగళవారం సునీత సోదరుడు దీపక్..కృష్ణదమత్‌కు ఫోన్‌చేసి తన సోదరి అమర్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకుంటుందని చెప్పాడు. దీంతో కృష్ణదమత్ వెంటనే నందినగర్‌లోని సునీత ఉండే నివాసానికి వెళ్లి నిలదీశాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకోగా సునీత అల్యూమినియం రోకలితో భర్తపై దాడికి పాల్పడింది. ఈ ఘటనలో కుడికంటి వద్ద తీవ్రంగా గాయమై రక్తస్రావం జరిగింది. ఆమెతో పాటు అమర్ కూడా కృష్ణదమత్‌పై దాడి చేయగా బాధితుడు బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



బడంగ్‌పేట్: సామాజిక న్యాయ సాధనలో భాగంగా అర్హులైన ప్రతీ కుటుంబానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం బడంగ్‌పేట మున్సిపల్ పరిధిలో 127 మంది అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ సరిగా అమలు చేయడం లేదని విమర్శించారు. ఇచ్చిన హామీలు నెరవేరేవరకు ప్రజల పక్షాన పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలాపూర్ మండల తహసీల్దార్ ఇందిరాదేవి, కమిషనర్ సరస్వతి, మాజీ కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, బోద్రమోని రోహిణి రమేశ్, నాయకులు పి.ఆనంద్ రెడ్డి, భీమిడి జంగారెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, బ్యాంక్ చైర్మన్ నర్సింహారెడ్డి, ముత్యాల కృష్ణ, లబ్ధిదారుల కుటుంబాలు, నాయకులు పాల్గొన్నారు.

వీడిన వృద్ధ దంపతుల హత్య కేసు మిస్టరీ

- జైలు నుంచి విడుదలైన 8 రోజుల్లోనే మరో ఘాతుకం
- నిందితుడిని పట్టుకున్న అల్వాల్ పోలీసులు

కుత్బుల్లాపూర్: వృద్ధ దంపతుల హత్య కేసు మిస్టరీని అల్వాల్ పోలీసులు చేధించారు. పాత నేరస్తుడే డబ్బు కోసం కర్రతో కొట్టి చంపినట్లు తేల్చి అరెస్టు చేశారు. పేట్‌బషీరాబాద్‌లో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీ రాములు, సీఐ రాహుల్ దేవ్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ తిమ్మప్పలతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బొల్లారం ప్రాంతానికి చెందిన చింతకింద అనిల్ (37) ఈ నెల 4న అల్వాల్ ప్రాంతంలోని సూర్య నగర్ కాలనీలో రేకుల రూములో ఉండే కనకయ్య (70), రాజమ్మ (65)ల ఇంట్లోకి అర్ధరాత్రి ప్రవేశించి వారిపై సెంట్రింగ్ కర్రతో దాడి చేయడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది. అల్వాల్ పోలీసులు సవాల్ గా తీసుకొని ఏకంగా 100 సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి నిందితుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుండి రెండు సెల్ ఫోన్లు, కొంత బంగారం, సిల్వర్‌తో పాటు 20 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.


వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

పలు కేసుల్లో రిమాండ్ ...

నిందితుడు అనిల్ దొంగతనం తదితర కేసుల్లో అరెస్టయి..ఏప్రిల్ 26న చంచల్‌గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యాడు. తిరిగి వారం రోజులకే మళ్లీ దొంగతనాలనే వృత్తిగా ఎంచుకున్నాడు. ఈ క్రమంలోనే వృద్ధ దంపతుల ఇంట్లోకి ప్రవేశించి దాడి చేసి బంగారు పుస్తెల తాడు, వెండి పట్టా గొలుసు, కొంత నగదు ఎత్తుకెళ్లాడు. ఈ కేసు తీవ్రంగా పరిగణించిన పోలీసులు సీసీ కెమెరాలు జల్లెడ పట్టగా నిందితుడి ఆనవాళ్లు లభించాయి. అంతేకాకుండా వృద్ధ దంపతులపై దాడి చేసి వారి వద్ద ఉన్న రెండు సెల్ ఫోన్లను తీసుకెళ్లగా వాటి సిగ్నల్ ఆధారంగా పోలీసులు చాకచక్యంగా నిందితుడిని అదుపులో తీసుకున్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, నగదు

పంజగుట్టలో 'ఆపరేషన్ రోప్'



రోడ్డుపై నిలిపిన వాహనానికి లాక్ వేస్తున్న ఇన్‌స్పెక్టర్

పంజగుట్ట: ఆపరేషన్ రోప్‌లో భాగంగా బుధవారం పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.వి.రాం ప్రసాద్ రావు నేతృత్వంలోని బృందం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–1లోని రోడ్డు ఆక్రమణలను తొలగించారు. రోడ్డుకు అడ్డంగా నిలిపిన వాహనాలకు చలానాలను విధించారు. ఫుట్‌పాత్లు, రహదారులపై ఆక్రమణలు తొలగించారు. ఇకపై వాహనదారులకు, పాదచారులకు ఇబ్బంది కలిగేలా ఎవరైనా రోడ్డు ఆక్రమణలు చేస్తే సహించేది లేదని రాంప్రసాద్‌రావు పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం



బంజారాహిల్స్: తెలంగాణ అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదించి గవర్నర్‌కు పంపించినందుకు జూబ్లీహిల్స్ డివిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ హర్షం ప్రకటించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శ్యామల, ఎల్లయ్య, బాబురావు, నరేష ప్రియాంక, వెంకటేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కదలని వరద నీరు



ఎమ్మెల్యే కాలనీ షారోన్ చర్చి పక్కన నిలిచిన వర్షపు నీరు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీ షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చి పక్కన వరద నీరు నిలిచి ఆ నీరు ముందుకు సాగక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద నీరు నిలిచిపోవడంతో ఎమ్మెల్యే కాలనీ నుంచి ఎన్బీటీ నగర్ వైపు వెళ్లే బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ నీటిగుండా వెళ్తూ కిందపడి వాహనదారులు గాయాలపాలవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు చేయూత

శ్రీనగర్‌కాలనీ: పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లాల్‌బహదూర్‌శాస్త్రి సేవానికేతన్ లైబ్రరీ కమిటీ ఆర్థిక సాయం చేయనుందని కమిటీ ప్రతినిధులు పి.నరసింహులు, ఇక్బాల్ అహ్మద్ తెలిపారు. ఆధార్ కార్డు, చిరునామా, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు, ఎస్‌ఎస్‌సీ మార్కుల మెమో తీసుకొని గ్రంథాలయంలో లేదా ఫోన్స్: 92958 03116, 99497 77417లలో సంప్రదించాలని సూచించారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జిమిర్చి 35, క్యాప్సికం 45, పచ్చి కాకరకాయ 35, పందిరిబీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 21, దొండకాయ 28, గుండు బీన్స్ 85, గింజచిక్కుడు 45, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 75, క్యాలీఫ్లవర్ 23, సొరకాయ 7, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4, మామిడికాయ 35, ముల్లంగి 4–5, ఉల్లిపొరక రూ. 35 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వృద్ధురాలి అదృశ్యం



తిరుపతమ్మ

బంజారాహిల్స్: వృద్ధురాలి అదృశ్యమైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శ్రీనగర్‌కాలనీలో నివాసం ఉండే తిరుపతమ్మ(80) తన కుమారుడు పూర్ణయ్య వద్ద ఉంటుంది. గత నెల 30వ తేదీన రాత్రి 8 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకుండాపోయింది. ఈ మేరకు కోడలు శివనాగులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

122 అక్రమ నిర్మాణాలు

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు | సీజ్ చేసేందుకు సిద్ధమవుతున్న జీహెచ్‌ఎంసీ అధికారులు | నోటీసులు ఇచ్చినా పట్టించుకోని యజమానులు | కొరడా ఝుళిపిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది | సర్కిల్–18లో అక్రమ నిర్మాణదారుల్లో వణుకు

బంజారాహిల్స్: అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలను సీజ్ చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో అనుమతులకు విరుద్ధంగా 122 అక్రమ నిర్మాణాలు జరిగినట్లుగా సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు గుర్తించారు.

- గత ఏడాదిగా అక్రమ నిర్మాణదారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నా బిల్డర్లు బేఖాతరు చేస్తూ వచ్చారు. ఇటీవల హైకోర్టు జీహెచ్‌ఎంసీ అధికారుల తీరుపై సీరియస్‌గా స్పందించింది. అక్రమ నిర్మాణదారులతో టౌన్‌ప్లానింగ్ అధికారులు కుమ్మక్కయారా? అని ప్రశ్నించింది.
- షోకాజ్ నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా అక్రమ అంతస్తులు వెలుస్తుంటే ఏమి చేస్తున్నారంటూ నిలదీసింది. దీంతో జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉలిక్కిపడ్డారు. గడిచిన మూడు వారాల నుంచి అక్రమ నిర్మాణదారులకు హైకోర్టు ఆదేశాలతో ఝలక్ ఇస్తున్నారు. అక్రమ కట్టడాలను సీజ్ చేస్తున్నారు.
- జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో ఇప్పటికే పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలను సీజ్ చేశారు. మొత్తం 122 అక్రమ నిర్మాణాలు ఉన్నట్లుగా గుర్తించారు. వీటన్నింటిపై సీరియస్ యాక్షన్ తీసుకోవాలని, అక్రమ అంతస్తులను కూల్చివేయాలని కోర్టు ఆదేశించింది. షోకాజ్ నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా స్పందించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.
- షేక్‌పేట ఓయూ కాలనీలో ఓ ఇంటి యజమాని అనుమతులకు విరుద్ధంగా రెండంతస్తులు అక్రమంగా నిర్మించాడు. దీంతో ఈ భవనాన్ని సీజ్ చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45లో ఓ యజమాని అక్రమంగా అదనపు అంతస్తు నిర్మించగా మొత్తం భవనాన్ని సీజ్ చేశారు.



ఓయూ కాలనీలో అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేసిన సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ అధికారులు

- హైకోర్టు ఆదేశాలను గత నెల 29న జోనల్ కమిషనర్లు, డీసీలు, సర్కిల్ వార్డు కార్యాలయాలకు, టౌన్‌ప్లానింగ్ అధికారులకు పంపించి అక్రమ నిర్మాణాలను సీజ్ చేయాలని ఆదేశించారు. షోకాజ్ నోటీసులు ఒక్కసారి ఇచ్చిన తర్వాత కూడా అక్రమ నిర్మాణం జరుపుతుంటే దానిని కూడా సీజ్ చేయాలన్నారు.
- రాజకీయ నాయకులు, బిల్డర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు కుమ్మక్కై అంతస్తుల కొద్దీ అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారని, రాజకీయ జోక్యం పెరిగిపోయిందని, దీంతో అధికారులు కళ్లు మూసుకుంటుండగా, ఆక్రమణదారులు అనధికార అంతస్తుల నిర్మాణాలు జరుపుతున్నారని హైకోర్టు ఆక్షేపించింది.
- ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పరిధిలో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు గత పదేళ్లగా దర్జాగా జరుగుతున్నాయని ఫిర్యాదులు పెద్ద ఎత్తున వచ్చాయి. వీటిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.
- జూబ్లీహిల్స్ సర్కిల్‌లో గతంలో పనిచేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు, సెక్షన్ ఆఫీసర్లు లంచాలు తీసుకుంటూ ఏసీబీకి, పోలీసులకు పట్టుబడి అడ్డంగా బుక్కయ్యారు. అయినా సరే అక్రమ అంతస్తులు ఆగడం లేదు. హైకోర్టు ఆదేశాలతోనైనా అక్రమ నిర్మాణాలకు చెక్ పడతాయా లేదా అనే అంశం కాలమే నిర్ణయించాలి.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్: ఆపరేషన్ రోప్‌లో భాగంగా పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని పంజగుట్ట, ఎన్‌ఎఫ్‌సీఎల్ జంక్షన్, ఎర్రమంజిల్ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేయాల్సి వస్తుందని వ్యాపారులకు ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్ హెచ్చరించారు. ఫుట్‌పాత్‌లపై కొంత మంది వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు.



ఎర్రమంజిల్‌లో ఆక్రమణలను తొలగిస్తున్న పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు

సైనికులకు మద్దతుగా ర్యాలీలు



ఫిలింనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఫిలింనగర్: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్‌పై యుద్ధం ప్రారంభించిన నేపథ్యంలో దేశ సైనికులకు మద్దతునిస్తూ ఫిలింనగర్‌లో బుధవారం సాయంత్రం కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు చేతబూని భారత్ మాతాక్ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇండియన్ ఆర్మీకి 140 కోట్ల మంది జనాల మద్దతు ఉంటుందని ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు అన్నారు. కాటూరి రమేష్ ఆకుల రాజు, అబ్దుల్ గని, నాగేష్ సాగర్, పద్మ, ఎల్లయ్య, ధనమ్మ, మంగమ్మ, మల్లీశ్వరి, సరస్వతి, నాగార్జున, సహదేవ్ పాల్గొన్నారు.

సైనికులకు సెల్యూట్: ఏఐవైఎఫ్

హిమాయత్‌నగర్: ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సాయుధ దళాలు విజయవంతం కావడం పట్ల త్రివిధ సైనికులను అభినందిస్తూ బుధవారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలీఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర ఆధ్వర్యంలో మిఠాయిలు పంచుతూ భారత సైన్యానికి సెల్యూట్ చేశారు. ఏఐవైఎఫ్ నాయకులు నెర్లకంటి శ్రీకాంత్, సత్య ప్రసాద్, కళ్యాణ్, హేమంత్, శ్రీనివాస్, రమేష్, రమ్య, కీర్తన, ఫాతిమా, రాము పాల్గొన్నారు.



సంబరాల్లో ఏఐవైఎఫ్ నేతలు

ఆన్‌లైన్ టికెట్ల విక్రయం పేరుతో మోసం

బంజారాహిల్స్: నోవాటెల్‌లో జరిగే ఈవెంట్‌కు ఆన్‌లైన్‌లో టిక్కెట్ల విక్రయం పేరుతో రూ. 10,500లు కాజేసి మోసానికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని వ్యాలీవ్యూ లేన్‌లో ఉండే రణబీర్ బగ్గా (48) వ్యాపారి. నోవాటెల్‌లో రిషబ్ రిఖిరామ్ శర్మచే జరిగే సితార్ ఫర్ మెంటల్ హెల్త్ ఈవెంట్‌కు టికెట్ల పునఃవిక్రయం జరుపుతున్నట్లుగా మే 4న రణబీర్ బగ్గా ఫోన్ వాట్సాప్‌కు సందేశం వచ్చింది. దీనిని ఆసక్తిగా తిలకించి ఆ ఈవెంట్‌కు వెళ్లాలని నిర్ణయించుకుని వాట్సాప్ సందేశం పంపిన వ్యక్తిని ఫోన్‌లో సంప్రదించాడు. టికెట్లు ఆన్‌లైన్‌లో పంపిస్తానని, అయితే నగదు చెల్లింపునకు క్యూఆర్ కోడ్ పంపిస్తానని సదరు వ్యక్తి చెప్పాడు. దీంతో క్యూఆర్ కోడ్ ఆధారంగా రూ. 10,500లను పంపించాడు. టికెట్లను అడగ్గా సదరు వ్యక్తి నుంచి స్పందన లేకపోగా ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇండియన్ బ్యాంకులో అగ్ని ప్రమాదం

దగ్ధమైన కంప్యూటర్లు, ఫైల్స్, ఏసీలు, ఫర్నిచర్

హిమాయత్‌నగర్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇండియన్ బ్యాంకులో అగ్ని ప్రమాదం సంభవించింది. నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ సమాచారం మేరకు... నారాయణగూడలోని తాజ్‌మహల్ హోటల్ సమీపంలో ఉన్న ఇండియన్ బ్యాంకులో విద్యుత్ వైర్ల నుంచి ఆకస్మాతుగా మంటలు వచ్చి దట్టమైన పొగలు నిండిపోయి మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు డయల్ 100 సమాచారం ఇవ్వడంతో నారాయణగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందిని పిలిపించారు. ఒక ఫైర్ ఇంజన్‌తో సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో విలువైన కంప్యూటర్లు, ఫైల్స్, ఏసీలు, ఫర్నిచర్ తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరుగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

బంజారాహిల్స్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రెండు సంవత్సరాల కాలానికి కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు విశ్వవిద్యాలయ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పి.వేణుగోపాల్‌రెడ్డి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా కె.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎం.డి.మియాజాని, ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథ్, జాయింట్ సెక్రటరీగా అశోక్, కోశాధికారిగా పాండులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను రిటర్నింగ్ ఆఫీసర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డిలకు పరిచయం చేశారు.



నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న వీసీ ఘంటా చక్రపాణి

డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్: హైదర్‌గూడలో నారాయణగూడ జలమండలి అధికారులు చేపట్టిన నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం రాజ్యమేలుతోందని... అక్రమాలు చోటుచేసుకున్నాయని కార్పొరేటర్ మహాలక్ష్మి ఆరోపించారు. నెల క్రితం జలమండలికి సంబంధించిన కాంట్రాక్టర్ రెయిన్ వాటర్ పైప్‌లైన్‌ల వ్యవస్థను ధ్వంసం చేసి నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. రెయిన్ వాటర్ పైప్‌లైన్‌లోకి డ్రైనేజీ నీరు వెళ్లేలా పనులు చేసి వెళ్లారు. ఈ క్రమంలో వర్షపు నీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు చేస్తుండగా బుధవారం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం డీఈ ప్రవీణ్, ఏఈ పవన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము పర్యవేక్షించడంతో రెయిన్ వాటర్ పైప్‌లోంచి మురుగునీరు రావడాన్ని గుర్తించి మ్యాన్ హోల్స్ తెరిచి చూడగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న కార్పొరేటర్ మహాలక్ష్మి ఘటన స్థలానికి చేరుకుని పర్యవేక్షించారు. జలమండలి మేనేజర్ ఉమామహేశ్వరరావుకు ఫోన్ చేసి విషయం ఆరా తీయగా ఆయన వచ్చి ఇలాంటి పునరావృత్తం కాకుండా చూస్తామని, కాంట్రాక్టర్ వివరణ తీసుకుని అసంపూర్తిగా ఉన్న పనులు చేయిస్తామని చెప్పారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లడుతూ... అధికారుల సమన్వయ లోపంతో పాటు జలమండలి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే పనుల్లో లోపాలు జరిగినట్లు గుర్తించామన్నారు.

ఎఫ్‌ఎన్‌సీసీపై ప్రజావాణిలో ఫిర్యాదు

ఫిలింనగర్: ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్‌ఎన్‌సీసీ)లో అనధికారిక నిర్మాణాలు, వాణిజ్య వినియోగం, సేవలకు ఆస్కారం లేని కార్యకలాపాలు, ప్రభుత్వం నష్టపోతున్న ఆదాయంపై సమగ్ర దర్యాప్తు జరిపి అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ నివాసి కాటూరి రమేష్ కలెక్టర్ కార్యాలయం ప్రజవాణిలో ఫిర్యాదు చేశారు. తాను అంతకముందే హైడ్రాకు, ప్రజాభవన్‌లో ప్రజవాణిలోనూ, జీహెచ్‌ఎంసీకి ఎఫ్‌ఎన్‌సీసీ అక్రమాలపై ఫిర్యాదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఎఫ్‌ఎన్‌సీసీ నిర్మించింది జీహెచ్‌ఎంసీ పార్కు స్థలం రాక్‌గార్డెన్‌లోనని, ఖరీదైన ప్రభుత్వ భూమిని వినియోగించుకుంటూ ప్రభుత్వానికి తీవ్ర ఆదాయ నష్టం కలిగిస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలన్నారు. 30 ఏళ్లకు లీజుకు తీసుకున్న ఈ స్థలానికి సంబంధించి వార్షిక అద్దె రూ. 5 వేలు మాత్రమే ఉందని ఆరోపించారు. రాక్ గార్డెన్, కల్చరల్ హాల్, కమ్యూనిటీ కార్యకలాపాలు, ఫిలిం ఇండస్ట్రీకి శిక్షణల కోసం ఉపయోగించాల్సిన ఎఫ్‌ఎన్‌సీసీలో సేవా ఉద్దేశ్యం లేకుండా బాంకెట్ హాల్, బార్, స్పా, బోటిక్, జిమ్, కాఫీ షాప్ నడుస్తున్నాయన్నారు. అంతేకాకుండా జీహెచ్‌ఎంసీ ఇచ్చిన అనుమతులు గ్రౌండ్ ప్లస్ 2 మాత్రమేనని, ఇక్కడ 3, 4 అంతస్తులు అనధికారికంగా నిర్మించారన్నారు. జీహెచ్‌ఎంసీ నోటీసులు కూడా జారీ చేసిందని పేర్కొన్నారు. ఒక్కో సభ్యత్వానికి రూ. 20 నుంచి రూ. 25 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని దుయ్యబట్టారు. లీజు పొడిగింపును తక్షణమే నిలిపివేయాలని, లీజు అద్దెను ప్రస్తుత మార్కెట్ రేటుకు అనుగుణంగా పెంచాలని, అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



ప్రజవాణిలో ఫిర్యాదు చేస్తున్న ఫిలింనగర్ నివాసి కాటూరి రమేష్

బీజేపీని మరింత పటిష్టం చేద్దాం: చింతల

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశం బుధవారం సాగర్ సొసైటీలోని బీజేపీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడుతూ... పోలింగ్‌బూత్ అధ్యక్షులు అందరినీ కలుపుకుపోతూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. బూత్ అధ్యక్షుడితో పాటు సెక్రటరీ, బూత్ మన్‌కీబాత్ ప్రముఖ్, వాట్సాప్ గ్రూప్ ప్రముఖ్, బీఎల్‌ఏ–2, లాబర్తి ప్రముఖ్‌లు బూత్‌లో అత్యంత కీలకంగా వ్యవహరించాలన్నారు. వీరు ఎల్లవేళలా ప్రజల్లో ఉండాలని సూచించారు. బీజేపీ సీనియర్ నేతలు బంగారు శృతి, కాడిగారి భోజిరెడ్డి, గడ్డం వెంకట్‌స్వామి, ముద్దంగుల శ్రీనివాస్, కొత్త నీరజ, అనిల్‌కుమార్, దండుగుల శ్రీనివాస్, దండుగుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

అభివృద్ధి పనుల పరిశీలన

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ విజయారెడ్డి పరిశీలించారు. ఖైరతాబాద్ జీహెచ్‌ఎంసీ ప్లే గ్రౌండ్‌లో రూ. 18 లక్షల వ్యయంతో చేపడుతున్న స్పోర్ట్స్ రూం, టాయిలెట్స్, ప్లే గ్రౌండ్ అభివృద్ధి పనులను పరిశీలించారు. సీఐబీ క్వార్టర్స్, శ్రీనివాసనగర్‌లలో చేపడుతున్న రూ. 25 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను నేరుగా పరిశీలించారు. పనులను అన్ని శాఖల సమన్వయంతో పూర్తిచేయాలని, రోడ్లు వేసిన తరువాత మరలా తవ్వకాలు చేపట్టకుండా సమన్వయంతో పనులు పూర్తిచేయాలన్నారు. కార్పొరేటర్‌తో పాటు జీహెచ్‌ఎంసీ డీఈ చైతన్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

ఘనంగా వాసవి జయంతి



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రహమత్‌నగర్: వైశ్యుల ఆరాధ్య దైవం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని బుధవారం సంతోషగిరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన, మధ్యాహ్నం యజ్ఞం, అన్నప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలనరు నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు చిటుమల్లి శ్రీనివాస్‌గుప్తా(నిజామాబాద్ శ్రీను), ప్రధాన కార్యదర్శి డి.మధుసూదన్‌గుప్తా, ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాస్‌గుప్తా, కోశాధికారి రాజేష్‌కుమార్‌గుప్తా, సుముద్రాల మల్లేశ్ గుప్తా, బుద్ద నాగరాజు గుప్తా, కొవ్వురి ప్రభు గుప్త, బ్రహ్మానందంగుప్తా, ఆలయ ధర్మకర్త పాక కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై పేరుకుపోతున్న వ్యర్థాలు

వెంకటేశ్వరకాలనీ: పాదచారులు నడిచేందుకు నిర్మించిన ఫుట్‌పాత్‌లు చెత్తకుప్పలు, మట్టి వ్యర్థాలతో నిండిపోయి కనిపిస్తున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని ఆశా ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై గత కొద్ది నెలలుగా వ్యర్థాలు ఫుట్‌పాత్‌పై కుప్పలుగా ఉన్నాయి. వీటిని తొలగించాల్సిన శానిటేషన్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఇక్కడ అపరిశుభ్ర వాతావరణం నెలకొంటున్నది. ఇకనైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఆశా ఆస్పత్రి ఎదురుగా ఫుట్‌పాత్‌పై వ్యర్థాలు

రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది

ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

సనత్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందని. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ నేతృత్వంలో బుధవారం సాయంత్రం బేగంపేటలో జై బాపు, జైభీం, జైసంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఎయిర్‌టెల్ ఆఫీసు భవనం నుంచి బేగంపేట ప్యాలెస్ వరకు జరిగిన ఈ ర్యాలీలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. అంబేద్కర్, గాంధీజీ, రాజ్యాంగ ప్రతిని చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను నెరవేర్చే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీయేనన్నారు. రాజ్యాంగాన్ని కుట్ర జరుగుతుందని, దీనిని కలసికట్టుగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శంషాబాద్ మాజీ సర్పంచ్ సిద్దేశ్వర్, సీనియర్ నాయకులు విశాల్ సూదం తదితరులు పాల్గొన్నారు.

తిరుమలహిల్స్ పార్కును పరిరక్షించండి

- హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు
- పార్కును పరిశీలించిన అధికారి

మణికొండ: అప్పటి హుడా ఆధ్వర్యంలో ఏర్పాలైన లే అవుట్‌లోని పార్కు స్థలం తమదని, మున్సిపాలిటీ నిర్మాణ అనుమతులు ఇచ్చిందని పనులు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని పార్కు స్థలాన్ని పరిరక్షించాలని కాలనీ వాసులు హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌ను కోరారు. గురువారం ఆయనను కార్యాలయంలో కలిసి పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయటంతో వెంటనే ఓ సీనియర్ అధికారిని పంపి స్థానికంగా పరిశీలించి నివేదిక తెప్పించుకున్నారు. వివరాలిలా... మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమలహిల్స్ కాలనీలో సర్వే నెంబర్ 87, 119లలో 1994లో అప్పటి హుడా ఏర్పాటు చేసింది. అందులో పలు చోట్ల పార్కులకు స్థలాలు వదిలారు. వాటిలో ఒక చోట 6024 గజాల స్థలాన్ని పార్కుకు అప్పటి రియల్టర్‌లు వదిలి సదరు భూమిని అప్పటి పుప్పాలగూడ గ్రామపంచాయతీ పేరుతో గిఫ్ట్ డీడ్ చేశారు. కాలక్రమంలో రియల్టర్‌లు తిరిగి దాన్ని కొందరికి అమ్మకాలు చేయటం, వారు తెలియక కొనుగోలు చేశారు. అప్పటి నుంచి సదరు స్థలం వివాదం కోర్టులో కొనసాగుతున్నా కొందరు స్థానిక మున్సిపాలిటీ నుంచి అనుమతులు పొంది నిర్మాణాలు చేస్తున్నారని తిరుమల హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ అవినాశ్, మణికొండ మున్సిపాలిటీ, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీలు బుధవారం ఆయనకు ఫిర్యాదు చేశారు. దాంతో ఆయన చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌ను విచారణ చేయాలని ఆదేశించటంతో ఆయన వచ్చి పార్కు స్థలాన్ని పరిశీలించారు. అందులో నిర్మాణాలు చేస్తున్న వారిని పనులు నిలిపివేయాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్మాణ అనుమతులు ఇచ్చిన వాటిని, క్రయవిక్రయాలను పరిశీలించి సదరు వ్యక్తులపై చర్యలకు సిఫారసు చేస్తామని అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. తిరుమలహిల్స్ కాలనీ ఉపాధ్యక్షుడు భరత్‌కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, కార్యదర్శి రంగాచారి తదితరులు పాల్గొన్నారు.



హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

నేడు హైడ్రా ఠాణా ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: ట్యాంక్‌బండ్ సమీపంలోని బుద్ధ భవన్ వద్ద ఏర్పాటైన హైడ్రా పోలీసుస్టేషన్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్నారు. ఈ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ఏసీపీ పి.తిరుమల్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ స్టేషన్‌కు ప్రాథమికంగా ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు, 12 మంది ఎస్సైలు, 30 మంది కానిస్టేబుల్స్‌ను కేటాయించారు. గ్రౌండ్ ఫ్లోర్, రెండు అంతస్తుల్లో 10,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని నిర్మించారు. ఈ ఠాణాలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తే జలవనరులు, ప్రభుత్వస్థలాల ఆక్రమణల వెనుక ఉన్న సూత్రధారుల వివరాలు బట్టబయలవుతాయి. హైడ్రా ఏర్పడిన నాటి నుంచి వందల ఎకరాల భూములు, చెరువులు, పార్కులు, నాలాలను చెర విడిపించింది. వీటి ఆక్రమణలకు సంబంధించి వేర్వేరు పోలీసుస్టేషన్లలో 50కిపైగా కేసులు విచారణలో ఉన్నాయి. ఇప్పుడు ఆ కేసులన్నిటిని హైడ్రా పోలీసుస్టేషన్‌కు బదిలీ చేయనున్నారు. ఈ అధికారులు ఆక్రమణదారులను సరైన ఆధారాలతో జైలుకు పంపనున్నారు.

మహోన్నత వ్యక్తి వీరబ్రహ్మేంద్ర స్వామి

– రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



శ్రీ పోతులూరి వీరబ్రహేంద్ర స్వామి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కవాడిగూడ: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గొప్ప కాలజ్ఞానాన్ని, దూరదృష్టితో భవిష్యత్తును ముందే తెలియజేశారని, ఇలాంటి గొప్పవ్యక్తి చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరముందని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 332వ ఆరాధన ఉత్సవాలు ట్యాంక్‌బండ్‌పై విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలన్నారు. వీర బ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేషాచారి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పీఎన్ చారి, విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అడ్లూరి రవీంద్రాచారి, విశ్వకర్మ సంఘం నాయకులు లాలు కోటా వెంకటాచారి, మదన్‌మోహన్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.


నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సెవెన్ విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(టీఎస్ఆర్‌టీసీ)లో ఉదయం 9 గంటల నుంచి పిల్లలకు ఫ్రీ సమ్మర్ క్యాంపు జరుగుతుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది. ఈ ప్రదర్శనలో డైరెక్ట్ వీవర్స్ 50 శాతం రాయితీపై అమ్మకాలు నిర్వహించనున్నారు.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీ కాలనీలో లులు మాల్‌లో లులు బిగ్ చాకో డేస్ ఫెస్టివల్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలపై శిక్షణ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవులు సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మైలార్‌దేవ్‌పల్లి గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 నుంచి ఉదయం 11 గంటల వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

మరో 12 చోట్ల స్లాట్ బుకింగ్!

- ఇప్పటికే 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు
- సత్ఫలితాలు ఇస్తున్న స్లాట్ బుకింగ్ విధానం
- అర్ధ గంటలోనే స్థిరాస్తి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి



సాక్షి,సిటీబ్యూరో: స్లాట్ బుకింగ్ విధానం సత్ఫలితాలు ఇస్తుండటంతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సరికొత్త ఉత్సాహంతో ముందడుగు వేస్తోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగంగా చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. రెండో దశలో మరికొన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపడుతోంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సంస్కరణల్లో భాగంగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. స్థిరాస్తి దస్తావేజుల సత్వర రిజిస్ట్రేషన్ల కోసం ప్రయోగాత్మకంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మొదటి విడతగా గత నెల 10వ తేదీ నుంచి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆజంపురా, చిక్కడపల్లి, మేడ్చల్ ఆర్వో, కుత్బుల్లాపూర్, వల్లభ్ నగర్, శంషాబాద్, సరూర్ నగర్, చంపాపేట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అధికారులు అమలు చేస్తున్నారు. ఈ నెల 12 నుంచి రెండో విడతగా హైదరాబాద్, హైదరాబాద్ సౌత్, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ ఆఫీస్‌ల తోపాటు ఫరూక్ నగర్, షాద్‌నగర్, మహేశ్వరం, వనస్థలిపురం, శేరిలింగంపల్లి, ఉప్పల్, ఘట్‌కేసర్, నారపల్లి, మల్కాజ్‌గిరి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్ ద్వారా స్థిరాస్తి దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు వెసులుబాటు కలగనుంది.

అర్ధగంటలోనే...

సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల కోసం గంటల తరబడి నిరీక్షించే పనిలేకుండా కేవలం అర్ధ గంటలోపు దస్తావేజుల నమోదు ప్రక్రియ పూర్తవుతోంది. ఒకేరోజు ఒకే సమయంలో ఎక్కువ దస్తావేజుల రిజిస్ట్రేషన్ల కోసం సమర్పించే పద్ధతి కూడా అడ్డుకట్ట పడినట్లయింది. దస్తావేజుల తాకిడి వల్ల జరిగే జాప్యాన్ని నివారించేందుకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు రోజువారీగా కనీసం 48 స్లాట్లు చొప్పున కేటాయిస్తున్నారు. దస్తావేజుల తాకిడి అధికంగా గల సబ్ రిజిస్ట్రార్లలో మాత్రం 144 స్లాట్స్ అందుబాటులో ఉంటాయి. ఈ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్ విధులు నిర్వహిస్తున్నారు. అయితే దస్తావేజుల స్లాట్ల టైమింగ్ ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతోంది. స్లాట్ బుక్ చేసుకొని అత్యవసర దస్తావేజుదారుల కోసం ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఐదు వాక్ ఇన్‌రిజిస్ట్రేషన్లను అనుమతిస్తున్నారు. నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో దస్తావేజులు స్వీకరించి నమోదు ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

దళారుల ప్రమేయం లేకుండా...

స్థిరాస్తి దస్తావేజుల నమోదు కోసం దళారుల ప్రమేయం లేకుండా స్లాట్ విధానంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కానుంది. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ శాఖలో డాక్యుమెంట్ రైటర్ లైసెన్స్ వ్యవస్థ లేనప్పటికీ కొందరు దళారులు డాక్యుమెంట్ రైటర్ల అవతారం ఎత్తి స్థిరాస్తి దస్తావేజుల రూపకల్పన, నమోదు ప్రక్రియలో దస్తావేజుదారులకు అన్ని తామై వ్యవహరిస్తూ అందినకాడికి దండుకుంటున్నారన్నది బహిరంగ రహస్యమే. అయితే తాజాగా రిజిస్ట్రేషన్ శాఖ స్లాట్ విధానంతోపాటు స్థిరాస్తి క్రయ, విక్రయదారులు దళారులపై ఆధారపడకుండా స్వయంగా దస్తావేజులను తయారు చేసుకోవడానికి వెబ్‌సైట్‌లో ఒక మాడ్యూల్‌ను ప్రవేశపెట్టింది. మరోవైపు దస్తావేజుదారులు నేరుగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ వెబ్–సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకొని నిర్దేశించిన సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునే వెసులుబాటు కలిగినట్లయింది. మరోవైపు వచ్చే నెల 3వ వారం నాటికి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తేవాలని రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

శాస్త్రీయంగా రిజర్వేషన్ల శాతాలను నిర్ణయించాలి

బీసీ రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



ప్రధాని మోదీకి మద్దతు తెలుపుతున్న 96 బీసీ కుల సంఘాల నాయకులు

లక్డీకాపూల్: రాష్ట్ర కులగణన గణాంకాలను కులాల వారీగా పరిశీలించి శాస్త్రీయంగా రిజర్వేషన్ల శాతాలను నిర్ణయించాలని, బుసాని వెంకటేశ్వరరావు కమిషన్ నివేదికను ప్రజల్లోకి విడుదల చేయాలని బీసీ రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. కులగణనపై తగిన సూచనలతో కూడిన నివేదికను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సమర్పించేందుకు త్వరలో బీసీ ప్రతినిధుల బృందం ఢిల్లీకి వెళ్లనుంది. ఈ సందర్భంగా బుధవారం స్థానిక హోటల్ అశోకలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి 96 బీసీ సంఘాల ప్రతినిధులు, బీసీ మేధావులు, సామాజికవేత్తలు హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. కులగణన నివేదికను ప్రధానికి సమర్పించేందుకు బీసీ ప్రతినిధుల బృందం ఢిల్లీకి వెళ్లాలని నిర్ణయించారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి కులగణన పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మే రెండో వారంలో ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో జాతీయ స్థాయి కులగణన సదస్సు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. కార్యక్రమంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య, శాసన మండలిలో విపక్ష నాయకుడు సిరికొండ మధుసూధనాచారి, పాలూరు రామకృష్ణయ్య, రాములు యాదవ్, ఈశ్వరప్ప, ఆనంద్ గౌడ్, గుజ్జ సత్యం, ఆంజనేయులు, కాటం నర్సింహా యాదవ్, నీల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో విద్యుత్ ఏఈ

రూ.10 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఏఈ జ్ఞానేశ్వర్



ఏసీబీ అధికారులకు చిక్కిన విద్యుత్ ఏఈ

నిజాంపేట్: ఓ విద్యుత్ ఏఈ రూ.10 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కాడు. రంగారెడ్డి జిల్లా రేంజ్ డీఎస్పీ ఆనంద్ వివరాలను వెల్లడించారు. ప్రగతినగర్ మిథిలా నగర్ సమీపంలో ఓ భవనం ముందున్న ట్రాన్స్‌ఫార్మర్ 63 కేవీ లైన్ మార్చేందుకు కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేలను ఏఈ ఎ.జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశాడు. అంత ఇవ్వలేనని కాంట్రాక్టర్ చెప్పడంతో రూ.30 వేలకు ఒప్పుకున్నాడు. తర్వాత సదరు కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బుధవారం ప్రగతినగర్ ఎలీఫ్ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఏఈ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. అదే విధంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో గల ఏఈ జ్ఞానేశ్వర్ నివాసంలో సైతం సోదాలు చేశారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా ప్రజల నుంచి వివిధ పనుల నిమిత్తం డబ్బులు డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1064కు లేదా వాట్సాప్ 9440446106 ద్వారాఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు.

గౌలిపురా స్లాటర్‌హౌస్‌ను త్వరలో ప్రారంభిస్తాం



గౌలిపురా స్లాటర్ హౌస్‌ను పరిశీలిస్తున్న కర్ణన్, ఆలే భాగ్యలక్ష్మీ, ఇతర అధికారులు

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని మేకలమండి (స్లాటర్ హౌస్)ను త్వరలో పునఃప్రారంభించనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. బుధవారం ఉదయం ఆయన వివిధ విభాగాల అధికారులతో కలిసి స్లాటర్ హౌస్‌ను పరిశీలించారు. స్లాటర్ హౌస్ భవనంలో యంత్రాలకు మరమ్మతులు, నీరు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేసి త్వరలో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రాజెక్టు ఇంజనీర్‌కు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ, హెల్త్ అడిషనల్ కమిషనర్ పంకజ, జోనల్ కమిషనర్ వెంకన్న, జోనల్ ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, ప్రాజెక్టు ఎస్ఈ లక్ష్మీ, సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్ మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

నల్లూరికి లెజెండరీ అవార్డు



సాక్షి,సిటీబ్యూరో: నలభై ఏళ్లకుపైగా ప్రాంతీయ ప్రకటన రంగంలో అందించిన అసాధారణ సేవలకుగాను ఓటీఎస్ అడ్వర్టైజింగ్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట జగదీష్ నల్లూరికి హైబిజ్ టీవీ మీడియా లెజెండరీ అవార్డు–2025ను అందించింది. ఇటీవల జరిగిన కార్యక్రమంలో మంత్రి ఉత్తమ కుమార్‌రెడ్డి నల్లూరికి అవార్డు బహూకరించారు.

'కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి'



ఎర్రగడ్డ: జూబ్లీహిల్స్ నియోజకవర్గం జై బాపూ.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం బుధవారం ఎల్లారెడ్డిగూడలోని పీజేఆర్ కమ్యూనిటీ హాల్‌లో సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల క్షేత్ర స్థాయిలో ప్రచారం అంశాలపై అనిల్‌కుమార్ కార్పొరేటర్లు, నాయకులతో చర్చించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, సిద్దేశ్వర్, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మహ్మద్ అజహరుద్దీన్, కార్పొరేటర్లు వనం సంగీత, బాబా ఫసియుద్దీన్, సి.ఎన్.రెడ్డి, నాయకులు భవాని శంకర్, నవీన్‌యాదవ్‌లతోపాటు వివిధ డివిజన్‌లకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

11న స్వర్ణ దేవాలయంలో నృసింహ జయంతి

బంజారాహిల్స్: శ్రీనృసింహ జయంతి వేడుకలను ఈ నెల 11వ తేదీన తెల్లవారుజామున 5.20 గంటల నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయం ముస్తాబవుతోంది. కీర్తనలు, మూల విరాట్ అభిషేకాలు, శ్రీనరసింహ హోమం, శ్రీభూదేవి సమేత నరసింహస్వామి కళ్యాణోత్సవం, శ్రీలక్ష్మీ నరసింహ స్వామి మహాభిషేకం అత్యంత ఆర్భాటంగా నిర్వహిస్తామని హరేకృష్ణ మూవ్‌మెంట్ తెలంగాణ అధ్యక్షుడు శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభు వెల్లడించారు. ఇక్కడ స్వయంభూ శ్రీలక్ష్మీ నరసింహస్వామి 1,200 సంవత్సరాల క్రితం కొలువుదీరారని తెలిపారు. 1907లో కృష్ణప్రసాద్ జాగీర్దార్ అనే వ్యక్తి స్వామివారి ఆలయ నిర్మాణం కోసం 47 ఎకరాలు కేటాయించారని తెలిపారు. క్రమేణా ధూపదీప నైవేద్యాలకు నోచుకోక కనుమరుగైపోతున్న తరుణంలో 2011లో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఈ ఆలయ అభివృద్ధికి ముందుకు వచ్చిందని, 2018లో నిర్మాణం పూర్తి చేసుకుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోనే మొట్ట మొదటి స్వర్ణదేవాలయంగా అవతరించిందన్నారు.

నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ సీజ్!

ఢిల్లీ నుంచి పాత కార్లలో తరలింపు

సాక్షి, సిటీబ్యూరో: ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు పాత కార్లలో గుట్టుగా తరలించిన రూ.నాలుగు లక్షల విలువ చేసే 105 నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను ఎక్సైజ్ పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు జిల్లాకు చెందిన రవీందర్ కత్రావత్ సెకండ్ హ్యాండ్ కార్ల బిజినెస్ చేస్తుంటారు. తరచూ ఢిల్లీసహా ఇతర రాష్ట్రాలకు వెళ్లి, అక్కడ తక్కువ ధరకు లభించే సెకండ్ హ్యాండ్ కార్లను కొనుగోలు చేసి, ఇక్కడికి తీసుకొచ్చి ఎక్కువ ధరకు అమ్ముతుంటాడు. ఇదే క్రమంలో ఢిల్లీలో తక్కువ ధరకు మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి, హస్తినాపురం పరిధిలోని సంతోషిమాతా కాలనీలో నివాసం ఉంటున్న నాగిరెడ్డి ఇంట్లో భద్రపరిచేవాడు. ఇలా విక్రయించగా వచ్చిన మొత్తాన్ని ఇద్దరు కలిసి పంచుకునేవారు. ఈ మేరకు ఎక్సైజ్ పోలీసులు బుధవారం నాగిరెడ్డి ఇంటిపై దాడి చేసి, 24 బ్లాక్ లేబుల్, 36 రెడ్ లేబుల్, 31 శివాజీ రీగల్, నాలుగు సిగ్నేచర్, నాలుగు రాయల్ గ్రీన్, ఆరు రాయల్ చాలెంజ్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4 లక్షల మేర ఉన్నట్లు అంచనా వేశారు.

పిలిస్తే.. యుద్ధంలో పాల్గొంటాం

- స్పష్టం చేసిన మాజీ ఆర్మీ అధికారులు
- ఆపరేషన్ సిందూర్.. అవసరమే!
- ఉగ్రవాదులపై దాడి చేయడం సరైన చర్య

రసూల్‌పురా: ఆపరేషన్ సిందూర్‌కు అపూర్వ స్పందన లభిస్తోంది. ఉగ్రవాదులను తుదముట్టించేందుకు ఇదే సరైన చర్య అని మాజీ ఆర్మీ అధికారులు భావిస్తున్నారు. అవసరమైతే తాము కూడా యుద్ధంలో పాల్గొనడానికి సిద్ధమని ప్రకటిస్తున్నారు. ఆర్మీ, నేవీ, వాయుసేన సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌పై కంటోన్మెంట్‌లోని పలువురు ఆర్మీ అధికారులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈసారి యుద్ధం వస్తే, అధికారుల నుంచి పిలుపు వస్తే పాల్గొనటానికి సిద్ధంగా ఉన్నామని రిటైర్డ్ ఆర్మీ జవాన్లు తెలిపారు.

దాడులు చేస్తే సహించేది లేదు



ఆపరేషన్ సిందూర్ సమర్థనీయమే. శక్తివంతమైన మన త్రివిధ దళాల సామర్థ్యం ప్రపంచ దేశాలకు తెలుసు. 1948 మొదలు 1965, 1975, 1999లో పాకిస్తాన్ దేశానికి తగిన గుణపాఠం చెప్పినా తీరు మార్చుకోలేదు. ఉగ్రవాదులు మనదేశంపై దాడులు చేయకుండా పాకిస్తాన్‌లోని వారి శిబిరాలపై దాడులు చేసేందుకు ఆపరేషన్ సిందూర్ కొనసాగించాలి.

– ఆర్‌ఆర్ మహాపాత్రో, రిటైర్డ్ ఆర్మీ అధికారి

మరోసారి యుద్ధానికి సిద్ధం



ఒకవేళ పాకిస్తాన్‌తో యుద్ధం జరిగితే మనదేశం తరపున యుద్ధంలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నాను. గత కార్గిల్ యుద్ధంలో మద్రాస్ రెజిమెంట్ 27 తరపున పూంచ్ సెక్టార్ నుంచి పాల్గొన్నాను. పాక్ ముష్కరులపై దాడులు చేశాం. 2006లో ఆర్మీ నుంచి పదవీ విరమణ పొందాను. తాజాగా ఉగ్రవాదులు దాక్కున్న తొమ్మిది స్థావారాలపై మన దళాలు దాడులు జరిపి ఉగ్రవాదులను మట్టుపెట్టి వారి స్థైర్యాన్ని దెబ్బతీశాయి.

– పరమేశ్వర్ సింగ్ సిపాయి, రిటైర్డ్

పాక్‌కు తట్టుకునేశక్తి లేదు..



ఈసారి పాక్‌తో యుద్ధం వస్తే మరోసారి పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నాను. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో యుద్ధ ట్యాంకర్ డ్రైవర్‌గా 21 మెకనైజ్డ్ ఎనిఫెంట్రి రెజిమెంట్ తరపున పదకొండు రోజులపాటు జమ్ము, కశ్మీర్‌లోని మేరినాగ్ బటాపూర్ నుంచి పాల్గొన్నాను. పదకొండు మంది పాక్ సైనికులను అంతమొందించాం. మనదేశానికి చెందిన ఆర్మీ, నేవీ, వాయుసేనను తట్టుకునే శక్తి పాకిస్తాన్‌కు లేదు.

– కామేశ్వర్ రావు, కార్గిల్ యుద్ధవీరుడు

12న అరుణోదయ 50 వసంతాల స్ఫూర్తిసభ



అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల స్ఫూర్తి సభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విమలక్క తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల పరిపూర్తి స్ఫూర్తి సభ కరపత్రాన్ని బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఆవిష్కరించారు. ఈ స్ఫూర్తి సభను ఈ నెల 12వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అరుణోదయ సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ 1974 మే 12న ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ చొరవతో ఈ సంస్థను స్థాపించామన్నారు. డిసెంబర్ 14, 15వ తేదీల్లో 50 వసంతాల సభలను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. 50 ఏళ్లుగా విప్లవ సాంస్కృతిక సంఘంగా ఉన్న అరుణోదయ సంస్థ అనేక నిర్బంధాలను ఎదుర్కొంటూ పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ స్ఫూర్తి సభలో సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, ప్రముఖ రచయిత కొండ స్వామి తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, అరుణోదయ ప్రధాన కార్యదర్శి రమేష్, అనిత, లింగన్న, రాకేష్, చిన్నన్న, గంగా, నూతన్ తదితరులు పాల్గొన్నారు.

గార్మెంట్ల ఉత్పత్తి కేంద్రాల స్థాపనకు నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మహమ్మద్ ఒబెదుల్లా కొత్వాల్

సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా మైనారిటీ కమ్యూనిటీ గార్మెంట్స్ ఉత్పత్తి, శిక్షణ కేంద్రాలను స్థాపించాలని తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్(టీజీ ఎంఎఫ్‌సీ) పాలక మండలి సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ హజ్‌హౌస్‌లోని ఎంఎఫ్‌సీ ప్రధాన కార్యాలయంలో 27వ పాలకమండలి సమావేశం జరిగింది. కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఒబెదుల్లా కొత్వాల్ అధ్యక్షత జరిగిన సమావేశంలో ప్రధానంగా ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం కింద కుట్టు యంత్రాల పంపిణీ, గార్మెంట్స్ ఉత్పత్తి, శిక్షణ కేంద్రాల స్థాపన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. సమావేశంలో ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి రాయ్‌రవి, టీజీ ఎంఎఫ్‌సీ ఎండీ కాంతివెస్లీ, మైనారిటీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సంజీవయ్య: పొన్నం



సంజీవయ్య ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

రాంగోపాల్‌పేట్: క్రమశిక్షణ గల నాయకుడిగా మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయుడని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దామోదరం సంజీవయ్య 53వ వర్ధంతి కార్యక్రమం సంజీవయ్య పార్కులో మాజీ ఎంపీ వి.హన్మంతరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సంజీవయ్య ఘాట్ వద్ద మంత్రి నివాళులర్పించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ చాంపియన్ అని ఆనాడే నిరుపేద దళితుడిని కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ అధ్యక్షుడిని చేసిందని అన్నారు. కర్నూలు జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాస్తామని పేర్కొన్నారు. సంజీవయ్య చూపిన సామాజిక మార్గదర్శకత్వాన్ని ముందుకు తీసుకుపోతున్నామని అన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, నాయకులు కైలాష్ లక్‌పతి గౌడ్, గరిగంటి రమేష్, నాగభూషణం, శ్రీకాంత్ గౌడ్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

13న మిస్ వరల్డ్ పోటీదారులతో హెరిటేజ్ వాక్

– ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



చార్మినార్: తెలంగాణ ఖ్యాతిని విశ్వమంతటా పరిచయం చేసేందుకు ఉపయోగపడే మిస్ వరల్డ్ 2025 వేడుకలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్లు పర్యాటక శాఖ సంచాలకులు జెడ్.హనుమంతు కొండిబా, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ నెల 13న చార్మినార్ వద్ద మిస్ వరల్డ్ పోటీదారుల హెరిటేజ్ వాక్‌తోపాటు, లాడ్ బజార్, చౌ మహల్లా ప్యాలెస్ సందర్శన వంటి కార్యక్రమాలను పురస్కరించుకొని చేయాల్సిన ఏర్పాట్ల కోసం బుధవారం పాతబస్తీలో పర్యటించారు. బందోబస్తుతోపాటు ఇతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 116 దేశాల యువతులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ఈ నెల 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లో జరగనున్నాయని తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 13న మిస్ వరల్డ్ పోటీదారులు హైదరాబాద్ పాతబస్తీని సందర్శించి చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్‌తోపాటు లాడ్ బజారు, చౌమహల్ల ప్యాలెస్‌ను సందర్శించనున్నారని తెలిపారు. పాతబస్తీతోపాటు తెలంగాణ తల్లి, సెక్రెటేరియట్, రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించనున్నారని అన్నారు. కార్యక్రమంలో సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటరమణ, పర్యాటక శాఖ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మిస్ మొరాకో



తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక మిస్ వరల్డ్ పోటీకి అధికారికంగా తెర లేచింది. మరో 3 వారాల పాటు నగరవాసులకు వైవిధ్యభరిత అనుభూతులను అందించనున్న ఈ పోటీలో మొత్తం 109 దేశాలు పాల్గొంటున్నట్లు దాదాపుగా నిర్ధారణ అయ్యింది. అయితే రకరకాల కారణాలతో పలు దేశాలు తమ ప్రతినిధులను పంపలేకపోయాయి. దాంతో తొలి అంచనాలతో పోలిస్తే 30దేశాలు తగ్గినట్లయ్యింది.

- సాక్షి, సిటీబ్యూరో

మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనాల్సిన వాటిలో 30 దేశాలు డుమ్మా

కొన్ని దేశాలు చివరి క్షణం వరకూ మార్పు చేర్పులు చేస్తూనే ఉన్నాయి. తమ అసలు పోటీదారులకు బదులుగా ఇతరులను పంపుతున్నాయి. చెక్ రిపబ్లిక్‌కు చెందిన జస్టినా జెడ్నికోవా స్థానంలో అడేలా స్ట్రోఫెకొవా ఎంపికయ్యారు. ట్యూనీషియాకు చెందిన అమీరా అఫ్లీకి బదులుగా లామిస్ రెడిసి పోటీలో పాల్గొననున్నారు. బెలీజ్‌కు చెందిన నొయెలియా హెర్నాండెజ్ పోటీ నుంచి తప్పుకోవడంతో ఆమె స్థానంలో షయారి మోరటాయా ఎంపికయ్యారు. కొట్ డి ఇవోరికి చెందిన మారీ ఎమ్మానుయేల్ డైమాలా స్థానంలో ఫటౌమటా కూలిబాలీ వస్తున్నారు. నమీబియాకు చెందిన అల్బర్టినా హైంబలా స్థానంలో సెల్మా కామాన్యా భర్తీ అయ్యారు. కంబోడియాకు చెందిన మానితా హాంగ్ వ్యక్తిగత కారణాలతో తప్పుకోవడంతో జూలియా రస్సెల్ ఎంపికయ్యారు. మాల్డోవాకు చెందిన మికాయెలా నికోలాలేవ్‌ను ఏంజెలినా చిట్టికా భర్తీ చేశారు. కొంతకాలం విరామం తర్వాత ఈ ఏడాది మిస్ వరల్డ్ పోటీలో తిరిగి పాల్గొంటున్న దేశాల్లో స్విట్జర్లాండ్, అల్బేనియా, ఆర్మేనియా, ఈక్వటోరియల్ గినియా, కిర్గిజిస్తాన్, లాట్వియా, నార్త్ మాసిడోనియా, సూరినామ్, బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్, జాంబియాలు ఉన్నాయి.

ఆఖరి క్షణంలో



మిస్ టాంజానియా

సిటీకి మిస్.. బ్యూటీస్ లెస్..

తొలి అంచనా 140 కాగా.. తాజాగా నిర్ధారణ అయింది 109 దేశాలే..

స్పాన్సర్లు లేకపోవడంతో పాటు ఇతర కారణాలు

ఆఖరి నిమిషంలో అందాల అస్త్రాలను మార్చిన మరికొన్ని దేశాలు



మిస్ నార్వే

మిస్ వరల్డ్ 2025 పోటీకి ప్రారంభంలో 140 దేశాలు పాల్గొననున్నట్లు ప్రకటించారు. అయితే తర్వాత ఈ సంఖ్యను 116కు కుదించారు. మొత్తం మీద చూస్తే.. తాజా సమాచారం ప్రకారం, ఈ పోటీలో 109 దేశాలకు చెందిన సుందరీమణులు మాత్రమే పాల్గొంటున్నారు. ఇది గత మిస్ వరల్డ్ 2023 పోటీలో పాల్గొన్న 112 దేశాల కంటే కూడా తక్కువ కావడం గమనార్హం. పోటీలో పాల్గొనని దేశాల్లో.. కోస్టారికా, ఇరాక్, లెసోతో, లైబీరియా, గినియాబిస్సావు, లైబీరియా, మకావ్, మొరాకో, నార్వే, స్లోవేకియా, టాంజానియా, ఉరుగ్వే తదితర దేశాలు ఉన్నాయి.

సరైన ప్రోత్సాహం, ఆర్థిక పరమైన మద్దతు లేకపోవడంతో మిస్ వరల్డ్ పోటీల నుంచి మిస్ టాంజానియా ట్రేసీ నబుకీరా వైదొలిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'చాలా పరిశీలించి ఆలోచించిన తర్వాత, మిస్ వరల్డ్ 2025లో పాల్గొనకూడదని నిర్ణయం తీసుకున్నాను. ఇది అంత తేలికైన నిర్ణయం కాదు, కానీ.. కావాల్సిన మద్దతు దొరకకపోవడం, సరైన కమ్యూనికేషన్ లేకపోవడం బాధ్యత వహించాల్సిన సంస్థ నుంచి తగినంత సన్నద్ధత లేని కారణంగా, ప్రపంచ వేదికపై టాంజానియాకు ప్రాతినిధ్యం వహించలేనని భావిస్తున్నా. మిస్ టాంజానియా టైటిల్ పట్ల ఇప్పటికీ చాలా గర్వపడుతున్నాను. నా ప్రాజెక్ట్, స్టెప్ బై స్టెప్ ద్వారా నా వంతు సామాజిక సేవ చేయడానికి నా గుర్తింపును ఉపయోగించుకుంటూనే ఉంటాను. ఈ ప్రయాణంలో ఓపికగా, మద్దతుగా నాతో ఉన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అన్నారు.

మద్దతు దొరకలేదు.. మిస్ అవుతున్నా..

స్పాన్సర్‌షిప్ లేక..

తమ దేశాల్లో జాతీయ స్థాయి పోటీలు సరిగా నిర్వహించలేకపోవడం, ప్రతినిధులను నియమించలేకపోవడంతో పాటు ఆర్థిక, వ్యక్తిగత కారణాల వల్ల పోటీలో అవి పాల్గొనడంలేదు. లెసోథోకు చెందిన లెరాటో మాసిలా, టాంజానియాకు చెందిన ట్రేసీ నబుకీరా పంపించేందుకు స్పాన్సర్‌షిప్ లేక పోటీల నుంచి తప్పుకున్నారు. గినియా–బిస్సా, ఇరాక్, మాకావ్, ఉరుగ్వే దేశాలు తమ జాతీయ ఫ్రాంచైజ్ సమస్యల వల్ల ప్రాతినిధ్యం వహించలేకపోయాయి. నార్వేకి చెందిన నికోలిన్ ఆండర్సన్, తాను వ్యక్తిగత ప్రాజెక్టుల వల్ల మిస్ వరల్డ్‌కు హాజరుకాకపోవడంతో, ఆమెను మిస్ ఇంటర్నేషనల్‌కు పంపించారు.





అందాల భామలకు స్వాగతం

50కి పైగా దేశాల సుందరీమణుల రాక

ఘనంగా స్వాగతం పలికిన పర్యాటక శాఖ



శంషాబాద్: ప్రపంచ సుందరి పోటీలకు వివిధ దేశాల నుంచి భాగ్యనగరంలో అడుగుపెట్టిన అందాల భామలకు శంషాబాద్ విమానాశ్రయంలో ఆత్మీయ స్వాగతం లభిస్తోంది. బుధవారం తెల్లవారుజాము నుంచే ఫిలిప్పైన్స్, మయన్మార్, వియత్నాం, అమెరికా, అర్మేనియాతో పాటు మొత్తం యాభైకి పైగా దేశాల నుంచి వచ్చిన సుందరీమణులతో పాటు మరో 25 మందికి పైగా విదేశీ ప్రతినిధులకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికింది. స్వాగత సమయంలో కొత్త అనుభూతికి లోనవుతున్న విదేశీ అందగత్తెలు స్వాగతం పలికే నృత్యకారులతో పాటు స్టెప్పులేశారు.



ప్యాట్ కమిన్స్ సందడి




బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ సందడి చేశారు. కర్రెరా కళ్ల జోళ్ల పరిశ్రమకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ఆయన ఆ సంస్థ సరికొత్త ఉత్పత్తులను ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మాట్లాడుతూ కర్రెరాతో భాగస్వామ్యం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. బ్రాండ్ అంబాసిడర్‌గా సంవత్సరాన్ని పూర్తి చేసుకున్న తర్వాత కర్రెరా సరికొత్త ఉత్పత్తులను ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. విభిన్న స్టైల్స్, విభిన్న డిజైన్స్‌లో అందరినీ ఆకట్టుకనేలా కళ్లజోళ్లు, గాగుల్స్‌ను కర్రెరా తీసుకువస్తుందన్నారు. చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అల్బెర్టో మక్కియని మాట్లాడతూ ఇండియాలో 2025 మే నుంచి మూడు ఆప్టికల్ ఫ్రేమ్స్‌ను, మూడు కొత్త సన్ గ్లాస్‌లను పరిచయం చేయడం జరిగిందన్నారు.

తెలుగులో కొరియన్, స్పానిష్

నేర్చుకునేందుకు వీలుగా..

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ అంతర్జాతీయ మొబైల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ డ్యుయోలింగో అతిపెద్ద కంటెంట్ విస్తరణలో భాగంగా డ్యుయోలింగో నగరానికి చెందిన అభ్యాసకుల కోసం 28 కొత్త కోర్సులను ప్రారంభించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా స్పానిష్, ఫ్రెంచ్, కొరియన్, జపనీస్, జర్మన్ వంటి ప్రపంచ భాషలను నేరుగా హిందీ, బెంగాలీ, తమిళం తెలుగు భాషలలో నేర్చుకునే అవకాశం వస్తుందని, అంతేకాకుండా సంస్కృతులను తెలుసుకోవడానికి, కెరీర్ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి వీలు కల్పిస్తుందని వివరించారు.

ఎర్ర రక్త కణాలలో ఉండే హిమోగ్లోబిన్‌ను శరీరం తగినంతగా ఉత్పత్తి చేయకపోతే వచ్చే వ్యాధే తలసేమియా.. రక్తంలోని ఆక్సిజన్‌ను శరీరంలోని అన్ని భాగాలకు తీసుకువెళ్లడంలో హిమోగ్లోబిన్ కీలక పాత్ర పోషిస్తుంది. తలసేమియా పుట్టుకతో వచ్చే దీర్ఘకాలిక వ్యాధి. దీనికి జీవిత కాలం పర్యవేక్షణ అవసరం. ఈ వ్యాధి సోకిన చిన్నారుల అవస్థలు వర్ణనాతీతం. వీరు రెండు నుంచి నాలుగు వారాలకు ఒకసారి రక్తం ఎక్కించుకోకపోతే ప్రాణాలు పోయే పరిస్థితి. ఇలాంటి చిన్నారుల దీనస్థితి చూసిన ఓ పసి హృదయం చలించింది. వారికి ఏదో విధంగా సేవ చేయాలనే తపన అతడిని వెంటాడింది. ఈ ప్రయత్నంలోనే భాగంగా నగరానికి చెందిన 15 ఏళ్ల సమర్థ్ లాంబా 'హెచ్‌బీ కేర్' అనే సంస్థను ప్రారంభించి స్ఫూర్తిగా నిలిచాడు. తన వయస్సుకి మించి సామాజిక బాధ్యతను గుర్తించి, తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పిస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. నేడు ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా కథనం.. – సాక్షి, సిటీబ్యూరో



సమర్థవంతంగా..

తలసేమియా వ్యాధిగ్రస్తుల సేవలో 15 ఏళ్ల బాలుడు

సాధారణంగా 15 ఏళ్ల వయసులో చిన్నారులు చదువు, ఆటలు వంటి వాటిలోనే బిజీగా ఉంటారు. అయితే.. సమర్థ్ చిన్నతనంలోనే తలసేమియా బాధితుల జీవితాలు, వారి కష్టాలను తెలుసుకున్నాడు. వారి కోసం ఏదైనా చేయాలన్న తపనతో హెచ్‌బీ కేర్ అనే సంస్థను స్థాపించి, ఈ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే కాకుండా, రక్తదానం, ముందస్తు పరీక్షల అవసరాన్ని వివరించడంలో కూడా తనదైన పాత్ర పోషిస్తున్నాడు.

సేవల కోసం విరాళాల సేకరణ

2023లో ప్రారంభించిన హెచ్‌బీ కేర్ సంస్థ ద్వారా సమర్థ్ ఇప్పటి వరకు రూ.7.5 లక్షల నిధులను సమీకరించాడు. ప్రజల నుంచి విరాళాల ద్వారా రూ.2.5 లక్షలు, సీఎస్ఆర్ ఫండ్‌లో భాగంగా కొన్ని కంపెనీల నుంచి మరో రూ.5 లక్షలు వచ్చాయి. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం స్పందించాలని సోషల్ మీడియా వేదికగా 7 వేల మందికి పైగా సందేశాన్ని చేరవేశాడు.

వారధిగా 'బ్లడ్ బ్రిడ్జ్' యాప్

నగరంలో ఐదు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి, వందలాది మందిని చైతన్యవంతులుగా మార్చాడు. భద్రుక కాలేజ్, ఎమ్‌జీబీటీ, కేబీఆర్ పార్క్ వంటి ప్రదేశాల్లో నిర్వహించిన క్యాంపులకు స్పందన లభించింది. తొలి క్యాంప్‌లోనే 40 మందిని రక్తదాతలుగా మార్చాడు. 'బ్లడ్ బ్రిడ్జ్' వంటి యాప్ ఆధారిత సేవలపై అవగాహన కల్పించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని సేవా కార్యకలాపాల్లో వినియోగిస్తున్నాడు. సమర్థ్ సేవలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. అమెరికాలోని యూసీ బెర్కిలీ విశ్వవిద్యాలయంలోని సుటార్డియా సెంటర్ వద్ద ప్రదర్శించే అవకాశం పొందాడు.

ఇతర నగరాలకు విస్తరించాలి



భవిష్యత్తులో కంప్యూటర్ సైన్స్, సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ రంగాల్లో ప్రయాణం చేయాలనుంది. హెచ్‌బీ కేర్‌ను ఇతర నగరాలకు విస్తరించాలనే ప్రణాళికలు ఉన్నాయి. అవగాహనతో ముందస్తు పరీక్షలు నిర్వహిస్తే తలసేమియా వంటి వ్యాధులను పూర్తిగా నియంత్రించవచ్చు. దీనిపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రతి యువకుడు వలంటీర్‌గా మారాలి. ప్రతి రక్తదాన శిబిరం ఒక జీవితాన్ని కాపాడుతుంది.

– సమర్థ్ లాంబా

హెచ్‌బీ కేర్ సంస్థ స్థాపించి వారికి అండగా..

అమెరికా యూసీ బెర్కిలీ విశ్వవిద్యాలయంలో అవగాహన

నేడు తలసేమియా దినోత్సవం సందర్భంగా కథనం





పాప్ గాయకులకు నివాళిగా..

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ పాప్ గాయకులకు నివాళిగా ఒక ప్రత్యేక సంగీత సందడిని నగరంలో నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్‌లోని హార్డ్ రాక్ కేఫ్‌లో నిర్వహించే ట్రిబ్యూట్ టూ పాప్ దివస్ కార్యక్రమంలో ప్రముఖ డీజే వ్యాస్ పాల్గొని పాప్ స్వరాలను వినిపించనున్నారు. ఈ నెల 11వ తేదీన రాత్రి 8.30 గంటల నుంచి ఈ మ్యూజిక్ షో 2 గంటల పాటు కొనసాగుతుంది.

కామెడీ కార్నివాల్

సాక్షి, సిటీబ్యూరో: ఆద్యంతం నవ్వులు కురిపించే హాస్య భరిత కార్యక్రమం కామెడీ కార్నివాల్ సికింద్రాబాద్‌లో జరగనుంది. సినీనటులుగా పేరొందిన రోహిత్ స్వైన్, మాయాంక్ పరేఖ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆహుతులకు వినోదాన్ని పంచనున్నారు. మౌలాలిలో ఉన్న ఏఎమ్ ఆర్ ప్లానెట్ మాల్‌లో సాయంత్రం 6.30గంటల నుంచి 1.30గంటల పాటు కార్యక్రమం కొనసాగుతుంది.





ఫ్రైడే.. మ్యూజిక్ డే..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని సంగీతాభిమానుల్ని అలరించేందుకు ఫ్రైడే లైవ్ పేరిట ఓ సంగీత కార్యక్రమం జరగనుంది. కొండాపూర్‌లోని ప్రముఖ కేఫ్ ఆర్టిస్ట్రీ మ్యూజిక్ లవర్స్ కోసం శుక్రవారం ఈ ఫ్రైడే లైవ్ అందిస్తోంది. ప్రముఖ సంగీత కళాకారులు పాల్గొనే ఈ కార్యక్రమం రాత్రి 8 గంటల నుంచి 5గంటల పాటు కొనసాగుతుంది.



'ఏకత్వంలో నిర్భీతి... ఎల్లలెరుగని బలం': సచిన్

సరిహద్దుల్లో తీవ్రవాదులను తుదముట్టించేందుకు భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై క్రీడాలోకం హర్షం వ్యక్తం చేసింది. తాజా ఘటనపై పలువురు క్రీడాకారులు స్పందిస్తూ మన దేశ ఘనతను కీర్తించారు. 'ఏకత్వంలో నిర్భీతి. ఎల్లలెరుగని బలం. మన ప్రజలే మన దేశానికి బలం. మనమంతా ఒక్కటే. ప్రపంచంలో తీవ్రవాదానికి చోటు లేదు. జైహింద్' అంటూ భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ వ్యాఖ్యానించాడు. పేసర్ షమీ, మాజీ క్రికెటర్లు సెహ్వాగ్, రైనా, ఇర్ఫాన్ పఠాన్, శిఖర్ ధావన్ కూడా ఇదే తరహాలో స్పందించారు. 'మీపై ఎవరైనా రాళ్లు విసిరితే మీరు పూలు విసరండి. అయితే అది పూలకుండీతో సహా విసరండి' అని సెహ్వాగ్ ట్వీట్ చేయగా, 'ప్రతికూల పరిస్థితులను కూడా భారత సైన్యం తమకు అనుకూలంగా మార్చుకొని విజయం సాధించింది. ప్రమాదకర సమయంలో వారి ధైర్యాన్ని చూసి గర్విస్తున్నాం' అని షమీ స్పందించాడు. బాక్సింగ్‌లో ఒలింపిక్ పతక విజేత విజేందర్ సింగ్ 'భారత్ మాతాకీ జై' అని ట్వీట్ చేయగా... పఠాన్, సైనా నెహ్వాల్ 'జైహింద్' అంటూ మద్దతు పలికారు. 'మన సైనికులు కేవలం భయపెట్టడంతో ఆగిపోరు. వారు ఏదైనా చేసి చూపిస్తారు' అని బాక్సర్ నిఖత్ జరీన్ పేర్కొంది. మన సైనికుల భద్రత గురించి తాను ప్రార్థన చేస్తున్నట్లు ఒలింపియన్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ వెల్లడించింది.



టెస్టు క్రికెట్‌కు రోహిత్ గుడ్‌బై

రిటైర్మెంట్ ప్రకటించిన భారత కెప్టెన్ ● వన్డేల్లో కొనసాగుతానని స్పష్టీకరణ

4 జనవరి, 2025: 'బ్యాటింగ్‌లో పరుగులు సాధించలేకపోతున్నాను. జట్టు ప్రయోజనాల కోసం ఈ మ్యాచ్‌లో ఆడరాదని నేనే నిర్ణయం తీసుకున్నా. నేను టెస్టుల నుంచి తప్పుకోవడం లేదు. ఇది నా రిటైర్మెంట్ ప్రకటన కాదు'... ఆస్ట్రేలియాతో సిడ్నీ టెస్టు సమయంలో రోహిత్ శర్మ చెప్పిన మాట ఇది.

7 మే, 2025: 'నేను టెస్టు క్రికెట్ నుంచి తప్పుకుంటున్న విషయాన్ని మీతో పంచుకుంటున్నాను. సాంప్రదాయ ఫార్మాట్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వకారణం. అండగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు. ఇకపై వన్డేల్లో మాత్రం కొనసాగుతాను'... టెస్టుల్లో తాను రిటైర్ అవుతున్నట్లు రోహిత్ ప్రకటన.

న్యూఢిల్లీ: దాదాపు నాలుగు నెలల క్రితం రోహిత్ సిడ్నీ టెస్టు నుంచి తనంతట తాను తప్పుకున్నప్పుడే అంతా అతని కెరీర్ ముగిసిందని భావించారు. పేలవమైన ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న అతను వచ్చే జూన్‌లో ఇంగ్లండ్ పర్యటనకు వెళతాడా లేదా అనే సందేహాలు అప్పుడే వినిపించాయి. అయితే క్రికెట్‌లో వేగంగా అంతా మారిపోతుందని, రాబోయే కొన్ని నెలల్లో తాను పరుగులు సాధిస్తానంటూ రిటైర్మెంట్ వార్తలను 38 ఏళ్ల రోహిత్ కొట్టిపారేశాడు. ఇటీవల ఇంగ్లండ్ టూర్ కోసం కుదించిన 30 మంది జాబితాలో అతని పేరు కూడా ఉందని తేలడంతో ఇంగ్లండ్‌కు వెళ్లడం ఖాయమనిపించింది. అయితే ఇప్పుడు అతని రిటైర్మెంట్ ప్రకటన వచ్చింది. మరికొద్ది రోజుల్లో ఇంగ్లండ్‌తో సిరీస్ కోసం భారత జట్టును ప్రకటించనున్న నేపథ్యంలో తన టెస్టు కెరీర్ గురించి ఉన్న సందేహాలపై స్పష్టత వచ్చేలా అతను నిర్ణయం తీసుకున్నాడు. గత ఏడాది టి20 వరల్డ్ కప్‌లో సారథిగా భారత్‌ను విజేతగా నిలిపిన అనంతరం ఆ ఫార్మాట్ నుంచి తప్పుకున్న రోహిత్ ఇప్పుడు టెస్టులకు దూరమయ్యాడు. ఇకపై తనకు బాగా కలిసొచ్చిన, ఇష్టమైన వన్డే ఫార్మాట్‌లో మాత్రం కొనసాగనున్నాడు.

కారణాలు స్పష్టం...

రోహిత్ శర్మపై నిర్ణయానికి సంబంధించి మంగళవారం సెలక్టర్లు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. చాంపియన్స్ ట్రోఫీలో జట్టును గెలిపించడంతో రోహిత్‌కు నాయకుడిగా తిరుగు లేదు. అయితే వన్డే ఫామ్‌ను టెస్టులకు అన్వయించరాదని సెలక్టర్లు భావించారు. ముందుగా అతని కెప్టెన్సీపై చర్చ జరిగింది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చూస్తే మరొకరికి నాయకత్వ బాధ్యతలు ఇవ్వడం మేలని అనుకున్నారు. కెప్టెన్‌గా కాదంటే బ్యాటర్ కోణంలో చూస్తే టెస్టుల్లో అతని ఫామ్ చాలా పేలవంగా ఉంది. సిడ్నీ తరహాలోనే తుది జట్టులో స్థానం దక్కడం కూడా కష్టం. ఇలాంటప్పుడు విఫల బ్యాటర్‌ను కెప్టెన్ కాబట్టి తుది జట్టులోకి తీసుకోవడంలో అర్థం లేదని భావించిన సెలక్టర్లు రోహిత్‌కు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో సిరీస్ నుంచి రోహిత్ బ్యాటింగ్ వైఫల్యం కొనసాగింది. 2 టెస్టుల్లో కలిపి 42 రన్స్ చేసిన అతను... న్యూజిలాండ్‌పై 3 టెస్టుల్లో కలిపి కేవలం 91 పరుగులు చేయడమే కాకుండా చరిత్రలో తొలిసారి కివీస్ చేతిలో భారత్ 0–3తో సిరీస్ కోల్పోయింది. ఆపై ఆసీస్‌తో తొలి టెస్టు ఆడని రోహిత్ తర్వాతి 3 టెస్టుల్లో కలిపి 31 పరుగులే చేశాడు. పేలవ ఫామ్‌తో చివరి టెస్టు నుంచి తనే తప్పుకున్నాడు.

రోహిత్ టెస్టు కెరీర్ గణాంకాలు

ఆడిన టెస్టులు: 67	ఆడిన ఇన్నింగ్స్: 116	
చేసిన పరుగులు: 4301	సగటు: 40.57	
అత్యధిక స్కోరు: 212	సెంచరీలు: 12	
అర్ధ సెంచరీలు: 18	ఫోర్లు: 473	సిక్స్‌లు: 88
పట్టిన క్యాచ్‌లు: 88	తీసిన వికెట్లు: 2	

అప్పుడప్పుడు కొన్ని 'హిట్స్'

వన్డేల్లో రోహిత్ శర్మ పేరిట అసాధారణ రికార్డులు ఉన్నాయి... టి20ల్లో రెండు వరల్డ్ కప్ విజయాల్లో భాగం... కెప్టెన్‌గా రెండు ఐసీసీ టోర్నీలు నెగ్గిన ఘనత... కానీ వీటితో పోలిస్తే అతని టెస్టు కెరీర్ అంత ఘనంగా కనిపించదు. అక్కడక్కడ కొన్ని గుర్తుంచుకునే ప్రదర్శనలు వచ్చినా ఈ ఫార్మాట్‌లో రోహిత్ ఎప్పుడూ తనదైన ముద్ర వేయలేకపోయాడు. సరిగ్గా చెప్పాలంటే అతని టెస్టు కెరీర్ ఎప్పుడూ నిలకడ లేకుండా పడుతూ లేస్తూనే సాగింది. SENA (దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లో కలిపి 25 టెస్టులు ఆడినా ఒకే ఒక శతకం ఉండటం అతని కెరీర్‌లో ఒక వైఫల్యం. అయితే ఈ విషయంలో అతను ఎప్పుడూ నిరాశ చెందలేదు. తనకు తెలిసిన ఆటను, తనదైన శైలిలోనే ఆడుకుంటూ పోయాడు తప్ప కొత్తగా 'అత్యుత్తమ టెస్టు క్రికెటర్' అనిపించుకోవాలనే తాపత్రయం, పట్టుదలను కనబర్చలేదు. టెస్టుల్లో మిడిలార్డర్ బ్యాటర్‌గా, ఆపై ఓపెనర్‌గా రెండు పార్శ్వాల్లో అతని కెరీర్ సాగింది.

ఘనారంభం...

2010లో నాగపూర్‌లో దక్షిణాఫ్రికా టెస్టు... వీవీఎస్ లక్ష్మణ్ గాయం నుంచి కోలుకోకపోవడంతో రోహిత్‌కు తుది జట్టులో అవకాశం దక్కింది. అయితే మ్యాచ్ ఆరంభానికి కొద్దిసేపు ముందు వామప్‌లో భాగంగా ఫుట్‌బాల్ ఆడుతూ గాయపడటంతో మ్యాచ్ ఆడలేకపోయాడు. ఆ తర్వాత మరో మూడున్నరేళ్ల పాటు టెస్టు అవకాశం కోసం వేచి చూడాల్సి వచ్చింది. 2013లో వెస్టిండీస్‌తో ఆడిన తొలి రెండు టెస్టుల్లో 177, 111 నాటౌట్ స్కోర్లతో తన రాకను ఘనంగా చాటాడు. అయితే ఆ తర్వాత ఆటలో పదును లోపించడంతో వైఫల్యాలు ఎదురయ్యాయి. అప్పుడప్పుడు అనూహ్యంగా వచ్చిన అవకాశాలను కూడా వాడుకోలేకపోయాడు. తర్వాతి ఐదేళ్లలో 23 టెస్టులు ఆడితే ఒకే ఒక సెంచరీ సాధించాడు! బౌన్సీ పిచ్‌లపై అతని అవసరం ఉందంటూ సెలక్టర్లు ఆస్ట్రేలియాలో రెండు టెస్టులు ఆడించగా ఒక అర్ధ సెంచరీ చేశాడు.

ఓపెనర్‌గా చెలరేగి...

వన్డేల్లో ఓపెనర్‌గా సూపర్ సక్సెస్ అయిన రోహిత్‌ను టెస్టుల్లోనూ ఓపెనర్‌గా ప్రయత్నించవచ్చని కోచ్ రవిశాస్త్రి చేసిన సూచన రోహిత్ కెరీర్‌ను మార్చింది. తన అమ్మ ఊరు విశాఖపట్నంలో దక్షిణాఫ్రికాపై ఓపెనర్‌గా ఆడిన తొలి టెస్టు రెండు ఇన్నింగ్స్‌లలో 176, 127 పరుగులు చేసి కొత్త రోహిత్ పరిచయమయ్యాడు. అదే సిరీస్‌లో చేసిన 212 పరుగులు అతని కెరీర్‌లో ఏకైక డబుల్ సెంచరీ. ఓపెనర్‌గానే 43 టెస్టుల్లో 2697 పరుగులు సాధించిన అతను 9 శతకాలు నమోదు చేసి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టాడు.

ఓవల్‌లో సత్తా చాటి...

చెన్నైలో స్పిన్‌తో గింగిరాలు తిరుగుతున్న పిచ్‌పై 161 (ఇంగ్లండ్‌పై) స్వదేశంలో అతని చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్. అయితే రోహిత్ కెరీర్‌లో హైలైట్‌గా నిలిచిన ఇన్నింగ్స్‌లో 2021 ఓవల్ మైదానంలో వచ్చింది. ఇంగ్లండ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో 99 పరుగుల ఆధిక్యం కోల్పోయిన తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో పోరాడుతూ అతను చేసిన 127 పరుగులు జట్టును గెలిపించాయి. భారత్‌కు 24 టెస్టుల్లో రోహిత్ కెప్టెన్‌గా వ్యవహరించగా జట్టు 12 మ్యాచ్‌లు గెలిచి 9 ఓడింది. 2023 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో టీమిండియాను ఫైనల్ చేర్చడం అతని నాయకత్వంలో అత్యుత్తమ ప్రదర్శన.

\- సాక్షి క్రీడా విభాగం



కోల్‌కతాకు చెన్నై ఝలక్

2 వికెట్లతో సూపర్ కింగ్స్ విజయం



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నూర్ అహ్మద్

కోల్‌కతా: ఐపీఎల్ 'ప్లే ఆఫ్స్' రేసు నుంచి ఇప్పటికే నిష్క్రమించిన చెన్నై సూపర్ కింగ్స్ కీలక పోరులో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ అవకాశాలపై దెబ్బ కొట్టింది. ఈడెన్ గార్డెన్స్‌లో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో చెన్నై 2 వికెట్ల తేడాతో నైట్‌రైడర్స్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కోల్‌కతా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. అజింక్య రహానే (33 బంతుల్లో 48; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆండ్రీ రసెల్ (21 బంతుల్లో 38; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), మనీశ్ పాండే (28 బంతుల్లో 36 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) రాణించగా...నూర్ అహ్మద్‌కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం చెన్నై 19.4 ఓవర్లలో 8 వికెట్లకు 183 పరుగులు సాధించింది. డెవాల్డ్ బ్రెవిస్ (25 బంతుల్లో 52; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేయగా...శివమ్ దూబే (40 బంతుల్లో 45; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడిన ఉర్విల్ పటేల్ (11 బంతుల్లో 31; 1 ఫోర్, 4 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించారు. పవర్‌ప్లేలోపే సగం వికెట్లు కోల్పోయి 60/5 వద్ద నిలిచిన చెన్నై ఓటమి ఇక లాంఛనమే అనిపించింది. కానీ బ్రెవిస్, దూబే పోరాడంతో పాటు చివర్లో ధోని (17 నాటౌట్) పట్టుదలగా నిలబడటంతో గెలుపు సాధ్యమైంది. తాజా ఫలితంతో కోల్‌కతా 'ప్లే ఆఫ్స్'కు వెళ్లడం దాదాపు అసాధ్యంగా మారింది. మిగిలిన 2 మ్యాచ్‌లలో గెలిచి గరిష్టంగా 15 పాయింట్లకు చేరినా ముందుకెళ్లడం కష్టమే. సాంకేతికంగా రేసులో ఉన్నా... ఈసారి కథ ముగిసినట్లే!

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	11	8	3	0	16	0.793
బెంగళూరు	11	8	3	0	16	0.482
పంజాబ్	11	7	3	1	15	0.376
ముంబై	12	7	5	0	14	1.156
ఢిల్లీ	11	6	4	1	13	0.362
కోల్‌కతా	12	5	6	1	11	0.193
లక్నో	11	5	6	0	10	-0.469
హైదరాబాద్	11	3	7	1	7	-1.192
రాజస్తాన్	12	3	9	0	6	-0.718
చెన్నై	12	3	9	0	6	-0.992

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ × ఢిల్లీ
వేదిక: ధర్మశాల

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

- 'శత'క్కొట్టిన జెమీమా... ఫైనల్లో భారత్
- రెండు స్వర్ణాలపై భారత ఆర్చరీ జట్ల గురి
- పంజాబ్-ముంబై మ్యాచ్ వేదిక మార్పు!

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



● ఆమిర్ ఖాన్ స్వగృహంలో అల్లు అర్జున్...

ఆమిర్ ఖాన్... అల్లు అర్జున్... ఓ సినిమా?

అల్లు అర్జున్, ఆమిర్ ఖాన్ ఒకే సినిమాలో నటించనున్నారనే విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇందుకు కారణం లేకపోలేదు. ఇటీవల ముంబైలోని ఆమిర్ ఖాన్ నివాసానికి వెళ్లారు అల్లు అర్జున్. దీంతో అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో ఆమిర్ ఖాన్ నటించనున్నారనే ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. మరోవైపు ఇంకో వార్త కూడా ప్రచారంలో ఉంది. అదేంటంటే... కొంతకాలంగా 'మహాభారతం' సినిమా స్క్రిప్ట్‌పై వర్క్ చేయిస్తున్నారు ఆమిర్ ఖాన్. త్వరలో ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకుని వెళ్లాలనుకుంటున్నారట. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రను అల్లు అర్జున్‌తో చేయించాలని ఆమిర్ భావిస్తున్నారని టాక్. ఇందు కోసమే.. అల్లు అర్జున్‌తో ఆమిర్ ఖాన్ మాట్లాడారనే టాక్ వినిపిస్తోంది. మరి... నిజమేంటో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

ఆ మార్పుకి సిద్ధంగా ఉన్నాను


\- శ్రీవిష్ణు



''కార్తీక్ రాజుగారు చెప్పిన 'సింగిల్' కథ బాగా నచ్చింది. కథ విన్నప్పుడు మంచి వినోదాత్మక చిత్రం అవుతుందనే నమ్మకం కలిగింది. ఫైనల్‌గా సినిమా చూసుకున్న తర్వాత చాలా పెద్ద వినోదాత్మక చిత్రం అవుతుందనిపించింది. సినిమా ఆరంభం నుంచి చివరి వరకూ ప్రేక్షకులను నవ్వించాలనే తీశాం'' అని హీరో శ్రీవిష్ణు చెప్పారు. కార్తీక్ రాజు దర్శకత్వంలో శ్రీవిష్ణు హీరోగా, కేతికా శర్మ, ఇవానా హీరోయిన్లుగా, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్ర పోషించిన చిత్రం 'సింగిల్'. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు విలేకరులతో పంచుకున్న విశేషాలు.

● 'సింగిల్' అందమైన ప్రేమకథ. స్టోరీ, స్క్రీన్‌ప్లే కొత్తగా ఉంటాయి. ఇంటర్వెల్, పతాక సన్నివేశాలు సరికొత్తగా ఉంటాయి. అన్ని సన్నివేశాలు కూడా మనల్ని మనం రిలేట్ చేసుకునేలా ఉంటాయి. మా సినిమా నేటి యువతరానికి బాగా కనెక్ట్ అవుతుంది. అలాగే కుటుంబ ప్రేక్షకులు కూడా హ్యాపీగా మా చిత్రం చూడొచ్చు. ● నా గత చిత్రాలతో పోల్చుకుంటే ఈ సినిమాలో ఒక డిఫరెంట్ బాడీ లాంగ్వేజ్‌ని ఆడియన్స్ చూస్తారు. నేను ఎప్పటినుంచో గీతా ఆర్ట్స్‌లో అల్లు అరవింద్‌గారితో ఓ సినిమా చేయాలనుకున్నాను. అదృష్టం కొద్దీ 'సింగిల్'తో కుదిరింది. ● నేను ఇండస్ట్రీకి వచ్చి పదహారేళ్లవుతోంది. ఇన్నేళ్లలో ప్రేక్షకులకు బోర్ కొట్టించని సినిమాలే చేశానని భావిస్తున్నాను. ప్రతి పాత్రలో బెస్ట్ ఇచ్చుకుంటూ వెళ్తున్నాను. రానున్న రోజుల్లో నెక్స్ట్ జనరేషన్ కిడ్స్ రాబోతున్నారు. వారికి తగ్గట్టు సినిమాలు చేయాలి... మారాలి. ఆ మార్పుకి సిద్ధంగా ఉన్నాను. నా గత చిత్రం 'స్వాగ్' ఓ ప్రయోగం. ఈ సినిమాకి మంచి పేరొచ్చింది కానీ, డబ్బులు రాలేదు. సినిమా బాగా ఆడినా, ఆడకున్నా కొత్త ప్రయోగాలు మానకూడదన్నది నా అభిప్రాయం. ప్రస్తుతం 'మృత్యుంజయ' అనే థ్రిల్లర్ సినిమా చేస్తున్నాను. ఆ తర్వాత ఒక కుటుంబ కథా చిత్రం, అలాగే అడవి నేపథ్యంలో ఒక సినిమా ఉంటుంది.

వెండితెరపైకి అహల్యా బాయి హోల్కర్ జీవితం




● అహల్యా బాయి

మరాఠీ రాణి, ధీర వనిత అహల్యా బాయి హోల్కర్ జీవితం వెండితెరపైకి రానుంది. అహల్యా బాయి హోల్కర్ 300వ జయంతి ఉత్సవాలు ఆమె జన్మస్థలం జామ్‌ఖేడ్ తహసీల్‌లో జరిగాయి. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆమె బయోపిక్‌ను అధికారికంగా ప్రకటించారు. ''మరాఠీతో పాటు ఇతర భాషల్లోనూ ఈ బయోపిక్ రూపొందనుంది. మహారాష్ట్ర ఫిల్మ్, థియేటర్ అండ్ కల్చరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, గుర్గావ్ ఫిల్మ్ సిటీ ఈ బయోపిక్ నిర్మాణ బాధ్యతలు నిర్వర్తిస్తాయి'' అని తెలిపారు దేవేంద్ర ఫడ్నవీస్. ప్రభుత్వం తరఫున ఈ సినిమాని నిర్మించనున్నారు కాబట్టి ఆయన స్వయంగా ప్రకటించారు. ఇక 1725 మే 31న అహల్యా బాయి హోల్కర్ జన్మించారు. భర్త ఖండేరావు హోల్కర్, మామ మల్హర్ రావు హోల్కర్ మరణించిన తర్వాత మాల్వా రాజ్యపు రాణిగా ఆమె సింహాసనాన్ని అధిష్ఠించారు. ఆ కాలంలో జరిగిన యుద్ధాల్లో సైన్యానికి నాయకత్వం వహించారు. దోపిడీ దారులను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అంతేకాదు... ఎన్నో హిందూ దేవాలయాలు, ధర్మశాలలను నిర్మించి పేరు, ప్రఖ్యాతులు గడించారామె.

వినోదం... సందేశం

అజయ్, ఇంద్రజ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సీఎం పెళ్లాం'. గడ్డం రమణారెడ్డి దర్శకత్వంలో బొల్లా రామకృష్ణా రెడ్డి (బీఆర్‌కే) నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో గడ్డం రమణారెడ్డి మాట్లాడుతూ– ''గెలిచిన ఎమ్మెల్యే... సీఎం అవుతాడు. ఎలక్షన్లు రాగానే ఎమ్మెల్యేగా పోటీ చేసే వ్యక్తే కాకుండా, ఆయన సతీమణి కూడా ఓట్లు అడగడం తెలిసిందే. కానీ గెలిచాక ఎంతమంది ఇళ్ల దగ్గరకు వచ్చి ఓటర్లను కలుస్తున్నారు? అనే ప్రశ్నను ఈ సినిమాతో అడుగుతున్నా. ఎంటర్‌టైన్‌మెంట్ యాంగిల్‌లో మెసేజ్ ఇవ్వబోతున్నాను'' అన్నారు. ''ఈ సినిమా బౌండ్‌స్క్రిప్ట్‌తో రమణారెడ్డిగారు నా దగ్గరకు రావడం ఇంప్రెస్ చేసింది. పైగా ఈ కథ మహిళా సాధికారతపై ఉండటంతో ఒప్పుకున్నాను'' అని చెప్పారు అజయ్. ''ఈ సినిమా చూశాక, ప్రజల్లో మార్పొస్తుందనుకుంటున్నా'' అని నమ్మకం వ్యక్తం చేశారు నిర్మాత రామకృష్ణ. ''సీఎం భార్య బయటకొస్తే ప్రజలకు ఎలా సేవ చేస్తారనేది మా చిత్రకథ'' అన్నారు నటుడు శ్రీనివాస్.



● అజయ్

ఆరుగురి ప్రయాణమే ఈ సినిమా

\- బషీర్ ఆలూరి



''తెలుగులో 'సమరం', కన్నడంలో ఓ సినిమా చేశాను. నా మూడో సినిమా '6 జర్నీ'. ఆరుగురి జీవిత ప్రయాణమే ఈ చిత్రం. గోవా ట్రిప్‌ను ఎంజాయ్ చేసి, ఆత్మహత్య చేసుకోవాలనుకునే ఓ బ్యాచ్ కథే '6 జర్నీ'' అని డైరెక్టర్ బషీర్ ఆలూరి అన్నారు. రవిప్రకాశ్ రెడ్డి, సమీర్ దత్త, టేస్టీ తేజ, పల్లవి, రమ్యా రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '6 జర్నీ'. పాల్యం శేషమ్మ, బసిరెడ్డి సమర్పణలో పాల్యం రవిప్రకాశ్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు బషీర్ ఆలూరి మాట్లాడుతూ– ''టెర్రరిజం, దేశభక్తి వంటి అంశాలు మా '6 జర్నీ'లో ఉంటాయి. శ్రీరాముడు పుట్టిన నేల మీద ఉగ్రవాదులు దాడి చేయడం ఏంటి? యువత ఎలా పోరాడాలి? అంటూ దేశ భక్తిని రేకెత్తించేలా ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా క్లైమాక్స్‌ను తెరకెక్కించాను. మంచి కథాంశంతో తీసిన '6 జర్నీ' అందర్నీ ఆకట్టుకుంటుంది. ఇక ముంబై నేపథ్యంలో ఓ సినిమా చేయబోతున్నాను. అక్టోబర్‌లో షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చెప్పారు.

ట్రైలర్ చూశాక ఈర్ష్య కలిగింది

\- ప్రియదర్శి



● ప్రియదర్శి, రాజ్ రాచకొండ, చంద్రబోస్

''రాజ్‌గారు '23' సినిమా చేయమని నా దగ్గరికి వచ్చారు. వేరే ప్రాజెక్ట్స్ వల్ల చేయడం కుదరలేదు. ఈ కథ నాకు తెలుసు కాబట్టి చెబుతున్నా... గొప్ప సినిమా ఇది. రాజుగారు లాంటి డైరెక్టర్, ప్రొడ్యూసర్ ఉండడం తెలుగు సినిమా అదృష్టంగా భావిస్తున్నా. ఈ చిత్రం ట్రైలర్ చూశాక నేను చేసుంటే బాగుండేదనే చిన్న ఈర్ష్య కలిగింది. ఇలాంటి సినిమాని తప్పకుండా ప్రేక్షకులు చూడాలి'' అని హీరో ప్రియదర్శి కోరారు. తేజ, తన్మయి ప్రధాన పాత్రల్లో 'మల్లేశం' మూవీ ఫేమ్ రాజ్ ఆర్. దర్శకత్వం వహించిన చిత్రం '23'. స్టూడియో 99పై రూపొందిన ఈ చిత్రానికి వెంకట్ సిద్ధారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమాని స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేస్తోంది. ఈ నెల 16న ఈ చిత్రం రిలీజ్ కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన '23' ట్రైలర్ విడుదల వేడుకకి ప్రియదర్శి, పాటల రచయిత చంద్రబోస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చంద్రబోస్ మాట్లాడుతూ– ''రాజ్‌గారు నిజాయితీ ఉన్న డైరెక్టర్. ఈ సినిమాలో మూడు మంచి పాటలు రాసే అవకాశం దొరికింది. 'మల్లేశం' ప్రియదర్శికి నటుడిగా ఎలా జన్మనిచ్చిందో అలా '23' నటీనటులందరికీ కొత్త జన్మ ఇవ్వాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''చిన్న సినిమాల్లో మాది చాలా పెద్ద సినిమా. థియేటర్స్‌లోనే చూడండి. అప్పుడే థియేటర్స్ సంస్కృతి బాగుంటుంది. మా '23'లాంటి సినిమాలను ప్రభుత్వాలు కూడా ప్రోత్సహించాలని వినతి చేశాను'' అని రాజ్ రాచకొండ తెలిపారు. ఈ వేడుకలో నటీనటులు తన్మయి, తేజ, పవన్ రమేశ్, ప్రణీత్ మాట్లాడారు.

ఆపరేషన్ సిందూర్‌పై ప్రముఖుల హర్షం

కశ్మీర్‌లోని పహల్గాం బైసరన్ లోయలో ఇటీవల జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ దాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ దీటైన సమాధానం ఇచ్చింది. మంగళవారం అర్ధరాత్రి పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై భారత ఆర్మీ మెరుపు దాడులు చేసింది. ఈ 'ఆపరేషన్ సిందూర్'పై సెలబ్రిటీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారత ఆర్మీ వెంట మేమున్నాం, భారత్ మాతా కీ జై, ఆపరేషన్ సిందూర్ అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. కొందరి ప్రముఖుల స్పందన ఈ విధంగా...

జై హింద్... ఆపరేషన్ సిందూర్. – చిరంజీవి

పోరాటం ఇప్పుడే ప్రారంభమైంది. లక్ష్యం పూర్తయ్యే వరకూ ఆగదు. దేశం మొత్తం మీతో ఉంది... జైహింద్. – రజనీకాంత్

సాయుధ దళాలు ఒక్కటైన వేళ గర్వంగా ఉంది. భారత ప్రభుత్వం తీసుకున్న వ్యూహాత్మక సైనిక చర్యను అభినందిస్తున్నాను. – కమల్‌హాసన్

మేం సిందూరాన్ని సంప్రదాయ తిలకంగా మాత్రమే కాదు... మా అచంచలమైన సంకల్పానికి చిహ్నంగా కూడా ఉపయోగిస్తాం. మాకు ఎన్ని సవాళ్లు ఎదురైనా నిర్భయంగా, గతం కంటే బలంగా వస్తాం. భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, బీఎస్ఎఫ్‌లోని ప్రతీ ధైర్యవంతుడికి వందనాలు. మీ అందరి ధైర్యం మా గర్వాన్ని మరింత పెంచుతోంది. మిమ్మల్ని చూసి దేశమంతా గర్విస్తోంది.. జైహింద్. – మోహన్‌లాల్

రియల్ హీరోలకు సెల్యూట్. దేశం కోసం ఇండియన్ ఆర్మీ ఏం చేయగలదో 'ఆపరేషన్ సిందూర్'తో మరోసారి రుజువైంది. దేశం గర్వపడేలా చేశారు. జైహింద్. – మమ్ముట్టి

ఎన్నో రోజుల నిశ్శబ్దం తర్వాత 'ఆపరేషన్ సిందూర్' భారతదేశం మొత్తంలో స్ఫూర్తిని నింపింది. త్రివిధ దళాల ధైర్యం, ఆపరేషన్‌కు నాయకత్వం వహించి సైన్యానికి అండగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీగారికి ధన్యవాదాలు. మేమంతా మీతోనే ఉన్నాం. – పవన్ కల్యాణ్

తగిన న్యాయం జరిగింది. మేరా భారత్ మహాన్. సైనికులకు సెల్యూట్. – మహేశ్‌బాబు

మన ఆర్మీ క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నా... జైహింద్. – ఎన్టీఆర్

న్యాయం జరిగింది... జైహింద్. – అల్లు అర్జున్

జైహింద్... ఆపరేషన్ సిందూర్. – నాని

పహల్గాం ఉగ్రదాడికి సమాధానం 'ఆపరేషన్ సిందూర్'... జైహింద్. – కల్యాణ్‌రామ్

ప్రజల భద్రత కోసం ప్రార్థనలు చేద్దాం. ఉగ్రవాదం, దాడులు అనే పదాలు లేకుండా ప్రజలు ప్రశాంతమైన జీవితాలను గడిపే రోజు కోసం ఎదురు చూస్తున్నాను. ప్రశాంతంగా, సుసంపన్నంగా జీవిద్దాం. జై హింద్. – విజయ్ దేవరకొండ

ప్రస్తుతం ప్రతి కదలిక పైనా దృష్టి పెట్టాలి. అన్నిటినీ నిశితంగా పరిశీలించాలి. – విశ్వక్ సేన్

ఉగ్రవాదాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో మాత్రమే భారత్ చర్యలు చేపట్టింది. పాకిస్థాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదు. మన దేశం లక్ష్యాలను నిర్దేశించుకోవడంలో సంయమనం పాటించింది. 26 మందిని దారుణంగా చంపినందుకు మాత్రమే ఈ చర్యలు జరిపింది. మేం నిబద్ధతకు కట్టుబడి ఉంటాం. – ప్రకాశ్‌రాజ్

భారత్ మాతా కీ జై.. న్యాయం జరిగింది. – ఖుష్బూ

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	106	80,747
నిఫ్టీ ▲	35	24,414

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	17,622	▽	268
డోజోన్స్	41,130	▲	301
ఎఫ్‌టీఎస్ఈ 100	8,559	▽	38
డాక్స్	23,116	▽	114
షాంఘై	3,343	▲	27
నికాయ్	36,779	▽	51

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.26	85.28
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	111.70	114.56
€	యూరో	ఎస్‌బీఐ	94.80	97.48
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.45	59.99
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.87	56.06
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.32	68.03
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.72	23.23
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.20	23.99
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.86	12.69

పీఎన్‌బీ లాభం హైజంప్

- క్యూ4లో రూ. 4,567 కోట్లు
- షేరుకి రూ. 2.9 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 52 శాతం జంప్‌చేసి రూ. 4,567 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 3,010 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 32,361 కోట్ల నుంచి రూ. 36,705 కోట్లకు ఎగసింది. వాటాదారులకు బ్యాంక్ బోర్డు షేరుకి రూ. 2.9 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా.. నికర వడ్డీ ఆదాయం(ఎన్‌ఐఐ) మాత్రం రూ. 10,363 కోట్ల నుంచి రూ. 10,757 కోట్లకు స్వల్పంగా బలపడింది. రూ. 4,926 కోట్ల రికవరీలు నమోదుకాగా.. ట్రెజరీ ఆదాయం రూ. 1,157 కోట్ల నుంచి రూ. 4,314 కోట్లకు భారీగా పెరిగింది. కనీస మూలధన నిష్పత్తి 17 శాతంగా నమోదైంది. 2.93 శాతం నికర వడ్డీ మార్జిన్లు(ఎన్‌ఐఎం) ఆర్జించింది. భూషణ్ స్టీల్‌పై రెండు, మూడు రోజుల్లోగా రుణదాతల కమిటీ నిర్ణయం తీసుకోనున్నట్లు పీఎన్‌బీ ఎండీ, సీఈవో అశోక్ చంద్ర పేర్కొన్నారు. జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు విక్రయించే దివాలా పరిష్కారాన్ని రద్దు చేసిన సుప్రీం కోర్టు నిర్ణయంపై సమీక్ష కోరే వీలున్నట్లు తెలియజేశారు.

రూ. 8,000 కోట్లపై కన్ను

ఈ ఏడాది(2025–26) బాసెల్–3 బాండ్ల జారీ ద్వారా రూ. 8,000 కోట్ల సమీకరణ ప్రతిపాదనకు బోర్డు అనుమతించినట్లు పీఎన్‌బీ వెల్లడించింది. ఇందుకు వీలుగా టైర్–1, టైర్–2 బాండ్లను జారీ చేయనున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది కొత్తగా 200 బ్రాంచీలను తెరవడంతోపాటు.. 3,000 మంది ఉద్యోగులను రిక్రూట్ చేసుకోనున్నట్లు వెల్లడించింది. 2.8–2.9% స్థాయిలో ఎన్‌ఐఎం కొనసాగించగలమని అంచనా వేసింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బ్యాంక్ నికర లాభం రెట్టింపై రూ. 16,630 కోట్లను తాకింది. 2023–24లో ఇది రూ. 8,245 కోట్లు మాత్రమే. మొత్తం ఆదాయం రూ. 1,20,285 కోట్ల నుంచి రూ. 1,38,070 కోట్లకు బలపడింది. స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 5.73% నుంచి 3.95 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.73 శాతం నుంచి 0.4 శాతానికి దిగివచ్చాయి.

ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.5% నీరసించి రూ. 94 వద్ద ముగిసింది.

బ్రిటన్ ఎఫ్‌టీఏతో వస్త్ర పరిశ్రమకు బూస్ట్..

- ఇతర దేశాలతో పోటీపడొచ్చు
- ఎగుమతిదారుల ఆశాభావం



న్యూఢిల్లీ: బ్రిటన్‌తో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో (ఎఫ్‌టీఏ) కార్మిక శక్తి ఎక్కువగా ఉండే వస్త్రాలు, లెదర్ తదితర దేశీ పరిశ్రమలకు తోడ్పాటు లభిస్తుందని ఎగుమతిదారులు ఆశాభావం వ్యక్తం చేశారు. బ్రిటీష్ మార్కెట్లో బంగ్లాదేశ్, వియత్నాంలాంటి దేశాలతో మనం కూడా పోటీపడేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ఈ ఎఫ్‌టీఏతో చాలా మటుకు భారతీయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు గణనీయంగా తగ్గడమో లేదా పూర్తిగా తొలగించడమో జరుగుతుంది కాబట్టి మనకు ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. నియంత్రణ ప్రక్రియలను క్రమబద్ధీకరించడంతో బ్రిటన్‌లో జనరిక్ ఔషధాలకు అనుమతులు వేగవంతం కాగలవని ఎగుమతి సంస్థల సమాఖ్య ఎఫ్‌ఐఈవో ప్రెసిడెంట్ ఎస్‌సీ రాల్హన్ తెలిపారు. చేనేతకారులు, తయారీదారులు, ఎగుమతిదారులకు కొత్త అవకాశాలు లభిస్తాయని, వాణిజ్య అవరోధాలు తొలగిపోతాయని, ప్రీమియం మార్కెట్ అందుబాటులోకి వస్తుందని అపారెల్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఏఈపీసీ) వైస్ చైర్మన్ ఎ. శక్తివేల్ వివరించారు. అంతర్జాతీయ వ్యవస్థకు భారత్‌ను మరింతగా అనుసంధానం చేసేందుకు, విశ్వసనీయ తయారీ భాగస్వామిగా అంతర్జాతీయంగా భారత్ స్థానాన్ని పటిష్టం చేసేందుకు ఇలాంటి ఒప్పందాలు కీలకమని రేమండ్ గ్రూప్ చైర్మన్ గౌతమ్ సింఘానియా తెలిపారు.

బంగారం మళ్లీ లక్ష పైకి

రూ.1,000 పెరుగుదల



న్యూఢిల్లీ: పసిడి మరోసారి రూ.లక్ష మార్క్‌పైకి చేరింది. ఇటీవలే మొదటిసారి రూ.లక్ష దాటిన తర్వాత అమ్మకాల ఒత్తిడితో పుత్తడి ఆ స్థాయిని కోల్పోయింది. తాజా పరిణామాల నేపథ్యంలో బంగారానికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా 99.9 శాతం స్వచ్ఛత బంగారం బుధవారం ఢిల్లీ మార్కెట్లో రూ.1,000 పెరిగి రూ.1,00,750 స్థాయిని చేరుకుంది. పాకిస్తాన్–భారత్ మధ్య ఉద్రిక్తతలతో కొనుగోళ్లకు డిమాండ్ ఏర్పడినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం 10 గ్రాములకు రూ.1,050 పెరిగి రూ.1,00,350 స్థాయికి చేరింది. ఏప్రిల్ 22న పసిడి రూ.1,01,600 ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిని నమోదు చేయడం గుర్తుండే ఉంటుంది. మరోవైపు వెండి కిలోకి రూ.440 పెరిగి రూ.98,940 స్థాయిని సమీపించింది. అంతర్జాతీయ మార్కెట్లో భిన్నమైన పరిస్థితి కనిపించింది. బంగారం 25 డాలర్ల నష్టంతో 3,397 డాలర్ల వద్ద ఉంది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల నిర్ణయాలకు ముందు అంతర్జాతీయంగా ఇన్వెస్టర్లు వేచి చూసే ధోరణిని అనుసరించినట్టు తెలుస్తోంది. 'వాణిజ్య చర్చల్లో పురోగతిపై ఆశలతో మళ్లీ రిస్కీ ఆస్తులవైపు మార్కెట్లు మొగ్గు చూపుతున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికీ మధ్య ప్రాచ్యం, రష్యా–ఉక్రెయిన్, భారత్–పాక్ ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇలాంటి అనిశ్చితుల్లో సురక్షిత సాధనంగా బంగారానికి డిమాండ్ కొనసాగుతుంది' అని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా పేర్కొన్నారు.

యుద్ధ భయాలు బేఖాతరు

ముంబై: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' దాడుల నేపథ్యంలో దేశీ స్టాక్ మార్కెట్ బుధవారం స్వల్ప లాభాలతో ముగిసింది. యుద్ధ భయాలతో

సూచీలకు స్వల్ప లాభాలు

ఉదయం భారీ నష్టాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్‌లో క్రమంగా కోలుకున్నాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే 704 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్ చివరికి 106 పాయింట్ల లాభంతో 80,747 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 35 పాయింట్లు బలపడి 24,414 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 24,220 వద్ద కనిష్టాన్ని, 24,414 వద్ద గరిష్టాన్ని తాకింది. ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల



మద్దతు లభించింది. అమెరికాతో చైనా వాణిజ్య చర్చలు సఫలం అవ్వొచ్చనే అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.

- బీఎస్‌ఈలో రంగాల వారీగా సూచీల్లో ఆటో 1.74%, కన్జూమర్ డిస్క్రెషనరీ 1.21%, మెటల్ 1.91%, రియల్టీ 1.21%, కన్జూమర్ డ్యూరబుల్స్, విద్యుత్, ఫైనాన్స్ సూచీలు ఒకశాతం పెరిగాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1.36 శాతం, 1.16 శాతం చొప్పున లాభపడ్డాయి.
- మార్చి క్వార్టర్‌లో నికర నష్టం తగ్గినట్లు ప్రకటించడంతో పేటీఎం షేరుకు డిమాండ్ లభించింది. 7% పెరిగి రూ.874 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 9.5% ఎగసి రూ.893 వద్ద గరిష్టాన్ని తాకింది.

పాక్ మార్కెట్ కుదేల్

భారత సైన్యం ప్రతీకార దాడులతో పాకిస్తాన్ స్టాక్ మార్కెట్ కుదేలయింది. పాక్ బెంచ్‌మార్క్ సూచీ 'కరాచీ100' ఏకంగా 6,561 పాయింట్లు(6%) క్షీణతతో 107,007 వద్ద ముగిసింది. భారీ క్షీణతతో మొదలవడంతో ఎక్స్ఛేంజీ తక్షణమే ట్రేడింగ్‌ను నిలిపివేసింది. తిరిగి ట్రేడింగ్ మొదలైన తర్వాత కొంత రికవరీ అయ్యింది.

దేశీయ కరెన్సీకి సెగ

42 పైసలు డౌన్



ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైన్యం పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులతో దేశీయ కరెన్సీ ఒత్తిడికి లోనైంది. డాలర్ మారకంలో రూపాయి విలువ 42 పైసలు బలహీనపడి 84.77 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 84.93 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. 'ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య సమావేశ వివరాల వెల్లడికి ముందు అప్రమత్తత, క్రూడాయిల్ ధరలు పుంజుకోవడం, పాక్–భారత్‌ల మధ్య యుద్ధ ఉద్రిక్తత రూపాయి నెలరోజుల్లో అతిపెద్ద పతనాన్ని చవిచూసింది' అని ఫారెక్స్ నిపుణులు తెలిపారు.

మార్చిలో జియో జోరు

కొత్తగా 21 లక్షల మొబైల్ యూజర్లు



న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం రిలయన్స్ జియో వైర్‌లెస్ యూజర్ల సంఖ్య మార్చిలో మరో 21.74 లక్షలు పెరిగి 46.97 కోట్లకు ఎగిసింది. భారతి ఎయిర్‌టెల్ కొత్త కనెక్షన్లు 12.5 లక్షల మేర పెరగడంతో మొత్తం సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 38.98 కోట్లకు చేరింది. వొడాఫోన్ ఐడియా మొబైల్ యూజర్ల సంఖ్య 5.41 లక్షలు తగ్గి 20.53 కోట్లకు పరిమితమైంది. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ విడుదల చేసిన గణాంకాల్లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. వీటి ప్రకారం దేశీయంగా మొత్తం వైర్‌లెస్ (మొబైల్, 5జీ, ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్) యూజర్ల సంఖ్య ఫిబ్రవరిలో 116.03 కోట్లుగా ఉండగా మార్చి ఆఖరు నాటికి 116.37 కోట్లకు చేరింది. పట్టణ ప్రాంతాల్లో వైర్‌లెస్ సబ్‌స్క్రిప్షన్ 63.4 కోట్ల నుంచి 63.25 కోట్లకు తగ్గింది.

కోల్ ఇండియా లాభం అప్

- క్యూ4లో రూ. 9,604 కోట్లు
- షేరుకి రూ. 5.15 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ మైనింగ్ దిగ్గజం కోల్ ఇండియా గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 12 శాతం ఎగసి రూ. 9,604 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 8,572 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 40,458 కోట్ల నుంచి రూ. 41,762 కోట్లకు మెరుగుపడింది. నిర్వహణ లాభం(ఇబిటా) 11 శాతం పుంజుకుని రూ. 12,873 కోట్లను దాటింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 5.15 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కోల్ ఇండియా నికర లాభం రూ. 37,402 కోట్ల నుంచి రూ. 35,358 కోట్లకు క్షీణించింది. మొత్తం ఆదాయం దాదాపు యథాతథంగా రూ. 1,52,358 కోట్లుగా నమోదైంది. 2023–24లో రూ. 1,52,731 కోట్ల టర్నోవర్ ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో కోల్ ఇండియా షేరు 1.5% బలపడి రూ. 383 వద్ద ముగిసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐపీ ముంబైలో పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫైడ్ కోర్సులు

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ) దేశవ్యాప్తంగా ఉన్న ఐఐపీ క్యాంపస్‌లలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫైడ్ ప్యాకేజింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

- » బీఎస్సీ ప్యాకేజింగ్ టెక్నాలజీ, ఎంఎస్ ప్యాకేజింగ్ టెక్నాలజీ,పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్(పీజీడీపీ),సర్టిఫైడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్(సీపీఈసీ),డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ (డీపీసీ),ఇంటెన్సివ్ ట్రైనింగ్ కోర్సు(ఐటీసీ).
- » **అర్హత:** కోర్సును అనుసరించి ఇంటర్మీడియట్, డిగ్రీ(ఫిజిక్స్, కెమిస్ట్రీ–మ్యాథమేటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఉండాలి), బీఈ, బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** 31.05.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది. సీపీఈసీ కోర్సుకు వయోపరిమితి లేదు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.06.2025.
- » **ప్రవేశ పరీక్ష తేది:** 22.06.2025
- » **వెబ్‌సైట్:** https://www.iip-in.com

సీపీఆర్‌ఐ, బెంగళూరులో 44 పోస్టులు

బెంగళూరులోని సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీపీఆర్‌ఐ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 44.
- » **పోస్టుల వివరాలు:** సైంటిఫిక్ అసిస్టెంట్–04, ఇంజనీరింగ్ అసిస్టెంట్–08, టెక్నీషియన్ గ్రూప్ 1–06, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్–01, అసిస్టెంట్ గ్రేడ్2–23, అసిస్టెంట్ లైబ్రేరియన్–02.
- » **వయసు:** సైంటిఫిక్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు, టెక్నీషియన్‌కు 28 ఏళ్లు, ఇతర పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.05.2025.
- » **వెబ్‌సైట్:** https://cpri.res.in

నిక్‌మార్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్(నిక్‌మార్)–2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫుల్ టైం, పార్ట్ టైం పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) డొమైన్స్:** సస్టైనబుల్ అండ్ గ్రీన్ కన్‌స్ట్రక్షన్, కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్, ఎన్విరాన్‌మెంటల్ అండ్ వాటర్ రీసోర్సెస్, సోషల్ అండ్ ఎకనామిక్ డైమెన్షన్స్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్.
- » **కోర్సు వ్యవధి:** ఫుల్ టైం పీహెచ్‌డీ మూడు నుంచి ఆరేళ్లు, పార్ట్‌టైం పీహెచ్‌డీ మూడున్నరేళ్ల నుంచి ఆరేళ్లు.
- » **అర్హత:** మాస్టర్స్ డిగ్రీ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ, ఎంఫిల్ ఉత్తీర్ణులవ్వాలి.
- » **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఎన్‌యూసీఎస్ పీహెచ్‌డీ అడ్మిషన్ టెస్ట్(ఎన్‌ప్యాట్), గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.06.2025.
- » **హాల్‌టికెట్‌ల డౌన్‌లోడ్ తేది:** 10.06.2025.
- » **ఎన్‌యూసీఎస్ పీహెచ్‌డీ అడ్మిషన్ టెస్ట్ తేది:** 15.06.2025.
- » **ఫలితాల విడుదల తేది:** 16.06.2025.
- » **ఇంటర్వ్యూ తేదీలు:** 24.06.2025, 25.06.2025.
- » **వెబ్‌సైట్:** www.nicmar.ac.in

చేస్తారా.. సమ్మర్ ఇంటర్న్‌షిప్!

ఇంటర్న్‌షిప్.. టెక్నికల్, ట్రెడిషనల్, ప్రొఫెషనల్.. ఏ కోర్సుల విద్యార్థులకైనా తప్పనిసరిగా మారింది. ఇంటర్న్‌షిప్ చేస్తే.. జాబ్ మార్కెట్‌లో అవకాశాలు అందుకోవడంలో ముందజలో నిలిచే అవకాశం ఉంటుంది. అందుకే ఇంజనీరింగ్ నుంచి డిగ్రీ కోర్సుల విద్యార్థుల వరకూ.. ఇంటర్న్‌షిప్ అవకాశాల కోసం అన్వేషణ సాగిస్తున్నారు. ముఖ్యంగా వేసవి సెలవుల్లో ఎక్కువ మంది సమ్మర్ ఇంటర్న్‌షిప్ చేసేందుకు ప్రయత్నిస్తారు. ఈ నేపథ్యంలో.. ఇంటర్న్‌షిప్‌తో ప్రయోజనాలు, అవకాశాలు అందుకోవడం ఎలా.. ఇంటర్న్ ట్రైనీల ఎంపిక తదితర వివరాలు..



» క్షేత్ర నైపుణ్యాలకు కేరాఫ్ ఇంటర్న్‌షిప్స్

» జాబ్ మార్కెట్‌లో ముందంజలో ఇంటర్న్‌ట్రైనీలు

అకడమిక్ స్థాయిలోనే తమ చదువుకుతగ్గ రంగాల్లో క్షేత్ర నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. తమ అకడమిక్స్‌కు సంబంధించిన విభాగాల్లో తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా ప్రస్తుత వేసవి సెలవుల్లో సమయం వృథా చేసుకోకుండా ఇంటర్న్‌షిప్స్ పూర్తిచేయడం ద్వారా ప్రాక్టికల్ నైపుణ్యాలు మెరుగుపరచుకోవచ్చు. తద్వారా జాబ్ మార్కెట్లో ముందంజలో నిలవడమేకాకుండా.. భవిష్యత్తులో కెరీర్లో మెరుగ్గా రాణించేందుకు అవకాశం ఉంటుంది.

నైపుణ్యాలు భవిష్యత్తుకు బాట

విద్యార్థులు అప్పటి వరకు తాము అకడమిక్‌గా నేర్చుకున్న అంశాలను వాస్తవ పరిస్థితుల్లో అన్వయించే విధానంగా ఇంటర్న్‌షిప్‌ను పేర్కొనొచ్చు. ఇది ఆయా కోర్సులు చదువుతున్న సమయంలోనే క్షేత్ర నైపుణ్యాలు పొందేందుకు మార్గం. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా విద్యార్థులు కొద్దిరోజుల పాటు ఏదైనా ఒక సంస్థలో వాస్తవ పని వాతావరణంలో విధులు నిర్వర్తిస్తారు. దీనివల్ల విద్యార్థులకు సదరు పరిశ్రమలోని తాజా పరిస్థితులపై అవగాహనతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలూ సొంతమవుతాయి.

పెరుగుతున్న ప్రాధాన్యం

ఇంటర్న్‌షిప్‌ను అకడమిక్ స్థాయిలో అమలుచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇంజనీరింగ్ విద్యలో ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం–బీటెక్ ప్రోగ్రామ్‌లో చేరిన ప్రతి ఒక్కరూ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ల తర్వాత తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్ చేయాలి. ప్రతిసారీ రెండు నెలలు, మొత్తంగా కోర్సు వ్యవధిలో ఆరు వందల నుంచి ఏడు వందల గంటల వ్యవధిలో ఇంటర్న్‌షిప్ పూర్తిచేయాలి. ఈ ఇంటర్న్‌షిప్స్‌కు క్రెడిట్స్ సైతం కేటాయించారు. ప్రతి 40–45 గంటల వ్యవధికి ఒక క్రెడిట్ చొప్పున మొత్తం 14 నుంచి 20 క్రెడిట్స్‌ను ఇవ్వనున్నారు. అదే విధంగా ఐఐఎంలు, ఐఐటీలతోపాటు పలు సెంట్రల్ యూనివర్సిటీలు కూడా తమ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరిచేశాయి.విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఇప్పించేందుకు ఇండస్ట్రీ వర్గాలతో ఒప్పందాలు కూడా చేసుకుంటున్నాయి.

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్

యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్‌ను తెచ్చింది. 24 ఏళ్లలోపు వయసుండి.. ఎలాంటి పని అనుభవం లేని విద్యార్థులు టాప్–500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసేలా ఈ పథకాన్ని రూపొందించింది. ఇంటర్న్ ట్రైనీగా నియమితులైన వారికి నెలకు రూ.5 వేల స్టయిఫండ్‌ను కూడా అందిస్తారు. ఈ అవకాశాన్ని అందుకోవాలంటే.. అభ్యర్థులు పీఎం ఇంటర్న్‌షిప్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఐఐఎంలు, ఐఐటీల్లో ప్రత్యేక ప్రక్రియ

దేశంలో ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్ ఐఐటీలు, ఐఐఎంలు తమ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. ప్రముఖ కంపెనీలు ఏటా ఆయా క్యాంపస్‌లను సందర్శించి బీటెక్ మూడో సంవత్సరం,ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్, ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ పేరుతో ఇంటర్న్‌షిప్ అందుకునే అవకాశం కల్పిస్తున్నాయి. ఇలా సంస్థల్లో ఎంపికైన వారిని ఇంటర్న్ ట్రైనీగా వ్యవహరిస్తున్నారు. వీరు ఆరు నుంచి ఎనిమిది వారాల వ్యవధిలో ఆయా కార్పొరేట్ కంపెనీల్లో ఇంటర్న్ ట్రైనీగా వాస్తవ పని వాతావరణంలో విధులు నిర్వర్తిస్తారు. ఫలితంగా విద్యార్థులకు క్షేత్ర నైపుణ్యాలపై అవగాహనతోపాటు ఆయా రంగాల్లో అనుభవజ్ఞులైన నిపుణులతో కలిసి పని చేసి నైపుణ్యాలు పెంచుకునే అవకాశం లభిస్తోంది. ఇంటర్న్ ట్రైనీగా ఎంపికైన వారికి సంస్థలు స్టయిఫండ్ పేరుతో ఆర్థిక ప్రోత్సహకాన్ని సైతం అందిస్తున్నాయి.

ద్వితీయ శ్రేణి ఇన్‌స్టిట్యూట్స్

ద్వితీయ శ్రేణి ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులు ఇంటర్న్‌షిప్ అవకాశాలు అందుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి ప్రధాన కారణం.. ఆయా ఇన్‌స్టిట్యూట్‌లకు ఇండస్ట్రీ వర్గాలతో పరిచయాలు లేకపోవడమే. దీనికి పరిష్కారంగా సదరు ఇన్‌స్టిట్యూట్స్‌లోని విద్యార్థులు.. ఇప్పటికే ఉద్యోగాల్లో స్థిరపడిన తమ సీనియర్లు, క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు, ప్రొఫెసర్ల సహకారంతో ఇంటర్న్‌షిప్ అవకాశాల కోసం అన్వేషణ సాగించడం మేలు చేస్తుంది.

స్వీయ అన్వేషణే మార్గం

ఇన్‌స్టిట్యూట్ నుంచి సహకారం లభించని పరిస్థితుల్లో విద్యార్థులే ఇంటర్న్‌షిప్ దిశగా స్వీయ అన్వేషణ సాగించాలి. ఇందుకోసం ఇప్పుడు ఎన్నో మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా ఏఐసీటీఈ కంపెనీలకు, విద్యార్థులకు అనుసంధానంగా నిలుస్తోంది. ఇంటర్న్‌శాల అనే సంస్థతో ఏఐసీటీఈ ఒప్పందం కుదుర్చుకుంది. విద్యార్థులు ఈ ఇంటర్న్‌శాల వెబ్‌సైట్‌లో తమ అకడమిక్ వివరాలు, డొమైన్ ఏరియాస్‌ను పేర్కొంటే.. అందుకు సంబంధించిన అవకాశాలు కల్పించే సంస్థల వివరాలు లభ్యమవుతాయి.

సంస్థల వెబ్‌సైట్స్

ఇటీవల కాలంలో అధిక శాతం కంపెనీలు తమ వెబ్‌సైట్‌లో కెరీర్స్/కరెంట్ ఆపర్చునిటీస్ ఆప్షన్‌లో ఇంటర్న్‌షిప్ అవకాశాల వివరాలు పేర్కొంటున్నాయి. వీటికి దరఖాస్తు చేసుకుని ఎంపిక ప్రక్రియలో పాల్గొంటే.. ఇంటర్న్ ట్రైనీగా అవకాశం సొంతం చేసుకోవచ్చు. ఈ ఎంపిక ప్రక్రియలో సంస్థలు అభ్యర్థుల అకడమిక్ నైపుణ్యాలతోపాటు ప్రాక్టికల్, అనలిటికల్ స్కిల్స్ వంటివి పరిశీలించే విధంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టెస్టులు నిర్వహిస్తున్నాయి.

జాబ్ సెర్చ్ పోర్టల్స్

జాబ్ సెర్చ్ పోర్టల్స్ సైతం తమ క్లయింట్ సంస్థల్లోని ఇంటర్న్‌షిప్ అవకాశాల సమాచారాన్ని పొందుపరుస్తున్నాయి. గతంలో కేవలం జాబ్ లిస్టింగ్స్‌కే పరిమితమైన ఈ పోర్టల్స్.. ఇప్పుడు ఇంటర్న్ అవకాశాలను సైతం అందుబాటులోకి తెస్తున్నాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

సోషల్ ప్లాట్‌ఫార్మ్స్

ఇంటర్న్‌షిప్ అందుకోవడంలో ప్రస్తుత పరిస్థితుల్లో లింక్డ్‌ఇన్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ ప్లాట్‌ఫార్మ్స్ దోహదపడుతున్నాయి. విద్యార్థులు సోషల్ నెట్‌వర్కింగ్ సైట్స్ ద్వారా ఆయా రంగాల్లోని నిపుణులకు ఫాలోయర్స్‌గా ఉంటూ.. వారి ద్వారా ఇంటర్న్ ట్రైనీ అవకాశాల గురించి తెలుసుకోవచ్చు.

చక్కటి పనితీరు

ఇంటర్న్‌షిప్ అవకాశం అందుకున్న అభ్యర్థులు చక్కటి పనితీరు కనబరిచేలా వ్యవహరించాలి. తమకు కేటాయించిన విభాగం, విధులకు సంబంధించి టీమ్ సభ్యులతో కలిసి పనిచేసేలా చొరవ చూపాలి. అదే విధంగా తమ విధుల విషయంలో ఏదైనా సందేహం తలెత్తితే.. టీమ్ లీడ్ లేదా ఇతర సీనియర్లను సంప్రదించి సందేహాల్ని నివృత్తి చేసుకోవాలి. ఇంటర్న్‌షిప్ సమయంలో సదరు సంస్థలో ఉద్యోగి మాదిరిగానే అంకితభావంతో పనిచేస్తేనే ఇంటర్న్‌షిప్ ఉద్దేశం నెరవేరుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

శాశ్వత కొలువుకు మార్గం

ఇంటర్న్ ట్రైనీగా ప్రతిభ, మంచి పనితీరు చూపిన వారికి అదే సంస్థల్లో పూర్తి స్థాయి ఉద్యోగం లభించే అవకాశం ఉంటుంది. ఐఐటీలు, ఐఐఎంల నుంచి ఆయా సంస్థల్లో ఇంటర్న్ ట్రైనీగా ఎంపికైన వారిలో 50 శాతం మేరకు.. ఇలా ఇంటర్న్ ట్రైనీ సమయంలో ప్రతిభ చూపి అదే సంస్థలో ఫైనల్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ అందుకుంటున్నారు.

ఇంటర్న్‌షిప్‌తో ప్రయోజనాలివే

- ఇంటర్న్ ట్రైనీగా ఇండస్ట్రీలో విధులు నిర్వహించడం ద్వారా నూతన నైపుణ్యాలు, రియల్ టైమ్ ఎక్స్‌పోజర్ లభిస్తుంది.
- వీటితోపాటు ఇంటర్ పర్సనల్ స్కిల్స్, నెగోషియేషన్ స్కిల్స్, టీం వర్కింగ్ కల్చర్, డెసిషన్ మేకింగ్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు అలవడుతాయి.
- టీమ్ మెంబర్స్, లీడర్స్‌తో చర్చించి తాజా నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవచ్చు.
- సమస్యలకు పరిష్కారం కనుగొనే విధంగా అనలిటికల్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ సొంతమవుతాయి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–ఇంగ్లిష్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–సోషియాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–కంప్యూటర్ అవేర్‌నెస్

బ్యూటీ విత్ ఏ పర్పస్ (ఓ ప్రయోజనంతో కూడిన సౌందర్యం).. హైదరాబాద్‌లో జరగనున్న ప్రపంచ సుందరి పోటీలకు సంబంధించి నిర్వాహకులు పదేపదే చెబుతున్న మాట. ఎక్కడా అందాల పోటీలు అనే మాటే లేదు. 1951లో యూకేలో ఎరిక్ మోర్లే మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభించినప్పుడు కేవలం శరీర సౌందర్యాన్ని ప్రదర్శించటానికే అవి పరిమితమయ్యాయి. ఆ తర్వాత కొన్ని దశాబ్దాలపాటు అదే పంథా కొనసాగగా, ఇప్పుడు పోటీల తీరు సమూలంగా మారిపోయింది. పోటీదారులను అన్నివిధాలా పరిశీలించే, పరీక్షించే విధానం వచ్చింది. ఇక సంస్కృతీ సంప్రదాయాలకు ఎంతో ప్రాధాన్యమిచ్చే మన దేశంలో పోటీలనేసరికి మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతేడాది ముంబైలో నిర్వహించినప్పుడు 'ఒళ్లు'దగ్గర పెట్టుకుని వ్యవహరించారు. ఇప్పుడు హైదరాబాద్‌లో మరిన్ని అదనపు జాగ్రత్తలు తీసుకుంటుండటం విశేషం. 'అందమే'ప్రధాన అంశంగా ఉన్నా.. అది అంతర్లీనంగా మాత్రమే ఉండేలా చూస్తున్నారు. సామాజిక బాధ్యత, మహిళా సాధికారత, వ్యక్తిగత ప్రతిభలే ప్రధాన అంశాలుగా పోటీలకు రూపకల్పన చేశారు.

సాక్షి, హైదరాబాద్

1996

ప్రపంచ సుందరి పోటీలు

వేదిక: బెంగళూరు

'మహిళను అంగడి బొమ్మగా చూపే పోటీలు వద్దు.. మహిళంటే శరీర ప్రదర్శన కాదు..'అంటూ మహిళా సంఘాలు, రైతు సంఘాలు, కొన్ని రాజకీయ పార్టీలు తీవ్రస్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. పోలీసులు అడ్డుకునే సమయంలో కొందరు ఆత్మహత్యకు యత్నించగా ఒకరు చనిపోయారు. ఈ ఘటనలు పోటీలపై పెద్ద దుమారమే రేపాయి. చివరకు భారీ సంఖ్యలో పోలీసు పహారా ఏర్పాటు చేసి పోటీలను నిర్వహించాల్సి వచ్చింది.



స్కిన్ షో నుంచి స్కిల్ షోగా..

2025

ప్రపంచ సుందరి పోటీలు

వేదిక: హైదరాబాద్

అక్కడక్కడా కొన్ని వ్యతిరేక వ్యాఖ్యలు తప్ప, ఎక్కడా నిరసన ప్రదర్శనలు లేవు. పైగా ఈ పోటీలు రాష్ట్రానికి మేలు చేస్తాయన్న భావన వ్యక్తమవుతోంది. అందాల పోటీల నిర్వహణ తీరులో వచ్చినమార్పే... ప్రజల ఆలోచన విధానంలో ఇలాంటి మార్పు తీసుకొచ్చింది. ఆ పోటీలు వద్దే వద్దు అన్న తీరు నుంచి, వాటిని ఓ వేడుకలాగా నిర్వహించే స్థాయికి చేరింది.

పూర్తిగా మారిన మిస్ వరల్డ్ పోటీల తీరు

ఆటల పోటీలు, మేధో మథనం, సామాజిక సేవా ఇతివృత్తానికి ప్రాధాన్యం

హైదరాబాద్‌లో పోటీల సందర్భంగా మరిన్ని జాగ్రత్తలు

సామాజిక సేవలో స్వయంగా మిస్ వరల్డ్ లిమిటెడ్ మమేకం

పలు దేశాల్లో నిరుపేదలకు ఇళ్లు, మురికివాడల్లో స్కూళ్లు తదితర సేవలు

తాజాగా భారత్‌లో సేవా కార్యక్రమాలకు యోచన

స్పోర్ట్స్ చాలెంజ్..

అందం కంటే ఆరోగ్యం ముఖ్యమన్న సంకేతం ఇస్తూ ఈ రౌండ్‌ను డిజైన్ చేశారు. ఆరోగ్యం బాగుండాలంటే శారీరక దృఢత్వం ఉండాలి, అది సమకూరాలంటే ఆటలు ఆడగలగాలి, ఈ ఆటల్లో ముందున్న పోటీదారులు మంచి మార్కులు తమ ఖాతాలో వేసుకుంటారు. ఆటలతో పాటు నాయకత్వ లక్షణమనే మరో కీలక విషయాన్ని ఇందులో ప్రదర్శించాల్సి ఉంటుంది. యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలిని, క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించేందుకు ఇది ప్రేరణగా నిలుస్తుందని మిస్ వరల్డ్ లిమిటెడ్ చెబుతోంది. స్పోర్ట్స్ చాలెంజ్‌లో రన్నింగ్, రిలే రేస్‌లు, ఫిట్‌నెస్ టెస్ట్‌లు ఉంటాయి. మే 17న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ ఫినాలే పోటీలు జరగనున్నాయి.



సామాజిక సేవా కార్యక్రమాలు..

మిస్ వరల్డ్ సంస్థ 'బ్యూటీ విత్ ఏ పర్పస్'ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తోంది. పోటీదారులు తమ దేశాలలో సామాజిక సమస్యలపై తాము చేపట్టిన ప్రాజెక్టులను ప్రదర్శిస్తారు. రొమ్ము క్యాన్సర్‌పై సమాజంలో అవగాహన కల్పించటమే కాకుండా, బాధిత పేద మహిళలకు చికిత్స అందించేందుకు కృషి చేస్తున్న నటుడు సోనూసూద్‌ను పోటీల వేదికపై ఘనంగా సన్మానించేందుకు మిస్‌వరల్డ్ లిమిటెడ్ ఏర్పాట్లు చేస్తోంది.

ఇప్పుడు ప్రతిభకే పట్టం..

బాహ్య సౌందర్యం కంటే అంతర సౌందర్యం ముఖ్యం అనే అంశం జనంలోకి వెళ్లేలా ఇప్పుడు కార్యక్రమాలను డిజైన్ చేశారు. పోటీదారులు సృజనాత్మక, కళాత్మక నైపుణ్యాలను, సంస్కృతి, వారసత్వాన్ని ప్రదర్శించేందుకు వీలుగా ప్రధాన రౌండ్‌ను రూపొందించారు. టాలెంట్ షోలో నృత్యం, గానం, వాయిద్య ప్రదర్శన, నాటకం, కవిత్వం, ఇతర సృజనాత్మక కళలు చేర్చారు. మే 22న శిల్పకళా వేదికలో మిస్ వరల్డ్ టాలెంట్ ఫినాలే నిర్వహిస్తున్నారు. దాదాపు 115 మంది పోటీదారులు వివిధ కళల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తారు. దీనితో పాటు వారి మేధో సంపత్తి, ప్రపంచ విషయాలపై పరిజ్ఞానాన్ని కూడా పరీక్షిస్తారు.

సామాజిక సేవలో మిస్ వరల్డ్ లిమిటెడ్

మహిళల అందాన్ని ఆదాయంగా మార్చుకుంటోందన్న విమర్శను దూరం చేసుకునేందుకు మిస్ వరల్డ్ సంస్థ గట్టిగా కృషి చేస్తోంది. ప్రస్తుతం దానికి చైర్ పర్సన్‌గా ఉన్న 86 ఏళ్ల జూలియా మోర్లే ఈ విషయంలో పట్టుదలగా పనిచేస్తున్నారు. మిస్ వరల్డ్ సంస్థ దాదాపు 100 దేశాలలో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం, యుద్ధ బాధితులకు చేయూత, విపత్తు నివారణ, ఆరోగ్య సంరక్షణ, పిల్లల సంక్షేమం, బాలికా విద్య వంటి అంశాలు వీటిల్లో ఉన్నాయి. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికాలోని పేద దేశాలలో విద్యా కార్యక్రమాలు, ఆరోగ్య సంరక్షణ, శుభ్రమైన నీటి సరఫరా వంటి ప్రాజెక్టులు చేపట్టింది. నైజీరియా, ఘనా, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాలలో సేవలందిస్తోంది.

క్లుప్తంగా...

'మత్తు' కట్టడికి ప్రత్యేక డ్రైవ్

స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను అప్రమత్తం చేసిన ఎక్సైజ్ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణ కోసం ఎక్సైజ్ శాఖ పకడ్బందీగా ముందుకెళ్తోంది. ప్రత్యేక డ్రైవ్‌ల నిర్వహణ ద్వారా గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలను కట్టడి చేసే దిశలో కార్యాచరణ రూపొందిస్తోంది. ఈ మేరకు ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు రాష్ట్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం ఆదేశాలు జారీ చేశారు. యువతకు ప్రాణాంతకంగా మారుతున్న గంజాయి, డ్రగ్స్‌ను పూర్తి స్థాయిలో అరికట్టడంపై దృష్టి సారించాలని ఆయన టాస్క్‌ఫోర్స్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం రాష్ట్ర ఎక్సైజ్ కార్యాలయంలో స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందాలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎస్టీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ బృందాలతో పాటు ఎక్సైజ్ శాఖ యంత్రాంగం సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించాలని సూచించారు. నార్కోటిక్ డ్రగ్స్, గంజాయి, ఆల్ప్రోజోలం, డైజోఫామ్ రవాణా, అమ్మకాలు, వినియోగం, దిగుమతులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎప్పటికప్పుడు కీలక సమాచారాన్ని డీకోడ్ చేసుకుంటూ అన్ని విభాగాలు సమన్వయంతో ముందుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ దాడుల్లో అధికారుల పనితీరును ప్రామాణికంగా తీసుకుంటామని, నియంత్రణ జరిగిన విధానాన్ని అంచనా వేయడం ద్వారా భవిష్యత్తులో ముందుకెళ్తామన్నారు. కాగా, గత ఏడాది కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నేతృత్వంలో జనవరి, జూన్, సెప్టెంబర్ నెలల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు.

ప్రొఫెసర్ బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేయండి

మంత్రి దామోదరకు టీజీజీడీఏ వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక ప్రభుత్వ వైద్య కళాశాలలైన ఉస్మానియా, గాంధీ, కాకతీయ, నిజామాబాద్ మెడికల్ కాలేజీలలో ప్రొఫెసర్ పోస్టుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలకు సంఘం అధ్యక్షుడు బి.నరహరి, సెక్రటరీ జనరల్ లల్లూ ప్రసాద్ రాథోడ్, కోశాధికారి ఖాజా రవూఫుద్దీన్.. బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహను కలి సి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని ప్రముఖ వైద్య సంస్థల్లో సీనియర్ ఫ్యాకల్టీ సభ్యుల కొరత తీవ్రంగా ఉందని, తద్వారా పోస్టు గ్రాడ్యుయేట్ వైద్యసేవలు దెబ్బతింటున్నాయని ఆ వినతిపత్రంలో వెల్లడించారు. ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని, ఖాళీగా ఉన్న పోస్టుల్లో బదిలీలకు అనుమతించాలని విజ్ఞప్తిచేశారు.

విద్యార్థులు కళలపై అభిరుచిని పెంచుకోవాలి

గిరిజన పరిశోధన సంస్థ సంచాలకురాలు సముజ్వల

సాక్షి, హైదరాబాద్: విద్యార్థి దశ నుంచే కళలపై అభిరుచిని పెంచుకోవాలని గిరిజన పరిశోధన సంస్థ సంచాలకురాలు వి.సముజ్వల అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాసాబ్‌ట్యాంక్‌లోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థలో రెండు వారాల పాటు నిర్వహించిన వేసవి శిబిరంలో గిరిజన సంస్కృతి, కళలపై అవగాహన, క్విజ్ నిర్వహించారు. గోండు, కోయ పెయింటింగ్స్, నాయక్‌పోడు మాస్కులు, లంబాడీ ఎంబ్రాయిడరీ, జ్యూయలరీ, కోలామ్ వెదురు కళలపై అవగాహన కల్పించడంతో పాటు వాటి తయారీపై శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. శిబిరానికి హాజరైన విద్యార్థులకు ధ్రువపత్రాలను ఆమె అందించారు. కార్యక్రమంలో సమ్మర్ క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం బరాజ్‌ల పునరుద్ధరణ ఎలా?

సీడబ్ల్యూసీ చైర్మన్‌తో మంత్రి ఉత్తమ్ చర్చలు

మార్గదర్శకాలు సూచించాలని విజ్ఞప్తి

ప్రతిపాదనలతో నివేదిక ఇవ్వాలన్న అతుల్ జైన్

సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరంలో ప్రాజెక్టులో భాగంగా ఉన్న మేడిగడ్డ సహా ఇతర బరాజ్‌ల పునరుద్ధరణ అంశంపై కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అతుల్‌జైన్‌తో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమా ర్ రెడ్డి చర్చలు జరిపారు. వేల కోట్లతో నిర్మించిన బరాజ్‌లను తిరిగి వినియోగంలోకి తేవాలనే దృఢమైన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, సీడబ్ల్యూసీ నిర్దిష్ట మార్గదర్శకాలు సూచిస్తే, వాటికి అనుగుణంగా ముందుకు వెళతామని ఈ సందర్భంగా ఉత్తమ్ వివరించారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో బుధవారం జరిగిన ఈ భేటీలో ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఈఎన్సీ అనిల్‌కుమార్, సీఈలు బస్వరాజు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికపై చర్చించారు. అతుల్ జైన్ మాట్లాడుతూ.. ఈ బరాజ్‌లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను తమకు నివేదిక రూపంలో అందిస్తే, పరిశీలించి తగు మార్గదర్శకాలు సూచిస్తామని హామీ ఇచ్చారు.



సీడబ్ల్యూసీ చైర్మన్ అతుల్ జైన్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నీటి కేటాయింపులు జరపండి: అతుల్ జైన్ పోలవరం ప్రాజెక్టు అథారిటీ చైర్మన్‌గా కూడా కొనసాగుతున్న నేపథ్యంలో.. ఆ ప్రాజెక్టుతో తెలంగాణకు ఉండే ముంపు సమస్యపై సమగ్ర అధ్యయనం చేయించాలని మంత్రి ఉత్తమ్ కోరారు. సమ్మక్క సారక్క ప్రాజెక్టుకు 44 టీఎంసీలు, పాలమూరు–రంగారెడ్డికి అవసరమైన 90 టీఎంసీల నీటిలో మొదటి దశ కింద 45 టీఎంసీల నీటిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

పునరుద్ధరణ మార్గాలు అన్వేషిస్తున్నాం: మంత్రి ఉత్తమ్

- మేడిగడ్డ సహా కాళేశ్వరం మూడు బరాజ్‌లను తిరిగి వినియోగంలోకి తేవడానికి ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఈ భేటీ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోట్ల రూపాయల ప్రజాధనం వృథా కాకూడదన్నదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం, డిజైన్, లొకేషన్, నిర్మాణం, ఓఅండ్ఎం లోపాల వల్లే ప్రాజెక్టుకు భారీ నష్టం వాటిల్లిందని విమర్శించారు. కృష్ణా జలాల్లో సమర్థ నీటి వినియోగం ఉండేలా, అక్రమంగా ఆంధ్రప్రదేశ్ నీటిని మళ్లించకుండా నీటి లెక్కలు పక్కాగా ఉండేలా టెలీమెట్రీ వ్యవస్థను తక్షణమే ఏర్పాటు చేయాలని సీడబ్ల్యూసీ చైర్మన్‌ను కోరినట్లు మంత్రి తెలిపారు.

పల్లె అందాలకు ప్రాచుర్యం

గ్రామీణ పర్యాటకానికి పెద్దపీట వేసేలా రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలు

తెలంగాణ అందాలకు దక్కనున్న ప్రపంచ వ్యాప్త ప్రచారం

సాక్షి, హైదరాబాద్ : మిస్ వరల్డ్ పోటీల వేళ..గ్రామీణ పర్యాటకానికి ప్రాధాన్యం దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఫీల్డ్ టూర్ పేరిట పోటీల్లో పాల్గొనే వారికి ఆయా ప్రాంతాలకు తీసుకెళ్లనుంది. మిస్ వరల్డ్ ఈవెంట్‌ను అద్భుత అవకాశంగా తీసుకొని తెలంగాణ గ్రామీణ సాంస్కృతిక, చారిత్రక, పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మిస్ వరల్డ్ ఈవెంట్‌కు 120 దేశాల ప్రతినిధులు హాజరుకానుండగా, 150కి పైగా దేశాల్లో మిస్ వరల్డ్ పోటీలు ప్రత్యక్ష ప్రసారం అవుతాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలోని గ్రామీణ పర్యాటకాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రమోట్ చేయడం ద్వారా గ్రామీణ ముఖచిత్రాన్ని మార్చేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. వరంగల్, హనుమకొండ, ములుగు, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను ఫోకస్ చేయనున్నారు.

- ఈ నెల 12న ఆధ్యాత్మిక టూరిజానికి చిహ్నంగా ఉన్న నాగార్జునసాగర్ లోని బుద్ధవనం, బుద్దిస్ట్ థీమ్ పార్కును మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శిస్తారు.
- 14న చారిత్రక, ఆధ్యాత్మిక నగరమైన హనుమకొండలోని వెయ్యి స్తంభాల గుడి, వరంగల్ ఖిలాను సందర్శిస్తారు. అదే రోజు యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ములుగు జిల్లాలోని రామప్ప ఆలయాన్ని సందర్శిస్తారు. అక్కడే ఏర్పాటు చేయనున్న పేరిణి నృత్యాన్ని తిలకిస్తారు.
- 15న ఆధ్యాత్మిక టూరిజంలో భాగంగా యాదగిరిగుట్ట ఆలయాన్ని సందర్శిస్తారు. అదే రోజు హ్యాండ్లూమ్ ఎక్స్‌పీరియన్స్‌లో భాగంగా పోచంపల్లిలో చేనేత వస్త్రాల తయారీ, ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకిస్తారు.
- 16న మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రి వృక్షాన్ని సందర్శిస్తారు.
- 21న శిల్పారామంలో తెలంగాణ కళాకారులచే నిర్వహించే ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ వర్క్‌షాప్‌నకు హాజరవుతారు. స్వయంగా వాటి తయారీలో భాగమై ప్రత్యక్షంగా వాటి గురించి తెలుసుకుంటారు.



'నారేటివ్స్ ఆఫ్ ద బెంచ్: ఏ జడ్జ్ స్పీక్స్'పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ బీఆర్ గవాయి. చిత్రంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎన్వీ రమణ

నేటి తరానికి రమణ ఆదర్శం

సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ బీఆర్ గవాయి

ఢిల్లీలోని హైకోర్టులో 'నారేటివ్స్ ఆఫ్ ద బెంచ్: ఏ జడ్జ్ స్పీక్స్'పుస్తకావిష్కరణ

హాజరైన సుప్రీం జడ్జిలు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్

సాక్షి, న్యూఢిల్లీ: రిటైర్డ్ జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ సూర్యకాంత్, తానూ గ్రామీణస్థాయి నుంచి వచ్చిన వారమని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ (కాబోయే చీఫ్ జస్టిస్) బీఆర్ గవాయి అన్నారు. మేం ముగ్గురం వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారమని గుర్తు చేసుకున్నారు. గ్రామీణ స్థాయి నుంచి దేశ అత్యున్నత న్యాయస్థానంలో సేవలు అందించే స్థాయి వరకూ రావడం తమకెంతో ఆనందంగా ఉందని చెప్పారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఎన్వీ రమణ న్యాయవ్యవస్థలో ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని, నేటితరం వారికి ఆదర్శంగా నిలిచారన్నారు. జస్టిస్ ఎన్వీ రమణ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి హోదాలో చేసిన వివిధ ప్రసంగాల సంకలనాన్ని 'నారేటివ్స్ ఆఫ్ ద బెంచ్: ఏ జడ్జ్ స్పీక్స్'పేరుతో పుస్తకంగా రూపొందించగా, ఆవిష్కరణ సభ బుధవారం ఢిల్లీలోని హైకోర్టులో జరిగింది. ముఖ్యఅతిథిగా జస్టిస్ బీఆర్ గవాయి హాజరై, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎన్వీ రమణలతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ గవాయి మాట్లాడుతూ ఎన్వీ రమణతో 2019 నుంచి సాన్నిహిత్యం ఉందని గుర్తు చేసుకున్నారు. వృత్తితో పాటు వ్యక్తిగత విషయాల్లోనూ ఆయన ఎన్నో సలహాలు ఇచ్చేవారని తెలిపారు. ఆయన పదవీ విరమణ రోజు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఎందరో ప్రజలు వచ్చి అభినందనలు తెలపడం ఇప్పటికీ గుర్తు ఉందన్నారు.

- న్యాయపరమైన సలహాలు, తీర్పులు ఇవ్వడంలో ఎన్వీ రమణ సమర్థులని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లు పేర్కొన్నారు.
- ప్రజాకార్యక్రమాల్లో తాను చేసిన ప్రసంగాల ద్వారా పంచుకున్న ఆలోచనల సమాహారమే ఈ పుస్తకమని రిటైర్డ్ జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. న్యాయ వ్యవస్థ కేవలం వివాదాలను నిర్ణయించేది కాదని, రాజ్యాంగ నైతికతకు చిహ్నం అని చెప్పారు. ముంబైలో తానూ, జస్టిస్ బీఆర్ గవాయి కలిసినప్పుడు టీటీడీ గురించి ఓ అరగంట చర్చించుకున్నామని గుర్తు చేసుకున్నారు.

రూపం మార్చుకొనే ప్రొటీన్

మొక్కల్లో ప్రొటీన్ రీఅరేంజ్‌ను గుర్తించిన సీసీఎంబీ శాస్త్రవేత్తలు

వైద్య, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: ఔషధాల పరిశోధన, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకగల ఒక కొత్త విషయాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. మొక్కల్లో ఒక ప్రొటీన్ అవసరానికి అనుగుణంగా తన నిర్మాణాన్ని స్వల్పంగా మార్చుకోవడం ద్వారా బహుళ ఆర్ఎన్ఏ అణువులతో బంధాన్ని ఏర్పరచుకోగలదని హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది జన్యు నియంత్రణలో కీలకపాత్ర పోషిస్తుందని పరిశోధకులు వెల్లడించారు. ఈ అధ్యయనం వివరాలు ఇటీవల అమెరికన్ కెమికల్ సొసైటీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ పరిశోధనలో ఒకే రకమైన రెండు మొక్కల ప్రొటీన్లను పరిశీలించారు. వీటిలో అత్యంత చురుకుగా ఉన్న ప్రొటీన్ విస్తృతంగా ఆర్ఎన్ఏ మాలిక్యూళ్లను గుర్తించి కలిపే పని చేయటాన్ని గుర్తించారు. అంటే, ఆ ప్రొటీన్ తాత్కాలికంగా తన ఆకృతిని మార్చుకొని, అవసరానికి తగ్గట్టుగా 'రీఅరేంజ్' అయి పని చేస్తుందన్నమాట. ఇది కొత్తగా కణాల్లో జరిగే 'జీన్ నియంత్రణ'ప్రక్రియను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. పరిశోధన ప్రధాన రచయిత డాక్టర్ మందర్ వి. దేశ్‌ముఖ్ వివరించారు. ఈ అధ్యయనం మొక్కలలో ఆర్ఎన్ఏ ప్రాసెసింగ్‌ను అర్థం చేసుకోవడానికి కొత్త దిశను చూపిస్తుందని పేర్కొన్నారు. ఈ పరిశోధన ఫలితాలు వైద్య, వ్యవసాయ రంగాల్లో కొత్త మార్గాలు చూపే అవకాశం ఉంది. ప్రత్యేకించి మొక్కలు తమ వద్ద తక్కువ ప్రొటీన్లే ఉన్నా.. వాటిని ఎలా సర్దుబాటు చేసుకొని అధిక పనితీరు సాధిస్తున్నాయో ఈ పరిశోధన ద్వారా అర్థమవుతుందని మందర్ తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
గురువారం । 8-5-2025



మరిపెడలోని గడి ముఖ ద్వారం



ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న మరిపెడ గడి

నాడు గడి.. నేడు బడి

దొరల ఆధిపత్యానికి, రక్షణకు చిహ్నం

కళాశాలకు దానం చేసిన మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి

ప్రస్తుతం చదువుల బడిగా విలసిల్లుతున్న గడి

ఒకప్పుడు తెలంగాణలో సంస్థానాధీశులు, దొరలు విశాలమైన గడీల నుంచి పరిపాలన సాగించారు. ఆ గడీలను అధికార కేంద్రంగా చేసుకుని ప్రజల సమస్యలు విని పరిష్కారం చూపేవారు. తెలంగాణ ప్రాంతంలో ప్రధానంగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు.. గ్రామాల్లో తమ గడీలను కేంద్రంగా చేసుకుని పాలించారు.

-మరిపెడ రూరల్

200 ఏళ్లపాటు గడీల పాలన..

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని గడి కేంద్రంగా సుమారు 200 ఏళ్లపాటు పరిపాలన కొనసాగింది. ఐదెకరాల విశాలమైన స్థలంలో గడిని నిర్మించారు. చుట్టూ 20 అడుగుల ఎత్తు గోడ నిర్మించారు. ఈ గడి కేంద్రంగా మాజీ ఎంపీ ఆర్.సురేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేవారు. వందలాది మంది అనుచరులు, గుమాస్తాల ద్వారా పాలన నడిపించేవారు. అనంతరం చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో గడీల పాలనకు తెరపడింది.

1995 నుంచి ఖాళీగా..

దొరల పాలన ప్రాబల్యం తగ్గిన తర్వాత.. 1995లో మరిపెడ గడిలోని దొరలు పట్టణ కేంద్రాలకు తరలి వెళ్లారు. కొంతకాలంగా కుడితి లక్ష్మారెడ్డి అనే గుమాస్తా.. మరిపెడ గడిని, ఆస్తులను కాపాడుకుంటూ వచ్చారు. కొంతకాలం గడిలో సరస్వతి శిశు మందిర్ పాఠశాలను నడిపించారు. 1997లో మరిపెడకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. భవనం లేకపోవడంతో మరిపెడ దామోదర్‌రెడ్డి హైస్కూల్‌లోని ఒక భవనంలో జూనియర్ కళాశాల కొనసాగిస్తూ వచ్చారు.

కళాశాలకు ధారాదత్తం..

సొంత భవనం లేక ఇరుగ్గా ఉన్న స్కూల్ గదుల్లో కళాశాల కొనసాగుతున్న నేపథ్యంలో.. విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బంది పడ్డారు. కాగా గడి ఖాళీగా ఉందని.. దానిని కళాశాలకు దత్తత ఇస్తే బాగుంటుందని అప్పటి ప్రిన్సిపాల్ విజయ భాస్కర్ గ్రామ పెద్దల దృష్టికి తెచ్చారు. అప్పుడు గడిని రక్షిస్తున్న గ్రామ పెద్ద ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీ ఆర్.సురేందర్‌రెడ్డి ఈ అంశంపై చర్చించారు. వెంటనే దాత సురేందర్‌రెడ్డి.. గడిని ఈ ప్రాంత పేద విద్యార్థుల ప్రయోజనం కోసం కళాశాలకు ధారాదత్తం చేస్తున్నట్లు ప్రకటించారు.

చదువుల ఒడిగా..

గడి ఆవరణలోని భవనంలో కొంతకాలంగా జూనియర్ కళాశాల నిర్వహణ కొనసాగింది. అనంతరం అప్పటి మంత్రి డీఎస్ రెడ్యానాయక్ కృషి ఫలితంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం మంజూరైంది. 2008లో నూతన కళాశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ ప్రాంత విద్యార్థులకు మరిపెడ గడి చదువుల ఒడిగా కొనసాగుతోంది.



గడి ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు

ఆహ్లాదకరంగా కళాశాల



ఐదెకరాల విస్తీర్ణంలోని గడీలో నిర్మించిన భవనం వృక్ష సంపద మధ్య ఆహ్లాదకరంగా ఉంది. విశాలమైన గదులు, అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులతో ప్రైవేటు కళాశాలలకు దీటుగా కొనసాగుతోంది. రూ.కోట్ల విలువైన గడిని పేద విద్యార్థుల శ్రేయస్సు కోసం దానం చేయడం దాత సురేందర్‌రెడ్డి గొప్పతనం.

– వి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, మరిపెడ ప్రభుత్వ జూనియర్ కళాశాల

దేశ భద్రతకు ఏ నిర్ణయం తీసుకున్నా మద్దతు ఇస్తాం

బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్



సాక్షి,హైదరాబాద్: దేశ భద్రత కోసం కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా బీఆర్‌ఎస్ మద్దతు ఇస్తుందని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. గతంలో సర్జికల్ స్ట్రైక్స్‌కు కూడా మద్దతు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. బుధవారం వినోద్ తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్, బీఆర్‌ఎస్ నేత గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌లతో కలసి మీడియాతో మాట్లాడుతూ, దేశ భద్రత అన్నింటికంటే ముఖ్యమని, ఆపరేషన్ సిందూర్‌కు పూర్తిగా మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేయాలని కేంద్రాన్ని కోరారు. కాగా, తెలంగాణలో ఒక్క సైనిక్ స్కూల్ కూడా లేదని, వరంగల్‌కు ఒక స్కూల్ మంజూరు చేసినా అనేక షరతులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో కోరుకొండ, పులివెందుల, కలికిరిలో సైనిక్ స్కూల్స్ ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని గుర్తు చేశారు. బొల్లారంలో సైనిక్ స్కూల్ వస్తుందని చెప్పినా...ఇప్పటివరకు అతీగతిలేదని అన్నారు. ఈ విషయంలో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని, రాష్ట్ర కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

భారత సైన్యం దాడులు భేష్: కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాష్టీకానికి భారత సైన్యం గట్టిగా సమాధానం ఇవ్వడాన్ని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభినందించారు. పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై జరిపిన వైమానిక దాడులను బుధవారం ఒక ప్రకటనలో ఆమె స్వాగతించారు. ఇలాంటి సమయంలో పార్టీలకతీతంగా ఐక్యతను చాటాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భారత సైన్యానికి అండగా నిలబడి వారి ధైర్యాన్ని మెచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.



బారులు.. బతుకులు

వివిధ రంగుల టబ్బులు కదులుతున్నట్లుంది కదూ. పెద్దపల్లి పట్టణ శివారు రంగాపూర్ ఇటుక బట్టీల్లో.. బట్టీ కార్మికులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ పనులు చేస్తున్నారు. రంగుల టబ్బుల్లో ఊక నింపి.. అప్పటికే తయారు చేసిన ఇటుక బట్టీలపైకి వరుస క్రమంలో వెళ్తూ కనిపించారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



మిస్ వరల్డ్ పోటీలు జరగనున్న నేపథ్యంలో సుందరంగా ముస్తాబైన హైదరాబాద్ నగరం

కాలేయ వ్యాధికి మధుమేహ మందుతో చికిత్స

ఆశాజనకంగా ప్రపంచస్థాయి పరిశోధన ఫలితాలు



సాక్షి, హైదరాబాద్: కాలేయ వ్యాధిగ్రస్తులకు ఇప్పటి వరకు సరైన మందు లేదు. కాలేయం చెడిపోతే ట్రాన్స్‌ప్లాంటేషన్ తప్ప సరైన చికిత్స అందుబాటులోకి రాలేదు. దీంతో సరైన మందు లేక తీవ్రంగా బాధపడుతున్న రోగులకు ఊరట కలిగించే శుభవార్తను శాస్త్రవేత్తలు వెల్లడించారు. మధుమేహానికి వినియోగించే 'సెమాగ్లుటైడ్'అనే మందు, ఇప్పుడు లివర్ వ్యాధుల చికిత్సలో కూడా ఉపయోగపడుతుందని లండన్ కింగ్స్ కాలేజ్ శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ మందుతో కాలేయంలోని గాయాలు తగ్గినట్లు గుర్తించారు. ముఖ్యంగా 'మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ అసోసియేటెడ్ స్టియాటో హెపటైటిస్'(సాధారణంగా మాష్ అని పిలుస్తారు) అనే కాలేయ వ్యాధిని నియంత్రించడమే కాకుండా కొంతవరకు తిరిగి సరిచేసే శక్తి కూడా ఈ మందుకు ఉందని తాజా అధ్యయనం వెల్లడైంది.

ప్రపంచవ్యాప్తంగా 37 దేశాల్లో పరిశోధన..

ప్రపంచంలోని 37 దేశాల్లో 800 మందిపై ఈ ఔషధ ప్రయోగం నిర్వహించారు. వారిని రెండు వర్గాలుగా విభజించారు. ఒక వర్గానికి ప్రతి వారం సెమాగ్లుటైడ్ మందును అందించగా, మరొక గ్రూపునకు ప్లాసెబో (నకిలీ మందు) ఇచ్చారు. 72 వారాల పాటు జరిపిన ఈ ప్రయోగం ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి.

- సెమాగ్లుటైడ్ తీసుకున్న వారిలో 63 శాతం మందికి లివర్ మంట తగ్గినట్టు తేలింది. దాదాపు 37 శాతం మందిలో కాలేయంలోని గాయాలు (ఫైబ్రోసిస్) తగ్గినట్టు గుర్తించారు.
- ఇదే సమస్య ప్లాసెబో (నకిలీ మందు) వాడిన వారిలో కేవలం 22 శాతం మందిలో మాత్రమే కనిపించింది. ఈ మందు వాడిన వారు సాధారణంగా బరువు తగ్గినట్టు కూడా తెలిసింది.
- సెమాగ్లుటైడ్ మందు వాడిన వారిలో కొందరికి వాంతులు, జీర్ణ సమస్యలు తలెత్తినప్పటికీ, ఆశాజనక ఫలితాల ముందు ఇవి తక్కువే అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
- ఈ మందును వాడిన కొంతమందికి వాంతులు, మలబద్ధకం, విరోచనాలు వంటి జీర్ణసంబంధిత స మస్యలు ఎదురయ్యాయి. అయితే ఇవి తాత్కాలిక మేనని, దీర్ఘకాల ప్రయోజనాలతో పోల్చితే తక్కు వేనని వైద్య నిపుణులు చెబుతున్నారు.

లివర్ సమస్యలకి కారణాలు అనేకం: అధిక కొవ్వు, మధుమేహం, అధిక రక్తపోటు, శరీరం చురుకుదనం లేకపోవడం వంటి కారణాలతో లివర్‌లో కొవ్వు పేరుకుని కాలేయం పాడవుతుంది. దీన్ని నాన్–ఆల్కహాలిక్ కొవ్వు కాలేయ వ్యాధి అని పిలుస్తారు. ఇది తీవ్రమై 'మాష్'గా మారితే, కాలేయం పూర్తిగా పనిచేయకుండా పోయే ప్రమాదం ఉంది.

- 'ఇలాంటి మందు తయారవడం ద్వారా తీవ్రమైన కాలేయ వ్యాధులకు కొత్త మార్గం ఏర్పడింది. ముఖ్యంగా మధుమేహంతో బాధపడే వారికి ఇది ప్రయోజనకరం'అని పరిశోధనకు నాయకత్వం వహించిన ప్రొఫెసర్ ఫిలిప్ న్యూసమ్ తెలిపారు.





బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మాక్‌డ్రిల్







నడిరోడ్డుమీదే...

కర్నూలులో మందుబాబుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. విచ్చలవిడిగా దొరుకుతుండటంతో వేళాపాళా లేకుండా మందుబాబులు మద్యాన్ని సేవిస్తున్నారు. నగరంలో బుధవారం పట్టపగలే నడిరోడ్డుపైన డివైడర్ వద్ద ఓ వ్యక్తి ఇలా మద్యాన్ని సేవిస్తున్నా...పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం.

– హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



చెట్టు నీడన చదువులు

వేసవి నేపథ్యంలో సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. దీంతో ఎండలు తట్టుకోలేక వృద్ధులు, చంటిపిల్లలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులోని ఓ కళాశాల విద్యార్థులు చెట్ల కింద ఉన్న నీడలో కూర్చొని ఇలా చదువుతున్న దృశ్యాన్ని 'సాక్షి'క్లిక్ మనిపించింది.

– వీరేశ్, సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

క్లుప్తంగా...

మెడికల్ కౌన్సిల్ చైర్మన్‌గా బీజేపీ నాయకుడు శ్రీహరిరావు

సాక్షి, అమరావతి: ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్‌గా డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన బీజేపీ రాయలసీమ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. విజయవాడలోని ఆరోగ్య విశ్వ విద్యాలయం కౌన్సిల్ కార్యాలయంలో శ్రీహరిరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ..వైద్యులు, రోగులకు మధ్య వారధిలా పనిచేస్తానని అన్నారు. నకిలీ పట్టాలతో వైద్య వృత్తిలో ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆర్టీజీఎస్ లాంటి వ్యవస్థలు అవసరం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)లాంటి వ్యవస్థలు అవసరమని స్విట్జర్లాండ్ రాయబారి మాయా టిస్సాఫీ అభిప్రాయపడ్డారు. బుధవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్‌ను టిస్సాఫీ, ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రఖర్ జైన్ ఆర్టీజీఎస్ పనితీరు గురించి వివరించారు. ప్రభుత్వ సేవల కోసం ప్రజలెవ్వరూ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండా వాట్సాప్ ద్వారానే సేవలు పొందే సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు.

ముందు రూ.5 లక్షలు డిపాజిట్ చేయండి

కేఏ పాల్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌ను రూ.5 లక్షలు డిపాజిట్ చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యాజ్యం దాఖలు వెనుక సదుద్దేశం ఉందని నిరూపించుకునేందుకు ఈ మొత్తాన్ని హైకోర్టు రిజిస్ట్రార్ వద్ద డిపాజిట్ చేయాలని స్పష్టం చేసింది. ఆ తరువాతే లోతుగా విచారణ జరుపుతామంది. తదుపరి విచారణను జూన్ 25కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏఈఓల సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి అచ్చెన్న

సాక్షి, అమరావతి: వ్యవసాయ విస్తరణ అధికారు (ఏఈవో)ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. బుధవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఏపీ ఎన్జీవో సంఘ నేతలు వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఏఈవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డి.వేణుమాధవరావు తెలిపారు.

ప్రభుత్వ సలహాదారుగా అశోక్‌కుమార్ జైన్

సాక్షి, అమరావతి: రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి అశోక్‌కుమార్‌జైన్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె.వి జయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఢిల్లీలోని ఏపీ భవన్ నుంచి విధులు నిర్వర్తించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఏడాది పాటు పదవిలో కొనసాగుతారని తెలిపారు.

'అన్నదాతా సుఖీభవ'పై స్పష్టత ఇవ్వాలి

సాక్షి, అమరావతి: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకుండా అన్నదాతా సుఖీభవ ఎలా అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలని ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కాటమయ్య, పి.జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం డిమాండ్ చేశారు. 2015లో టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ రాధాకృష్ణ కమిటీ నివేదిక మేరకు రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలురైతులు ఉంటే, అందులో 10 లక్షల మందికి ఎటువంటి భూమిలేని వివరించారు. ఇప్పుడు కౌలు రైతుల సంఖ్య మరింత పెరిగిందని, వీరికి గుర్తింపు కార్డులు జారీ చేసి భూ యజమానితో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు.

- అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్‌కు చెందిన కిషోర్‌కు ఒక కూతురు. మూడో తరగతి పూర్తి చేసిన ఆ పాపను ఓ కార్పొరేట్ బడిలో చేర్పిద్దామని ఇటీవల అక్కడికి వెళ్లగా నాలుగో తరగతి ఫీజు రూ.62 వేలుగా తేల్చేశారు. మూడో తరగతికి కిషోర్ కట్టిన ఫీజు రూ.36 వేలు, ఏకంగా రెట్టింపు అడగడంతో కంగుతిన్న కిషోర్ కొత్త బడిలో చేర్పిద్దామనే ఆలోచనకు స్వస్తి పలికి పాత పాఠశాలలోనే కొనసాగించాలనే నిర్ణయానికొచ్చారు.
- వాల్మీకిపురం కోనేటికట్టకు చెందిన శ్రీనివాస్ తన మూడేళ్ల కొడుకును ప్లే స్కూల్‌లో చేర్పిద్దామని వెళ్లగా ఏడాదికి ఫీజు రూ.30 వేలు అని చెప్పింది స్కూల్ యాజమాన్యం. వచ్చే విద్యా సంవత్సరం (2025-26)కి ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, ఆలస్యమైతే మరో రూ.5 వేలు ఎక్కువవుతాయని చెప్పగా తొలి దశ కింద రూ.10వేలు కట్టి అడ్మిషన్ ఖాయం చేసుకున్నారు.
- కురబలకోట మండలం అంగళ్లకు చెందిన శశివర్ధన్,శ్వేత దంపతులకు ఇద్దరు పిల్లలు. సీబీఎస్ఈ సిలబస్ ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీలో తన కుమారుడిని చేర్పించడానికి ఫీజుల వివరాలు ఆరా తీశారు. ఏడాదికి రూ.56 వేలు ఫీజు, రవాణా, యూనిఫాం, ఇతర ఖర్చులు అదనమని చెప్పడంతో తక్కువ ఫీజు ఉన్న ఇతర పాఠశాలలో చేర్పించాలని నిర్ణయానికి వచ్చారు.

ఫీజులుం..



ప్రవేశాలు ప్రారంభించిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు

- ఈ ఏడాది అన్ని తరగతులకు 40 శాతం పైనే పెంపు
- రవాణా, యూనిఫాం, ఇతర ఖర్చులు అదనం



మదనపల్లె సిటీ: వచ్చే విద్యా సంవత్సరానికి జిల్లాలోని పలు ప్రైవేట్, కార్పొరేటు పాఠశాలలు ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించాయి. ఇది వరకికే తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరానికి 40 శాతానికిపైగా ఫీజులు పెంచుతూ వారి తల్లిదండ్రుల సెల్‌ఫోన్లకు సమాచారం పంపుతున్నాయి. దీంతో ఇప్పటి నుంచే విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజుల భయంతో బెంబేలెత్తుతున్నారు. పోటీ ప్రపంచంలో బడి పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఫీజులు పెంచినా తప్పనిసరిగా చెల్లించే పరిస్థితి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.జిల్లాలో మదనపల్లె, రాయచోటి, పీలేరు, రాజంపేట ప్రాంతాల్లో సీబీఎస్ఈ కింద ఎల్‌కేజీలోనే ప్రవేశాలకు దాదాపు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు **వసూలు చేస్తున్నారు. పాఠశాలలో వసతులు, సౌకర్యా**లను బట్టి ఇవి మరింత ఎక్కువగా ఉంటున్నాయి. పాఠశాలకు రవాణా సౌకర్యం,యూనిఫాం, పాఠశాలల్లో ప్రత్యేక రోజుల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, పరీక్షల రుసుం తదితర వాటికి అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. వెరసి ఒకటో తరగతి చదివే విద్యార్థికి ఏడాదికి సగటున రూ.80వేలు వరకు ఖర్చు చేయాల్సిన దుస్థితి. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి.

» కనిపించని ఫీజు బోర్డులు

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వివరాలు బోర్డులు ఎక్కడా కన్పించడం లేదు. ఏ తరగతికి ఎంత ఫీజు వివరాలు ఆయా పాఠశాలల్లో బోర్డుల్లో కనబరచాలి. అలాంటిది ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం.

చర్యలు తీసుకోవాలి



అధికంగాఫీజులు వసూలు చేసే ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. వేసవి సెలవుల్లోనే కొన్ని కార్పొరేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నారు. ఫీజులతో పాటు అదనంగా పుస్తకాలు వంటి వాటి పేరుతో అధికంగా డబ్బులు గుంజుతున్నారు. విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలి.

–మాధవ్, ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి

డాక్టర్ ప్రభావతి నుంచి ఇంకేం రాబట్టాలనుకుంటున్నారు

- ఏపీ ప్రభుత్వ న్యాయవాదికి సుప్రీంకోర్టు అక్షింతలు
- ఏపీ పోలీసులు ఏం కోరుకుంటున్నారంటూ అసహనం
- ప్రభావతి తాత్కాలిక రక్షణను.. సంపూర్ణ రక్షణగా మార్చిన ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఎంపీ, ఏపీ శాసనసభ ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు కేసులో జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ నీలం ప్రభావతి నుంచి ఇంకా ఏ రాబట్టాలనుకుంటున్నారు? ఆమె నుంచి మీ పోలీసులు ఏం కోరుకుంటున్నారు? అంటూ రాష్ట్ర ప్రభుత్వ తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాదిపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. నీలం ప్రభావతి విచారణకు అన్నివిధాలా సహకరించాలని ఆదేశిస్తూ.. ఆమెకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. గతంలో ఎంపీగా ఉన్న తనను సీఐడీ కస్టడీలో వేధించారంటూ గుంటూరులోని నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో రఘురామ ఫిర్యాదు చేశారు. ఆ కేసులో అప్పటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి ఏ5గా ఉన్నారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించి నిరాశ చెందారు. జనవరి 22న హైకోర్టు తీర్పును ప్రభావతి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ కేసు బుధవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. నీలం ప్రభావతి తరఫున సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపించారు. నిందితురాలి కుమారుడు మానసిక సమస్యతో బాధ పడుతున్నాడని కోర్టుకు తెలిపారు. రఘురామ ఇప్పుడు ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తిగా ఉన్నారు కాబట్టి.. ప్రభావతి ఇప్పుడు కేసును ప్రభావితం చేసే అవకాశమే లేదని, కేసు విచారణకు అన్నివిధాలా సహకరిస్తున్నారని తెలిపారు. కాబట్టి ముందస్తు బెయిల్ ఇవ్వాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. ప్రభావతికి బెయిల్ మంజూరు చేస్తే.. కేసుపై ప్రభావం పడే అవకాశముందని ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా కోర్టుకు తెలిపారు. ఈ కేసును వాదించేందుకు తనకు మరో రెండు నిమిషాల సమయం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా.. ×ఆమె నుంచి ఇంకేం ఏం కోరుకుంటున్నారు. ఇవన్నీ ఇప్పటికే రికార్డుల్లో ఉన్నాయి. న్యాయవాదిగా మూడు దశాబ్దాలుగా అనుభవం ఉన్న మీరు ఏం చేయాలో మాకు చెప్పండి. మీ పోలీసులు ఆమె నుంచి ఇంకా ఏం రాబట్టాలనుకుంటున్నారు. టెక్నిక్‌ను వాడుతున్నారు౯ అంటూ ధర్మాసనం సీనియర్ న్యాయవాది లూథ్రాపై అసహనం వ్యక్తం చేసింది. మాధవి దివాన్ వాదనతో ఏకీభవిస్తూ.. ప్రభావతికి గతంలో కల్పించిన తాత్కాలిక రక్షణను, సంపూర్ణ రక్షణగా మారుస్తున్నామని తెలిపింది. అయితే.. ప్రభావతి విచారణకు సహకరించని పక్షంలో ఆమె ముందస్తు బెయిల్ రద్దు చేయాలని పేర్కొంటూ.. మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది.

పొగాకు రైతు ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

సాక్షి, అమరావతి: పొగాకు సాగుతో అప్పులపాలై ఒత్తిళ్లు తాళలేక బలవన్మరణానికి పాల్పడిన రైతు ఉప్పుటూరు సాంబయ్య మృతికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని ఏపీ రైతు, కౌలురైతు సంఘాల కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, హరిబాబు బుధవారం డిమాండ్ చేశారు. సాంబయ్య కుటుంబానికి రూ.7లక్షలు పరిహారం ఇవ్వాలని కోరారు.

ఇకపై ప్రభుత్వ ఖజానాకే రహదారుల అభివృద్ధి సెస్

సాక్షి, అమరావతి: ఇకపై రహదార్ల అభివృద్ధి కింద వసూలైన సెస్ మొత్తం ప్రభుత్వ ఖజానాకే జమ కానుంది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెస్ మొత్తం ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాల్సిందిగా ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్తిగా చెల్లించేసిందని, ఎలాంటి బకాయిలు లేనందున రుణ ఖాతాను కూడా మూసివేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్‌పై వసూలు చేస్తున్న రహదార్ల అభివృద్ధి సెస్‌ను ప్రభుత్వ ఖజానాకు జమ చేయాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఉపాధి పనుల్లో ఎమ్మెల్యే జోక్యంపై కౌంటర్ వేయండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల విషయంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మీ గజపతిరాజు జోక్యంపై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. చట్ట ప్రకారం గ్రామ సభలు చేసిన తీర్మానానికి విరుద్ధంగా ఆయా పనుల ప్రాధాన్యతలను ఎమ్మెల్యే ఎందుకు మార్చారో వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను జూన్ 18కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.



సచివాలయం ప్రధాన గేటు వద్ద యాక్సెస్ నియంత్రణ వ్యవస్థ

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయం ప్రధాన గేటు వద్ద యాక్సెస్ నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఇందుకోసం అవసరమైన పరికరాలు, సాఫ్ట్‌వేర్‌కు రూ.75.66 లక్షలను మంజూరు చేస్తూ సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు, సందర్శకులు సచివాలయంలోకి వెళ్లాలంటే ఈ వ్యవస్థ అనుమతించాల్సి ఉంటుంది.

ఆర్టీఈ బకాయిలను విడుదల చేయాలి

ఏపీ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ విజ్ఞప్తి

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ (విద్యా హక్కు చట్టం) చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తులసీ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల సభ్యుల సంయుక్త సమావేశం విజయవాడలో బుధవారం జరిగింది. తులసీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో చేర్చుకున్న విద్యార్థులకు ఫీజులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాల్సి ఉందన్నారు. కోర్టును ఆశ్రయిస్తే, తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా ప్రభుత్వం మాత్రం నిధులు విడుదల చేయలేదన్నారు. ఇండిపెండెంట్ మేనేజ్‌మెంట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చినా విద్యార్థుల డేటా అప్‌డేట్, అకడమిక్ డేటా ఎంట్రీ ఇలా పలు అంశాలను అప్‌లోడ్ చేయాలని విద్యాశాఖాధికారులు ఆదేశిస్తున్నారని చెప్పారు. టీచర్లు, సెలవుల్లో ఉంటే సమాచారం ఎలా అప్‌లోడ్ చేస్తామని ప్రశ్నించారు.

హజ్ యాత్రికులకు సకల సౌకర్యాలు

సాక్షి, అమరావతి: హజ్ యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. బుధవారం సచివాలయంలో మంత్రి ఫరూక్‌ను హజ్ కమిటీ నూతన చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హజ్ యాత్ర పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఫరూక్ ఆయనకు సూచించారు. మిగిలిన దశల్లో హజ్‌కు వెళ్లే వారి పర్యటనలకు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలన్నారు.

పశు సంవర్ధక శాఖలో టెండర్ కమిటీ

సాక్షి, అమరావతి: పశు సంవర్ధక శాఖలో టెండర్ల ఖరారు, రద్దు అంశాలను పరిశీలించడానికి తొమ్మిది మందితో కూడిన కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కమిటీకి చైర్మన్‌గా పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ వ్యవహరిస్తారు. మరో 8 మంది సభ్యులుంటారు. ఈ మేరకు ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

75 శాతం హాజరుంటేనే కుట్టు మిషన్

సాక్షి, అమరావతి: మహిళల సాధికారిత లక్ష్యంగా కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. శిక్షణలో 75 శాతం హాజరున్న మహిళలకే కుట్టు మిషన్‌లు అందజేస్తామని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే 3.36 లక్షల మంది కుట్టు శిక్షణ కోసం పేర్లు నమోదు చేసుకున్నట్టు వివరించారు.

బీజేపీ కార్యాలయంలో విజయోత్సవం

సాక్షి, అమరావతి: పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతిగా భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' విజయవంతం కావడంతో బుధవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద పార్టీ నేతలు, కార్యకర్తలు బాణ సంచా కాల్చి విజయోత్సవం నిర్వహించారు. అంతకుముందు స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో నేతలు అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

పాలనలో 'ఏఐ వినియోగం' పెంపు!

12 నుంచి ఉద్యోగులకు శిక్షణ

సాక్షి, అమరావతి: పరిపాలనకు సంబంధించి అన్ని శాఖల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని ప్రభుత్వం విస్తరిస్తోంది. ఈ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 24, 25 తేదీలలో అన్ని శాఖల విభాగాధిపతులతో రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించగా, ఇప్పుడు 20 ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనుంది. మే 12 నుంచి 15 మధ్య ఫేజ్-1లో పోలీస్, రెవెన్యూ, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, ఫైనాన్స్, గ్రామ/వార్డు సచివాలయాలు, మున్సిపల్, పరిశ్రమలు, ప్లానింగ్, రవాణా శాఖల సిబ్బందికి శిక్షణ ఇస్తారు.19 నుంచి 22 మధ్య ఫేజ్-2లో జనరల్ అడ్మినిస్ట్రేషన్ (జీఏడీ), స్కిల్ డెవలప్‌మెంట్, లా, వ్యవసాయం, ఉద్యానవనం, మత్స్య శాఖ, పశుసంవర్ధక, మైనింగ్, ఐటీ, హెచ్‌ఆర్‌డీ శాఖల ఉద్యోగులు శిక్షణలో పాల్గొననున్నారు.

ఏబీ వెంకటేశ్వరరావుపై కేసు కొట్టివేత

సాక్షి, అమరావతి: నిఘా పరికరాల కొనుగోళ్ల వ్యవహారంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై ఏసీబీ నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టేసింది. అలాగే విజయవాడ ఏసీబీ కోర్టులో ఏసీబీ దాఖలు చేసిన చార్జిషీట్‌ను సైతం కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ బుధవారం తీర్పునిచ్చారు.

400 చెరువులు, కోనేరుల అభివృద్ధి

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 400 చెరువులు, కోనేర్లను ఉపాధి పథకం ద్వారా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. వీటిని పునరుద్ధరించి జూన్ నాటికి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురానున్నట్టు స్పష్టం చేసింది. గ్రామాల్లో చరిత్ర కలిగి నిర్లక్ష్యానికి గురైనవాటిని బాగు చేయనున్నట్టు పేర్కొంది.

కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలపై వివక్ష

సీఎం చంద్రబాబుకు కాపు ఐక్యవేదిక బహిరంగ లేఖ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలపై టీడీపీ కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోందని కాపు ఐక్యవేదిక చైర్మన్ రావి శ్రీనివాస్ విమర్శించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు కాపు ఐక్యవేదిక తరఫున బహిరంగ లేఖను రాశారు. బుధవారం విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఎంకు రాసిన బహిరంగ లేఖను శ్రీనివాస్ మీడియాకు విడుదల చేశారు. టీడీపీ పాలనలో పారదర్శకత లేదని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీ మేరకు రూ.3వేల కోట్లు కాపు కార్పొరేషన్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ టీడీపీతో ఉన్నారనే ధీమాతో కాపులపై వివక్ష చూపిస్తున్నారా? అని ప్రశ్నించారు. కృష్ణాజిల్లాకు వంగవీటి మోహనరంగా, పల్నాడు జిల్లాకు కన్నెగంటి హనుమంతు పేర్లు పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వేదిక రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ జానపాముల నాగేంద్రకుమార్, కన్వీనర్ బోడపాటి పెదబాబు, కో కన్వీనర్ కాకిలేటి హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'డీఎస్సీలో సీబీఎస్ఈ అభ్యర్థులకు అవకాశమివ్వండి'

సాక్షి, అమరావతి: డీఎస్సీ-2025లో సీబీఎస్ఈలో చదివిన అభ్యర్థులకు అవకాశమివ్వాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతున్న నేపథ్యంలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్‌లో చదువుకున్న అర్హులకూ డీఎస్సీ రాసేందుకు వీలు కల్పించాలంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు లేఖ రాశారు.

ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను నియమించండి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులను డైట్ కాలేజీల్లో అధ్యాపకులుగా నియమించిన నేపథ్యంలో వారి స్థానాల్లో ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను నియమించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ విద్యాశాఖకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలని బుధవారం ఆయన ఓ ప్రకటనలో కోరారు. లేనిపక్షంలో విద్యాబోధన కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

379 మంది పార్ట్‌టైమ్ సిబ్బంది సేవలు రెన్యువల్

పాఠశాల విద్యాశాఖలో పార్ట్‌టైం విధానంలోవివిధ విభాగాల్లో పనిచేస్తున్న 379 మంది సిబ్బంది సేవలను 2025-26 విద్యా సంవత్సరానికి పునరుద్ధరించారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. సేవలు పునరుద్ధరించిన వారిలో జూనియర్ లెక్చరర్లు, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు, కంప్యూటర్ టెక్నీషియన్లు, టైప్‌రైటింగ్ ఇన్‌స్ట్రక్టర్లు.. ల్యాబ్ అటెండర్లు ఉన్నారు. వీరు జూన్ ఒకటి నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు కొనసాగుతారని అందులో పేర్కొన్నారు.




● పుణ్య తీర్థం

ప్రకృతి సౌందర్యానికి పరశురామ్...

'పరశురామ క్షేత్ర మనగానే మనకు ప్రకృతి సౌందర్యం ఉట్టిపడే కేరళ ప్రాంతమే జ్ఞాపకం వస్తుంది. అలాగే అవతార పురుషుడైన పరశురాముడు పుట్టిన ఊరు కూడా అత్యంత ప్రసిద్ధి చెందినది. పరశురామ్ అనే ఆ భూమి ఎంతోమహిమాన్వితం. పవిత్రమైన భరత భూమికే అలంకారాలైనవి ఇక్కడి నదీనదాలు, సముద్రాలు, పర్వతాలు, లోయలు, అడవులు. మహారాష్ట్ర మాత నెన్నుదుటి తిలకం చిప్లూన్ తాలూకాలోని పరశురామ్ అనే పుణ్యస్థలం. పశ్చిమానున్న నాసిక్ నుండి కొచ్చిన్ దాకా ఉన్న పడమటి కొండలను సహ్యాద్రి కొండలుగా పిలుస్తారు.





పూనేలో సతారా అనే ప్రదేశాన్ని దాటగానే పర్వతశ్రేణులు ఆరంభమౌతాయి. పూనే నుండి సుమారు 250 కి.మీ దూరంలో రత్నగిరి జిల్లాలో చిప్లూన్ తాలూకా వున్న ఈ ప్రదేశం ఒక సుందరమైన లోయ. ఆ లోయలో ఒక కొండ గ్రామం పరశురామ్. చిప్లూన్ నుండి 12 కి.మీ. దూరం కొండ మీదకి వెళ్తే, రమణీయ ప్రకృతితో నిండి ఉన్న ఈ గ్రామం రా రమ్మని పిలుస్తుంది. ఈ కొండలలో అనేక వర్ణాలు ఆకట్టుకుంటాయి. ఇక్కడ ఎరుపు రంగు రాతిబండలు ప్రత్యేకం. ఆలయాలు, ఇళ్ళు కూడా ఈ బండలతోనే నిర్మిస్తారు.

సహ్యాద్రి కొండలమీద నుండి చిప్లూన్ మార్గం అంతా పండ్లతో వంగిన కొమ్మలున్న ఫలవృక్షాలతో దట్టంగా పెరిగి ఎటువైపు చూసినా పచ్చగా ఆహ్లాద కరంగా... ఎర్రని షవురీ పుష్పాలతోపాటు పలురకాల పరిమళ పుష్పాల సౌరభాలతో నిండి ఉంటుంది. ఆ మార్గంలో వశిష్టానది అందాలతో వంపులు తిరిగి ప్రవహిస్తుంది. ప్రథమంగా శ్రీమహావిష్ణువు అంశయైన పరశురాముడు స్వయం భూమూర్తిగా అక్కడ అవతరించాడు. తరువాత ఆయనకు పూజా పునస్కారాలు ప్రారంభమై క్రమేపీ జనావాసాలు ఏర్పడ్డాయి. మెల్లగా ఒక గ్రామం వెలిసింది. నాలుగు తరాలుగా ఆ ఆలయ కైంకర్యం చేస్తూ వస్తూన్న కొంకణదేశ బ్రాహ్మణ కుటుంబాలు, ఇతరులు అక్కడ నివసిస్తున్నారు.

పరశురామావతారం

భూలోకంలోని రాజులందరూ కలహించుకుంటూ శాంతి భద్రతలు పూర్తిగా క్షీణదశకు వచ్చినప్పుడు భూదేవి ఆ అశాంతిని సహించ లేక శ్రీమహావిష్ణువుతో మొర పెట్టుకోగా, మహావిష్ణువు తన ఆరవ అవతారంగా మహా తపశ్శక్తి సంపన్నుడైన జమదగ్ని మహర్షికి రేణుకాదేవికి జన్మించాడు. రాముడనే పేరుతో ఆ బాలుడు పెరిగి పెద్దవాడై సకల విద్యాపారంగతుడై అత్యంత పరాక్రమవంతుడైనాడు. రాముడు శివుని గురించి తీవ్రమైన తపస్సు చేశాడు. పరమశివుడు ప్రత్యక్ష మై' ఎందుకు యింత కఠోర తపస్సు చేస్తున్నావని' అడిగాడు. ఈ లోకంలో పాలకులైన క్షత్రియులంతా దుష్టులై, దుర్మార్గులై లోకకంటకులై వున్నారు. వారిని ఎదుర్కొని శాంతి కలిగే మార్గాన్ని సూచించమని ప్రార్థించాడు. పరమేశ్వరుడు 'పరశువు' అనే దైవీక శక్తి కలిగిన గొడ్డలిని ప్రసాదించి దుష్ట సంహారం చేయమని ఆదేశించాడు. పరశువును పొందిన రాముడు ఆనాటి నుండి పరశురామునిగా ప్రసిద్ధి చెందాడు. ఈ పరశురాముడు త్రేతాయుగ గాథ అయిన రామాయణంలో, ద్వాపరయుగం నాటి మహాభారత గాథలోనూ దర్శనమిస్తాడు.



న్నో వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ పరశురామ ఆలయాన్ని బ్రహ్మేంద్రస్వామి నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. పరశురాముని మూర్తి స్వయం భూగా వెలసినందున ఈ మూర్తికే పూజలు చేసేవారు. ఈనాడు పరశురామునికి ఒక విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు జరుపుతున్నారు. ఆలయ ప్రాంగణమంతా దట్టమైన పచ్చని చెట్లతో ప్రశాంతంగా వుంటుంది. కొండ మీద వున్న ఈ ఆలయానికి వెళ్లాలంటే సుమారు 50 మెట్లు ఎక్కవలసిందే. గర్భగుడిలో పరశురాముడు నాలుగు హస్తాలతో దర్శనమిస్తాడు. కుడివైపు చేతిలో గొడ్డలి, మరొకటి అభయ హస్తం, ఎడమ వైపు ఒక చేతిలో బాణం, మరొక చేతిలో కమండలంతో దర్శనం ఇస్తాడు. పరశురాముడు కాముని గెలిచిన బ్రహ్మచారి. అందుకు చిహ్నంగా పరశురాముడి కుడిపక్కన మన్మథుని శిల, కాలునిపై విజయం సాధించి చిరంజీవియైనందుకు ప్రతీకగా ఎడమ పక్కన కాలుని శిలాప్రతిమలు కూడా పూజలు అందుకోవడం విశేషం.

పరశురాముని తల్లి రేణుకాదేవికి గర్భగుడి వెనుక ఒక ప్రత్యేక సన్నిధి ఉంది. రేణుకాదేవి సన్నిధికి కుడిపక్కన పైన హోమమండపం ఎడమ పక్కన పరశురాముడి బాణాలతో భూగర్భం నుంచి గంగా జలం పైకి వచ్చిన బాణగంగా పుష్కరిణి ఉన్నాయి.

ఇవిగాక పరశురాముడు ప్రజల సౌకర్యార్థం అతి విశాలమైన అరవై మంచినీటి సరస్సులను, అరవై అతి పెద్ద సుందర ఉద్యానవనాలను నిర్మించినట్లు పురాణ కథనం.

రేణుకాదేవి సన్నిధినుండి కుడిపక్క కొన్ని మెట్లు ఎక్కి పైకి వెళ్తే, హోమాలు చేయడానికి ప్రత్యేక మండపం వస్తుంది. సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలలో హోమం చేస్తే గృహాలకి శాంతి చేకూరుతుందని, దేహానికి ఆరోగ్యం సమకూరుతుందని చెప్తారు. పరశురామ భూమిలో, అక్షయ తృతీయనాడు పరశురామ జయంతి వైభవంగా జరుపుతారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు చిప్లూన్ ప్రాంత ప్రజలేకాక చుట్టుపక్కల గ్రామస్థులు, ప్రధాన నగరాలైన పూనే, ముంబయి, గోవాల నుండి కూడా వేలాది యాత్రీకులు వెళ్ళి పాల్గొంటారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ ఈ ఊరికి వచ్చి, పరశురాముని పూజించినట్టు చరిత్ర చెప్తోంది.

చిప్లూన్ దాకా రైలు, బస్సుల వసతి ఉంది. చిప్లూన్ నుండి పరశురామ్ గ్రామానికి వెళ్ళడానికి కారు, ఆటో వసతులు ఉన్నాయి.

ప్రకృతి అందాలతో నిండిన ఈ క్షేత్రం పర్యాటకులకు, విహారయాత్రీకులకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. ఇక్కడి అలౌకికమైన దైవీక వాతావరణం మనసులకి ఆనందాన్ని, తృప్తిని కలిగిస్తుంది.

– డి.వి.ఆర్.

● వారం.. పర్వం



మే 11, ఆదివారం నరసింహ జయంతి

శ్రీ మహా విష్ణువు దశావతారాల్లోని నాలుగో అవతారమే శ్రీ నారసింహావతారం. నరసింహ జయంతి రోజున తెల్లవారు జామునే స్నానం చేసి ఉతికిన బట్టలను ధరించాలి. అనంతరం నరసింహ స్వామితో పాటు లక్ష్మీదేవిని పూజించాలి. పూజ చేసే సమయంలో నరసింహ మంత్రాలను పఠించాలి. స్వామివారికి తీపి పదార్థాలు, పండ్లు, పూలు, కుంకుమ సమర్పించాలి. నరసింహ స్తోత్రాన్ని పఠించి హారతితో పూజను పూర్తి చేయాలి. సత్ఫలితాలను ఆశించేవారు ఈ రోజు ఉపవసించడం మంచిది.



మే 12, సోమవారం కూర్మజయంతి:

శ్రీ మహావిష్ణువు దశావతారాల్లో రెండో అవతారం: శ్రీ కూర్మావతారం. కూర్మ జయంతి రోజున పగలంతా ఉపవాసం ఉండి విష్ణు సహస్రనామం పారాయణ చేస్తూ నారాయణ భజనలు, కీర్తనలు చేస్తూ జాగారం చేయాలి. ఈ విధంగా చేసినవారికి శ్రీ మహావిష్ణువు అనుగ్రహంతో జీవితంలో ఆటంకాలు తొలగిపోతాయి. సకల విజయాలు, శ్రేయస్సు కలుగుతాయని శాస్త్రోక్తి. ఉపవాస జాగరణలు చేయలేని వారు కనీసం ఈ రోజున శ్రీ మహావిష్ణువు కూర్మావతార కథను చదివినా విన్న సకల శుభాలు చేకూరుతాయని శాస్త్ర వచనం. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం పట్టణానికి 15 కి.మీ. దూరంలో శ్రీకూర్మం అనే పుణ్య క్షేత్రంలో శ్రీమహావిష్ణువు కూర్మావతారం రూపంలో పూజలు అందుకుంటాడు. ఈ రోజు ఈ ఆలయానికి దేశవిదేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు.



మే 12 సోమవారం: సత్యదేవుని కల్యాణం

కోరిన వరాలనిచ్చే సత్యదేవుడు అన్నవరం సత్యనారాయణ స్వామి. సత్యం పలకాలి. ప్రియంగా పలకాలి. అలాగని ఇష్టం కలిగించడం కోసం అసత్యం చెప్పకూడదని ఆయన వ్రత కథలను బట్టి అర్థం అవుతుంది. సత్యవచన ప్రభావం అప్పటికప్పుడు ఎలా కనిపిస్తుందో శ్రీసత్యనారాయణ స్వామి వ్రత కథల్లో దృష్టాంతాలు కనిపిస్తాయి. వైశాఖ పూర్ణిమ నాడు అన్నవరంలో సత్యదేవుడి కల్యాణ వేడుకలు అంగరంగ వైభంగా జరగడం ఆచారం. ఈ వేళ అక్కడకి వెళ్లి, స్వామిని సేవించలేని వారు కనీసం ఇంటిలో లేదా ఇతర పుణ్యక్షేత్రాలలో సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకోవడం చాలా మంచిది.

● సువార్త

తల్లి నాయకత్వం ప్రత్యేకత

'ఒకని తల్లి వానిని ఆదరించినట్లు నేను మిమ్మును ఆదరించెదను ' – యెషయా 66:13

దేవుడు నేను ఆదరిస్తాను అని నేరుగా సూటిగా చెప్పుకోక 'ఒకని తల్లి వానిని ఆదరించినట్లు నేను మిమ్మును ఆదరిస్తాను' అనడం విశేషంగానే చెప్పుకోవాలి. తల్లి నాయకత్వం గూర్చి మనం తప్పక చర్చించి మాట్లాడుకోక తప్పదు. ప్రేమ, ఆదరణ, ఓర్పు, సహనంతో కూడిన నైపుణ్యాలు చక్కగా ఇందు మిళితమై ఉన్నందున పరిచారక నాయకత్వం కంటె కూడా ఇది అరుదైన మరొక కళగా ఉండి అలరిస్తుంది.

తల్లి నాయకత్వంలో ఉన్న సుగుణం, విశేషం లేదా గొప్ప లక్షణం 'ప్రేమాదరణ' అనేదే.

మహాదేవుడు అంతటి వాడే ఈ సృష్టిలోని అమూల్యమైన తల్లి పాత్రధారి చూపే ఆదరణతో పోల్చుకుంటే ఆయన కుమారుడైన క్రీస్తు అనేక పిల్లలు గల తల్లి కోడితో పోల్చుకోవడం గొప్ప విశేషం.

'యెరూషలేమా, యెరూషలేమా ప్రవక్తలను చంపుచును నీ యొద్దకు పంపబడిన వారిని రాళ్ళతో కొట్టుచును ఉండుదానా, కోడి తన పిల్లలను రెక్కల క్రింది కేలాగు చేర్చుకొనునో అలాగే నేనును నీ పిల్లలను ఎన్నో మారులు చేర్చుకొనవలెనని యుంటిని గాని మీరు ఒల్లకపోతిరి' – మత్త 23 : 37. పిల్లల పటిష్ట భద్రతకు ప్రధాన స్థావరం తల్లి కోడి రెక్కల చాటు నీడ. తన పిల్లల రక్షణ కోసం ఎంతటి బలమైన జీవితోనైనా ఢీకొనే పోరాట పటిమ గల కోడిని, దాని శక్తి ప్రదర్శనను గ్రద్ద వ్రాలే ముందు చూస్తేనే మన కంటికి అదొక గొప్ప కనువిందు. ఎక్కడెక్కడో ఉన్న పిల్లలు అన్నీ రెక్కలు చాచిన తల్లి రెక్కల మాటున దాగడం చూస్తే అబ్బో గొప్ప సాహసిక ప్రేమను కనుగొంటాం. ఇలా ఈ సృష్టి వైవిధ్యం మనలను ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటుంది.



తండ్రియైన దేవుడు ఆయన ప్రియ కుమారుడు ఇలా పోల్చుకుంటే క్రీస్తు ప్రభువుల వారి అపొస్తలుడు ఆయన భక్తరాజం అయిన పౌలు మహాశయుడు పోల్చుకోడా మరి! 'స్తన్యమిచ్చు తల్లి తన సొంత బిడ్డలను గారవించునట్లుగా మేము మీ మధ్యను సాధువులమై యుంటిమి'(1థెస్స 2:7). స్తన్యమిచ్చు తల్లితో పోల్చుకోవడం చూస్తే ఎంత సాహసం అతనికి! ఎంతటి గొప్ప ఆత్మ విశ్వాసం అతనికి! కొత్తగా జన్మించిన నూతన సృష్టి సంబంధ శిశువులకు వాక్యమనే పాలు నోటికి అందించుటలో నైపుణ్యం గలవాడు కనుకే తల్లి పరిచర్య సంబంధిత నాయకత్వ విశేషాలు తెలుసు కనుకనే ఆమెతో పోల్చుకోనుటకు సాహసించి ఇలా తల్లిని, ఆమె నాయకత్వాన్ని మెచ్చుకుంటూ పౌలు ప్రశంసించగలిగాడు.

అలాగే అతడు నిండు గర్భిణీతో కూడా తనను పోల్చుకోవడం విశేషం. 'క్రీస్తు స్వరూపము మీయందు ఏర్పడువరకు మీ విషయమై నాకు మరల ప్రసవ వేదన కలుగుచున్నది (గలతీ 4:19) అంటూ పోల్చుకోవడం పౌలుకు ఎప్పుడూ ఇష్టమే అనుటకు కారణం అతడు తన సువార్త ప్రయాణాలలో ఎన్నో శ్రమలు, ప్రసవవేదనలు అనుభవించాడు.

సాధువులో, మాతృమూర్తిలో, గర్భిణీ స్త్రీలో సహజ సిద్ధమైన దైవిక ప్రేమ క్షేమాభివృద్ధి కలిగించే రీతిలో ఉబికి వస్తుంటుంది. నోటికి రుచియైన చల్లని సురక్షిత సుజలం ఊటబావి నుండి తోడేకొద్దీ ఊరుతూ ఉన్నట్టుగా షరతులు లేని సహజప్రేమ వీరిలో నుండి ఒకే రుచితో ఉబికి వస్తూ ఉంటుంది. అమ్మ ప్రేమే అసలైన నాయకత్వ ప్రేమ. తల్లి దగ్గరకు, ఆమె ప్రేమాదరణ దగ్గరకు వచ్చి అందరూ ఇక్కడనే ఆగిపోతారు. ఇంతకంటే మిన్నగా ఆస్వాదించడానికి, సరి పోల్చుకోవడానికి మరొక ప్రేమ, ఆదరణ ఎక్కడా కానరాని కారణం చేత అంతా ఈ అంతిమ స్థాయిలోనే ఆనందపడుతుంటారు.

ఇస్సాకు తల్లి శారా, మోషే తల్లి యొకెబెదు, గెర్షోము తల్లి సిప్పోరా, సమూయేలు తల్లి హన్నా, యేసు తల్లి మరియ, జెబెదయి కుమారులనబడే యోహాను, యాకోబుల తల్లి సలోమి, తిమోతి తల్లి యూదురాలు మున్నగు వారేకాక బైబిలు నందు ఉత్తమ తల్లులు, నాయకమణులు ఎందరో ఉన్నారు. తమ కుమారులను కుమార్తెలను కుటుంబాలను దేవుని భక్తిలోకి నడిపించిన ఇట్టి గొప్ప ప్రార్థన యోధులైన తల్లులు సమాజానికి సంఘానికి అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ఆదర్శప్రాయులే.

కొన్ని ప్రసిద్ధి చెందిన సంస్థలు 'మదర్ లీడర్షిప్' నైపుణ్యాలకు చోటిస్తూ, ప్రతిభ గల మహిళలను కీలక విభాగాలలో నియమిస్తూ, చేర్చుకుంటూ ఉన్నందువల్ల అవి సంఖ్యలోను నాణ్యతలోనూ అన్నింటా రాణించి మరింతగా వాసి కెక్కుతున్నాయి కూడానూ.

– జేతమ్

● ఇస్లాం వెలుగు

శ్రమ సౌందర్యం

పుడమిపై శ్వాసించే ప్రతి ఒక్కరూ బతుకు దెరువుకోసం ఏదో ఒక పని చేయాల్సి ఉంటుంది. ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయంతో పాటు వివిధరకాల పనులను మనిషి ఆశ్రయిస్తాడు భుక్తి కోసం. అందులో కాయ కష్టం చేసుకునే శ్రమ జీవులే అత్యధిక శాతం ఉన్నారు. కష్టపడి, చెమటోడ్చి సంపాదించే డబ్బుతో



జీవితం గడిపేవారి కంటే గౌరవనీయులు, నిజాయితీ పరులు మరొకరు కాజాలరు. పవిత్ర ఖురాన్ దృష్టిలో ఇలాంటివారే అందరి కన్నా ఎక్కువగా సాఫల్యం పొందేవారు. కష్టజీవులను దైవ ప్రవక్త ముహమ్మద్ (స) అమితంగా ప్రేమించేవారు. అందరికన్నా ఎక్కువగా వారిని గౌరవించేవారు. ఏ వృత్తినీ ఆయన తక్కువగా చూడలేదు. వృత్తుల పరంగా మనుషుల మధ్య తారతమ్యాన్ని ఆయన సహించలేదు. జాతి, కులం, మతం, హోదా, అంతస్తు కారణంగా ఎవరూ ఎక్కువ కాని, తక్కువ కాని కాదని చెప్పారు. నీతి, నిజాయితీ, విశ్వసనీయత, దైవ భీతి పరంగా ఎవరు ఉత్తములో వారే అందరి కన్నా గౌరవనీయులని ప్రవక్త సెలవిచ్చారు.

ఒకసారి ప్రవక్త (స), అనుచరుల మధ్య ఆసీనులై ఉండగా ఒకవ్యక్తి వచ్చాడు. అందరికీ వినయంగా సలాం (అభివాదం) చేసి కూర్చోబోయాడు. వెంటనే ప్రవక్త(స) అతనితో కరచాలనం చేసి తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. వచ్చిన వ్యక్తి బాగా కష్టజీవి అయినందున చేతులు కాయలు కాసి, మొరటుగా ఉన్నాయి. ఆ చేతులు చూసి ప్రవక్త మహనీయులు ఆశ్చర్య పొయ్యారు. 'సోదరా! నీచేతులు ఇంత నల్లగా కాయలు కాసి ఉన్నాయేమిటి? 'అని అడిగారు. అప్పుడా వ్యక్తి,'ఏమీ లేదండీ.. నేను కూలి పని చేస్తాను. కుటుంబ పోషణ కోసం రాళ్ళు పగులగొట్టే పనికి వెళుతుంటాను. బరువైన సుత్తెతో పదే పదే రాళ్ళను కొట్టడం వల్ల చేతులు కాయలు కాసి నల్లబడ్డాయి అంతే'. అని చెప్పాడు. ఆ వ్యక్తి సమాధానం ప్రవక్త వారికి అమిత సంతోషాన్ని కలిగించింది. వెంటనే ప్రవక్త మహనీయులు కాయలు కాసిన ఆ నల్లని చేతులను ఆప్యాయంగా చుంబించి కాయకష్టం చేసుకునే శ్రమజీవుల పట్ల తనకున్న ప్రేమను, ఆప్యాయతను వ్యక్తం చేశారు.

– యండి. ఉస్మాన్ ఖాన్



● గురు బోధ

● చాలామంది ఆధ్యాత్మిక సాధనలను ముసలితనంలో చేయవచ్చుననీ, జీవితంలోని రకరకాల భోగభాగ్యాలను ముందు అనుభవిద్దామనీ అనుకుంటూ ఉంటారు.

● వారు తమ శక్తిలో చాలా భాగం భౌతిక సుఖాల కోసం ఖర్చుపెట్టడం వలన కష్టతరమైన ఆధ్యాత్మిక సాధనలు చేసే అవకాశం వారికి ఎన్నడూ రాదు.

● వారు ఆధ్యాత్మిక సాధనలు మొదలు పెట్టినా, చేయడానికి కావల్సిన శక్తి, ఓర్పు లేక వారికి అంతగా మేలు కలగదు.

● అసంఖ్యాకులైన జనులు తమ జీవితం వ్యర్థమై పోయిందన్న విషయాన్ని తెలుసుకునే సరికి సమయం మించిపోతుంది.

● అయితే ఆ విషయమే తెలియక ఇంకా నవ యౌవనంలోనే ఉన్నామనుకుంటూ భౌతిక సుఖాల వెంట పరిగెట్టే వృద్ధులకంటే వీరు నయం.

● నిర్మల వాణి

సహస్రార చక్రం వికసించిన శుభ యోగం

మాతాజీ నిర్మలాదేవి తన బాల్యం నుండీ మానవుడిని లౌకిక పరమైన ఈతిబాధల బానిసత్వం నుండి విముక్తి చేయడానికి ఒక పరిష్కార మార్గాన్ని కనుగొనడానికి ప్రయత్నిస్తుండే వారు. ఆ లక్ష్యంతో ఆమె ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలను అధ్యయనం చేశారు. ఎంతో మంది ప్రముఖ ఆధ్యాత్మిక నాయకుల ప్రసంగాలు, ఉపన్యాసాలకు కూడా హాజరయ్యారు. కానీ వారి ప్రసంగాలు, ఉపన్యాసాలన్నీ మానసిక స్థాయిలోనే ఉండేవి. ఈ మానసిక విన్యాసాలు మానవాళికి ముక్తిని అందించలేవు అని ఆమెకు అనిపించేది. ఆ సమయంలో ఆధ్యాత్మిక నాయకులుగా పిలవబడే వ్యక్తులు మానవుడిని తన జీవిత లక్ష్యమైన మోక్షానికి నడిపించగలరా అనే సందేహం ఆమెకు మనస్సులో ఏర్పడేది.



శ్రీ మాతాజీ నిర్మలాదేవి

ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా వారు చేసే ప్రకటనలు చూసి ఆమె చాలా కలత చెందేవారు.

అది 1970వ సం. మే 4వ తేదీ, మాతాజీ నిర్మలా దేవి అప్పుడే ప్రముఖ ఆధ్యాత్మిక గురువుగా చలామణీ అవుతున్న ఒక గురువు నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయి వచ్చారు. అక్కడకు వెళ్ళడం ఆమెకు ఇష్టం లేకపోయినప్పటికీ, ఆ వ్యక్తి పదే పదే ఆహ్వానించడంతో వెళ్ళవలసి వచ్చింది. అక్కడ ఆధ్యాత్మికత ముసుగులో అమాయక ప్రజలను అతను మోసం చేస్తున్న విధానం మొత్తం చూసి ఆమె నివ్వెరపోయారు. భగవంతుని కోసం నిజాయితీగా సత్యాన్వేషణ చేస్తున్న సాధకులు ఆ మోసపు గురువు బారిన పడి, మోక్షానికి దూరమవుతున్న విధానం చూసి ఆమె మాతృ హృదయం తల్లడిల్లింది. ఆమె నేరుగా గుజరాత్ లోని అరేబియా సముద్ర తీరంలో ఉన్న నార్గోల్ అనే ప్రాంతానికి వెళ్ళారు. అక్కడ రాత్రంతా ధ్యాన నిమగ్నులై ఉన్నారు. మరుసటిరోజు ఉదయం తెల్లవారుతుండగా అనగా 1970 సం. మే 5వ తేదీ తెల్లవారు జామున ఆమె లోపల కుండలినీ శక్తి షట్చక్రాలను ఛేదించుకుంటూ పైకి వెళ్ళి సహస్రార చక్రాన్ని ఛేదించింది. అసత్యం పట్ల ఏర్పడిన అసహ్యం, తన బిడ్డలను రక్షించాలనే కరుణ, ఆమెను సహస్రార చక్రాన్ని తెరవడానికి ప్రేరేపించాయి.



– డా. పి. రాకేశ్
(శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ఆధారంగా)

చమురుపై రూ.1.8 లక్షల కోట్లు ఆదా

- ధరలు తగ్గడంతో 2025-26లో ఆదా
- బ్యారెల్ ధర 60-70 డాలర్లు ఉండొచ్చు
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా



న్యూఢిల్లీ: చమురు ధరలు కనిష్ఠ స్థాయికి చేరిన క్రమంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్‌కు వీటి దిగుమతులపై రూ.1.8 లక్షల కోట్ల మేర ఆదా అవుతుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. దేశ ముడి చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతుల రూపంలోనే సమకూరుతుండడం తెలిసిందే. వీటి దిగుమతుల కోసం భారత్ 2024-25లో 242.4 బిలియన్ డాలర్లను (రూ.20.60 లక్షల కోట్లు) వెచ్చించినట్టు ఇక్రా నివేదిక తెలిపింది. ఎల్ఎన్‌జీ దిగుమతుల కోసం 15.2 బిలియన్ డాలర్లు (రూ.1.29 లక్షల కోట్లు) ఖర్చు చేసినట్టు పేర్కొంది. ఈ వారంలో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధర 60.23 డాలర్ల కనిష్టానికి చేరుకోవడం గమనార్హం. 2021 ఫిబ్రవరి తర్వాత కనిష్ఠ స్థాయికి చమురు ధరలు చేరుకోవడం మళ్లీ ఇదే మొదటిసారి. 2024 మార్చితో పోల్చి చూసుకున్నా బ్యారెల్ ముడి చమురు ధర 20 డాలర్లు తక్కువగా ఉంది.

నాడు పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం రూ.2 చొప్పున తగ్గించడం తెలిసిందే. 2025-26 సంవత్సరంలో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 60-70 డాలర్ల మధ్య ఉండొచ్చని ఇక్రా అంచనా వేసింది. ఈ ధరల ప్రకారం అప్‌స్ట్రీమ్ ఆయిల్ కంపెనీలకు (ముడి చమురు ఉత్పత్తి సంస్థలు) రూ.25,000 కోట్ల మేర పన్నుకు ముందు లాభం సమకూరుతుందని అంచనా వేసింది. ఇక ఎల్ఎన్‌జీ దిగుమతులపై రూ.6,000 కోట్లు, ముడి చమురు దిగుమతులపై రూ.1.8 లక్షల కోట్ల చొప్పున మిగులుతుందని పేర్కొంది. ఆయిల్ మార్కెటింగ్ (రిటైల్) సంస్థలకు మార్జిన్లు మెరుగ్గా ఉంటాయని.. ఎల్పీజీపై నష్టాలు తగ్గుతాయని వెల్లడించింది.

ఎక్సైజ్ సుంకం మళ్లీ పెంచొచ్చు

చమురు ధరలు ఒక్కసారిగా తగ్గడంతో రిఫైనరీ సంస్థలకు ఇన్వెంటరీ (నిల్వ) నష్టాలు ఎదురుకావొచ్చని ఇక్రా అంచనా వేసింది. దీంతో మరో విడత పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం పెంచే అవకాశం లేకపోలేదని అభిప్రాయపడింది. పెట్రోల్, డీజిల్ విక్రయాలపై ఒక్కో లీటర్‌కు దీర్ఘకాల సగటు అయిన రూ.2.5-4 చొప్పున మార్జిన్లు ఉంటాయని తెలిపింది. టారిఫ్‌లపై నెలకొన్న అనిశ్చితులు.. వీటి ఫలితంగా వృద్ధి క్షీణత.. ఉత్పత్తి కోతలను క్రమంగా తగ్గించుకుంటామని ఓపెక్ ప్లస్ కూటమి చేసిన ప్రకటన ధరలు తగ్గడానికి కారణమైనట్టు ఇక్రా వివరించింది.

గ్రాన్యూల్స్ ఇండియాకు ఎకోవాడిస్ గోల్డ్ రేటింగ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తున్నందుకు గాను తమకు ప్రతిష్టాత్మక ఎకోవాడిస్ గోల్డ్ రేటింగ్ లభించినట్లు ఫార్మా సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా వెల్లడించింది. టాప్ 5 శాతం కంపెనీల జాబితాలో తమ సంస్థ కూడా చోటు దక్కించుకున్నట్లు వివరించింది. పర్యావరణం, కార్మిక .. మానవ హక్కులు, నైతిక విలువలు తదితర అంశాల ప్రాతిపదికన ప్రపంచవ్యాప్తంగా కంపెనీలకు ఎకోవాడిస్ రేటింగ్ ఇస్తుంది. ఈ గుర్తింపు దక్కడం గర్వకారణమని, దీనితో తమ బాధ్యత మరింత పెరిగిందని గ్రాన్యూల్స్ ఇండియా సీఎండీ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి తెలిపారు.



సువెన్ ఫార్మా పేరు మార్పు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ సంస్థ సువెన్ ఫార్మా పేరు కోహ్యాన్స్ లైఫ్‌సైన్సెస్ లిమిటెడ్‌గా మారింది. విలీన ఒప్పందం ప్రకారం ఈ మేరకు మార్పు చేసినట్లు సంస్థ వెల్లడించింది. 2022లో కోహ్యాన్స్ లైఫ్‌సైన్సెస్ బ్రాండ్‌ను ప్రారంభించిన ఆడ్వెంట్ ఇంటర్నేషనల్.. 2023లో సువెన్‌లో 50.1 శాతం వాటాలు కొనుగోలు చేసింది. రెండింటి విలీనంతో తాజాగా పేరు మారింది.

cohance lifesciences

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-5-2025

విశాఖ	505-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	485-00
వరంగల్	487-00
రిటైల్ ధర	5.45

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	681.8	5.18
JIOFIN	256.5	2.11
BAJFINANCE	8,977.00	2.04
SHRIRAMFIN	635	1.85
ETERNAL	236.48	1.65

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ASIANPAINT	2,322.00	-3.97
SUNPHARMA	1,780.90	-2.1
BAJAJ-AUTO	7,845.00	-1.26
ITC	430.15	-1.24
GRASIM	2,697.70	-1.14

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,315
ఎన్ఎస్ఈ	1,01,223
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,74,784
ఎఫ్ఐఐ	+ 2,586
డీఐఐ	+ 2,378

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	58.07 (రాత్రి 11.30కు)	$ 59.09 (క్రితం ముగింపు)
బ్రెంట్	61.25 (రాత్రి 11.30కు)	$ 62.15 (క్రితం ముగింపు)

హైదరాబాద్‌లో 5% పెరిగిన ఇళ్ల ధరలు

- చదరపు అడుగు ధర రూ.7,412
- టాప్-8 నగరాల్లో భిన్నమైన పరిస్థితి
- ప్రాప్ టైగర్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు జనవరి-మార్చి త్రైమాసింలో 5 శాతం పెరిగాయి. చదరపు అడుగు ధర 2024 డిసెంబర్ త్రైమాసికం చివరికి రూ.7,053గా ఉంటే, 2025 మార్చి చివరికి రూ.7,412కు చేరుకుంది. ఎంఎంఆర్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణె, చెన్నై నగరాల్లో ధరలు స్థిరంగా కొనసాగగా.. హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, అహ్మదాబాద్, కోల్‌కతాలో ధరలు 4-5 శాతం మధ్య పెరిగినట్టు ప్రాప్ టైగర్ నివేదిక వెల్లడించింది. ఇళ్ల ధరలు గత కొన్నేళ్ల నుంచి ఏటా పెరుగుతూ వచ్చాయని.. ఆ పెరుగుదల వేగం ఇటీవలి త్రైమాసికాల్లో నిదానించినట్టు తెలిపింది. 2022-24 మధ్య ఇళ్ల ధరలు గణనీయంగా పెరిగిన అనంతరం.. మోస్తరు స్థాయికి చేరడంతో వినియోగ డిమాండ్‌కు ఊతమిస్తుందని పేర్కొంది. టాప్-8 నగరాల్లో మార్చి త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలు అంతకుముందు ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 19 శాతం తక్కువగా 98,095 యూనిట్లుగా ఉన్నట్టు ప్రాప్ టైగర్ గత నెలలో విడుదల చేసిన నివేదికలో పేర్కొనడం గమనార్హం. గత కొన్ని త్రైమాసికాలుగా ఇళ్ల ధరల పెరుగుదల మోస్తరుగా ఉండడం మార్కెట్ స్థిరపడినట్టు సంకేతమిస్తోందని హౌసింగ్ డాట్ కామ్, ప్రాప్ టైగర్ గ్రూప్ సీఈవో ధ్రువ్ అగర్వాల్ తెలిపారు. ధరలు తగ్గడం నిజమైన కొనుగోలుదారులకు ప్రేరణనిస్తుందని బీసీడీ గ్రూప్ సీఎండీ అంగద్ బేడి అభిప్రాయపడ్డారు.

నగరాల వారీగా ధరలు..

- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో ఇళ్ల ధర చదరపు అడుగుకు రూ.12,600గా ఉంది.
- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోనూ ఎలాంటి మార్పు లేకుండా రూ.8,106, చెన్నైలో 7,173, పుణెలో రూ.7,109 చొప్పున చదరపు అడుగు ధర మార్చి త్రైమాసికంలో ఉంది.
- అహ్మదాబాద్‌లో చదరపు అడుగు ధర డిసెంబర్ చివరికి రూ.4,402గా ఉంటే, మార్చి చివరికి రూ.4,568కి చేరింది.
- బెంగళూరులో ఇళ్ల ధర చదరపు అడుగుకు రూ.7,536 నుంచి రూ.7,881కి చేరింది.
- కోల్‌కతాలో రూ.5,633 నుంచి రూ.5,839కి పెరిగింది.

టారిఫ్‌లకు రెండు వైపులా పదును

హెచ్‌సీఎల్ గ్రూప్ చైర్‌పర్సన్ రోష్ని నాడార్



న్యూఢిల్లీ: టారిఫ్‌లనేవి రెండువైపులా పదునున్న కత్తిలాంటివని హెచ్‌సీఎల్ గ్రూప్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా వ్యాఖ్యానించారు. అమెరికాలాంటి పెద్ద మార్కెట్లలో టారిఫ్ ప్రభావిత పరిశ్రమలు నెమ్మదించినా వాటికి సేవలు కొనసాగించాల్సి రావడం ఒకెత్తైతే, టారిఫ్‌లవల్ల వ్యయాలు పెరగకుండా చూసుకోవడం మరో ఎత్తవుతుందని ఆమె పేర్కొన్నారు. అయితే, ఇవన్నీ కూడా భారతీయ ఐటీ కంపెనీలు కొత్త వ్యాపారావకాశాలను దక్కించుకునేందుకు కూడా తోడ్పడవచ్చని, ఇందుకు టెక్నాలజీ ఉపయోగపడగలదని ఆమె తెలిపారు. అమెరికా టారిఫ్‌ల ప్రభావం నేరుగా ఐటీ సంస్థలపై పడకపోయినా, అవి సేవలందించే మార్కెట్లలో పరిశ్రమలు మందగించడం వల్ల పరోక్షంగా దెబ్బతినొచ్చనే అంచనాలు ఉన్న నేపథ్యంలో రోష్ని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టారిఫ్‌లు, డీగ్లోబలైజేషన్‌లాంటి భౌగోళికరాజకీయాంశాలు ఐటీ సేవలపై ప్రభావం చూపొచ్చని ఇటీవలే ఆర్థిక ఫలితాలు ప్రకటించిన సందర్భంగా హెచ్‌సీఎల్ టెక్ సీఈవో సి. విజయ కుమార్ కూడా తెలిపారు.

పెట్టుబడి స్కామ్‌లపై మెటా ఫోకస్

23 వేల ఫేస్‌బుక్ పేజీలు, అకౌంట్ల తొలగింపు

న్యూఢిల్లీ: పెట్టుబడుల అవకాశాల పేరిట జరిగే స్కామ్‌లను అరికట్టేందుకు మెటా పలు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా భారత్, బ్రెజిల్‌లో యూజర్లను టార్గెట్‌గా చేసుకున్న 23,000 పైచిలుకు ఫేస్‌బుక్ పేజీలు, ఖాతాలను మార్చి నెలలో తొలగించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ప్రముఖ క్రికెటర్లు, వ్యాపారవేత్తలు, పర్సనల్ ఫైనాన్స్ కంటెంట్ క్రియేటర్లులాంటి వారు మోసపూరిత ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్లను ప్రమోట్ చేస్తున్నట్లుగా మభ్యపెట్టేందుకు స్కామర్లు.. డీప్‌ఫేక్స్‌వంటి టెక్నిక్‌లను ఉపయోగిస్తున్నట్లు వివరించింది. సోషల్ మీడియా, ఈమెయిల్స్, ఫోన్ కాల్స్ మొదలైన మాధ్యమాల ద్వారా వీరు అమాయకులను సంప్రదిస్తున్నట్లు మెటా తెలిపింది. ఆ తర్వాత, నకిలీ వెబ్‌సైట్ల వైపు మళ్లించి, స్కామ్ యాప్‌లను డౌన్‌లోడింగ్ చేసుకునేలా మోసపుచ్చుతున్నారని మెటా పేర్కొంది. ఇలాంటి వాటి బారిన పడకుండా ఉండేందుకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్‌లో ఉండే సాధనాలను వివరించింది.



షాట్ పూనావాలాలో టీపీజీకి వాటా

35 శాతం కొనుగోలుకి రెడీ



న్యూఢిల్లీ: భాగస్వామ్య కంపెనీ(జేవీ) షాట్ పూనావాలాలో ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ దిగ్గజం టీపీజీ 35 శాతం వాటా కొనుగోలు చేయనుంది. ఇందుకు వ్యాక్సిన్ తయారీ దేశీ దిగ్గజం సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎస్ఐఐ)తో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అయితే ఈ వాటా విలువను టీపీజీ వెల్లడించలేదు. టీపీజీ వాటా కొనుగోలు తదుపరి జేవీ షాట్ పూనావాలాలో ఎస్ఐఐ మైనారిటీ వాటాను కొనసాగించనుంది.

ప్రైవేటు పెట్టుబడులు తగ్గుముఖం!

- 2025-26లో 25 శాతం తగ్గొచ్చు
- రూ.4.88 లక్షల కోట్లుగా అంచనా
- ప్రణాళిక శాఖ సర్వే వెల్లడి



న్యూఢిల్లీ: ప్రైవేటు మూలధన వ్యయాలు (పెట్టుబడులు) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 25 శాతం మేర తగ్గిపోవచ్చని కేంద్ర ప్రభుత్వ సర్వే అంచనా వేసింది. రూ.4.88 లక్షల కోట్లుగా ఉండొచ్చని కేంద్ర ప్రణాళికలు, కార్యక్రమాల అమలు శాఖ నిర్వహించిన 'ఫార్వార్డ్ లుకింగ్ సర్వే' తెలిపింది. 2024-25లో ప్రైవేటు రంగ మూలధన వ్యయాలు రూ.6.56 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం. 2023-24లో రూ.4.22 లక్షల కోట్లు కాగా, 2022-23లో రూ.5.72 లక్షల కోట్లు, 2021-22లో రూ.3.94 లక్షల కోట్లుగా ఉన్నట్టు ఈ సర్వే నివేదిక వెల్లడించింది. వీటి ప్రకారం 2021-22 నుంచి 2024-25 మధ్య కాలంలో మొత్తం మీద ప్రైవేటు రంగ మూలధన వ్యయాలు 66.3 శాతం పెరిగాయి. 2021-22లో ఒక్కో సంస్థ గ్రాస్ ఫిక్స్‌డ్ అస్సెట్ (జీఎఫ్ఏ) రూ.3,151 కోట్లుగా ఉంది. ఇది 2022-23లో రూ.3,279 కోట్లకు (4 శాతం వృద్ధి).. 2023-24లో రూ.4,183 కోట్లకు (27 శాతం వృద్ధి) పెరిగింది. విద్యుత్, గ్యాస్, స్టీమ్, ఎయిర్ కండీషనింగ్ సప్లై విభాగంలో ఒక కంపెనీ నుంచి అత్యధిక జీఎఫ్ఏ రూ.14,000 కోట్లుగా ఉంది. 2021-22లో ఒక్కో సంస్థ సగటున రూ.109 కోట్లను మూలధన వ్యయాలపై వెచ్చించింది. 2022-23లో ఇది రూ.149 కోట్లు, 2023-24లో రూ.1.07 కోట్లు, 2024-25లో రూ.172 కోట్ల చొప్పున ఉన్నాయి. తయారీ రంగం నుంచి 43.8 % మూలధన వ్యయాలు ఉంటే.. ఐటీ నుంచి 15.6 %, రవాణా, స్టోరేజీ నుంచి 14 % చొప్పున ఉన్నాయి.

వృద్ధి కోసమే పెట్టుబడులు..

ప్రస్తుత ఆస్తుల విలువను పెంచుకోవడంపై పెట్టుబడులకు 28.4 శాతం కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయి. 11.5 శాతం సంస్థలు అవకాశాలను విస్తృతం చేసుకోవడంపై ఇన్వెస్ట్ చేస్తున్నాయి. ఆదాయ వృద్ధి కోసం 2024-25లో మూలధన వ్యయాలు చేసినట్టు 49.6 శాతం ప్రైవేటు కార్పొరేట్ సంస్థలు తెలిపారు. 30.1 శాతం సంస్థలు సామర్థ్యాల పురోగతికి, 2.8 శాతం సంస్థలు వైవిధ్యంపై పెట్టుబడులు పెట్టినట్టు వెల్లడించాయి.

మార్చి త్రైమాసిక ఫలితాలు

వోల్టాస్‌కు రెట్టింపు లాభం

క్యూ4లో రూ.236 కోట్లు



న్యూఢిల్లీ: టాటా గ్రూపులో భాగమైన కన్స్యూమర్ డ్యూరబుల్స్ కంపెనీ వోల్టాస్ మార్చితో ముగిసిన (2024-25 క్యూ4) త్రైమాసికంలో రాణించింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే రెట్టింపునకు పైగా పెరిగి రూ.236 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.111 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం సైతం ఇదే కాలంలో రూ.4,257 కోట్ల నుంచి రూ.4,847 కోట్లకు పెరిగింది. ఇక 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి లాభం రూ.834 కోట్లకు వృద్ధి చెందింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.248 కోట్లతో పోల్చితే మూడింతలకుపైగా పెరిగింది. వాటాదారుల వద్దనున్న ప్రతి షేరుకు రూ.7 చొప్పున డివిడెండ్ పంపిణీకి కంపెనీ బోర్డు నిర్ణయం తీసుకుంది. యూనిటరీ కూలింగ్ ఉత్పత్తుల విభాగంలో అమ్మకాలు 2024-25లో 36 శాతం పెరిగాయి. ఎలక్ట్రో మెకానికల్ ప్రాజెక్టులు, సేవల విభాగం ఆదాయం 13 శాతం పెరిగి రూ.4,157 కోట్లుగా ఉంది. ఈ విభాగంలో నష్టాలు రూ.108 కోట్ల నుంచి రూ.2 కోట్లకు తగ్గాయి. ఇంజనీరింగ్ ఉత్పత్తులు, సేవల విభాగంలో సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చినట్టు కంపెనీ తెలిపింది.

బీఎస్ఈలో వోల్టాస్ షేరు ధర ఒక శాతానికి పైగా లాభపడి రూ.1244 వద్ద స్థిరపడింది.

డాబర్ లాభం నేలచూపు

- క్యూ4లో రూ. 313 కోట్లు
- షేరుకి రూ. 5.25 డివిడెండ్



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం డాబర్ ఇండియా గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 8 శాతం వెనకడుగుతో రూ. 313 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 341 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం స్వల్ప వృద్ధితో రూ. 2,830 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 2,815 కోట్ల టర్నోవర్ సాధించింది. మొత్తం వ్యయాలు రూ. 2,490 కోట్ల నుంచి రూ. 2,559 కోట్లకు పెరిగాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 5.25 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి డాబర్ నికర లాభం 4 శాతం నీరసించి రూ. 1,740 కోట్లను తాకింది. 2023-24లో రూ. 13,113 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 12,404 కోట్ల నుంచి రూ. 12,563 కోట్లకు స్వల్పంగా పుంజుకుంది.

ఫలితాల నేపథ్యంలో డాబర్ షేరు బీఎస్ఈలో స్వల్పంగా బలపడి రూ. 481 వద్ద ముగిసింది.

హడ్కో లాభం ప్లస్

- క్యూ4లో రూ. 728 కోట్లు




న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం హడ్కో గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 728 కోట్లకు చేరింది. అయితే మొత్తం ఆదాయం రూ. 2,194 కోట్ల నుంచి రూ. 2,855 కోట్లకు మెరుగుపడింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి హడ్కో నికర లాభం రూ. 2,117 కోట్ల నుంచి రూ. 2,709 కోట్లకు జంప్‌చేసింది. ఈ ఏడాది(2025-26) లోన్‌బుక్‌లో 25 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నట్లు కంపెనీ చైర్మన్, ఎండీ సంజయ్ కులశ్రేష్ఠ పేర్కొన్నారు. రుణ ప్రణాళికలను రూ. 65,000 కోట్లకు పెంచుతున్నట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో హడ్కో షేరు బీఎస్ఈలో 1.7 శాతం క్షీణించి రూ. 214 వద్ద ముగిసింది.

టాటా కెమికల్స్‌కు తగ్గిన నష్టాలు

మార్చి క్వార్టర్‌కు రూ.67 కోట్లు



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ సంస్థ టాటా కెమికల్స్ మార్చితో ముగిసిన త్రైమాసికానికి రూ.67 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.818 కోట్ల నష్టంతో పోల్చి చూసినప్పుడు గణనీయంగా తగ్గింది. ఆదాయం ఇదే కాలంలో రూ.3,589 కోట్ల నుంచి రూ.3,551 కోట్లకు తగ్గింది. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి టాటా కెమికల్స్ రూ.354 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.449 కోట్లుగా ఉంది. ఆదాయం రూ.15,707 కోట్ల నుంచి రూ.15,112 కోట్లకు పరిమితమైంది. ఫలితాలపై సంస్థ ఎండీ, సీఈవో ఆర్ ముకుందన్ మాట్లాడుతూ.. ''మార్కెట్ పరిస్థితులు ఇప్పటికీ సవాలుగానే ఉన్నాయి. భారత్ మార్కెట్ వృద్ధిని చూస్తున్నప్పటికీ.. చైనా, యూఎస్, పశ్చిమ యూరప్‌లో ఫ్లాట్, కంటెయినర్ గ్యాస్ డిమాండ్ క్షీణతతో అమ్మకాలు తగ్గాయి. ఆసియా, అమెరికాలో డిమాండ్ బలంగా ఉంటే, ఆఫ్రికాలో డిమాండ్ స్వల్పంగా తగ్గింది''అని వివరించారు. డిమాండ్-సరఫరా పరిస్థితులు కొంత కుదుటపడినప్పటికీ.. టారిఫ్‌లపై నెలకొన్న అనిశ్చితులు మార్కెట్‌పై ప్రభావం చూపిస్తున్నట్టు చెప్పారు. మధ్య కాలం నుంచి దీర్ఘకాలానికి సానుకూలంగా ఉన్నట్టు చెప్పారు.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో టాటా కెమికల్స్ షేరు ధర ఒక శాతం లాభపడి రూ.826 వద్ద ముగిసింది.

ఎంఆర్ఎఫ్ లాభం స్పీడ్

- క్యూ4లో రూ. 512 కోట్లు
- షేరుకి రూ. 229 డివిడెండ్



న్యూఢిల్లీ: టైర్ల తయారీ దేశీ దిగ్గజం ఎంఆర్ఎఫ్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 29 శాతం జంప్‌చేసి రూ. 512 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 396 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,349 కోట్ల నుంచి రూ. 7,075 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 5,916 కోట్ల నుంచి రూ. 6,527 కోట్లకు పెరిగాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 229 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఎంఆర్ఎఫ్ నికర లాభం రూ. 2,081 కోట్ల నుంచి రూ. 1,869 కోట్లకు క్షీణించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 25,169 కోట్ల నుంచి రూ. 28,153 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో ఎంఆర్ఎఫ్ షేరు బీఎస్ఈలో 4 శాతం జంప్‌చేసి రూ. 1,40,429 వద్ద ముగిసింది.

బ్లూస్టార్ లాభం జూమ్

- క్యూ4లో రూ. 194 కోట్లు
- షేరుకి రూ. 9 డివిడెండ్



న్యూఢిల్లీ: కూలింగ్ ప్రొడక్టుల దిగ్గజం బ్లూస్టార్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 21 శాతం జంప్‌చేసి రూ. 194 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 160 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,340 కోట్ల నుంచి రూ. 4,043 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 3,126 కోట్ల నుంచి రూ. 3,798 కోట్లకు పెరిగాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బ్లూస్టార్ నికర లాభం రూ. 414 కోట్ల నుంచి రూ. 591 కోట్లకు జంప్‌చేసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 9 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. అంతేకాకుండా ప్రస్తుత కంపెనీ చైర్మన్, ఎండీగా వీర్ ఎస్.అద్వానీ మరో ఐదేళ్లపాటు బాధ్యతలు నిర్వర్తించేందుకు ఆమోదముద్ర వేసింది. 2026 ఏప్రిల్ 1 నుంచి గడువు ప్రారంభంకానుంది.

ఫలితాల నేపథ్యంలో బ్లూస్టార్ షేరు బీఎస్ఈలో 0.7% బలహీనపడి రూ. 1,680 వద్ద ముగిసింది.

భారత మాజీ ఫుట్‌బాలర్
అఫ్జల్ కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: భారత మాజీ ఫుట్‌బాల్ ప్లేయర్, ఆసియా క్రీడల పసిడి పతక విజేత, హైదరాబాద్‌కు చెందిన డీఎంకే అఫ్జల్ (81) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అఫ్జల్ బుధవారం హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు. 1962లో జాతీయ జట్టు తరపున అరంగేట్రం చేసిన అఫ్జల్... అదే ఏడాది జకార్తాలో జరిగిన ఆసియా క్రీడల్లో పాల్గొని పసిడి పతకం సాధించారు. మైదానం లోపల తన ఆటతీరుతో ఆకట్టుకున్న అఫ్జల్... వెలుపల తన వ్యక్తిత్వంతోనూ మన్ననలు పొందారు. అఫ్జల్ మృతి క్రీడారంగానికి తీరని లోటు అని తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. అఫ్జల్ మృతికి రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్, రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం సహా పులువురు సంతాపం ప్రకటించారు.

హార్దిక్ పాండ్యాపై రూ. 24 లక్షలు జరిమానా

ముంబై: ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై భారీ జరిమానా పడింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో భాగంగా మంగళవారం వాంఖడే స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన పోరులో ముంబై జట్టు స్లో ఓవర్‌రేట్‌కు పాల్పడింది. దీంతో ముంబై సారథి పాండ్యాకు రూ. 24 లక్షల జరిమానా విధించిన ఐపీఎల్ పాలక మండలి... మిగిలిన జట్టు సభ్యులకు (ఇంపాక్ట్ ప్లేయర్ సహా) రూ. 6 లక్షల చొప్పున జరిమానా వేసింది. అదే విధంగా గుజరాత్ టైటాన్స్ కోచ్ ఆశిష్ నెహ్రాపై కూడా పాలక మండలి క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ముంబైతో మ్యాచ్ సందర్భంగా... అంపైర్లతో వాగ్వాదానికి దిగిన నెహ్రా మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించిన ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్... ఒక ‘డీ మెరిట్’ పాయింట్‌ను సైతం కేటాయించింది.



‘ముంబై ఇండియన్స్ జట్టు నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయలేక పోవడం ఈ సీజన్‌లో ఇది రెండోసారి. దీంతో ఐపీఎల్ నియమావళి ప్రకారం ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై రూ. 24 లక్షలు, మిగిలిన ప్లేయర్లపై రూ. 6 లక్షలు జరిమానా విధించాం. గుజరాత్ టైటాన్స్ హెడ్ కోచ్ నెహ్రా మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు ఒక డీ మెరిట్ పాయింట్ కేటాయించాం. అతడు లెవల్-1 తప్పిదానికి పాల్పడ్డాడు’ అని ఐపీఎల్ పాలక మండలి ఒక ప్రకటనలో తెలిపింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే... వర్షం అంతరాయం మధ్య ఆలస్యంగా ముగిసిన పోరులో డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ముంబైపై గుజరాత్ విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయకపోవడంతో... చివరి ఓవర్‌లో బౌండరీ సమీపంలో ఒక ఫీల్డర్‌ను తక్కువ పెట్టాల్సి వచ్చిన ముంబై అందుకు మూల్యం చెల్లించుకుంది.



ముంబై, పంజాబ్ మ్యాచ్ వేదిక మార్పు!

- ధర్మశాల విమానాశ్రయం మూసివేత
- ఇంకా చేరుకోని ముంబై ఇండియన్స్

న్యూఢిల్లీ/ధర్మశాల: ఐపీఎల్ 18వ సీజన్‌లో భాగంగా ఆదివారం (మే 11) ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య జరగనున్న మ్యాచ్ వేదిక మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. షెడ్యూల్ ప్రకారం పంజాబ్ రెండో సొంత మైదానమైన ధర్మశాలలో ఈ మ్యాచ్ జరగాల్సి ఉండగా... ‘ఆపరేషన్ సిందూర్’ నేపథ్యంలో రెండు రోజుల పాటు ధర్మశాల విమానాశ్రయాన్ని మూసివేశారు. దీంతో ముంబై జట్టు ధర్మశాలకు చేరుకోవడం ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన మ్యాచ్‌ను ముంబైలోనే నిర్వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ప్రతీకార చర్యగా భారత సైన్యం... పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు జరిపింది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పలు విమానాశ్రయాలను మూసివేసింది. దీంతో ఐపీఎల్ మ్యాచ్ కోసం ముంబై జట్టు ధర్మశాల చేరుకోవడంపై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ అధికారి మాట్లాడుతూ... ‘ఈ మ్యాచ్ ముంబైలో జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి’ అని అన్నారు. కాగా... గురువారం ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ యథావిధిగా జరగనుంది. ఈ పోరు కోసం ఇరు జట్లు ఇప్పటికే ధర్మశాల చేరుకోవడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. ‘బీసీసీఐ నుంచి కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కానీ ఎలాంటి ఆదేశాలు రాలేదు. దీంతో గురువారం మ్యాచ్ కోసం ఏర్పాట్లు చేశాం. అధికారికంగా చెప్పేనంత వరకు షెడ్యూల్ ప్రకారం ముందుకు వెళ్తాం’ అని హిమాచల్‌ప్రదేశ్ క్రికెట్ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు వేదిక మార్పునకు సంబంధించిన బీసీసీఐ నుంచి ఎలాంటి సమాచారం అందలేదని పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ యాజమాన్యం వెల్లడించింది. ఇక ఐపీఎల్ సాగడంపై ఎలాంటి అనుమానాలు లేవని... ప్రభుత్వ సూచనల మేరకు లీగ్ నిర్వహిస్తామని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ అన్నారు.

పడిక్కల్ స్థానంలో మయాంక్ అగర్వాల్

న్యూఢిల్లీ: గాయం కారణగా ఐపీఎల్‌కు దూరమైన దేవదత్ పడిక్కల్ స్థానంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు... భారత ఆటగాడు మయాంక్ అగర్వాల్‌ను ఎంపిక చేసుకుంది. తాజా సీజన్‌లో 10 మ్యాచ్‌లాడి 247 పరుగులు చేసిన పడిక్కల్ కండరాలు పట్టేయడంతో మిగిలిన సీజన్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో కర్ణాటకకే చెందిన మయాంక్‌ను 1 కోటి రూపాయల ధరతో ఆర్‌సీబీ తీసుకుంది. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు అఫ్గానిస్తాన్ ప్లేయర్ సాదిఖుల్లాను జట్టులోకి తీసుకుంది. ఇంగ్లండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ స్థానంలో 23 ఏళ్ల సాదిఖ్‌ను ఎంపిక చేసుకుంది. అతను 49 టి20ల్లో 1507 పరుగులు చేశాడు. వేలంలో అమ్ముడుపోయిన తర్వాత ఐపీఎల్‌లో ఆడేందుకు నిరాకరించడంతో బ్రూక్‌పై బీసీసీఐ నిషేధం విధించింది.



జెమీమా రోడ్రిగ్స్

‘శత’క్కొట్టిన జెమీమా

ఫైనల్లో భారత మహిళల జట్టు

- మెరిసిన దీప్తి శర్మ, స్మృతి మంధాన
- చివరి లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 23 పరుగులతో విజయం
- ఆదివారం శ్రీలంకతో టైటిల్ పోరు

కొలంబో: ముక్కోణపు మహిళల వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భారత జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. దక్షిణాఫ్రికాతో బుధవారం జరిగిన నాలుగో లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 23 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మూడు జట్ల మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో ఈ టోర్నీ జరుగుతోంది. భారత జట్టు తమ నాలుగు మ్యాచ్‌లను పూర్తి చేసుకుంది. మూడు మ్యాచ్‌ల్లో గెలిచి ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు దక్షిణాఫ్రికా జట్టు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి ఫైనల్‌కు దూరమైంది. భారత్ చేతిలో దక్షిణాఫ్రికా ఓడిపోవడంతో ఆతిథ్య శ్రీలంక జట్టు మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. శుక్రవారం జరిగే నామమాత్రమైన చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక, దక్షిణాఫ్రికా తలపడతాయి. భారత్, శ్రీలంక జట్ల మధ్య టైటిల్ పోరు ఆదివారం జరుగుతుంది. ఫైనల్ బెర్త్ లక్ష్యంగా దక్షిణాఫ్రికాతో పోరు ప్రారంభించిన భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 337 పరుగుల భారీ స్కోరు సాధించింది. జెమీమా రోడ్రిగ్స్ (101 బంతుల్లో 123; 15 ఫోర్లు, 1 సిక్స్) సఫారీ బౌలర్ల భరతం పట్టి కెరీర్‌లో రెండో సెంచరీ సాధించింది. ఓపెనర్ స్మృతి మంధాన (63 బంతుల్లో 51; 6 ఫోర్లు) కెరీర్‌లో 31వ అర్ధ సెంచరీ నమోదు చేసుకోగా... దీప్తి శర్మ (84 బంతుల్లో 93; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడి త్రుటిలో శతకాన్ని చేజార్చుకుంది. అనంతరం దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 314 పరుగులు చేసి ఓడిపోయింది. అనెరి డెరెక్సన్ (80 బంతుల్లో 81; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), చోల్ ట్రయాన్ (43 బంతుల్లో 67; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో రాణించినా ఫలితం లేకపోయింది. గాయం కారణంగా దక్షిణాఫ్రికా రెగ్యులర్ కెప్టెన్ లౌరా వొల్వార్ట్ ఈ మ్యాచ్‌కు దూరంకాగా... చోల్ ట్రయాన్ సారథిగా వ్యవహరించింది. ఈ మ్యాచ్‌తో శుచి ఉపాధ్యాయ్ (భారత్), మియాని స్మిట్ (దక్షిణాఫ్రికా) అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశారు.

122 పరుగుల భాగస్వామ్యం

ఫైనల్ బెర్త్ లక్ష్యంగా బరిలోకి దిగిన భారత్‌కు శుభారంభం లభించలేదు. ప్రతీక (1), హర్లీన్ డియోల్ (4), హర్మన్‌ప్రీత్ కౌర్ (20 బంతుల్లో 28; 6 ఫోర్లు) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. ఈ దశలో స్మృతి, జెమీమా మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. నాలుగో వికెట్‌కు 88 పరుగులు జోడించారు. స్మృతి అర్ధ సెంచరీ పూర్తి



దీప్తి శర్మ

చేసుకున్న వెంటనే అవుటవ్వగా... జెమీమాతో దీప్తి శర్మ జత కలిసింది. వీరిద్దరూ దూకుడుగా ఆడటంతో భారత స్కోరు బోర్డులో వేగం పెరిగింది. ఈ క్రమంలో జెమీమా శతకం పూర్తి చేసుకుంది. ఐదో వికెట్‌కు వీరిద్దరూ 122 పరుగుల భాగస్వామ్యం జోడించాక జెమీమా పెవిలియన్ చేరుకుంది. వన్డేల్లో ఐదో వికెట్‌కు భారత్‌కిదే అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం. గతంలో ఈ రికార్డు మిథాలీ రాజ్-వేద కృష్ణమూర్తి (108 పరుగులు) పేరిట ఉండేది. జెమీమా అవుటయ్యాక దీప్తి శర్మ మరింత దూకుడు పెంచడంతో భారత స్కోరు 300 పరుగులు దాటింది. ఏడు పరుగుల తేడాతో దీప్తి శర్మ సెంచరీని కోల్పోయింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో ఏ దశలోనూ విజయంపై ఆశలు రేకెత్తించలేదు. డెరెక్సన్, ట్రయాన్ మెరిపించినా దక్షిణాఫ్రికా విజయానికి సరిపోలేదు. భారత బౌలర్లలో అమన్‌జోత్ కౌర్ మూడు వికెట్లు పడగొట్టింది. జెమీమా రోడ్రిగ్స్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు లభించింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ప్రతీక రావల్ (సి) డెరెక్సన్ (బి) డి క్లెర్క్ 1; స్మృతి మంధాన (సి) డి క్లెర్క్ (బి) ట్రయాన్ 51; హర్లీన్ డియోల్ (బి) క్లాస్ 4; హర్మన్‌ప్రీత్ కౌర్ (సి) షాంగేస్ (బి) డెరెక్సన్ 28; జెమీమా రోడ్రిగ్స్ (సి) సునె లుస్ (బి) క్లాస్ 123; దీప్తి శర్మ (సి) ట్రయాన్ (బి) డి క్లెర్క్ 93; రిచా ఘోష్ (సి) బ్రిట్స్ (బి) మలాబా 20; అమన్‌జోత్ కౌర్ (సి) స్మిట్ (బి) మలాబా 5; శ్రీ చరణి (రనౌట్) 6; స్నేహ్ రాణా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 337. వికెట్ల పతనం:** 1-9, 2-18, 3-50, 4-138, 5-260, 6-296, 7-314, 8-336, 9-337. **బౌలింగ్:** మసబటా క్లాస్ 8-0-51-2, నదినె డి క్లెర్క్ 9-0-54-2, అనెరి డెరెక్సన్ 6-0-36-1, మలాబా 8-0-71-2, షాంగేస్ 6-0-43-0, చోల్ ట్రయాన్ 8-0-46-1, సునె లుస్ 3-0-15-0, మియాని స్మిట్ 2-0-20-0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: లారా గుడాల్ (సి) రిచా ఘోష్ (బి) అమన్‌జోత్ కౌర్ 4; తజ్మిన్ బ్రిట్స్ (సి) జెమీమా (బి) అమన్‌జోత్ కౌర్ 26; మియాని స్మిట్ (బి) దీప్తి శర్మ 39; అనెరి డెరెక్సన్ (బి) అమన్‌జోత్ కౌర్ 81; షాంగేస్ (సి) హర్లీన్ డియోల్ (బి) ప్రతీక రావల్ 36; సినాలో జాఫ్టా (ఎల్బీడబ్ల్యూ) (బి) శ్రీ చరణి 21; చోల్ ట్రయాన్ (బి) దీప్తి శర్మ 67; నదినె డి క్లెర్క్ (నాటౌట్) 22; సునె లుస్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 314. వికెట్ల పతనం:** 1-7, 2-70, 3-89, 4-159, 5-188, 6-260, 7-311. **బౌలింగ్:** స్నేహ్ రాణా 7-1-53-0, అమన్‌జోత్ కౌర్ 9-0-59-3, శ్రీ చరణి 10-0-58-1, శుచి ఉపాధ్యాయ్ 9-0-59-0, దీప్తి శర్మ 10-0-57-2, ప్రతీక రావల్ 3-0-15-1, స్మృతి మంధాన 2-0-12-0.

రెండు స్వర్ణాలపై భారత్ గురి

కాంపౌండ్ విభాగంలో ఫైనల్ చేరిన భారత పురుషుల, మహిళల జట్లు ● శనివారం మెక్సికో జట్లతో పసిడి పోరు

షాంఘై: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నమెంట్‌లో భారత్‌కు రెండు పతకాలు ఖాయమయ్యాయి. బుధవారం జరిగిన కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో భారత పురుషుల, మహిళల జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. ఫలితంగా భారత్ ఖాతాలో కనీసం రెండు స్వర్ణాలు లేదా రెండు రజతాలు చేరనున్నాయి. వెన్నం జ్యోతి సురేఖ (ఆంధ్రప్రదేశ్), తనిపర్తి చికిత (తెలంగాణ), మధుర (మహారాష్ట్ర)లతో కూడిన భారత మహిళల కాంపౌండ్ జట్టు... అభిషేక్ వర్మ, రిషభ్ యాదవ్, ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలేలతో కూడిన భారత పురుషుల కాంపౌండ్ జట్టు టైటిల్ పోరుకు అర్హత సాధించాయి. మరోవైపు మెక్సికో పురుషుల, మహిళల జట్లు కూడా ఫైనల్లోకి అడుగు పెట్టాయి. శనివారం భారత్, మెక్సికో జట్లు రెండు స్వర్ణాల కోసం పోటీపడతాయి.

క్వాలిఫయింగ్‌లో అగ్రస్థానంలో నిలిచినందుకు... భారత జట్లకు నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు ‘బై’ లభించింది. క్వార్టర్ ఫైనల్లో భారత మహిళల జట్టు 232-229 పాయింట్ల తేడాతో అదెల్ జెక్సెన్‌బినోవా, విక్టోరియా లియాన్, రొక్సానా యునోసోవాలతో కూడిన కజకిస్తాన్ జట్టును ఓడించింది. సెమీఫైనల్లో భారత జట్టు 232-230 పాయింట్లతో ఎల్లా గిబ్సన్, ఇసబెల్లా కార్పెంటర్, లేలా అనిసన్‌లతో కూడిన బ్రిటన్ జట్టుపై గెలిచింది. క్వార్టర్ ఫైనల్లో భారత పురుషుల జట్టు 239-232 పాయింట్ల తేడాతో అజయ్ స్కాట్, ఆడమ్ కార్పెంటర్, ల్యూక్ డేవిస్‌లతో కూడిన బ్రిటన్ జట్టుపై నెగ్గింది. సెమీఫైనల్లో భారత బృందం 232-231 పాయింట్ల తేడాతో మథియాస్ ఫులర్టన్, మార్టిన్ డామ్స్‌బో, నిక్లాస్ బ్రెడాల్‌లతో కూడిన డెన్మార్క్ జట్టును ఓడించింది.



రిషభ్ యాదవ్, అభిషేక్ వర్మ, ఓజస్ ప్రవీణ్



చికిత, మధుర, జ్యోతి సురేఖ

తొమ్మిదో స్థానంలో ధీరజ్

బుధవారం జరిగిన రికర్వ్ విభాగం పురుషుల క్వాలిఫయింగ్‌లో భారత ఆర్చర్లు అంతగా ఆకట్టుకోలేకపోయారు. పారిస్ ఒలింపియన్, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్ 677 పాయింట్లు స్కోరు చేసి తొమ్మిదో స్థానంలో నిలిచాడు. 666 పాయింట్లతో తరుణ్‌దీప్ రాయ్ 28వ స్థానంలో, 652 పాయింట్లతో అతాను దాస్ 57వ స్థానంలో, 651 పాయింట్లతో పార్థ్ సాలుంఖే 60వ స్థానంలో నిలిచారు. ఓవరాల్‌గా 1995 పాయింట్లు స్కోరు చేసి ఏడో స్థానంలో నిలిచిన భారత్‌కు తొలి రౌండ్‌లో ‘బై’ లభించింది. రికర్వ్ విభాగం మహిళల క్వాలిఫయింగ్‌లో భారత స్టార్ దీపిక కుమారి 655 పాయింట్లు సాధించి 12వ స్థానాన్ని దక్కించుకుంది. 652 పాయింట్లతో అంకిత 17వ స్థానంలో, 642 పాయింట్లతో అన్షిక 29వ స్థానంలో, 637 పాయింట్లతో సిమ్రన్‌జిత్ కౌర్ 39వ స్థానంలో నిలిచారు. ఓవరాల్‌గా 1949 పాయింట్లతో భారత్ మూడో స్థానంలో నిలిచిన భారత్‌కు తొలి రౌండ్‌లో ‘బై’ దక్కింది.



ధీరజ్



శ్రీకాంత్ శుభారంభం

తైపీ సిటీ: భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ చైనీస్ తైపీ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-16, 21-15తో భారత్‌కే చెందిన శంకర్ సుబ్రమణియన్‌పై విజయం సాధించాడు. ప్రస్తుతం ప్రపంచ 61వ ర్యాంక్‌లో ఉన్న శ్రీకాంత్ వరుస గేముల్లో గెలుపొందాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో మరో భారత షట్లర్ ఆయుశ్ శెట్టితో శ్రీకాంత్ తలపడనున్నాడు. ఇతర మ్యాచ్‌ల్లో హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి 21-17, 19-21, 21-12తో షోగో ఒగావా (జపాన్)పై, ఆయుశ్ 21-17, 21-18తో మూడో సీడ్ లీ చై హో (చైనీస్ తైపీ)పై విజయాలు సాధించారు. 70 నిమిషాల పాటు సాగిన పోరులో తరుణ్ సత్తా చాటగా.. ఆయుశ్ 50 నిమిషాల్లో మూడో సీడ్‌ను బోల్తా కొట్టించాడు. మరో మ్యాచ్‌లో మైస్నం మెరాబా లువాంగ్ (భారత్) 21-23, 12-21తో బ్రియాన్ యంగ్ (కెనడా) చేతిలో ఓడాడు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా విజయం సాధించగా... ఆకర్షి కశ్యప్ పరాజయం పాలైంది. ఉన్నతి 21-13, 21-17తో భారత్‌కే చెందిన అనుపమా ఉపాధ్యాయపై గెలవగా... ఆకర్షి (భారత్) 9-21, 12-21తో హుంగ్ యీ టింగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడింది.


ఆపరేషన్ అభ్యాస్‌లో భాగంగా పణజీలో మాక్‌డ్రిల్ చేస్తున్న పౌర సిబ్బంది


ముంబైలో..


మీరట్‌లో..


న్యూఢిల్లీలో..


కొచ్చీలో..


ప్రయాగ్‌రాజ్‌లో..


ముంబైలో..


కొచ్చీలో..

2040 నాటికి చంద్రుడిపై మన పాదముద్ర

2035 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రం
- అంతరిక్ష ప్రయోగాల్లో ముందంజలో భారత్
- ప్రధాని నరేంద్ర మోదీ హర్షం

న్యూఢిల్లీ: అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ ముందంజలో దూసుకెళ్తోందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. 2040 నాటికి చందమామపై మన వ్యోమగాములు అడుగు పెట్టబోతున్నారని చెప్పారు. అంగారక(మార్స్), శుక్ర(వీనస్) గ్రహాలపైనా ప్రయోగాలు చేయబోతున్నట్లు వెల్లడించారు. గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కాన్ఫరెన్స్(గ్లెక్స్-2025) సందర్భంగా ప్రధాని మోదీ బుధవారం ఈ మేరకు వీడియో సందేశం విడుదల చేశారు. అంతరిక్ష ప్రయోగ ప్రణాళికలు వివరించారు. 2035 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత 2040 నాటికి చంద్రుడిపై మన పాదముద్ర ఉంటుందని పేర్కొన్నారు. మరో 15 ఏళ్లలో భారతీయ వ్యోమగాములు చందమామపై అడుగుపెట్టడం తథ్యమని స్పష్టంచేశారు. మన అంతరిక్ష ప్రయాణం ఇతరులతో పోటీకి సంబంధించింది కాదని, అందరినీ కలుపుకొని ఈ రంగంలో ఉన్నత శిఖరాలకు చేరాలన్నదే అసలు లక్ష్యమని ఉద్ఘాటించారు. మొత్తం మానవాళికి లబ్ధి చేకూరేలా అంతరిక్ష ప్రయోగాల్లో తమ ఉమ్మడి లక్ష్యాన్ని అందరితో పంచుకుంటామని వ్యాఖ్యానించారు.

జీ20 ఉపగ్రహం ప్రయోగిస్తాం

దక్షిణాసియా దేశాల కోసం ఒక శాటిలైట్ ప్రయోగించామని ప్రధాని మోదీ గుర్తుచేశారు. గ్లోబల్ సౌత్ దేశాలకు బహుమతిగా జీ20 ఉపగ్రహం ప్రయోగించబోతున్నామని చెప్పారు. గగన్‌యాన్ ప్రాజెక్టు మన దేశ ఆకాంక్షలకు ప్రతిబింబిస్తోందని అన్నారు. మన తొలి మానవసహిత స్పేస్-ఫ్లైట్‌ను త్వరలో అంతరిక్షంలోకి పంపించబోతున్నామని చెప్పారు. ఇస్రో-నాసా ఉమ్మడి మిషన్‌లో భాగంగా భారతీయ వ్యోమగామి మరికొన్ని వారాల్లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) చేరుకోబోతున్నాడని వివరించారు. అంతరిక్షం అంటే కేవలం ఒక గమ్యం కాదని.. ఉత్సుకత, ధైర్యం, సమీకృత ప్రగతికి ఒక ప్రతీక అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. భారతదేశ అంతరిక్ష ప్రయాణం ఆ దిశగానే సాగుతోందని చెప్పారు.



1963లో ఒక చిన్న రాకెట్ ప్రయోగంతో మన అంతరిక్ష యాత్ర ఆరంభమైందని గుర్తుచేశారు. అనంతరం ఈ రంగంలో ఎంతగానో పురోగమించామని, చంద్రుడి దక్షిణ ధ్రువంపై స్పేస్‌క్రాఫ్ట్‌ను ల్యాండ్ చేసిన తొలి దేశంగా రికార్డు సృష్టించామని పేర్కొన్నారు. మన ప్రయాణం చరిత్రాత్మకమని అభివర్ణించారు. మన రాకెట్లు పేలోడ్స్ కంటే అధికంగా 140 కోట్ల మంది భారతీయుల కలలను మోసుకెళ్తుంటాయని వివరించారు. తొలి ప్రయత్నంలోనే మార్స్ వద్దకు చేరుకున్న దేశంగా ఇండియా చరిత్ర సృష్టించిందన్నారు. చంద్రయాన్ ప్రయోగాలతో చంద్రుడిపై నీటి జాడ కనిపెట్టామని, అత్యంత నాణ్యమైన చంద్రుడి ఫొటోలు చిత్రీకరించామని, అక్కడి దక్షిణ ధ్రువం గురించి మరింత సమాచారం తెలుసుకున్నామని వెల్లడించారు. రికార్డు సమయంలో క్రయోజెనిక్ ఇంజన్లు తయారు చేశామని, ఒకేసారి 100 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించామని గుర్తుచేశారు. 34 దేశాలకు చెందిన 400కుపైగా శాటిలైట్లను మన అంతరిక్ష నౌకల ద్వారా ప్రయోగించామని అన్నారు. ఈ ఏడాది అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానించామని, ఇదొక గొప్ప ముందడుగు అని తెలియజేశారు.

సైరన్ మోతలు.. ప్రజల పరుగులు

దేశవ్యాప్తంగా ఆపరేషన్ అభ్యాస్ మాక్‌డ్రిల్స్

- ప్రధాన నగరాల్లో అత్యవసర రక్షణ చర్యలపై అవగాహన
- ఢిల్లీలో 55 ప్రాంతాల్లో డ్రిల్స్.. 15 నిమిషాలు కరెంట్ కట్
- పంజాబ్, ముంబై, బెంగళూరులో యుద్ధ సన్నద్ధత అభ్యాసం

న్యూఢిల్లీ: సమయం బుధవారం సాయంత్రం 4 గంటలు.. ఒక్కసారిగా సైరన్ల మోతలు.. రయ్ రయ్‌మంటూ దూసుకొచ్చిన అగ్నిమాపక శకటాలు, అంబులెన్స్‌లు.. ప్రజల ఉరుకులు, పరుగులు.. అగ్నిప్రమాదాలు, భవనాల శిథిలాలు, ఎత్తయిన భవనాల్లో చిక్కుకున్నవారిని కాపాడేందుకు పరుగెత్తుతున్న పోలీసులు, భద్రతా సిబ్బంది.. దేశ రాజధాని ఢిల్లీ సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో 'ఆపరేషన్ అభ్యాస్'లో భాగంగా బుధవారం సాయంత్రం నిర్వహించిన మాక్ డ్రిల్స్‌లోని దృశ్యాలివి. యుద్ధం వస్తే సామాన్య పౌరులు, భద్రతా బలగాలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశంపై కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా మాక్‌డ్రిల్స్ నిర్వహించారు. ఢిల్లీలో 55 కీలక ప్రాంతాల్లో డ్రిల్స్ కొనసాగాయి. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద నిర్వహించిన మాక్ డ్రిల్స్‌లో ఫైర్ సిబ్బందితోపాటు వైద్యులు పాల్గొని బాంబుదాడుల్లో ప్రజలు గాయపడితే అప్పటికప్పుడు వైద్య సేవలు ఎలా అందించాలన్న అంశంపై అభ్యాసం చేశారు. నగరం నలుమూలల నిర్వహించిన ఈ డ్రిల్స్‌లో విద్యార్థులు, టీచర్లు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఖాన్ మార్కెట్, ఎన్ఎండీసీ భవనం, సాకేత్‌లోని సిటీవాక్ మాల్, చాందినీ చౌక్, పటేల్‌నగర్ తదితర ప్రాంతాల్లో మాక్‌డ్రిల్స్ అరగంటపాటు మాక్‌డ్రిల్స్ నిర్వహించారు. మరోవైపు యుద్ధ సన్నద్ధతలో భాగంగా ఢిల్లీ నగరం బుధవారం రాత్రి 15 నిమిషాలపాటు అంధకారంలోకి వెళ్లింది. రాత్రి 8 గంటల నుంచి 8.15 గంటల వరకు న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ నగరంలోని చాలాప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేసింది. ఆపరేషన్ అభ్యాస్‌లో భాగంగానే విద్యుత్ సరఫరాను నిలిపేసినట్లు అధికారులు తెలిపారు. ఈ డ్రిల్స్ నుంచి ఆసుపత్రులు, మెట్రో స్టేషన్లు, దౌత్య కార్యాలయాలు, రాష్ట్రపతి భవన్, ప్రధాని కార్యాలయాన్ని మినహాయించారు.

కీలకమైన 300 ప్రాంతాల్లో డ్రిల్స్

దేశంలో రక్షణ, పరిశోధనల పరంగా అత్యంత కీలకమైన 300 ప్రాంతాల్లో మాక్‌డ్రిల్స్ పెద్ద ఎత్తున నిర్వహించారు. అణు కేంద్రాలు, మిలిటరీ బేస్‌లు, చమురు రిఫైనరీలు, జలవిద్యుత్ కేంద్రాలు, భారీ నీటి రిజర్వాయర్ల వద్ద డ్రిల్స్ కొనసాగాయి. ఇందులో భాగంగా బంకర్లు, ట్రెంచ్‌లను శుభ్రం చేసి.. శత్రువులు దాడిచేస్తే వెంటనే అందులో దాక్కోవటంపై ప్రజలకు వివరించారు. పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంగా ఉండే పంజాబ్‌లో చాలాప్రాంతాల్లో డ్రిల్స్ నిర్వహించారు. ఫిరోజ్‌పూర్, లుధియానా, అమృత్‌సర్, బటిండా, గుర్దాస్‌పూర్, హోషియార్‌పూర్, పటియాలా, పఠాన్‌కోట్, బర్నాలా, మొహాలీ తదితర ప్రాంతాల్లో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో అధికారులకు సహకారం అందించటంపై ప్రజలకు వివరించినట్లు సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ దీపక్ పరీక్ తెలిపారు. ముంబైలోని ప్రఖ్యాత ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ వద్ద రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్పీ) సంయుక్తంగా మాక్‌డ్రిల్స్ నిర్వహించాయి. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ), సివిల్ డిఫెన్స్, బీఎంసీ ఫైర్ బ్రిగేడ్, హోంగార్డులు, ఎస్ఎస్ఎస్, పారామెడికల్ సిబ్బంది కూడా డ్రిల్స్‌లో పాల్గొన్నారని సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రభాత్‌కుమార్ తెలిపారు. బెంగళూరులో చాలాచోట్ల మాక్‌డ్రిల్స్ నిర్వహించారు. అగ్నిప్రమాద ప్రాంతాల్లో చిక్కుకున్నవారిని సురక్షితంగా కాపాడటం, కూలిన భవన శిథిలాల నుంచి పౌరులను రక్షించటం, ఎత్తయిన భవనాల్లో చిక్కుకున్నవారిని కాపాడటం, మెడికల్ ఎమర్జెన్సీ సర్వీసుల వంటి కార్యక్రమాలను మాక్‌డ్రిల్స్‌లో భాగంగా నిర్వహించారు.

ప్రధాన నగరాల్లో హై అలర్ట్

పాక్ ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం దాడి నేపథ్యంలో దేశంలోని కీలక ప్రాంతాల్లో ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. ఢిల్లీలోని అనేక ప్రాంతాలు భద్రతా బలగాల పహారాలోకి వెళ్లిపోయాయి. కీలక ప్రాంతాల్లో బలగాల మోహరింపును పెంచినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. రోడ్లపై పెట్రోలింగ్‌ను పెంచారు. కన్నాట్‌ప్లేస్, ఇండియా గేట్, జన్‌పథ్, యశ్వంత్ ప్యాలెస్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పెట్రోలింగ్ సిబ్బందిని నియమించి రాత్రి, పగలు గస్తీ కాస్తున్నారు. ముంబైలో కూడా హై అలర్ట్ ప్రకటించారు.

సీబీఐ చీఫ్ ప్రవీణ్ సూద్‌కు ఏడాది పొడిగింపు

న్యూఢిల్లీ: సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని మరో ఏడాది పొడిగించారు. ఈ మేరకు కేబినెట్ నియామకాల కమిటీ నిర్ణయం తీసుకుంది. సీబీఐ డైరెక్టర్ నియామక కమిటీలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని పొడిగించారు. ప్రవీణ్ 2023 మేలో సీబీఐ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. సుబోధ్ జైస్వాల్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ యాక్ట్-2003 ప్రకారం సీబీఐ డైరెక్టర్ పదవీకాలం రెండేళ్లు. ప్రవీణ్ సూద్ రెండేళ్ల పదవీకాలం మే 24తో ముగియనుంది. దీంతో సీబీఐ చీఫ్‌ను ఎన్నుకోవడానికి ప్రధాని మోదీ ఎంపిక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా కూడా హాజరయ్యారు. అయితే ఈ భేటీలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ప్రవీణ్‌ను కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ప్రవీణ్ సూద్ 1986 బ్యాచ్, కర్ణాటక కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. 1989లో మైసూరులో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. బళ్లారి, రాయచూర్ ఎస్పీగా పనిచేసి బెంగళూరులో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ)గా నియమితులయ్యారు. డిప్యూటేషన్‌పై మూడేళ్ల పాటు మారిషస్‌లో పనిచేశారు. 2004 నుంచి 2007 వరకు మైసూరు నగర పోలీసు కమిషనర్‌గా కూడా పనిచేశారు. ఆ తర్వాత 2011 వరకు బెంగళూరు ట్రాఫిక్ పోలీస్‌లో అడిషనల్ పోలీస్ కమిషనర్, 2013-14 వరకు కర్ణాటక స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఆ తరువాత రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా, కర్ణాటక స్టేట్ రిజర్వ్ పోలీస్ ఏడీజీపీగా, అడ్మినిస్ట్రేషన్ ఏడీజీపీగా, కర్ణాటక డీజీపీగా పనిచేశారు.

ఎఫ్‌డీఏ వ్యాక్సిన్స్ విభాగం హెడ్‌గా
ఇండియన్ అమెరికన్

వాషింగ్టన్: అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) వ్యాక్సిన్ విభాగం సెంటర్ ఫర్ బయోలాజిక్స్ ఎవాల్యుయేషన్ అండ్ రీసెర్చ్ (సీబీఈఆర్) డైరెక్టర్‌గా భారత సంతతికి చెందిన హెమటాలజిస్ట్-ఆంకాలజిస్ట్ వినయ్ ప్రసాద్ నియమితులయ్యారు. ఎఫ్‌డీఏ కమిషనర్ మార్టి మకారీ ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రసాద్‌కు మెడిసిన్‌లో సుదీర్ఘమైన, విశిష్టమైన చరిత్ర ఉందని, ఆయన ఆంకాలజీలో విస్తృతమైన పరిశోధనలు చేశారని మకారీ పేర్కొన్నారు. సీబీఈఆర్.. ఎఫ్‌డీఏ కింద ఉన్న టీకాలు, ఔషధాలను పర్యవేక్షిస్తుంది. ప్రసాద్ గతంలో ఎఫ్‌డీఏను, కోవిడ్-19 వాక్సిన్స్, మాస్క్ ఆదేశాలను తీవ్రంగా విమర్శించడం గమనార్హం. కోవిడ్ సమయంలో ప్రసాద్ తన బ్లాగులో, సోషల్ మీడియా వేదికలపై సీబీఈఆర్ అప్పటి డైరెక్టర్ మార్క్స్ నాయకత్వాన్ని తీవ్రంగా ఖండించారు. పాఠశాల మూసివేతలు, మాస్క్ విధానాలు, కోవిడ్ -19 బూస్టర్ షాట్‌ను వ్యతిరేకించారు. అందుకు ప్రస్తుత ఎఫ్‌డీఏ కమిషనర్ డాక్టర్ మార్టి మకారీ నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రసాద్ నియామకంపై సీబీఈఆర్ మాజీ డైరెక్టర్ పీటర్ మార్క్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, సీబీఈఆర్ డైరెక్టర్‌గా ప్రసాద్ నియామకం తరువాత వ్యాక్సిన్ తయారీ సంస్థ మోడెర్నా (నాస్డాక్: ఎంఆర్ఎన్ఏ) షేర్లు సుమారు 10 శాతం క్షీణించాయి. ఫైజర్ షేర్లు 3 శాతం తగ్గాయి. సరెప్టా థెరప్యూటిక్స్, టీషా జీన్ థెరపీస్ వంటి చిన్న జన్యు చికిత్స సంస్థలు తీవ్రమైన నష్టాలను చవిచూశాయి. సుమారు 20% పడిపోయాయి. చికాగో విశ్వవిద్యాలయం నుంచి వైద్య పట్టా పొందిన ప్రసాద్.. నేషనల్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌లో సేవలందించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఎపిడెమియాలజీ ప్రొఫెసర్‌గా పనిచేశారు.

భారత సైన్యం చరిత్ర సృష్టించింది: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను కచ్చితత్వంతో ధ్వంసం చేసి భారత సైన్యం చరిత్ర సృష్టించిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడానికి సాయుధ దళాలు ముందుజాగ్రత్త, కరుణతో వ్యవహరించాయన్నారు. యావత్ దేశం తరఫున సాయుధ దళాలకు అభినందనలు తెలిపారు. మంత్రి బుధవారం బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) రైజింగ్ డే వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. పహల్గాం దాడికి ప్రతిస్పందించే హక్కును భారత్ ఉపయోగించిందని, ప్రణాళిక ప్రకారమే లక్ష్యాలను ధ్వంసం చేశామని తెలిపారు. ప్రణాళిక ప్రకారం పౌరులెవరికీ హాని జరగలేదని స్పష్టం చేశారు. మన సాయుధ బలగాలు ఏం చేశాయో ప్రపంచం మొత్తం చూసిందని, ఈ చర్య చాలా ఆలోచనాత్మకంగా, పకడ్బందీగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. బలగాలకు పూర్తి సహకారం అందించినందుకు ప్రధాని నరేంద్ర మోదీని అభినందిస్తున్నానని చెప్పారు. అశోకవనం విధ్వంసం సమయంలో 'జిన్ మోహి మారా, టిన్ మోహి మారే' (నాపై దాడి చేసిన వారిని మాత్రమే కొట్టాను) అన్న హనుమంతుడి ఆదర్శాలను అనుసరించామన్నారు. అమాయక ప్రజలను చంపిన వారిని మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని సింగ్ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి సూత్రధారులను, వ్యూహకర్తలను శిక్షించడానికి భారత్ దాడులు చేయాలని నిర్ణయించిందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడి సూత్రధారులు, నిర్వాహకులు, ఫైనాన్షియర్లు, స్పాన్సర్లను బాధ్యులను చేయాలన్న ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ప్రకటనకు అనుగుణంగానే భారత్ చర్యలు ఉన్నాయని ఆయన వెల్లడించారు.


సెయింట్ పీటర్స్ బాసిలికాలో సమావేశమైన కార్డినళ్లు


ప్రత్యేక కార్యక్రమానికి సారథ్యంవహించిన కార్డినల్ గియోవన్నీ

తొలి రౌండ్‌లో రాని మెజారిటీ

- చిమ్నీ నుంచి నల్లరంగు పొగ
- కొనసాగుతున్న పోప్ ఎన్నిక ప్రక్రియ

వాటికన్ సిటీ: దాదాపు 140 కోట్ల మంది క్యాథలిక్‌లకు అత్యున్నత మతాధికారి అయిన నూతన పోప్‌ను ఎన్నుకునేందుకు నిర్వహించే రహస్య ఓటింగ్ ప్రక్రియ మొదలైంది. 70 దేశాలకు చెందిన 133 మంది కార్డినళ్లు వాటికన్ సిటీలోని సిస్టిన్ ఛాపెల్‌లోకి బుధవారం ప్రవేశించారు. పైభాగంలో ఎరుపు రంగు వస్త్రం ధరించిన కార్డినళ్లు ఇద్దరిద్దరు జంటగా 'లిటనీ ఆఫ్ సెయింట్'గీతాలాపన మధ్య ఛాపెల్‌లోకి వెళ్లారు. 80 ఏళ్లలోపు కార్డినళ్లలో అత్యంత సీనియర్ అయిన పియెట్రో పరోలిన్ ఈ ప్రవేశానికి నాయకత్వం వహించారు. పోప్ పదవి కోసం పోటీపడుతున్న వారిలో పరోలిన్ అత్యంత మెరుగైన అవకాశాలున్న వ్యక్తిగా ప్రచారం పొందారు. మిగతా కార్డినళ్లతో ఈయనే ప్రత్యేక ప్రమాణం చేయించారు. పోప్ ఎన్నిక క్రతువులో రహస్య విధానానికి కట్టుబడి ఉంటామని కార్డినళ్లు లాటిన్ భాషలో ప్రతిజ్ఞ చేశారు. వేలాది మంది క్యాథలిక్‌లు వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్ విశాల ప్రాంగణానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ తెరల్లో సిస్టిన్ ఛాపెల్ వద్ద జరుగుతున్న కార్యక్రమాలను వీక్షించారు. ఛాపెల్‌లోకి వెళ్లడానికి ముందు కార్డినళ్లు ఒకసారి సమావేశమయ్యారు. చర్చికి యువరాజులుగా పిల్చుకునే కార్డినళ్లు ఎవరిని పోప్‌గా ఎన్నుకుంటారనే విషయం మొట్టమొదట అక్కడి ఛాపెల్ పైకప్పు మీద ఏర్పాటుచేసిన చిమ్నీ పొగ ద్వారా ప్రపంచానికి తెలియనుంది. నల్ల రంగు పొగ వెలువడితే మరోమారు ఓటింగ్ జరగనుందని అర్థం. తెల్లరంగు పొగ వస్తే కొత్త పోప్ ఎన్నిక ఖరారైందని అర్థం. బుధవారం కార్డినళ్లు లోపలికి వెళ్లిన వెంటనే అక్కడి జనమంతా ఆ పొగగొట్టం వైపే తదేకంగా చూడటం కనిపించింది. ఇటీవల దివంగతులైన పోప్ ఫ్రాన్సిస్‌ను ఆనాడు 133 కార్డినళ్లకుగాను 108 మంది ఓటేసి ఎన్నుకున్నారు. మూడింట రెండొంతుల మంది ఓటేసిన వ్యక్తే పోప్‌గా అర్హత సాధిస్తారు. ఇప్పుడున్న కార్డినళ్లలో తక్కువ వయసు ఉన్న వాళ్లను పోప్ ఫ్రాన్సిస్ నియమించారు. వీరెవరూ గతంలో పోప్ ఎన్నిక ప్రక్రియలో పాల్గొనలేదు. తొలి రౌండ్ ఓటింగ్‌లో ఎవరికీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో బ్యాలెట్ చిట్టీలను నల్లరంగు ద్రావకంలో ముంచి కాల్చేశారు. దీంతో చిమ్నీ నుంచి బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నల్లరంగు పొగ వెలువడింది. దీంతో మరోసారి కొంత సమయం తర్వాత తదుపరి రౌండ్ ఓటింగ్ చేపట్టనున్నారు.

'పహల్గాం' వెనుక మాస్టర్‌మైండ్ సజ్జాద్ గుల్

టీఆర్ఎఫ్ అధినేత కోసం అధికారుల వేట

ఉగ్రవాది తలపై రూ.10 లక్షల రివార్డు

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి వెనుక షేక్ సజ్జాద్ గుల్ అలియాస్ సజ్జాద్ అహ్మద్ షేక్ మాస్టర్‌మైండ్‌గా వ్యవహరించినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. లష్కరే తోయిబా ముసుగు సంస్థ అయిన ద రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)కు 50 ఏళ్ల సజ్జాద్ గుల్ అధినేతగా పనిచేస్తున్నాడు. ఇతడు కశ్మీర్‌లోనే జన్మించినట్లు తెలుస్తోంది. పాకిస్తాన్‌లోని రావల్పిండిలో కంటోన్మెంట్ టౌన్‌లో లష్కరే తోయిబా ఆధ్వర్యంలో ఉగ్రవాద శిక్షణ పొందాడు. 2020 నుంచి 2024 దాకా కశ్మీర్‌లో ఎన్నో దాడులకు వ్యూహరచన చేశాడు. భారత జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) 2022 ఏప్రిల్‌లో సజ్జాద్ గుల్‌ను ఉగ్రవాదిగా గుర్తించింది. అతడి తలపై రూ.10 లక్షల రివార్డు ప్రకటించింది. పహల్గాంలో 26 మందిని హత్య చేసింది తామేనని టీఆర్ఎఫ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సజ్జాద్ గుల్‌తో ముష్కరులకు ఉన్న లింకులు బయటపడ్డాయి. సజ్జాద్ గుల్ ఆదేశాలతోనే పహల్గాంలో ఉగ్రవాదులు కాల్పులు జరిపినట్లు తేల్చారు.

300 విమానాలు రద్దు.. 25 ఎయిర్ పోర్టులు మూసివేత

న్యూఢిల్లీ/ముంబై: 'ఆపరేషన్ సిందూర్' ఆంక్షల మధ్య శ్రీనగర్ సహా 25 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. మూసేసిన వాటిలో శ్రీనగర్, లేహ్, జమ్మూ, అమృత్‌సర్, బికనేర్, కిషన్‌గఢ్, పఠాన్‌కోట్, చండీగఢ్, జోధ్‌పూర్, జైసల్మేర్, సిమ్లా, ధర్మశాల, జామ్‌నగర్, భుజ్, రాజ్‌కోట్ విమానాశ్రయాలున్నాయి. వివిధ విమానాశ్రయాలకు రాకపోకలు సాగించే 300 విమానాలు రద్దయ్యాయి. ఎయిరిండియా, ఇండిగో, స్పైస్ జెట్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ ఎయిర్ సహా మరికొన్ని విదేశీ విమానయాన సంస్థలు తమ సర్వీసులను రద్దు చేసుకున్నాయి.

16 యూట్యూబ్ న్యూస్ ఛానల్స్, 32 వెబ్‌సైట్లు బ్లాక్ చేసిన పాక్

ఇస్లామాబాద్: ఇరుదేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా పాకిస్తాన్ అధికారులు 16 భారతీయ యూట్యూబ్ న్యూస్ ఛానళ్లు, 31 యూట్యూబ్ లింకులు, 32 వెబ్‌సైట్లను బ్లాక్ చేశారు. అబద్ధాలను, అసత్యాలను ప్రచారం చేస్తున్న డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల నియంత్రించేందుకు పాకిస్తాన్ టెలికమ్యూనికేషన్ అథారిటీ ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు.

సంబంధాల బలోపేతానికి సమగ్ర విధానాలు



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

రాజమన్నార్ కమిటీ (1969)

కేంద్ర - రాష్ట్ర సంబంధాలను సమగ్రంగా అధ్యయనం చేయడానికి తమిళనాడు ప్రభుత్వం జస్టిస్ రాజమన్నార్ కమిటీని 1969లో నియమించింది. ఇందులో పి.సి.చంద్రారెడ్డి, డాక్టర్ లక్ష్మణ్ స్వామి మొదలియార్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ 1971 మే 27న తన అధ్యయన నివేదికను సమర్పించింది.

రాజమన్నార్ కమిటీ భారత్‌లోని ఏకకేంద్ర ధోరణులకు 4 కారణాలు తెలిపింది. అవి:

1. భారత రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక అధికారాలు ఇవ్వడం.
2. కేంద్రం, రాష్ట్రంలో ఒకే రాజకీయ పార్టీ పాలన.
3. తగినన్ని ఆర్థిక వనరులు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఆధారపడటం.
4. కేంద్ర ప్రణాళిక రూపకల్పన, ప్రణాళిక సంఘం అధీకృత పాలన.

సూచనలు

- కేంద్ర-రాష్ట్ర సంబంధాల విషయంలో తలెత్తే వివాదాలను పరిశీలించడానికి ఒక అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రాల అవసరాలకు సంబంధించిన బిల్లులను అంతర్రాష్ట్ర మండలి అనుమతితోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి.
- కేంద్ర, ఉమ్మడి జాబితాల్లోని పాలనా పరమైన అంశాలను పునఃపరిశీలించడానికి ఒక ఉన్నత స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేయాలి.
- రాజ్యసభలో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలి.
- రాజ్యసభకు 12 మందిని నియమించే రాష్ట్రపతి అధికారాన్ని రద్దు చేయాలి.
- కేంద్ర మంత్రి మండలిలో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి.
- పార్లమెంట్ చేసే అన్ని రాజ్యాంగ సవరణలను 2/3వ వంతు మెజార్టీతో రాష్ట్ర శాసనసభ ఆమోదించాలి.
- పన్నుల విధింపునకు సంబంధించిన అవశేష అధికారాలను రాష్ట్రాలకు ఇవ్వాలి.
- ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం కింద రాష్ట్రాలకు అందించే ఆర్థిక సహాయం ఆర్థిక సంఘం సూచనలకు అనుగుణంగా ఉండాలి.
- రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించడానికి అవకాశమిచ్చే రాజ్యాంగ అధికరణలు 356, 357, 365లను రద్దు చేయాలి.
- రాష్ట్రాల్లో ఉన్నత స్థాయి (హైకోర్టు) న్యాయమూర్తుల తొలగింపు ప్రక్రియలో శాసన సభ అభిప్రాయాన్ని కూడా తీసుకోవాలి.
- అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లను రద్దు చేయాలి.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు. ఈ కమిటీ సిఫార్సులపై దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. దేశంలో వేర్పాటువాద శక్తులు బలపడుతుంటే జాతి నిర్మాణం, జాతీయ సమైక్యత కోసం కృషి చేయడానికి; విద్య, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, ఉత్పత్తి రంగాలను బలోపేతం చేసి సామాన్య మానవుడి సమస్యలను తీర్చడానికి ప్రయత్నాలు చేయాల్సి ఉండగా.. కేవలం రాష్ట్రాలకు అనుకూలంగా, ప్రాంతీయ తత్వాన్ని ప్రోత్సహించే విధంగా సిఫార్సులు చేయడం సరికాదని పేర్కొన్నారు.

ఆనందపూర్ సాహెబ్ తీర్మానం (1973)

1973లో పంజాబ్‌లోని ఆనందపూర్ సాహెబ్ ప్రాంతంలో అకాలీదళ్ పార్టీ సమావేశమై కేంద్ర-రాష్ట్ర సంబంధాల విషయంలో ఒక తీర్మానం చేసింది. దీన్నే 'ఆనందపూర్ సాహెబ్ తీర్మానం' అంటారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ పరిధి ప్రధానంగా రక్షణ, అంతర్జాతీయ సంబంధాలు, కమ్యూనికేషన్లు, కరెన్సీ తదితర అంశాల వరకే పరిమితం కావాలని, భారత్‌లో నిజమైన సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తి తేవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

సూచనలు

- పంజాబ్ నుంచి తీసుకున్న ప్రాంతాలను ఇతర రాష్ట్రాల్లో చేర్చినా, వాటిని తిరిగి పంజాబ్‌కు అప్పగించాలి.
- బహిరంగ ప్రదేశాల్లో మత్తు పానీయాలు సేవించడం, ధూమపానాన్ని నిషేధించాలి.
- పంజాబ్ వెలుపల నివసించే అల్ప సంఖ్యాక వర్గాలకు (సిక్కులు) అన్ని రకాల రక్షణలు కల్పించాలి. వారి పట్ల ఎలాంటి వివక్ష చూపకూడదు.
- రక్షణ, విదేశీ వ్యవహారాలు, తంతి-తపాలా, కరెన్సీ, నాణేలు, రైల్వేలు మినహా మిగతా పాలనాపరమైన అంశాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వ పరిధి నుంచి తప్పించి రాష్ట్రాలకు బదిలీ చేయాలి.
- మాజీ సైనికులకు పునరావాస సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తీర్మానం (1977)

కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 1977లో ఒక విజ్ఞాపన పత్రం సమర్పించింది. ముఖ్యాంశాలు..

- భారత రాజ్యాంగంలో 'యూనియన్' అనే పదాన్ని తొలగించి 'సమాఖ్య' పదాన్ని చేర్చాలి.
- నూతన రాష్ట్రాల ఏర్పాటు ప్రక్రియలో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి.
- కేంద్ర ప్రభుత్వ అధికార పరిధిని తగ్గించాలి.
- రాజ్యసభకు కూడా లోక్‌సభతో సమానంగా అధికారాలను బదలాయించాలి.
- రాష్ట్రపతి పాలన, ఆర్థిక అత్యవసర పరిస్థితి లాంటి అధికారాలను తొలగించాలి.
- జాతీయ అభివృద్ధి మండలి పేరును జాతీయ ఆర్థికాభివృద్ధి మండలిగా మార్పు చేసి దాని అస్థిత్వాన్ని బలోపేతం చేసి పరిరక్షించాలి.
- త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి గట్టి ప్రయత్నం చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీస్ చార్జీలను ప్రత్యేక సందర్భాల్లోనే విధించాలి.
- ఆర్థిక సంఘంలో సభ్యులుగా ఆర్థిక నిపుణులనే నియమించాలి.
- దేశంలోని అన్ని రాష్ట్రాలతో సంప్రదించి ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్, ఇండియన్ హెల్త్ సర్వీసు, ఇండియన్ ఎడ్యుకేషన్ సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ ఏర్పాటు చేసే సందర్భంలో పార్లమెంట్ అనుమతి తీసుకోవాలనే నిబంధన విధించాలి.
- రాష్ట్రాల్లో శాసనమండలి ఏర్పాటు, రద్దు విషయంలో పార్లమెంట్ నిర్దిష్ట సమయంలోనే తన అభిప్రాయం వ్యక్తం చేయాలి.
- ప్రణాళిక సంఘం, ఆర్థిక సంఘం మధ్య విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది కాబట్టి దీన్ని కొనసాగిస్తూ పరిపుష్టం చేయాలి.
- దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా జాతీయ స్థాయి కార్యక్రమాలను ప్రాంతీయ భాషల్లో ప్రచారం చేయాలి.
- ఉమ్మడి జాబితాలో పేర్కొన్న అంశాలపై పార్లమెంట్ చట్టం చేసేటప్పుడు రాష్ట్రాలను తప్పనిసరిగా సంప్రదించాలి.
- కేంద్ర ప్రభుత్వ బలగాలను రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి లేకుండా పంపించవద్దు.
- గవర్నర్ నియామకం చేపట్టేటప్పుడు సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రిని విధిగా సంప్రదించే విధంగా రాజ్యాంగ సవరణ చేయాలి.
- టెలివిజన్, రేడియోలకు స్వయం ప్రతిపత్తి అవసరం లేదు కాబట్టి వాటి పనితీరును వికేంద్రీకరించాలి.
- అంతర్రాష్ట్ర మండలి వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించాలి.
- అంతర్రాష్ట్ర మండలిని శాశ్వత ప్రాతిపదికపై ఏర్పాటు చేయాలి.
- రాష్ట్ర ప్రభుత్వాలకు కార్పొరేషన్ పన్నులో వాటా కల్పించాలి.
- భాషాపరమైన అల్ప సంఖ్యాక వర్గాల వారికి ప్రత్యేక కమిషన్ నియమించి అభివృద్ధిని సమీక్షిస్తూ ఉండాలి.

సర్కారియా కమిషన్ (1983)

కేంద్ర - రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేయడానికి 1983 జూన్ 9న కేంద్ర ప్రభుత్వం రంజిత్‌సింగ్ సర్కారియా అధ్యక్షతన కమిషన్‌ను నియమించింది. ఇందులో బి.శివరామన్, ఎస్.ఆర్. సేన్ సభ్యులుగా; ఆర్.ఎం.సుబ్రహ్మణ్యం కార్యదర్శిగా; ఎల్.ఎన్. సిన్హా రాజ్యాంగ సలహాదారుడిగా వ్యవహరించారు. ఈ కమిషన్ 247 సిఫార్సులతో సుమారు 5000 పేజీల నివేదికను 1987 అక్టోబర్ 27న కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. కేంద్ర ప్రభుత్వం సుమారు 230 సిఫార్సులపై నిర్ణయాలు తీసుకొని 170 సిఫార్సులను అమలు చేసింది.

ముఖ్యమైన సిఫార్సులు
కేంద్ర - రాష్ట్ర ఆర్థిక సంబంధాలు

కార్పొరేట్ పన్నును కేంద్ర - రాష్ట్రాలు పంచుకునేలా రాజ్యాంగాన్ని సవరించాలని సర్కారియా కమిషన్ సిఫార్సు చేసింది. తగిన రీతిలో పన్ను, ఎక్సైజ్ సుంకాలు పంచుకోవడంలో మార్పులు చేయాలని పేర్కొంది. అధికరణ 269ని సవరించి ప్రభుత్వ ప్రసార సంస్థల్లో వ్యాపార ప్రకటనలపై పన్ను విధించి దాన్ని పూర్తిగా రాష్ట్రాలకు ఇవ్వాలని సూచించింది. వృత్తి పన్ను, వాణిజ్య పన్నుల పరిమితిని పెంచాలని, ఆదాయ పన్ను మీద అదనపు సుంకం, పరిమిత ప్రయోజనాలకు పరిమిత గడువునే విధించాలని సిఫార్సు చేసింది.

రైల్వే ప్రయాణికుల చార్జీలపై పన్ను ప్రాతిపదికగా రాష్ట్రాలకు గ్రాంటులు ఇవ్వాలని సిఫార్సు చేసింది. ఖనిజాల రాయల్టీ రేట్లను ప్రతి నాలుగేళ్లకు కాకుండా రెండేళ్లకే సమీక్షించాలని సూచించింది. ఆర్థిక సంఘం నిర్ణయాలు తీసుకునే ముందు రాష్ట్రాలను సంప్రదించాలని సలహా ఇచ్చింది. సిఫార్సులను అమలు చేయడంలో ఆలస్యం చేయకూడదని కూడా పేర్కొంది.

కేంద్ర - రాష్ట్ర శాసన సంబంధాలు

- కేంద్ర జాబితాలోని ఎంట్రీ 97ను సవరించి అవశిష్ట అంశాలను (పన్నులు కాకుండా) ఉమ్మడి జాబితాలోకి మార్చాలని సూచించింది. ఉమ్మడి జాబితా విషయంలో కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని ఏదైనా నూతన చట్టాన్ని రూపొందించేటప్పుడు రాష్ట్రాలను తప్పక సంప్రదించాలని సూచించింది. ఈ విషయంలో మంచి సంప్రదాయాలను నెలకొల్పాలని పేర్కొంది.
- రాష్ట్ర విధానసభ, విధాన మండలి ఏర్పాటుకు లేదా రద్దుకు ఆమోదించిన తీర్మానాన్ని రాష్ట్రపతి సహేతుక కాల వ్యవధిలో అనుమతించాలని, కేంద్ర ప్రభుత్వ సూచనలతో పాటు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని సిఫార్సు చేసింది. పార్లమెంట్ దాన్ని ఆమోదించవచ్చు లేదా తోసిపుచ్చవచ్చు. ఆ శాసనం పార్లమెంట్ ఆమోదం పొందితే, కేంద్ర ప్రభుత్వం దాని అమలుకు చర్యలు తీసుకోవాలి. అవసరమైతే అధికరణ 169ని దీనికి అనుగుణంగా సవరించాలని సూచించింది.
- రాష్ట్రానికి సంబంధించిన బిల్లులను గవర్నర్ కేంద్రం పరిశీలనకు పంపించడం గురించి సర్కారియా కమిషన్ సవివరమైన సూచనలు చేసింది. నిర్ణీత కాలంలో బిల్లులను పరిశీలించడంతో పాటు సాధారణ పరిస్థితుల్లో బిల్లును ఆమోదించాలని, విధానపర లోపాలున్నాయని లేదా త్వరలో సమగ్ర బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టబోతున్నామనే నెపంతో తిరస్కరించకూడదని కమిషన్ సూచించింది. బిల్లును తిరస్కరించడానికి కారణాలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలి.

కేంద్ర - రాష్ట్ర పరిపాలనా సంబంధాలు

- అధికరణం 159ని సవరించి గవర్నర్ నియామకంలో రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించేలా చూడాలని సర్కారియా కమిషన్ సూచించింది. గవర్నర్‌గా నియమించే వ్యక్తికి కింద పేర్కొన్న లక్షణాలు ఉండాలని కమిషన్ సిఫార్సు చేసింది.

1. ఏదైనా ఒక రంగంలో ప్రముఖ వ్యక్తిగా ఉండాలి.
2. రాష్ట్రేతర వ్యక్తి అయియుండాలి.
3. రాజకీయాల్లో ఎక్కువగా పాల్గొనని, ముఖ్యంగా.. ఆ ప్రాంత రాజకీయా లతో పెద్దగా సంబంధం లేని వ్యక్తి అయియుండాలి.
   కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన వ్యక్తిని ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు గవర్నరుగా పంపవద్దని కూడా సర్కారియా కమిషన్ సూచించింది.

- గవర్నర్ నియామకంలో ఉప రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, ప్రధానమంత్రిని సంప్రదించడం మంచిదని కమిషన్ సూచన. గవర్నర్లను పదవీ కాలం పూర్తయ్యే వరకూ కొనసాగించాలని, ఒకవేళ ముందే తొలగిస్తే.. ఏ కారణం వల్ల అలా చేస్తున్నారో తెలపాలని పేర్కొంది. తగిన వివరణ ఇవ్వడానికి గవర్నర్‌కు అవకాశం కల్పించాలని సిఫార్సు చేసింది.
- గవర్నర్ ఇచ్చిన వివరణను రాష్ట్రపతి, స్పీకర్, పదవీ విరమణ చేసిన ఉన్నత న్యాయమూర్తితో కూడిన సలహా సంఘం పరిశీలించాలని కమిషన్ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ముందు ఆ గవర్నర్ తొలగింపునకు సంబంధించి వ్యాఖ్య చేయాలని సూచించింది. అలాంటి వ్యక్తి పదవీ విరమణ తర్వాత గవర్నర్, ఉప రాష్ట్రపతి పదవులు తప్ప ఎలాంటి కేంద్ర, రాష్ట్ర పదవులను చేపట్టకుండా, రాజకీయాల్లోకి రాకుండా అనర్హత విధించాలని సూచించింది. పదవీ విరమణ ప్రయోజనాలు ఏర్పరచాలని తెలిపింది. అధికరణం 163లో ఉన్న గవర్నర్ వివేచనాత్మక అధికారాన్ని ఏ మాత్రం మార్చకూడదని, ఆ అధికారాన్ని ఎలా ఉపయోగించాలనే విషయంలో మార్గదర్శక సూత్రాలు ఏర్పర్చడం సాధ్యం కాని పని అని తెలిపింది.

Sivani is a wiser girl than Bhavani



విశేషణాలు (Adjectives)

వాడుకలో కొన్ని ముఖ్య నియమాలు

Rule 1:

కొన్ని క్రియలను adverbsతో modify చేయలేం. వీటిని verbs of incomplete predication అంటాం. అంటే వీటి అర్థం Complete అవడానికి ఏదైనా Complement అవసరం. ఈ క్రియలకు Adjectivesను complementగా వాడతారు.

Verbs: 'be' దాని రూపాలు (is, am, are, was, were), become, seem, appear, taste, smell, round, feel, turn, get, grow, keep, look, make, prove etc.

'Her voice sounds...' ఈ వాక్యానికి అర్థం లేదు. sounds how? అని ప్రశ్నిస్తే sweet, bitter, harsh. ఇలా ఏదో ఒక adjective complement అవసరం.

Ex: 1) She appears sad.
2) His statements sounds queer.
3) He feels sick.
4) The flowers smell sweet.
5) You have grown wise.
6) She looked dainty.
7) Seema is smart.

Rule: 2

కొన్ని adjectivesని comparative, superlative degreesలో చెప్పకూడదు. ఈ adjectives వాటికవే absolute conditionని తెలియజేస్తాయి.

Such adjectives are: perfect, excellent, unique, ideal, extreme, complete, eternal, supreme, etc.

Ex:
1) I have never seen a more complete book on English figures of speech. ('more' అవసరం లేదు)
2) Happiness is the chiefest aim of life. (chiefest తప్పు. 'chief' అని రాయాలి)
3) Each person's fingerprints are most unique. ('most' అవసరం లేదు)
4) Most extreme poverty still exists in many parts of India ('most' అవసరం లేదు)

Rule: 3

-orతో అంతమయ్యే కింది comparatives లాటిన్ భాష నుంచి వచ్చాయి. వీటిని toతో ప్రయోగిస్తాం. than తో కాదు.

Ex:
1) Abdul is inferior to Amar in intelligence. (inferior than.అని రాయొద్దు)
2) Sunanda is senior to me.
3) All his friends are junior to him.
4) This incident took place prior to the fire accident.
5) The U turn is posterior to their deceptive win. (happened or existed later something else).

అలాగే & or తోనే అంతమయ్యే మరికొన్ని Comparative రూపాలు వాటి Comparative forceను కోల్పోతాయి. వాటిని మామూలు Positive Adjectives గానే వాడతాం. వీటిని Comparative, Superlative forms లేకుండానే ప్రయోగిస్తాం.

Ex:
1) The interior walls of the house are painted white.
2) The exterior walls of the house are studded with mosai.
3) His words are of minor/major importance.

రెండు లేదా అంతకంటే ఎక్కువ వస్తువులను లేదా వ్యక్తులను పోల్చినప్పుడు thanను వాడుతాం ఎంపిక చేసిన వాటి గురించి చెప్పేటప్పుడు ofను Comparative adjectivesగా తీసుకుంటాం.

Ex:
1) Yogesh is more deceptive than Tabu.
2) Sivani is a wiser girl than Bhavani.

Note: Double comparative, double Superlatives ను వాడొద్దు.

Ex:
1) She is more wiser than her Sister (C" తప్పు. పై వాక్యంలో moreను తొలగించాలి) కానీ సాహిత్యంలో Shakespeare లాంటిమహామహులు దీనికి మినహాయింపుగా అంగీకరించాలి.

Ex:
1) The most Kindest Brutus.
2) The honester (in stead of 'more honest') attitude. more hotter, most poorest ఇలా చాలా ప్రయోగాలు ఆయన సాహిత్యంలో మనకు కనిపిస్తాయి. మొత్తం మీద 'lesser'అనే ప్రయోగం వాడుకలో ఉంది. మంచి రచయితలు ఈ పదాన్ని స్వాగతిస్తున్నారు.

Ex:
1) He chose the lesser of the two evils.

అలాగే Prefer, preferable అనే పదాలు Comparative forceని కలిగి ఉన్నాయి. వీటిని 'to' తో ప్రయోగిస్తాం.'than'తో కాదు. 'more' అనే పదాన్ని వీటితో వాడొద్దు.

Ex:
1) He has his own scheme he thinks preferable to that of his own brother.

ఎక్కడ 'fewer' అవసరమో అక్కడ 'less' వాడకూడదు. ఎందుకంటే 'less' quantityని, 'fewer' numberని denote చేస్తాయి. 'few' కు comparative.. fewer.

Ex:
1) Fewer women wear hats these days.
2) There are fewer (not 'less') tigers than there were a hundred years ago.
3) I don't accept less than (not' fewer) a thousand for my each article. (here, a thousand rupees. Though 'rupees' are countable, indicating number, it is considered a Sum of amount).
4) This is a less bad (or less bad a) solution than I thought possible

'older' and 'oldest' లను persons, things రెండింటికీ వాడొచ్చు. కానీ elder and eldest వ్యక్తులకు మాత్రమే వాడాలి. ప్రత్యేకించి ఒకే కుటుంబ సభ్యులకు మాత్రమే.

'older, oldest' refer both to age and time while 'old, elder, eldest' refer to age only.

Ex:
1) Babu is older than Jagan.
2) Pandu is my elder brother.
3) Patricia is the eldest of the Vicar's family.
4) This is the oldest tree in the garden (not 'eldest tree') In the sense of 'one who is older than another'.
5) Respect your elders.
6) He is elder to me (not 'elder than I').

'few' and 'a few' have different meanings. 'few' is negative and equivalent to hardly any, not many.

Ex:
1) Many are called but few are chosen.
2) Few people or persons can keep a secret. 'A few' is positive and equivalent to 'some'.

Ex:
1) There are a few books in the old library.
2) I have a few friends.

'The few' denotes 'not many'. It has both a positive and a negative meaning.

Ex:
1) The few are rich, the many are poor.
2) He lost the few thousands he had.
3) The money he lost was not much (Negative).

He lost all the money he had (Positive) ఇలాగే little, a little, the little ప్రయోగం కూడా.

'Little' means 'hardly any' or 'not much'. It has a negative meaning.

Ex:
1) There was little food left in the bowl.
2) There is little hope of his execution of promises made to the people.
3) 'A little' denotes 'some at least'. It has positive meaning.
4) Here is a little hope of his recovery.
5) I have a little money.
6) A little knowledge is always dangerous.

'the little' denotes 'the small quantity'. It has both a positive and a negative meaning.

Ex:
1) I spent the little money I had (నా దగ్గర ఉన్న కొంచెం డబ్బులు నేను ఖర్చు పెట్టేశాను).

It means:

The money I had wasn't much (negative).

I spent all the money I had (positive).

'Later' is the opposite of 'earlier' It refers to 'Time'.Latest 'means ' recent', last up to now only'.

దీనికి మూడు రూపాలు:

'Late - later - latest.

'Last' mean 'final' or 'last-of all'

దీనికి 3 రూపాలు.

later - latter - last.

Practice Bits

1. **Fill in the blank with suitable word. There is no secret between her and______**
   1) I 2) me 3) mine 4) he
2. **Fill in the blank with correct pronoun.**
   _____were you talking to?
   1) To whom 2) Whom
   3) Who 4) Whom
3. **Supply suitable article.**
   He is______ heir of the property besides his cousin.
   1) the 2) an
   3) a 4) No article needed.
4. **He ______ (come) this morning. Supply the correct verb form.**
   1) came 2) will come
   3) has come 4) is coming.
5. **There ______ many a flower in the garden.**
   1) is 2) are 3) was 4) were
6. **He died ______ a fatal blow.**
   1) from 2) of
   3) with 4) for
7. **His ruling is not ______ than the ruling of the past.**
   1) more better 2) much better
   3) better 4) more fairer
8. **______ you please help me do this?**
   1) Would 2) Will
   3) Could 4) Can
9. **He is born ______ very rich parents.**
   1) to 2) of 3) by 4) for
10. **One of my friends ______ saved the life of a boy.**
    1) have 2) are saved
    3) has 4) has been
11. **I_____ my bed. I will just come.**
    1) am making 2) am doing
    3) am setting
    4) am arranging
12. **Dad, ______ Mr Sastry is on line for you. Come soon.**
    1) No article 2) a
    3) the 4) one
13. **He completed reading______ books he had.**
    1) a few 2) few
    3) the few 4) some
14. **If I had money, I ______ you.**
    1) will lend
    2) will be lending
    3) would have lent
    4) could have lent
15. **I am looking forward_____ you very soon.**
    1) to meet 2) to meeting
    3) meet 4) to be met

Key:

1) 2	2) 2	3) 2	4) 3
5) 1	6) 1	7) 3	8) 3
9) 2	10) 3	11) 1	12) 2
13) 3	14) 4	15) 2	

విద్య, ఉద్యోగ సమాచారం

వైఎస్సార్ కడప జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 69 పోస్టులు

వైఎస్సార్ కడప జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 69.
- **పోస్టుల వివరాలు:** అనెస్తీషియా టెక్నీషియన్-04, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్-06, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2-09, జూనియర్ అసిస్టెంట్-02, డేటా ఎంట్రీ ఆపరేట్-02, ఎలక్ట్రీషియన్-01, జనరల్ డ్యూటీ అటెండెంట్-44, ప్లంబర్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(బీఎస్సీ), ఇంటర్, ఐటీఐ, పదో తరగతి, పీజీ డిప్లొమా, డీఎంఎల్‌టీ, ఎంఎల్‌టీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. -వయసు: 42 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు అనెస్తీషియా టెక్నీషియన్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2కు రూ.32,670, జూనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్‌కు రూ.18,500, జనరల్ డ్యూటీ అటెండెంట్, ప్లంబర్‌కు రూ.15,000.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అడిషనల్ డీఎంఈ/ప్రిన్సిపల్, ప్రభుత్వ మెడికల్ కాలేజ్, పుట్లంపల్లి, కడప, వైఎస్సార్ కడప జిల్లా చిరునామాకు పంపించాలి.
- **దరఖాస్తు ప్రారంభతేది:** 10.05.2025.
- **దరఖాస్తులకు చివరితేది:** 20.05.2025.
- **వెబ్‌సైట్:** https://kadapa.ap.gov.in/

కులం ఆవిర్భావానికి మూలం ఏది?

భారతదేశంలో ఒక ప్రత్యేక రకమైన సామాజిక స్తరీకరణ (Social Stratification) కనిపిస్తుంది. దీన్ని 'కుల వ్యవస్థ'గా పేర్కొంటారు. ప్రపంచం మొత్తం మీద పరిశీలిస్తే కొన్ని ప్రాంతాల్లో కులం లక్షణాలు కనిపిస్తున్నప్పటికీ భారత్‌లోని కులవ్యవస్థ విశిష్టమైంది. హిందూ సామాజిక వ్యవస్థ కుల విధానంపై ఆధారపడి ఉంది. కులం అనేది ఏ మాత్రం సరళత లేని అంశంగా పరిణమించింది.



కులం - కులతత్వం

కులం అనే పదం 'Caste' అనే పోర్చుగీస్ పదం నుంచి ఉద్భవించింది. కాస్ట్ అంటే..

1) వారసత్వం
2) వంశ పారంపర్యంగా కలిగేది

అనే అర్థాలున్నాయి.

కుల వ్యవస్థ భారతీయ సామాజిక వ్యవస్థకు ఒక 'మూలస్తంభం'గా ఉంది. హిందూ సమాజం మినహాయించి మరే ఇతర సమాజంలోనూ కులాలు కనిపించవు. వివిధ పరిశోధకులు కులానికి సంబంధించి భిన్న రకాల నిర్వచనాలు ఇచ్చారు.

'కొన్ని సమూహాలు లేదా కుటుంబాలు కలిసి ఒకే పేరుతో, ఒకే విధమైన వంశానుక్రమంతో ఉండి వంశపారంపర్యంగా ఒకే విధమైన పేరుతో గుర్తింపు పొందడాన్ని కులం అంటారు'
– హెర్బర్ట్ రిస్లీ

'కులం అంటే ఒక పరధీకృతమైన సమూహం (Closed Group)'
– టి.ఎన్. మదన్, డి.ఎన్. మజుందార్

'ఒక వర్గం (Single Group) కచ్చితంగా వారసత్వాన్ని పాటించినప్పుడు దాన్ని కులంగా పేర్కొనవచ్చు' – సి.హెచ్. కూలే

ఎమ్.ఎన్. శ్రీనివాసన్, హట్టన్ కులం ఆవిర్భావం గురించి పేర్కొన్నారు.

కులం ఆవిర్భావం

భారతదేశంలో సాహిత్య రచన ఆర్యుల కాలంలో (క్రీ.పూ. 1500 నుంచి క్రీ.పూ. 500 మధ్య) జరిగింది. ఈ సాహిత్యాన్ని ప్రధానంగా 8 రకాలుగా గుర్తించవచ్చు. అవి:

1) వేదాలు
2) బ్రాహ్మణాలు
3) అరణ్యకాలు
4) ఉపనిషత్తులు

వేదాంగాలు
పురాణాలు
ఉపవేదాలు
ఇతిహాసాలు

వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులను 'శృతి సాహిత్యం' అంటారు. అంటే 'అతి పవిత్రమైనవి' అని అర్థం. వీటినే 'అపౌరుషేయాలు'గా పేర్కొంటారు. అంటే దేవతలు రాసి ప్రజలకు ఇచ్చారు అని అర్థం.

వేదం అంటే 'నాలెడ్జ్' అని అర్థం. వేదాలు నాలుగు. అవి:

1) రుగ్వేదం
2) యజుర్వేదం
3) సామవేదం
4) అధర్వణ వేదం

రుగ్వేదంలో పదో అధ్యాయంలో 1028 శ్లోకాలు ఉన్నాయి. ఈ అధ్యాయంలోనే 'పురుష సూక్తం' గురించి ఉంది. సమాజాన్ని వర్ణం ఆధారంగా బ్రహ్మ నాలుగు రకాలుగా సృష్టించాడని 'పురుష సూక్తం'లో పేర్కొన్నారు.

వర్ణం అంటే రంగు అని అర్థం. వర్ణం ఆధారంగా బ్రహ్మ కింద పేర్కొన్న సామాజిక వర్గాలను సృష్టించాడని రుగ్వేదంలో తెలిపారు.

1) బ్రాహ్మణులు (తెలుపు)
2) క్షత్రియులు (ఎరుపు)
3) వైశ్యులు (పసుపు)
4) శూద్రులు (నలుపు)

ఈ వర్గీకరణలో మొదటి 3 వర్ణాలకు చెందినవారిని 'ద్విజులు' అంటారు. అంటే రెండు సార్లు (తల్లి గర్భం నుంచి, ఉపనయనం నుంచి) జన్మించినవారని అర్థం. శూద్రులకు ఉపనయనం లేదు. వీరికి కర్మకాండలు చేసే అర్హత కూడా లేదు.

ఆర్యుల సాహిత్యంలోని వేదాంగాలను ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు.

అవి: 1) శిక్ష, 2) నిరుక్త, 3) వ్యాకరణం, 4) జ్యోతిషం, 5) ఛందస్సు, 6) కల్ప

'కల్ప' అనేది యజ్ఞయాగాదుల గురించి తెలుపుతుంది. ఇందులో మూడు రకాల సూత్రాలు ఉన్నాయి. వీటిలో గృహ సూత్రం ప్రధానమైంది.

గృహ సూత్రం: రాజు మోక్షం సాధించడానికి చేయాల్సిన 16 పౌరుశ కర్మల గురించి పేర్కొంటుంది. వీటిలో 11వ కర్మ 'ఉపనయనం' గురించి వివరిస్తుంది. ఈ కర్మ నిర్వహిస్తే మోక్షం పొందొచ్చని భావిస్తారు.

◆ శూద్రులతో పాటు స్త్రీలకు కూడా ఉపనయనం లేదు.

వర్ణ వ్యవస్థ నిర్మితి, ఆచరణ, వివరణ అంతా సమాజంలో సామరస్యం సాధించడానికే ఏర్పాటైంది. కానీ చాతుర్వర్ణ వ్యవస్థలో పైవర్ణంవారు కింది వర్ణం అయిన శూద్రులను 'దాసులు'గా చూడటం ప్రారంభించారు. ఆ తర్వాత క్రమంగా వివిధ వృత్తులు ఏర్పడ్డాయి.

కాలక్రమేణా బౌద్ధ, జైన మతాల అవిర్భావంతో సమాజంలో అనేక మార్పులు సంభవించాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

అంతర్వర్ణ వివాహాలను అంగీకరించారు. అనులోమ, ప్రతిలోమ వివాహాలు కూడా జరిగాయి.

ఉన్నత వర్ణాలకు చెందిన పురుషుడు తక్కువ వర్ణాలకు చెందిన యువతిని వివాహం చేసుకోవడం 'అనులోమ వివాహం'. తక్కువ వర్ణంలోని పురుషుడు ఉన్నత వర్ణానికి చెందిన స్త్రీని వివాహం చేసుకోవడం 'ప్రతిలోమ (విలోమ) వివాహం'. ఈ విధంగా జరిగిన వివిధ రకాల వివాహాల కారణంగా 'వర్ణ సంకరం' ఏర్పడింది.

వర్ణ వ్యవస్థ పరివర్తన చెంది విస్తృతమవడం వల్ల జాతులు ఆవిర్భవించాయి. కాలక్రమేణా ఇవి కులాలుగా ఏర్పడ్డాయి. ఇలా ఏర్పడ్డ కులం తదనంతర కాలంలో అనేక ఉపకులాలుగా విభజితమైంది. ఈ విధంగా 'వర్ణ వ్యవస్థ' నుంచి 'కుల వ్యవస్థ' ఏర్పడింది.

కులం ఆవిర్భావ సిద్ధాంతాలు

హిందూ సమాజంలో కుల వ్యవస్థ ఒక ప్రత్యేక లక్షణం. ఇది ఎప్పుడు, ఏవిధంగా ప్రారంభమైందో స్పష్టంగా చెప్పలేనప్పటికీ కొంత మంది సామాజిక శాస్త్రవేత్తలు దీని పుట్టుక గురించి కొన్ని సిద్ధాంతాలు ప్రతిపాదించారు.

దైవాంశ సంభూత సిద్ధాంతం: దీని ప్రకారం కులవ్యవస్థ దైవాంశమైంది. హిందువులకు ప్రమాణం 'వేదం'. రుగ్వేదంలోని పురుష సూక్తంలో బ్రహ్మదేవుడు నాలుగు వర్ణాలను సృష్టించాడని పేర్కొన్నారు. భగవద్గీత కూడా అత్యంత ప్రాచీన గ్రంథం. హిందువులకు ప్రామాణికం. ఇందులో కృష్ణుడు తన వల్లే నాలుగు వర్ణాలు ఉద్భవించాయని చెప్పినట్లు పేర్కొన్నారు. విష్ణు పురాణం, వేదాల్లోనూ ఈ సిద్ధాంతం ప్రస్తావన ఉంది. దీన్ని శాస్త్రీయంగా అంగీకరించడానికి ఆధారాలు లేవు.

జాతి సిద్ధాంతం: ఈ సిద్ధాంతాన్ని హెర్బర్ట్ రిస్లీ అభివృద్ధి చేశాడు. ఇతడి ప్రకారం.. ఆర్యులు, ద్రావిడులు, మంగోలియన్ లాంటి వివిధ తెగల మధ్య సంఘర్షణలు తలెత్తినప్పుడు ప్రతి తెగ ప్రత్యేక లక్షణాలను కాపాడుకునే ఉద్దేశంతో ఒక సమూహంగా ఏర్పడి తర్వాత ఆ సమూహం 'కులం'గా మారింది. తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడానికి సమూహంలోని సభ్యులందరూ కట్టుబడి ఉండాల్సిన కొన్ని నియమాలను ఏర్పరచుకున్నారు. ఈ విధంగా అనేక కులాలు ఆవిర్భవించాయి.

వృత్తి సిద్ధాంతం: ఈ సిద్ధాంతాన్ని నెస్‌ఫీల్డ్ తెలిపాడు. ఇతడు కులం ఆవిర్భావానికి కారణం వృత్తి అని పేర్కొన్నాడు. వ్యవసాయం, పరిశ్రమల వల్ల జీవన క్రమంలో వచ్చిన మార్పుల ఆధారంగా కులాలు ఏర్పడ్డాయని ఈ సిద్ధాంతం వివరిస్తోంది. వ్యక్తులు నిర్వహించే వృత్తి ఆధారంగా ఒక స్థితి, ఒక ప్రత్యేకత ఏర్పడ్డాయి. లోహాల వినియోగం కంటే ముందు ఉన్న కులాలకు తక్కువ స్థాయి; లోహాలు, పరిశ్రమల ఆవిర్భావం తర్వాత ఉన్న వృత్తులకు 'ఉన్నత స్థాయి' ఉందని ఇతడు పేర్కొన్నాడు.

సంస్కార సిద్ధాంతం: దీన్ని ఎ.ఎం. హోకర్ట్ ప్రతిపాదించాడు. 'భారతదేశంలో మత సంస్కారాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఇందులో భాగంగా మంత్రాలు చదవడం, ప్రదేశాన్ని శుభ్రం చేయడం, అలంకరించడం, మేళతాళాలు వాయించడం మొదలైన వాటి వల్ల కులాలు ఏర్పడ్డాయి' అని ఇతడు వివరించాడు.

భౌగోళిక సిద్ధాంతం: ఈ సిద్ధాంతాన్ని గిల్బర్ట్ ప్రతిపాదించాడు. దీని ప్రకారం.. భారతదేశం సువిశాలమైంది. వివిధ రకాల వాతావరణ పరిస్థితులు, వనరులను, సముద్ర తీర ప్రాంతాలు, నదీ మైదానాలు, మెట్ట ప్రాంతాలు, పర్వత ప్రాంతాలు లాంటివి ఉన్నాయి. ఇక్కడ నివసించే ప్రజలు ఆయా ప్రదేశాల్లోని పరిస్థితులకు అనుగుణంగా తమ జీవన విధానాన్ని సర్దుబాటు చేసుకొని జీవిస్తారు. వ్యవసాయం, పశుపోషణ, చేపలు పట్టడం ఈ విధంగానే ఏర్పడ్డాయి. ఇలాంటి జన సమూహాలే 'కులాలు'గా ఆవిర్భవించాయి.

సాంస్కృతిక సిద్ధాంతం: దీన్ని ఎస్.పి. రాయ్, అతడి అనుచరులు ప్రతిపాదించారు. దీని ప్రకారం సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడానికి ఒక సమూహంలోని ప్రజలు ఆ సమూహాన్ని 'కులం'గా రూపొందించుకున్నారు.

మాదిరి ప్రశ్నలు

1. 'కులం' అనేది ఏ భాషా పదం నుంచి ఆవిర్భవించింది?
ఎ) ఫ్రెంచ్ బి) లాటిన్
సి) పోర్చుగీస్ డి) అరబిక్

2. 'కులవ్యవస్థ' దేని నుంచి ఉద్భవించింది?
ఎ) వర్ణ వ్యవస్థ బి) వర్గ వ్యవస్థ
సి) వృత్తి వ్యవస్థ డి) ఏదీకాదు

3. జతపరచండి.
1. జాతి సిద్ధాంతం ఎ) హెర్బర్ట్ రిస్లీ
2. వృత్తి సిద్ధాంతం బి) నెస్ ఫీల్డ్
3. సంస్కార సిద్ధాంతం సి) ఎ.ఎం. హోకర్ట్
4. భౌగోళిక సిద్ధాంతం డి) గిల్బర్ట్
ఎ) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
బి) 4-ఎ, 3-బి, 2-సి, 1-డి
సి) 1-ఎ, 2-డి, 3-బి, 4-సి
డి) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి

4. వర్ణ వ్యవస్థ ప్రస్తావన ఏ 'వేదం'లో కనిపిస్తుంది?
ఎ) రుగ్వేదం బి) యజుర్వేదం
సి) సామవేదం డి) అధర్వణ వేదం

5. 'ఉపనయనం' ఏ వర్ణం వారికి వర్తించదు?
ఎ) తెలుపు బి) నలుపు
సి) ఎరుపు డి) పసుపు

6. 'చతుర్వర్ణ వ్యవస్థ' ఎక్కడ పేర్కొన్నారు?
ఎ) వేదాలు బి) అరణ్యకాలు
సి) బ్రాహ్మణాలు డి) ఉపనిషత్తులు

7. కింద పేర్కొన్నవారిలో 'ద్విజులు' కాని వారు?
ఎ) బ్రాహ్మణులు బి) క్షత్రియులు
సి) వైశ్యులు డి) శూద్రులు

8. 'చాతుర్వర్ణ వ్యవస్థ'లో పై స్థాయి వారు?
ఎ) శూద్రులు బి) క్షత్రియులు
సి) బ్రాహ్మణులు డి) వైశ్యులు

9. 'ఉపనయనం' గురించి ఎందులో పేర్కొన్నారు?
ఎ) గృహ సూక్తం బి) శ్రేత సూక్తం
సి) సుకువ సూక్తం డి) ఏదీకాదు

10. 'కులవ్యవస్థ' ఎప్పుడు ఆవిర్భవించింది?
ఎ) 400 బి.సి. బి) 200 ఎ.డి.
సి) 1000 ఎ.డి.
డి) కచ్చితంగా చెప్పలేం

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) ఎ; 4) ఎ;
5) బి; 6) ఎ; 7) డి; 8) సి;
9) ఎ; 10) డి.

A computer-intensive problem runs on..

CLASSIFICATION OF COMPUTERS

DIGITAL COMPUTER

A computer that performs calculations and logical operations with quantities represented as digits, usually in the binary number system.

(i) CLASSIFICATION BASED ON PURPOSE:

General purpose computers: These are designed to perform a range of tasks. They have the ability to store numerous programs, but lack in speed and efficiency.

Specific purpose computers: These are designed to handle a specific problem or to perform a specific task. A set of instructions is built into the machine.

(ii) CLASSIFICATION BASED ON SIZE AND PERFORMANCE WISE:

EMBEDDED COMPUTERS

It is a computer system with a dedicated function within a larger mechanical or electrical system, often with real-time computing constraints. Embedded systems are commonly found in consumer, cooking, industrial, automotive, medical, commercial and military applications such as microwave ovens, washing machines and dishwashers, include embedded systems to provide flexibility, efficiency and features.

MICRO COMPUTER OR PERSONAL COMPUTER

- **Desktop Computer:** a personal or micro-mini computer sufficient to fit on a desk.
- **Laptop Computer:** a portable computer complete with an integrated screen and keyboard. It is generally smaller in size than a desktop computer and larger than a notebook computer.
- **Palmtop Computer/ Digital Diary /Notebook /PDAs:** a hand-sized computer. Palmtops have no keyboard but the screen serves both as an input and output device.
- **Workstations**
A terminal or desktop computer in a network. In this context, workstation is just a generic term for a user's machine (client machine) in contrast to a "server" or "mainframe."
- **Mini Computer**
It is a midsize computer in size and power, minicomputers lie between workstations and mainframes in general, a minicomputer is a multiprocessing system capable of supporting from 4 to about 200 users simultaneously.
- **Mainframe Computer**
A very large and expensive computer capable of supporting hundreds, or even thousands, of users simultaneously. In some ways, mainframes are more powerful than supercomputers because they support more simultaneous programs. These are mainly used servers in banks.
- **Super Computer**

Bank Exams

Computer Awareness

The fastest and most powerful type of computer Supercomputers are very expensive and are employed for specialized applications that require immense amounts of mathematical calculations. For example, weather forecasting requires a supercomputer. Other uses of supercomputers include animated graphics, fluid dynamic calculations, nuclear energy research, and petroleum exploration.

- **ANALOG COMPUTER**
An analog computer (spelt analogue in British English) is a form of computer that uses continuous physical phenomena such as electrical, mechanical, or hydraulic quantities to model the problem being solved
- **Hybrid Computer**



(Analog + Digital)

A combination of computers those are capable of inputting and outputting in both digital and analog signals. A hybrid computer system setup offers a cost effective method of performing complex simulations.

MODEL BITS

1. The product of two binary numbers (1011) and (1001) is____
1) 1011001 2) 1010100
3) 1100011 4) 100110
5) None of these

2. MS -DOS is usually supplied on a
1) Hard disk
2) floppy disk or diskettes
3) CD ROM 4) Cartridge tape
5) None of these

3. When a key is pressed on the keyboard, which standard is used for converting the keystroke into the corresponding bits?
1) EBCDIC 2) ASCII
3) ANSI 4) ISO
5) None of these

4. A thing present in real world in physical form is called ____
1) DBMS 2) Keywords
3) Modulation 4) Entity
5) None of these

5. Programming language built into user programs such as Word and Excel are known as____?
1) 4GLs
2) Visual programming languages
3) Object-oriented languages
4) Macro languages
5) None of these

6. A program that generally has more user-friendly interface than a DBMS is called a ____?
1) form 2) repository
3) back end 4) front end
5) None of these

7. Antivirus software is an example of____
1) a security utility
2) an operating system
3) business software
4) an office suite
5) None of these

8. System software is the set of programs that enables your computer's hardware devices and ____ software to work together.
1) application 2) processing
3) utility 4) management
5) None of these

9. In a ring topology, the computer in possession of the______ can trasmit data.
1) packet 2) token
3) access method 4) data
5) None of these

10. A computer-intensive problem runs on a ____.
1) supercomputer
2) mainframe 3) server
4) super PC 5) None of these

11. The term _____ designates equipment that might be added to a computer system to enhance its functionality.
1) peripheral device
2) system add-one 3) disk pack
4) digital device
5) None of these

12. A collection of interrelated files in a computer is a _____.
1) file manager 2) field
3) database 4) record
5) None of these

13. When installing _____, the user must copy and usually decompress program files from a CD-ROM or other medium to the hard disk.
1) programming software
2) applications software
3) applications hardware
4) system hardware
5) None of these

14. ____is the ability of an operating system to control the activities of multiple programs at the same time.
1) Multitasking 2) Streamlining
3) Multiuser 4) Simulation
5) None of these

15. Which of the following computer language is a mathematically oriented languages used for scientific problems?
1) FORTRAN 2) COBOL
3) LISP 4) PROLOG
5) APPLE

16. Which of the following terms is just the connection of personal networks that can be joined together?
1) Virtual private network
2) Internet 3) Intranet
4) Extranet 5) None of these

17. For large network which topology is used?
1) Star 2) Ring 3) Bus
4) Mesh 5) None of these

18. A special high-speed line used by large corporations to support digital communications is known as:
1) Satellite/ Air connection service lines
2) Cable modems
3) Digital subscriber lines
4) T1, T2, T3 and T4 lines
5) None of the above

19. A language that refers to the way people think mathematically is called as ___
1) Functional language
2) Cross-platform language
3) Event driven programming language
4) Object oriented language
5) None of these

20. When you are typing the text in a document, you would need to hit the enter key at the end of every ______.
1) line 2) sentence
3) paragraph 4) word 5) file

21. _____ displays each slide of the PPT as a thumbnail and is used to re-arrange them.
1) Slide Show 2) Slide Display
3) Slide Design
4) Slide Layout 5) Slide Sorter

22. If you want to find the Paste Special option, you would use the Clipboard group on the tab of PowerPoint _____
1) Home 2) Slideshow
3) Page Layout 4) Design
5) Insert

23. In a pull down menu if you see that a command appears faded, it means that _____
1) the command is not applicable to this document
2) the command is not accessible at the moment
3) there are no keystrokes equivalent to those commands.
4) None of these
5) All of these

KEY

1) 3 2) 2 3) 3 4) 4 5) 2
6) 4 7) 1 8) 1 9) 2 10) 1
11) 1 12) 3 13) 2 14) 1 15) 1
16) 3 17) 4 18) 4 19) 1 20) 3
21) 5 22) 1 23) 2